
తామర కొలను
కన్నడ మూలం
త్రివేణి
తెలుగు సేత
శర్వాణి

# తామర కొలను

కన్నడమూలం : త్రివేణి

తెలుగు సేత : శర్వాణి

234

యం. శేషాచలం అండ్ కంపెనీ
మచిలీపట్నం-సికింద్రాబాద్

# *TAMARA KOLANU*

*Kannada Original by TRIVENI*
*Telugu Translation by SARVANI*

Publishers :
M. SESHACHALAM & Co.,
Machilipatnam-Secunderabad.

First Edition in MSCO Series :
November 1983

Distributors :
ANDHRA PRADESH BOOK DISTRIBUTORS,
3237, Rashtrapathi Road, Secunderabad-500 003

Printers :
PRASAD PROCESS
Secunderabad-26

Price : Rs. 12/-

---

an MSCO CROWN SERIES BOOK

'రమేష్! కాలేజీకి టైమవుతుంది. లేవరా బాబూ! తరువాత ఊరికే హడావిడిచేస్తావు. కొంచెం తొందరగా లేస్తే అన్నీ నెమ్మదిగా చేసుకోవచ్చుగా! ఓ రమేష్...'

శాంత రమేష్ మంచందగ్గర నిలబడి అతడిని లేపే ప్రయత్నంలో ఉంది. రమేష్ నిండా దుప్పటికప్పుకుని పడుకున్నాడు. ముసుగులోనుండి కొంత ఉంగరాలజుట్టుమాత్రం కనిపిస్తూంది.

శాంత ప్రయత్నం ఫలించలేదు.

'నాలుగేళ్ళుగా మెడికల్ కాలేజీలో చదువుతున్నా, ఇంకా ఉదయం త్వరగా లేచే అలవాటు లేకపోతే ఎలా! సిగ్గులేటు! నువ్వేం పసిపిల్లవాడివా ఏం, రోజూ నిన్ను లేపటానికి ? రేపటినుండి అసలు నిన్ను లేపనే లేపను.'

తన ఆఖరిమాట నిజంకాదని ఆమెకే తెలుసు. ఆమెకే ఏమిటి, రమేష్‌కి కూడా తెలుసు. రమేష్ మెడికల్ కాలేజీలో చేరినప్పటినుండి శాంత రోజూ ఈ మాట చెపుతూనే ఉంది. కాని అతడిని లేపే బాధ్యత మాత్రం ఆమెదే. కావాలనే శాంత ఈ బాధ్యతను స్వీకరించింది. ఈ కార్యక్రమం ఆమెకెంత ప్రియమయిందో, వదిన మందలింపులు తిట్లు వింటూ లేవడం రమేష్‌కీ అంతే ప్రియమయింది.

రమేష్ మెడికల్ కాలేజీలో చేరాక రెండు సంవత్సరాలకు హాస్పిటల్ డ్యూటీ ప్రారంభమయింది. రమేష్ ఇంటికి రాగానే :

'వదినా, రేపటినుండి నన్ను లేపే బాధ్యతమీదే' అని వదినమీద భారమంతా పడవేసి నిశ్చింతగా ఉండిపోయాడు. అప్పటినుండి శాంత ఒక్కరోజుకూడా విసుక్కోకుండా అతడిని లేపేది.

'ఆరు గంటలకల్లా లేపకండి. ఆరుంబావుకు సరిగ్గా లేపండి. తరువాత ఆరు గంటలకే లేపి, నా నిద్ర పాడుచేస్తే వూరుకోను' అని ఖచ్చితంగా చెప్పివుంచాడు రమేష్.

ఆరు-గంటలు కాగానే రమేష్ గదిముందునిల్చుని కర్టెన్ పక్కకు జరిపి చూసేది.

"పాపం, నిద్రపోతున్నాడు. మరికొంతసేపు పడుకోనీ" అనుకుంటూ వెళ్ళిపోయేది. ఆరూ ఐదు నిమిషాలకు మళ్ళీ కిటికీ తలుపులు తెరచి మెల్లిగా 'రమేష్' అని పిలిచి వెళ్ళిపోయేది. ఆరూ పదికి మళ్ళీవచ్చి ఈమారు నిజంగానే లేపడం మొదలెట్టేది. ఎన్నోమార్లు మేలుకునే వదినను ఏడిపించే వుద్దేశ్యంతో లేవకుండా పడుకునేవాడు రమేష్. వదిన చేతి గాజుల చప్పుడుకే అతడికి మెళకువ వచ్చినా, ఆమెచేత తిట్టించుకోవడం, బతిమాలించుకోవడం కోసమే ఆరుంబావువరకూ మెదలకుండా పడుకునేవాడు.

ఈ రోజూ అలాగే కదలకుండా పడుకున్నాడు. కాని తన దొంగ నిద్రకు తనకే నవ్వొస్తోంది.

'ఇకమీదట నిజంగా నిన్ను లేపను. ఇంతటి బద్ధకస్తుడు మెడికల్ కాలేజీలో ఎందుకు చేరాలసలు ? నీకేం నిశ్చింతగా వున్నావు. నువ్వు ఫేలయితే మాట వచ్చేది నాకేగా! ఇకమీదట నాకూ, నీ చదువుకూ ఏమీ సంబంధంలేదు. చెబుతున్నామరి. ఇహ నీ యిష్టం. మీ అమ్మా, నాన్న, అన్నయ్యా వాళ్ళిష్టం. ఎవ్వరికిలేంది నేను మాత్రం ఎందుకు నా తల పగలకొట్టుకోవాలి? మొదటిలా చిన్న కుర్రాడివయినా అయితే తన్ని లేపవచ్చు. నాకంటె రెండింతలు పొడుగు పెరిగి నిల్చున్నావు...'

మంచంమీద మనిషి కదలటంతో శాంత వాక్ప్రవాహం ఆగింది.

'అమ్మయ్య ఇప్పటికయినా లేచావుకదా? నువ్వు మెడిసిన్ పాసయితే నా భుజంమీది బరువు దించినట్టవుతుంది. ఆ రోజు హనుమంతుడికి ఓ కొబ్బరికాయ కొడతాను.'

'ఏ హనుమంతుడు ? రాముడి కొడుకు హనుమంతుడేనా?' అంటూ లేచి కూర్చున్నాడు రమేష్.

'కొడుకుకాదు, సేవకుడు' అని దిద్దింది శాంత.

'ఇంకా గంట ఆరుకూడా కాలేదు. అప్పుడే నన్ను లేపేశారు అనవసరంగా' అని విసుక్కుంటూ గడియారంవేపు చూశాడు రమేష్.

'చూడరా బాబూ, చక్కగా కళ్ళుతెరచి చూడు. దేవుడు నీకు పెద్ద పెద్ద కళ్ళిచ్చాడు. బాగా ఉపయోగించు' అంది శాంత.

'రాత్రి తొందరగా పడుకుందామని ఇరవై నిమిషాలు ముందుకు పెట్టాను.'

'నీ గడియారం చూసుకునేం లేపటంలేదు నేను. నా గడియారం వేరేవుంది.'

'తమరి గడియారం ఏదో చెబుతారా, వదినగారూ?'

'సూర్యుడికన్నా గడియారం కావాలా ఏం? ఈ ప్రపంచంలోని గడియారాలన్నీ చెడిపోయినా నేను కరెక్టు టైం చెప్పగలను. అయినా మీ అన్నయ్య నాకు గడియారం కొనిపెట్టనంత మాత్రాన నాకు టైం తెలీక పోతుందనుకున్నావా?'

'అనవసరంగా అన్నయ్య నంటారెందుకు వదినా? అన్నయ్య ఇనప్పెట్టి తాళంచెవులు ఎవరిదగ్గరున్నాయో నాకు తెలుసు.'

'తాళం చెవులువుంటే వచ్చిందా భాగ్యం ? ఈ నెలలో ప్యాంటు, వచ్చేనెలలో కోటు, మరోనెలలో ఇంకోటి...ఇలా చెప్తుంటే, నేను వాచి కొనుక్కున్నట్టే వుంది.'

'ఈ నెలలో మీకేమీలేదు, నేను దాచి కొనుక్కుంటానంటే అన్నయ్య మిమ్మల్ని కొడతాడా ఏం?'

'ఆఁ ఇహ అదొక్కటే తక్కువ. నువ్వు ఇక లే. కాఫీ చల్లారి పోతుంది. వేడిచేస్తే బావుండదు మరి. బ్రెడ్డు తింటావా, బిస్కట్లు ఇమ్మన్నావా?'

'రెండూ! వానితోపాటు కొంచెం వెన్నకూడా.'

'అమ్మ మళ్ళీ నన్ను అంటారు బాబూ, తెచ్చిన వెన్నంతా రెండు రోజుల్లోనే అయిపోయిందని. అమ్మకే తైరుకొట్టి వెన్న తీసుకో.'

'మీరు ఇస్తారా లేదా చెప్పండి' అంటూ మంచందిగి నిల్చుని వళ్ళు విరుచుకున్నాడు రమేష్.

'సరే. త్వరగా రా' అంటూ వెళ్ళిపోయింది శాంత.

రమేష్ తన పనులన్నీ ముగించుకుని కాలేజీకి వెళ్ళటానికి సిద్ధమై గుమ్మందగ్గరకొచ్చాడు.

బూటు శబ్దంవిని, శాంత గాజుపళ్ళెంలో బ్రెడ్డు, బిస్కట్లు, వెన్నపెట్టి రమేష్ కిచ్చింది. అతడు నిల్చునే తినబోతుంటే;

'కూర్చుని తినరా బాబూ!' అంది.

'వీల్లేదు, టైమయిపోయింది.'

'ఊరికే నన్ను ఆక్షేపిస్తావుగాని, ఎప్పుడనగా లేపాను నిన్ను. ఇప్పుడు టైమయిపోతుందని రాగం తీస్తున్నావా? నిల్చుని తినటం మంచిది కాదబ్బాయ్!'

'అలాగని ఏ పుస్తకంలోనూ రాసిలేదు మరి.'

'దానికి పుస్తక మెందుకోయ్? నన్నడుగు చెపుతాను. అలా నిల్చుని గబగబా తినటం వంటికి మంచిదికాదు.'

'ఆడవాళ్ళు ఎక్కువగా మాట్లాడటం ఏమంత మంచిది కాదు' అంటూ రమేష్ కాఫీ ఒక్కగుక్కలో తాగేసి తొందరగా బయటికి వెళ్ళి పోయాడు. ఇంకో నిముషంలో అతడి సైకిల్ రోడ్డుమలుపుతిరిగి మాయ మయింది.

అతడు ఇంకొక్క నిముషం అక్కడ నిలబడి శాంత మొహం చూసివుంటే, తనమాటతో ఆమెనెంత బాధపెట్టాడో తెలిసేది. సుమారు పన్నెండేళ్ళుగా అతని స్వభావంతో పరిచయంవున్నా, ఎన్నోమార్లు అతడి దుడుకు మాటలకు శాంత చిన్నబుచ్చుకునేది.

రమేష్‌ది నిర్మల హృదయం. అందులో తనను కించపర్చాలనే భావం ఏమాత్రం లేదనే విషయం శాంతకు తెలుసు. కాని అతడి దుడుసు తనంవల్ల, ఆ మాటల తీక్షణతను తట్టుకోవటం సూక్ష్మగ్రాహియైన శాంతకు కష్టమనిపించింది.

చేదు మాత్రను శాంతచేత మింగించి, రమేష్ వెళ్ళిపోయాడు. ఇహ మళ్ళీ అతనురావటం సాయంకాలం ఐదు గంటలకే. అప్పుడుకూడా హడావిడిగా కాఫీ, టిఫిన్ తీసుకోగానే స్నేహితులతో షికారుకు వెళ్ళి పోయేవాడు. ఇక మళ్ళీ దర్శనం రాత్రి ఎనిమిది దాటాకనే! రాత్రి భోజన సమయంలో మళ్ళా వదినా, మరుదుల మధ్య మాటామంతి, జగడం-మళ్ళీ ప్రారంభ మయ్యేవి.

రమేష్ వెళ్ళిపోయాక ఎంతోసేపు శాంత అలాగే నిలచుని వుండి పోయింది.

"నిజం, రమేష్ మాటలు అక్షరాలా నిజం. తనకు ఈమధ్య మాటలు

చాలా ఎక్కువయ్యాయి. పల్లెటూరినుండి వచ్చిన పిల్ల తను. తనకు ఎక్కువ చదువులేదు. మెడిసిన్ చదువుతున్న రమేష్‌తో అంత ఎక్కువగా మాట్లాడటం తనదే తప్పు. ఈరోజునుండి ఎంతో అంతలో ఉండాలి" అని నిశ్చయించుకుంది శాంత.

కడిగిన పాత్రలు తీసుకొని లోపలికి వస్తున్న సుశీలమ్మగారు రాతి బొమ్మలా నిల్చున్న కోడల్ని చూసి

'ఇంకా మడి కట్టుకోలేదా శాంతా? కృష్ణుడికి ఆఫీసు టైమవుతోంది' అన్నారు.

శాంత తేరుకొని 'ఇదుగో వెడుతున్నా' అంది.

'మొహం అలా వుందేమిటి? వంట్లో బాగాలేదా?'

'ఏం లేదే! బాగానే ఉన్నాను.'

'రమేష్ ఏమన్నా అన్నాడా?'

చిన్న కొడుకు, పెద్దకోడలి స్వభావాలు ఆమెకు తెలియనివి కావు.

రమేష్ దుడుకు తనాన్ని ఖండించి, అతడి స్వభావాన్ని మార్చటానికెంతో ప్రయత్నించి చివరికి ఓటమిని అంగీకరించవలసి వచ్చింది. శాంత సున్నిత హృదయమూ తెలుసు ఆమెకు. అత్తగారి ప్రశ్నకు 'లేదు' అని మాత్రం బదులు చెప్పింది శాంత.

'వాడికి అంత చనువివ్వద్దని నీ కెన్నోమార్లు చెప్పాను. నువ్వు వినవు. వాడికి పెద్దా, చిన్నా ఉండదు. ఇష్టమొచ్చినట్లా వాగుతాడు. నువ్వేమో చిన్నబుచ్చుకుంటావు.'

ఒక్క క్షణం క్రితమే రమేష్ మొరటుతనానికి అతడి మీద కోపగించుకున్న శాంత రమేష్‌ని వెనకేసుకొచ్చి,

'పాపం వాడేం అనలేదు. కాలేజికి టైమయిపోయిందని సరిగ్గా టిఫిన్‌కూడా తినకుండా వెళ్ళిపోయాడు' అంది.

'వాడు తినకపోతే నువ్వు వదిలిపెడతావా' అంటూ లోపలికి వెళ్ళిపోయారామె.

శాంత మడికట్టుకుని వంట ప్రయత్నంలో పడింది. చేతులు వంకాయల్ని తరుగుతున్నా, మనసులో రమేష్ మాటల్నే నెమరు వేసుకుంటోంది.

అతడన్నదీ నిజమే. స్వభావతః తను మితభాషి. స్నేహితులతో కలసి ఉన్నప్పుడుగాని, ఎక్కడైనాసరే, తను అంతగా మాట్లాడేది కాదు. తను ఎక్కువగా మాట్లాడేదల్లా రమేష్‌తోనే. ఇకమీదట ఎంత అడిగితే అంతే సమాధానం చెప్పిఊరుకోవాలి. తనంతట తానుగా పలకరించరాదు.

'శాంతా! పప్పు మాడిపోతున్నట్టుంది. వాసన వేస్తోంది! చూడు.' అత్తగారి మాటలతో ఈ లోకంలోకి వచ్చిపడింది శాంత. తరిగిన కూర ముక్కలు పప్పులో పడవేసింది.

తన మనసు ఎంత దుర్బలమైంది! రమేష్ ఓ చిన్నమాటకు తనింత బాధపడాలా? అతడి చిన్నమాట తన మనశ్శాంతి నింత పాడుచెయ్యాలా?

కృష్ణమూర్తి భోజనానికి కూర్చున్నాడు. శాంత వడ్డిస్తోంది.

'శాంతా! పులుసులో ఉప్పే వేయలేదు. మరచిపోయావా?' అని కృష్ణమూర్తి అడిగినప్పుడు ఆకు కొనలో నూరిన ఉప్పు వడ్డించింది.

'పాపం! రమేష్ ఉప్పు లేకుండానే భోంచేయాలివాళ' అంది.

'నువ్వు ఊరగాయ పంపావుకదా? అదొక్కటుంటే చాలు, వాడి కింకేమీ అక్కర్లా' అన్నాడు కృష్ణమూర్తి.

'మీకు నచ్చకపోయినంత మాత్రాన ఊరగాయ ఇంకెవరూ తినరను కున్నారా ఏం?' అంది శాంత.

'అన్నట్టు ఇవ్వాళ నువ్వూ, రమేష్ దెబ్బలాడుకున్నారా ఏం?'

'ఛా, అదేమిటి అలా అడుగుతున్నారు?'

'ఆహా, పులుసులో ఉప్పు వెయ్యకపోతేనూ' అంటూ నవ్వాడు కృష్ణమూర్తి.

'మీ తమ్ముడితో దెబ్బలాడటం తప్ప నా కింకేం పని లేదను కున్నారా ఏం?'

'నిజమే, నీ కింకేం పనుందో చెప్పు చూద్దాం!' కొంటెగా అడిగాడు కృష్ణమూర్తి.

'ఆ తమ్ముడి అన్నతో కాపురం చేయటం మాత్రం ఏమంత సులువైన పనా ఏం?'

'అయ్యో పాపం!'

'ఆఫీసుకు టైమవుతోంది; తొందరగా లేవండి బాబూ.'

కృష్ణమూర్తి ఆఫీసుకు వెళ్ళిపోయాక గది శుభ్రం చెయ్యసాగింది. అతడు వెళ్ళిపోయాక, ఆ గదిలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి వుండేవి.

గదినిండా పుస్తకాలు, విడిచిన గుడ్డలు, కాలర్లుపడి పొర్లుతూ వుండేవి. శాంత అన్నీ తీసి శుభ్రంగా సర్దిపెట్టింది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక కాసేపు నిద్రపోవటం శాంత కలవాటు. చేతిలో పుస్తకం పట్టుకుని మంచంమీద పడుకోగానే ఆమెకు నిద్ర వచ్చేసేది. కాని ఈరోజు మాత్రం ఎంత ప్రయత్నించినా, నిద్ర రాలేదు.

'ఈ కుర్రకుంక మాటలను తనెందుకింత కేర్ చెయ్యాలి' అనుకుని నిద్రపోవటానికి ఎంతో ప్రయత్నించింది. కాని సాధ్యపడలేదు.

సాయంత్రం ఐదు గంటలు కావస్తోంది. గదినుండి బయటకు వచ్చిన శాంత జబ్బుపడిలేచిన దానిలా తయారయింది. మనసులోని అశాంతివల్ల తలనొప్పిగాకూడా వుంది.

"ఇక రమేష్ వచ్చే వేళయింది. కాఫీ రెడీగా లేకపోతే గొడవ చేస్తాడు" అనుకుంటూ, వంట గదిలోకి వెళ్ళింది.

'ఏమిటి శాంతా, ఇంత సేపు పడుకున్నావు? వంట్లో బాగా లేదా?' అని అడిగారు సుశీలమ్మగారు.

'కొంచెం తలనొప్పిగా వుంది; అంతే.'

'రమేష్ వచ్చాక ఏదైనా మందు అడిగి వేసుకో.'

'ఈ మాత్రానికి రమేష్ ఎందుకు? ఓ మాత్ర ఏదన్నా మింగితే అదే పోతుంది.'

బయట రమేష్ వచ్చిన అలికిడి అయింది. సైకిల్ వరండాలో పెట్టి, బూటు శబ్దం చేసుకుంటూ, గదిలోకి వెళ్ళాడు. చేతిలోని పుస్తకాలు గదిలో పడేసి, బట్టలు మార్చుకుని, సబ్బుపెట్టె తీసుకుని గబగబా నీళ్ళ గదిలోకి వెళ్ళిపోయాడు.

శాంత కాఫీగ్లాసు కడుగుతోంది.

'త్వరగా నాకు కాఫీ కలపండి వదినా. టేబుల్ టెన్నిస్‌కు టైమయిపోతోంది!' రమేష్ తొందర పెట్టాడు.

శాంత మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్ళిపోయింది. పీట వాల్చి కాఫీ, టిఫిన్ సిద్ధంగా వుంచింది.

రమేష్ డ్రస్ చేసుకుని వచ్చి పీటమీద కూర్చోగానే, నెమ్మదిగా బయటికి జారుకుంది. కాని రమేష్ వూరుకుంటాడా?

'వదినా...వదినా'

'ఏం కావాలి' అంటూ లోపలకు వచ్చింది శాంత.

'ఇదుగో, ఈ లైట్ బ్లూషర్టు నాకు బావుంటుందా?'

శాంత రమేష్ వైపు చూసింది.

అతని కళ్ళు చిలిపిగా నవ్వుతున్నాయి.

'నీకేం, ఏదైనా బావుంటుంది.'

'హాస్యానికి కాదొదినా, నిజం చెప్పండి.'

'ఫస్టుగా వుందిరా బాబూ.'

'మీరు వాడే ఫేస్ పౌడరు వాడానీ రోజు.'

'నువ్వా కొన్నావా ఏం?'

'అబ్బే, నేనెందుకు కొంటాను. మీ టేబిల్‌మీద కనబడింది. శుభ్రంగా రాసేసుకున్నాను. అలాగే మీ హేరాయిల్ కూడా–'

'నువ్వొకడివి! అచ్చం ఆడదానిలా...' అనేసి నాలిక కొరుక్కుంది శాంత.

రమేష్‌తో ఎక్కువ మాట్లాడరాదనుకున్నమాట గుర్తుకు వచ్చింది.

'ఇకమీదట ఆ పౌడర్ నాకు దొరికేటట్టుగా పెట్టకండి. కనబడితే మాత్రం నే నొదల్ను.'

'అది చాలా ఎలరా బాబూ. ఇష్టం వచ్చినట్టుగా రాసేసుకోకు.'

'అయితే అవుతుంది. మా అన్నయ్య డబ్బేగాపోయేది. మధ్య మీ కేమిటి?' అన్నాడు రమేష్ శాంతంగా.

అంతలో సుశీలమ్మగారు లోపలికొచ్చి, 'శాంతకు తలనొప్పిగా వుందిట. ఏదైనా మందివ్వరా' అన్నారు.

'నాదగ్గర ఫీజు చాలా ఎక్కువవుతుందమ్మా. వేరే డాక్టర్ని చూడటం మంచిది.'

'చాల్లేరా నీ పరిహాసం' అని విసుక్కున్నారు సుశీలమ్మగారు.

శాంతకు అసలు సంగతి తెలుసు. నవ్వుతూ,

'నీ ఫీజు ఎంత?' అంది.

'ఒక్క సినిమా—బాల్కని టికెట్' అన్నాడు రమేష్.

'అలాగే' అంది శాంత.

'ఇప్పుడే ఇచ్చేయాలి. ఆట ముగించుకుని అలాగే సినిమాకు వెళ్ళిపోతాను. భోజనానికి నాకోసం కాచుక్కూర్చోకండి.'

'మందు చెప్పకుండానే ఫీజు పుచ్చుకునే డాక్టర్. భలే!' అంది శాంత కొంటెగా.

'ఒక్క సారిడన్ మింగి, నీళ్ళు తాగండి' అనేసి గబగబా లేచి వెళ్ళాడు రమేష్. తలుపుదాకా వెళ్ళినవాడు గబుక్కున వెనక్కు మళ్ళి,

'వదినా! నా ఫీజు' అంటూ చెయ్యి జాపాడు.

శాంత యిచ్చిన రెండురూపాయల నోటు జేబులో పడవేసుకుని చకచకా వెళ్ళిపోయాడు.

రమేష్ ఇంట్లో వున్నంతవరకూ అంతా మరిచిపోయిన శాంతకు, మళ్ళీ ఉదయపు సంఘటనే గుర్తుకు రాసాగింది.

"ఉదయం తనన్నమాట గుర్తుకూడా లేకుండా అతను హాయిగా తిరుగుతూంటే, తను మాత్రం ఎందుకిలా బాధ పడాలి?"

అలా అనుకుంటూనే రాత్రి వంట చేసింది. అందరి భోజనాలూ అయ్యాక రమేష్‌కి కంచంపెట్టి, వంటంతా అందేటట్టు పెట్టి,

'రమేష్ వస్తే అతణ్ణే వడ్డించుకోమనండి. నాకింకా తలనొప్పి తగ్గ లేదు' అని అత్తగారితో చెప్పి పడుకుంది.

కాని నిద్రమాత్రం ఆమె ఛాయలకూడా రాలేదు.

రమేష్ గేటు తెరుచుకుని రావటంకూడా ఆమెకు తెలుస్తూనే వుంది. లోపలికి రాగానే,

'వదినా...వదినా' అని పిలిచాడు.

'ష్... అరవకు. శాంతకు తలనొప్పిగా వుందని పడుకుంది. నువ్వు అన్నం తిందువుగాని పద' అన్నారు అక్కడే పడుకున్న సుశీలమ్మగారు.

రమేష్ వెంటనే గొంతు తగ్గించి 'కులాసాగా వున్నారు కదా' అన్నాడు.

'ఉదయం నుండి అదో రకంగానే వుంది.'

'పులుసులో ఉప్పు వేయడం మరిచిపోయినప్పుడే అనుకున్నా; వదిన మామూలుగా లేరని.'

రమేష్ వంటింట్లోకి వెళ్ళేసరికే శాంత వడ్డించటానికి సిద్ధంగా వుంది.

'మీరెందుకు లేచారు? నేను పెట్టుకుని తినేవాడినిగా.'

'నెయ్యి కంచం దగ్గర పెట్టడం మరిచిపోయాను. ఇక అలాగే అన్నం తినేస్తావని వచ్చాను.'

'అన్నట్టు వదినా! ఉదయం పులుసులో ఉప్పు వేయలేదేం?'

'ఏమిటో మతి మరుపు. నేనూ పెద్దదాన్నయిపోతున్నాను మరి.'

'ఉదయం నుండి అదో మాదిరిగానే వున్నారట?'

'లేదే' అని నవ్వటానికి ప్రయత్నించింది శాంత.

'సినిమా ఎలా వుందని అడగనేలేదు?'

'ఎలా వుంది?'

'చాలా బావుంది.'

'______'

'ఎవరెవరు నటించారో అడగనేలేదు మళ్ళీ?'

'ఆడవాళ్ళు ఎక్కువగా మాట్లాడరాదురా, రమేష్.'

రమేష్ తలెత్తి చూశాడు.

'ఆఁ. ఇప్పుడు అర్థమయింది అసలు విషయం. కాని, వదినా! నా స్వభావం తెలిసికూడా నేనన్న చిన్నమాట నంతగా పట్టించుకుంటారనుకో లేదు. నేను అలా అనిన వెంటనే ఒక్క లెంపకాయ ఇవ్వలేకపోయారూ?'

'నువ్వు ఇప్పుడు పెద్దవాడివయ్యావు. మొదటిలా చిన్న కుర్రాడివి కాదు కొట్టటానికి.'

'అప్పుడూ మీరు కొట్టేవారు కాదు. నన్ను కొట్టాల్సి వచ్చినప్పుడు కూడా మీరు చిరుతిళ్ళు పెట్టేవారు. అందువల్ల నేనిలా తయారయ్యాను.'

'ఎలా?'

'ఎలాగేమిటి, పూర్తిగా చెడిపోయాను.'

'ఛ, అవేం మాటలు నీకేం రాజులా వున్నావు.'

'నేను రాజులా వుండటానికి ఇంట్లో ఎంతమంది శ్రమిస్తున్నారో నాకు తెలుసొదినా.'

'నీకు కొంచెం అన్నం పెట్టేదా?'

రమేష్ ఒక్క నిమిషం మెదలకుండా వుండి

'మీ తలనొప్పి ఎలా వుంది?'

'అలాగే వుంది.'

'సారిడన్ తీసుకున్నారా?'

'లేదు.'

'పోనివ్వండి. ఇప్పుడువెళ్ళి పడుకొని హాయిగా నిద్రపొండి. తెల్లవారేసరికి తలనొప్పి పారిపోతుంది.'

'ఈ సలహాక్కూడా ఫీజు ఇవ్వాలా ఏం?'

'కాక డాక్టర్లెప్పుడైనా ఫీజు తీసుకోకుండా సలహాలివ్వగలరా?'

'అయితే యిప్పుడేమివ్వాలి డాక్టరుగారూ?'

'ఏమీవద్దు. ఒక్కసారి నవ్వేసి వెళ్ళి పడుకోండి.'

'అనవసరంగా నాకు నవ్వు రాదురా అబ్బాయి.'

'అయితే నన్ను తల్లక్రిందులుగా నిల్చోమన్నారా? అప్పుడైనా నవ్వగలరేమో మరి.'

'పోరా, పిచ్చితండ్రీ' అంటూ శాంత నవ్వుతూ వెళ్ళిపోయింది. ఉదయం నుండి బరువుగావున్న మనసు యిప్పుడు తేలిక పడినట్టు అనిపించింది.

కృష్ణమూర్తి ఎప్పుడో నిద్రపోయాడు. శాంతవెళ్ళి పడుకోగానే నిద్రాదేవి ఆమెను వెంటనే వరించింది.

మర్నాడు ఉదయం మామూలు ప్రకారమే రమేష్‌ని లేపటానికి వెళ్ళింది శాంత.

'రమేష్... ఆరు దాటింది ఇకనైనా లేవరా బాబూ!'

'— — —'

'టేబిల్ మీద సరిగ్గా యీ పుర్రె పెట్టావేంరా? లేవగానే దాన్నే చూస్తావా పాడు. అపలక్షణం. దాన్ని ఎక్కడైనా కనపడకుండా దాచి పెట్టుకోకూడదూ?'

'ఏమన్నారు?' అంటూ, లేచి కూర్చున్నాడు రమేష్.

'ఉదయం లేస్తూనే ఈ పుర్రె చూడటం మంచిది కాదంటున్నా.'

'అలాగా! కాని, నేను లేవగానే దాన్ని చూడటం లేదే?'

'మరింకేం చూస్తున్నావ్?'

'మీ మొహం చూస్తాను. ఫేస్ పౌడరుతో పాలిష్ చేసిన మొహం.'

'నువ్వేం వర్ణించనక్కరలేదుగాని, దీన్నెక్కడైనా దాచేయి, నాక్కనిపించకుండా.'

'ఆ పుర్రె వెనక ఎంత కథ ఉందో మీకు తెలుసా?'

'ఏమిటి?'

'ఆ ముఖం కూడా ఒకప్పుడు మీలాంటి అందమైన ఆడదాని మొహం.'

'చాల్లే యిక; నాకు కోపం తెప్పించకు.'

'నేను హాస్యానికి చెప్పటం లేదొదినా! నిజంగానే, తనలోని రంగు, కాంతి, జీవం అన్నీ పోగొట్టుకుని, ఇలా తయారయింది. కలలో ఒక్కోసారి నిజరూపంలో దర్శన మిస్తుంది. ఆహా! ఎంతటి సౌందర్యం అను కున్నారు! అలాటి లావణ్యరాశి దొరికితేనే పెళ్ళి చేసుకుంటాను లేకపోతే బ్రహ్మచారిగానే వుండిపోతాను.'

'ఆహా! అందులోనూ తమరు బ్రహ్మచారిగా వుండిపోవటం! అన్నట్టు తమ క్లాస్‌మేట్ మనోరమను ఏంచేస్తారండి డాక్టరుగారూ?'

'మనోరమ విషయం మీ కెవరు చెప్పారూ? ఆమె నాతో టేబుల్ టెన్నిస్ ఆడటానికి వస్తుంది. అంతే మరింకేం లేదు.'

'ఇంకేంలేదూ? నిజంగానేనా?'

'నిజం వదినా.'

'ఏమో బాబూ! నాకుమాత్రం నమ్మకంలేదు.'

'ఓసారి యింటికి తీసుకొస్తాను. చూద్దురుగాని; ఆమె లవ్ ప్రూఫ్ వదినా.'

'అయితే మాత్రమేం! ప్రేమ గుడ్డిది.'

'కాని ప్రేమికులకు కళ్ళుంటాయి. నా మటుకు నేను కళ్ళు మూసు కోను. నేను చేసుకోబోయే పిల్లకు వెన్నెలకాంతిని విరజిమ్మే...'

'ఇహ చాల్లే. కాలేజీకి టైమవుతోంది.'

'మీ తలనొప్పి ఎలా వుంది?'

'నీ మాటలు వింటూ కూర్చుంటే, మళ్ళీ వస్తుంది' అంటూ లోపలకు వెళ్ళిపోయింది శాంత.

కోడల్ని చూడగానే సుశీలమ్మగారు 'తలనొప్పి ఎలా వుంది?' అని అడిగారు.

'ఇప్పుడేం లేదు; తగ్గిపోయింది' అంది శాంత.

'మొహమంతా వాడిపోయినట్టుంది.'

'లేదే బాగానే వున్నా' అంటూ వంటింట్లోకి వెళ్ళింది శాంత.

# 2

రమేష్ కాలేజీకి వెళ్ళేవరకు శాంతకు తీరిక చిక్కేది కాదు. అంత హడావిడి చేసేవాడు. అతడి గొడవలతో ఎవరికీ ఏమీ తోచేదికాదు. అన్నీ ముగించుకుని అతడు కాలేజీకి వెళ్ళాడంటే అందరూ గొప్ప పని ముగించి నట్టు హాయిగా ఊపిరి పీల్చుకునేవారు. రమేష్ తన బూటు పాలిషునుండి "ఫైసకాలజి" నోట్‌బుక్ వరకూ వదినవే ఎక్కడుందని అడిగేవాడు.

ఒక్కోసారి శాంత విసుక్కునేది.

'ఏమిట్రా చోద్యం! నీ పుస్తకాలు, రేజర్లు, బ్లేడు, పాలిషు-అంతా నన్నడుగుతావేం? అవన్నీ నేను వాడనని తెలీదూ?'

'ఏమో, ఎవరికి తెలుసు. గోళ్ళు కత్తిరించుకోవడానికి నా బ్లేడు తీసి వుండవచ్చుగా.'

'రామ, రామ! నేను శూర్పణఖ నయినా కూడా నీ బ్లేడు మాత్రం ముట్టుకోను.'

'అన్నయ్య కోసమేమైనా-'

'ఇంకా నయం. ఆయన వస్తువులు నువ్వు ముట్టకుండా వుంటే చాలు' అనేది శాంత.

ఆమె మాటలు అక్షరాలా నిజం. జేబు రుమాలు, పెన్సిలు, పెన్ను, బ్లేడు-ఏది కావాల్సి వచ్చినా తనవి వెతుక్కోకుండా, సులువుగా దొరికే

అన్నయ్య వస్తువులమీద దాడి చేసేవాడు రమేష్. తనకు కావలసిన వస్తువు తీసుకుని,

'వదినా, అన్నయ్య పెన్ను తీసుకుంటున్నా! మళ్ళీ వెతుక్కునేడు' అనేవాడు.

'ఆయన పెన్ను ముట్టకయ్యా. మళ్ళీ నన్ను కోప్పడతారు.'

'అహా, నాకు తెలియక అడుగుతాను- నేను పెన్ను తీసుకుంటే మిమ్మల్నెందుకు కోప్పడతారు?'

'నేను నీకు యింత చనువిచ్చి నెత్తికెక్కించుకున్నానని, అందువల్లే నువ్విలా తయారయ్యావని అంటారు. మీ అన్నయ్యనే అడిగి తీసుకో బాబూ.'

'ఉహుఁ. నేను అన్నయ్యను అడుగను. మీ దగ్గర పెన్నుంటే ఇవ్వండి'

'నే నేం రాసుకుంటానని నాదగ్గిర పెన్నుంటుందనుకున్నావ్?'

'ఇంటి లెక్క రాయటానికి పెన్నక్కర్లేదా మీకు?'

'అక్కర్లేదు; అసలు ఇంటి లెక్క రాసే అలవాటే లేదు నాకు. లెక్కంతా నా నోట్లోనే ఉంటుంది.'

'మీరు డాక్టరు కావాల్సింది వదినా! మంచి జ్ఞాపకశక్తి మీకు.'

'ఇంటికి ఒకరు డాక్టరైతే చాలు. నీ చదువు ఎప్పటికి పూర్తవుతుందాని ఇంట్లో అందరం కాచుక్కూర్చున్నాము.'

'ఎందుకో వాళ్ళకంత ఆత్రం?'

'ఆత్రం కాదామరి ? ఉదయం నీ హడావిడిలో చచ్చిపోతున్నాం. నువ్వు డాక్టరై, నీకూ పెళ్ళయితే మేమంతా బ్రతికిపోతాం...'

'వదినా! నాకు వెన్నెలకాంతిని విరజిమ్మే...'

'కాలేజికి టైమవుతోంది వెళ్ళరా బాబూ!' అని మైమరచిన మరిదిని హెచ్చరించి అక్కడ నుండి పంపేది శాంత.

ఆమె అనుకున్నట్టే కృష్ణమూర్తి అడిగేవాడు.

'నా పెన్నేది?'

'రమేష్ పట్టుకెళ్ళాడు.'

'ఇకమీదట నా వస్తువులేవీ ముట్టద్దని చెప్పువాడికి.'

'మీరే చెప్పకూడదూ, నే చెపితే వినడుమరి.'

'ఎలావింటాడూ? అలా చనువిచ్చి నెత్తి కెక్కించుకుంటే!'

'పోనివ్వండి. ఈ సంవత్సరం గడిచిపోతే, వాడెక్కడో! మన మెక్కడో!'

'నువ్విలా అంటూనే వాడిని ఇలా తయారుచేశావు' అని ఊరుకునే వాడు కృష్ణమూర్తి.

శాంత అన్నమాట నిజమే. రమేష్ తన భవితవ్యాన్ని గురించి వదినతో చర్చించేవాడు. తన మనసులోని ఆరాటన్నంతా వదిన ముందుంచే వాడు. వదినతో తప్ప మరెవరితోనూ తన విషయాలు చెప్పుకునేవాడు కాదు. తల్లి తనకన్నా చాలా పెద్దగనుక ఈ కాలానికి తగినట్టుగా సలహా లివ్వలేరని అనుకునేవాడు. తండ్రితో రమేష్‌కి చిన్నప్పటినుండి చనువన్న మాటేలేదు. ఇక అన్నయ్య. వాళ్ళెప్పుడూ ఎక్కువగా కలుసుకునే వారే కాదు. కలుసుకుని మాట్లాడుకున్నా, అన్నయ్య తమ్ముడిని చిన్నకుర్రాడి కింద కట్టి మాట్లాడేవాడు. ఇహ మిగిలింది శాంత. తన మనసులోని ఆలోచనలన్నీ ప్రేమతో వినే వదినతోనే చెప్పుకునేవాడు.

'మెడిసిన్ పూర్తిచేశాక ఇక్కడే పనిలో చేర్తావా, ఏం చేస్తావు రమేష్?' అని అడిగేది శాంత.

'ఇక్కడే ప్రాక్టీసు చేసుకున్నా, జీవనం నడిచిపోతుంది. కాని, వదినా! పనిమాత్రం రాదు. జలుబు, దగ్గు- ఇలాంటివి నయంచేస్తూ కూర్చో వచ్చు. కాని నాకు సర్జన్ కావాలనుంది. ఈ ఊరు వదలిపెట్టాలని లేదు గాని, ఈ ఊళ్ళో కులాల గొడవలు ఎక్కువైపోయాయి. అందుకనే ఉత్తరాదికి వెళ్ళాలని వుంది.'

'హస్తవాసి, నైపుణ్యం ఉంటే, ఏ ఊళ్ళో వుంటే మాత్రం ఏమిటి చెప్పు!'

'మీరు ఎప్పుడూ ఇంట్లో ఉంటారు. మీకేమీ తెలేదు వదినా! బయట ప్రపంచాన్ని కాస్త కళ్ళు తెరచి చూడండి. మా హాస్పిటల్‌లోనే ఎన్ని అన్యాయాలు జరుగుతున్నాయని! కాని, ఏమీ చేయలేక అందరూ

ఊరుకుంటారు. ఇవన్నీ చూస్తూ చూస్తూ మళ్ళీ నేను అదే కూపంలోకి దూకలేను వదినా!'

'నువ్వువెళ్ళిపోతే, నాకేమీ తోచదురా రమేష్.'

'నిజమే, నాకూ కష్టమే, మీరు రుచిరుచిగా వండిపెట్టే టిఫిన్లు, వంట ఇవన్నీ వదలిపోవటం.'

శాంత నవ్వేసేది.

'పోనీ, వాటికోసమైనా వుండిపో' అని సలహా ఇచ్చేది.

'మీలాంటివారు వుండేవరకూ, ఎక్కడున్నా జీవించేందుకు కావాల్సినంత డబ్బు సంపాదించుకోగలను. ఉత్త డబ్బు సంపాదించడం ఒకటే కాదు నాకు కావలిసింది.'

'కావచ్చు. కాని ఈ ఆదర్శం ఎన్నిరోజులు నిలబడుతుందోననే నా అనుమానం. వృత్తిలోకిదిగే ప్రతి డాక్టరు అలాగే అనుకుంటాడు. కాని తరువాత పేదవాళ్ళను కన్నెత్తి కూడాచూడరు.'

'మీ మాట నిజమే వదినా! సామాన్యంగా హాస్పిటలులో జనరల్ వార్డులోని రోగుల్ని డాక్టర్లు మొదల్కొని నర్సులు ఆయాలవరకూ అందరూ అలక్ష్యంగా చూస్తారు.'

'మీ డాక్టర్ల ఇంకోరోగంకూడా నాకు అర్థంకాదు. ఒక డాక్టరు పేషంట్‌ను ఇంకొకడు చచ్చినా చూడడు. పేషంటు ప్రాణంపోతున్నా 'ఇతడు నా పేషెంటు కాదు' అని వెళ్ళిపోవటం న్యాయమంటావా? అంతెందుకు, ఓ మారు మా మామయ్య బెంగుళూరు విక్టోరియా హాస్పిటలులో స్పెషల్ వార్డులో వుండేవాడు. ఆయనకోసం తెప్పించిన ఇంజక్షన్ ఇవ్వటానికి డాక్టరే గతిలేకపోయాడు. ప్రతివాడు 'ఈయన మా పేషెంటుకాదు' అంటూ వెళ్ళిపోవటమే. ఇదేం న్యాయమో చెప్పు!'

'న్యాయంకాదుగాని, అలా ఒకరిపేషంటుని ఇంకొకరం ట్రీట్‌చేస్తే మళ్ళీ వాళ్ళల్లో వాళ్ళకు భిన్నాభిప్రాయాలు గొడవలు వస్తాయి.'

'వీళ్ళ గొడవల్లో మధ్య చచ్చేది మనం. నువ్వుమాత్రం అలా చేయకు రమేష్!'

'నాకు మంచి సర్జను కావాలనుంది.'

'చాలా ధైర్యం ఉండాలి కదూ సర్జన్ కావాలంటే?'

'అవును. రెండు కేసులు సక్సెస్ కాకపోతే ఇహ వాడికా వూళ్ళో ఉప్పుకూడాపుట్టదు.'

'అయితేమరి ఏ ధైర్యం మీద సర్జన్ అవుదామనుకుంటున్నావు? నాకేమో భయమే బాబూ!'

'భయపడకండి వదినా! నేను నా మొదటి ప్రయోగంమాత్రం మీ మీద చెయ్యను.'

'నాభయం అదికాదు రమేష్! ఒకవేళ నీ కేమయినా చెడ్డపేరొచ్చి...'

'అపుడు మీ రుంటారు, నాకు కావలసినంత డబ్బివ్వటానికి.'

'తమాషాక్కాదు రమేష్! ఏది ఏమైనా, నీకు ధనదాహం లేకుండా ఉండాలనే నా కోరిక.'

'వదినా! ఖచ్చితంగా చెపుతున్నా వినండి. డబ్బుగల వాళ్ళ దగ్గర నుండి ఒక్కపైసాకూడా వదలకుండా వసూలు చేస్తాను. బీదవాళ్ళను పైసాకూడా అడగను, సరేనా?'

'అలా అని ప్రామిస్ చెయ్యి.'

'ఏం? నా మాటమీద మీకంత నమ్మకం లేదా?'

రమేష్ నవ్వుతూ అన్నా శాంత నొచ్చుకుంది.

'నిన్ను నొప్పించానేమో?' అంది.

'అవును.'

'క్షమించు.'

'రవ్వలడ్డూలు, కారంగింజలు పెడితేగాని, క్షమించను.'

'నా దగ్గరే ఇంత లంచం వసూలు చేస్తావే! ఇహ బయట వాళ్ళను వదలిపెడతావా నువ్వు!'

'మీరేమన్నా, నా పేషంటు కావాలి...'

'రామ, రామ. డాక్టర్ల చేతికి చిక్కకుండానే దేవుడు నన్ను తీసుకుపోతే చాలు.'

'మీరు అలా అంటే డాక్టర్లు బ్రతికేదెలా? మీరు నా పేషంటయితే నేను అడిగేదింతే. వారానికో సినిమా, రెండుమార్లు హోటల్ ఖర్చు, వారానికి నాలుగుమార్లు రవ్వలడ్డులు చేసిపెడితే చాలు. అంతే నా ఫీజు.'

'నీ ఫీజు ఇవ్వటంతో నేను దివాలా తీస్తానంతే.'

'మీకు తెలీదు కాని, వదినా! మీకు దేవుడు సకల సౌభాగ్యాలను ప్రసాదించాలని నేను ఎప్పుడూ దేవుడిని ప్రార్థిస్తూంటాను.'

'చాలా సంతోషం. కాని, తమరికి దేవుడిమీద ఈ నమ్మక మెప్పటి నుండో?' శాంత కొంటెగా అడిగింది.

'నేను ఫైనల్ ఎం. బి. స్టూడెంటు నయినప్పటినుండి' అని జవాబు చెప్పాడు రమేష్.

సుశీలమ్మగారు ఎందుకనో పిలవటంతో శాంత లోపలికి వెళ్ళింది.

రమేష్ ఆఖరి సంవత్సరంలో పడ్డాక, మునుపటిలా వదినతో కబుర్లు చెబుతూ కూర్చోటం పడేదికాదు. ఉదయం హాస్పిటల్ డ్యూటీ, మధ్యాహ్నం కాలేజీ, సాయంకాలం టేబుల్-టెన్నిస్ వీటితో సరిపోయే దతనికి. రాత్రి భోంచేసేటపుడు, పడుకునేందుకు ముందు కబుర్లు చెప్పేవాడు. ఒక్కోసారి భోంచేయగానే తన గదిలోకి వెళ్ళిపోయేవాడు— చదువుకోవటానికి. అప్పుడు శాంతకు ఏమీ తోచేదికాదు. పాలు ఇవ్వటమనే నెపంతో అతడి గదిలోకి వెళ్ళేది.

'రమేష్! పాలుతీసుకో.'

'అక్కడే ఉంచండి' అన్నాడు రమేష్ పుస్తకంలోనుండి తలెత్తకుండానే.

'తొందరగా తాగేయ్. లేకపోతే చల్లారిపోతుంది.'

'అబ్బ! పాలు తాగడానిక్కూడం మీగొడవే' అని విసుక్కునేవాడు రమేష్.

శాంత చిన్నబుచ్చుకుని పాలగ్లాసు టేబుల్‌మీద పెట్టేసి వెళ్ళిపోయేది.

శాంత అలా వెళ్ళిపోతే అతడి చదువు సాగేదికాదు. పాలుతాగి, గ్లాసులోపల పెట్టే వంకతో వంట గదిలోకి వెళ్ళేవాడు. అక్కడ శాంత లేకపోతే,

'అమ్మా! వదిన ఏదీ' అని అడిగేవాడు.

'పడుకుని ఉంటుంది.'

రమేష్ ఇహ వెనకా ముందు చూడకుండా తిన్నగా అన్నయ తగదిలుపుకొడుతూ,

'వదినా! తలుపులు తీయండి. కాస్త పనుంది' అనేవాడు.

'నేను పడుకున్నా. లేచి తియ్యలేను. ఏం పనున్నా, రేపు ఉదయమే చెప్పు' అని జవాబు వచ్చేది శాంతనుండి.

'అన్నయ్యా! నువ్వైనా తలుపుతీయి' అని అరిచేవాడు రమేష్.

'ఆయన నిద్రపోతున్నారు' అని శాంతే జవాబుచెప్పేది.

'అయితే ఇప్పుడే లేపేస్తాను చూడండి' అంటూ దబ దబా తలుపు తట్టేవాడు.

ఇహ విధిలేక శాంత తలుపు తీసేది. కృష్ణమూర్తి చదువుతూ వుండేవాడు.

'ఆఁ అబద్ధాలు చెప్తున్నారా? అన్నయ్య నిద్రపోవటంలా.'

'నీ గొడవతో కుంభకర్ణుడుకూడా నిద్రపోలేడు. అదిసరేగాని, నీకెన్నేళ్ళయ్యా?'

'హఠాత్తుగా తమరికి నా వయస్సెందుక్కావాల్సి వచ్చింది' అంటూ తనో కుర్చీ లాక్కుని కూర్చునేవాడు.

అలా కూర్చుంటే మరో గంటక్కూడా లేవడని కృష్ణమూర్తి క్కూడా తెలుసు.

'అహ, ఊరికినేగాని; ఇంతకూ నీ కెన్నేళ్ళు చెప్పు?' అంటూ తనూ ఇంకో కుర్చీమీద కూర్చునేది శాంత.

'ఇరవై మూడేళ్ళు.'

'నీ కిన్నేళ్ళొచ్చింది వృథా రమేష్.'

'ఏం అలా అంటున్నారు? చదువుకోవటంలేదా? ఆఖరి సంవత్సరం ఎం. బి. లో ఉన్నాను గుర్తుంచుకోండి.'

'చదువుకుంటే సరా? రాత్రి ఈ సమయంలో భార్యాభర్తలు పడుకున్న గదితలుపులు తెరిపించి ఇలా వచ్చి కూర్చోవచ్చా?'

'ఓస్. ఇంతేనా! ఏమో అనుకున్నాను. మీ దగ్గర నాకు రూల్సేమిటి వదినా' అని ఎగర గొట్టేసేవాడు.

'అలాగే అంటూవుండు. రేపు నీ పెళ్ళాంరానీ, నేనూ అలాగే చేస్తాను.'

'వదినా నీకు పెళ్ళయి ఎన్నేళ్ళయింది?' రమేష్ ఎదురు ప్రశ్న వేశాడు.

'పన్నెండేళ్ళు. నే నీ యింటికి వచ్చేసరికి నువ్వు పదకొండేళ్ళ కుర్రాడివి.'

'సరే, నాకూ పెళ్ళయ్యాక పన్నెండేళ్ళు టైమివ్వండి. తర్వాత అలాగే చేద్దురుగాని.'

శాంత మొండిగా 'ఊహుఁ, అదేం కుదరదు మీ ఆవిడ వచ్చిన రోజే నేను అల్లరిచేస్తాను' అనేది.

'అయితే ఆ రోజు నేను ఇంటికేరాను, ఎక్కడికన్నా వెళ్ళిపోతాను. ఆఁ, అన్నట్టు వదినా! మొన్న ఏదో సంబంధం వచ్చిందట. మీరు ఆ పిల్లను చూశారా?'

'ఆఁ, చూశాను.'

'ఎలా ఉంది?' కుతూహలంతో అడిగాడు రమేష్.

'నేనే నయం- ఆ పిల్లముందు.'

'బాగాలేదన్న మాట.'

'ఆఁ. అందుకే నీదాకా తేలేదు. నువ్వుచూసి, పెళ్ళయితే చాలు అని ఎక్కడ ఒప్పేసుకుంటావో అనే భయంతో అమ్మా, నేనూ నీతో చెప్పకూడదని అనుకున్నాం.'

'అయ్యో! అన్యాయం!' లేని బాధ వ్యక్తపరిచాడు రమేష్.

'డాక్టరుగారూ! ఆమెది వెన్నెలకాంతిని విరజిమ్మే అందంకాదు. అతి సామాన్యరూపంగల పిల్ల.'

'నేను పెళ్ళిచేసుకోబోయే అమ్మాయి ఎలా వుండాలో తెలుసా? వెన్నెల- కాంతిని... విరజిమ్మే...'

కృష్ణమూర్తి పెద్దగా ఆవలించి-

'రమేష్! నువ్వింక వెళ్ళి పడుకోరా! నాకు నిద్దరొస్తోంది' అన్నాడు.

'నువ్వు పడుకో అన్నయ్యా! నేను ఇంకా వదినకు చాలా కబుర్లు చెప్పాలి.'

'నువ్వు పెళ్ళిచేసుకోబోయే అమ్మాయిని వర్ణించదల్చుకుంటే మాత్రం విసుగే' అని భర్తతో ఏకీభవించేది శాంత.

'నేను ఎలాంటి పిల్లను చేసుకున్నా, వదినలాంటి మొండిఘటాన్ని మాత్రం చేసుకోను.'

'మంచి మాటన్నావు రమేష్' అంటూ, తమ్ముడిని సమర్థించేవాడు కృష్ణమూర్తి.

'వాళ్ళ గదిలో ఇంతసేపు ఏంచేస్తున్నావురా' అని అప్పటివరకూ మేలుకున్న సుశీలమ్మగారు అడిగితే, బుద్ధిగా

'నిద్రపట్టలేదమ్మా, వదిన కథ చెపుతూంటే వింటూ కూర్చున్నాను' అనేవాడు.

'ఊరికే కబుర్లు- కథలు అంటూ కూర్చోకు. నీ చదువేదో చూసుకో' అని గుర్తుచేసేవారు సుశీలమ్మగారు.

శాంతకు తరచుగా తలనొప్పి రావటం మామూలైపోయింది. తలనొప్పేకదా అని మొదట్లో ఎవరూ అంతగా లెక్కచేయలేదు. కాని అస్తమానం తలనొప్పిగానే వుండటం గమనించి కృష్ణమూర్తి:

'ఎప్పుడూ కుట్లూ, అల్లికలూ చేతిలో పట్టుకుని కూర్చోకు. అందుకే ఇలా తలనొప్పిగా వుంటుందేమో. పుస్తకాలుకూడా చదవటం మానేయి కొన్నిరోజులు' అని సలహా ఇచ్చాడు.

శాంత భర్త చెప్పినట్టే కంటికి శ్రమ కలిగించే పనులు మానేసింది కాని, దానివల్ల తలనొప్పి ఏమాత్రం తగ్గలేదు.

పొయ్యిదగ్గర కూర్చోవటంవల్ల అలా అవుతోందేమోనని సందేహం వెలిబుచ్చారు సుశీలమ్మగారు.

'ప్రపంచంలో పొయ్యిముందు కూర్చున్న వాళ్ళకంతా తలనొప్పి వస్తుందా ఏం' అని ఎదురు ప్రశ్న వేసింది శాంత.

'వారానికోమారు శుభ్రంగా ఆముదం రాసుకుని నీళ్ళుపోసుకుంటే తలనొప్పి ఎందుకు వస్తుంది? ఈ కాలపు పిల్లలకు షాంపూమీదనే నమ్మకం ఎక్కువ' అని గొణిగారు మామగారు.

'వారానికోసారి సినిమా చూస్తే ఇంకేమవుతుందేమిటి?' అన్నాడు రమేష్.

అందరి మాటలూ మౌనంగా వింటున్న శాంత, రమేష్‌మాటతో రెచ్చిపోయింది.

'వారానికోసారి సినిమా చూసేది నువ్వా— నేనా?' అంది కోపంతో మండిపడుతూ.

'చూసేదేమో నేనే కాని, తలనొప్పి మాత్రం మీకు. అది సరేకాని, వదినా! రేపు మిమ్మల్ని కళ్ళ డాక్టరు దగ్గరకు తీసుకుని వెడతాను.'

మరునాడు వదినను తీసుకుని హాస్పిటల్‌కు వెళ్ళాడు. దారి పొడుగునా ఆమెను ఏడిపిస్తూనే ఉన్నాడు.

'అక్కడ ఎ. బి. సి. డి. చదవమంటారు. చదవగలరా? లేకపోతే వేళ్ళు చూపెట్టి లెక్క పెట్టమంటారు. అది మరీ అవమానకరం.'

'రమేష్! నేను ఏమైనాచేస్తాను కాని, కళ్ళజోడు మాత్రం పెట్టుకో లేను. ముందే చెబుతున్నా; నాకస్సలు ఇష్టం వుండదు.'

'అలా అని కళ్ళు పాడుచేసుకోగలమా వదినా?'

రమేష్, మెడికల్ కాలేజి విద్యార్థి కావటంవల్ల కళ్ళ డాక్టరుతో బాగా పరిచయం వుందతనికి. దానివల్ల శాంత కళ్ళ పరీక్ష తొందరగానే జరిగిపోయింది.

'కళ్ళలో ఏ దోషమూలేదు' అని చెప్పారు డాక్టరుగారు.

'అయితే కళ్ళజోడు పెట్టుకోనక్కరలేదు' అని పొంగిపోయింది శాంత.

కాని, రమేష్ మొహం చింతాగ్రస్తమైంది.

కళ్ళకు కావలసినంత విశ్రాంతి నివ్వమని మాత్రమే చెప్పాడు వదినతో. వంటపనికూడా సుశీలమ్మగారే కావటంతో శాంతకు ఇంట్లో పనేమీ లేకపోయింది. ఏమీ తోచేదికాదు. రమేష్‌కి తీరికున్నప్పుడల్లా కబుర్లతో కాలక్షేపం చేసేది.

ఒకరోజు సాయంత్రం రమేష్ ఇంటికిరాగానే శాంత:

'ఇంకెన్నాళ్ళు రమేష్! నాకీశిక్ష' అని అడిగింది.

'శిక్ష మీకుకాదు మాకు.'

'మీకా?'

'అవును; మానసిక శిక్ష. మీ తలనొప్పి మాకు పెద్ద సమస్యగా తయారయింది.'

'ఏం డాక్టర్లోగాని; ఇంగ్లండు, అమెరికా అన్ని విదేశాలకు వెళ్ళి

పరీక్షలు పాసై వస్తారుగాని, జలుబు, తలనొప్పికూడా నయం చెయ్యలేరు' అంది శాంత కొంటెగా.

ఆ మాటలతో రమేష్ నోరు మూసుకున్నాడు. దానికి కారణం వుంది. శాంత స్నేహితురాలొకమ్మాయి అస్తమానం జలుబుతో బాధపడు తుండేది.

'నాకు బుద్ధి తెలిసినప్పటినుండి నా ముక్కులో తేమ ఆరటం అంటూ జరగలేదు. జీవనదులైనా ఎండిపోతాయేమోగాని, నాముక్కు మాత్రం ఎండదు' అని శాంతతో ఎన్నోమార్లు చెప్పుకుంది.

ఆమెను శాంత రమేష్‌కి మొదటి రోగిగా అప్పగించింది.

'ఈమె జలుబు నయం చేసేయ్. నువ్వు అడిగిన ఫీజు దొరుకు తుంది' అని శాంత చెప్పినపుడు రమేష్ సంతోషానికి పరిధులులేవు. ఇట్టే నయంచేసి వదినను మెప్పించాలనుకున్నాడు. రాజ్యాన్ని స్వయంగా హాస్పి టల్‌కి తీసుకునివెళ్ళి డాక్టర్‌తో చెప్పి 'కాటరైస్' చేయించాడు. కొన్ని రకాల 'నేసల్‌డ్రాప్స్'కూడా సూచించాడు.

కాని, ఆమె జలుబు దేన్నీ ఖాతరుచెయ్యకుండా, రమేష్‌ని ఓడిం చింది. సైన్సు అతనికి సహాయపడకపోవటంతో కర్మసిద్ధాంతాన్ని ఆశ్ర యించి;

'మీకర్మ; మీరు అలా జీవితాంతం జలుబుతో బాధపడాలని రాసి వుంటే, నేనేం చేయగలను' అంటూ ఓటమిని అంగీకరించాడు.

శాంత నిరాశచెందినా, మరిదిని వేళాకోళం పట్టించటానికి మరో కొత్త విషయం దొరికిందామెకు.

తన వృత్తిని గురించి, నిపుణత గురించి గొప్పలు చెప్పుకునేవాడు రమేష్.

రమేష్ చదువులో మంచి తెలివైనవాడు. ఆ విషయం ఎవరూ కాదనలేరు. ఏ ఒక్క క్లాసులోకూడా అతడు ఫేలయిందిలేదు. ఎప్పుడూ మొదటి లేక రెండవస్థానం అతడిదే!

దీనివల్ల అతడిలో ఆత్మవిశ్వాసం ఓపాలు ఎక్కువగానే వుండేది. అప్పుడప్పుడూ వదినముందు తన గొప్పలు చెప్పుకునేవాడు.

గొప్పలు చెప్పుకోడానికి వదినతప్ప మరింకెవరున్నారతనికి?

కాని, తరువాత రాజ్యం- జలుబు ప్రకరణం ఆతడి బడాయికి అడ్డుపడేది.

'ఎక్కువగా మాట్లాడితే, రాజ్యం- ముక్కు లాక్కొస్తా'నని ఏడిపించేది శాంత.

ఆ మాట వినగానే, రమేష్ ఏదో ఒక సాకుతో అక్కడినుండి జారుకునేవాడు.

రమేష్ 'మానసిక శిక్ష' అనగానే శాంతకు భయంవేసింది.

'అయితే ఇది నయమయ్యే తలనొప్పి కాదంటావా?'

'నయం కాకపోవడమేమిటి? తప్పకుండా నయమవుతుంది కాని, కారణమే తెలియలేదు. ఈసారి పరీక్షలయ్యాక, నేనే మిమ్మల్ని వెల్లూరుకు తీసుకువెడతాను' అన్నాడు రమేష్.

'వెల్లూరా! దానికి బదులు అమెరికానైనా చూపించరా బాబూ' అంది శాంత.

'వీలయితే అమెరికానూ చూపిస్తాను. అదీకాకపోతే ఇంకో మార్గం వుంది-'

'ఏమిటది?'

'నేను చదువుకోటానికి అమెరికా వెడతాను. అక్కడే ఓ పిల్లను చూసి పెళ్ళిచేసికొంటాను. అప్పుడు మీరు మీ తోడికోడలిని చూడడానికి వద్దురుగాని. ఆమెకు వెన్నెలవంటి కాంతిని విరజిమ్మే-'

'రమేష్! నీ స్నేహితులెవరో పిలుస్తున్నారు చూడు' అంటూ శాంత రమేష్ వాగ్ధాటిని దివినుండి భువికి మరల్చేది.

రమేష్ వెంటనే స్నేహితులకోసం పరుగెత్తేవాడు.

తనకాబోయే భార్య ఎలా ఉండాలో, వదినముందు వర్ణించేవాడు. ఆ వర్ణించటంలో తన్నుతానే మర్చిపోయి స్వప్నలోకంలో విహరించేవాడు.

'విద్యాసరస్వతి, రూపలక్ష్మి, రసిక శిరోమణి, సుగుణాల ఖని, ప్రేమరాశి-' ఇలాంటి పదాలు ఆ వర్ణనలో దొర్లిపోయేవి.

శాంత అతడి ఊహలను చూసి, లోలోపలే నవ్వుకునేది.

'ఈ వయస్సే అంత; పిచ్చికుదరాదు' అని ఊరుకునేది. శాంత పుట్టింటికి వెడితే, కృష్ణమూర్తికన్నా ఎక్కువగా విసుక్కునేవాడు రమేష్.

గాలి మార్పువల్లనైనా కోడలి ఆరోగ్యం బాగుపడుతుందేమోనని పుట్టింటికి పంపుదామనుకున్నారు సుశీలమ్మగారు. శాంత పుట్టింటికి వెళ్ళి చాలా రోజులయిందికూడా.

ఉత్తరం చూసిన వెంటనే శాంత నాన్నగారు బయలుదేరి వచ్చేశారు కూతురి మొహంచూసి ఏమనాలో ఆయనకు తోచలేదు.

చాలాకాలానికి వచ్చిన తండ్రినిచూసి, సంతోషంతో 'రా నాన్నా' అంది శాంత.

పాలిపోయిన మొహం, లోతుకుపోయిన కళ్ళు, ఎత్తికనిపించే పళ్ళు ముక్కు— వీటినిచూసి 'తమ కూతురు శాంతేనా' అనిపించింది.

'ఎందుకమ్మా ఇలా చిక్కిపోయావు' అని అడిగారు ఆయన.

'ఏంలేదు, ఈమధ్య మూడు నెలలుగా తలనొప్పిగా వుంటోంది అంతే. మరేం కంగారుపడకు నాన్నా' అంది శాంత.

శాంత మామగారు 'అమ్మాయి అనారోగ్యం మాకంతా పెద్ద సమస్యయిపోయింది. ఎంతమంది డాక్టర్లకో చూపించాంగాని ఎందుకో, ఏమిటో కూడా తెలియలేదు. అందరికీ అదే బెంగగా వుంది' అన్నారు.

'అందుకే మీకు వుత్తరం వ్రాశాం. పుట్టింట్లో వుంటే, ఏమైనా తగ్గుతుందేమోనని. ఎంతయినా ఇది అత్తవారిల్లు; తనూ వూరికే కూర్చోదు. కొద్దికొద్దిగా నయినా బాధ్యత వుండనే వుంటుంది. అక్కడైనా, కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోనీ' అన్నారు సుశీలమ్మగారు.

'ఎక్కడైతే ఏమిటమ్మా? నాకేమో రెండిళ్ళకు ఏమీ తేడా కనిపించదు' అంది శాంత.

కోడలిమాటతో పొంగిపోయారు సుశీలమ్మగారు.

కాని శాంత మాటలు ఉత్ప్రేక్షకాదు.

ఇంట్లో భర్త, అత్తగారు, మామగారు, మరిది అందరికీ శాంతంటే ఎంతో ప్రేమా, విశ్వాసమూనూ. ఆడపిల్లలులేని సుశీలమ్మగారు కోడల్ని కూతురిలాగే చూసుకునేవారు. పెళ్ళయిన కొత్తలో శాంతను పండుగలకు కూడా పుట్టింటికి పంపేవారేకాదు. పండుగకు పిలవటానికి వచ్చిన శాంత తండ్రితో:

'మీకయితే ఇంకా ఇద్దరు ఆడపిల్లలున్నారు. మాకు శాంత ఒక్కతే.

తను వెళ్ళిపోతే మాకు పండగేమిటి చెప్పండి' అన్నప్పుడు శాంత నాన్న గారు ఏమీ బదులు చెప్పలేకపోయేవారు.

శాంత తల్లి, కూతురు రాలేదని చిన్నబుచ్చుకున్నా, వియ్యపురాలు అన్నమాటలు ఆమె మనసుకు హాయినిచ్చేవి.

గాలి మార్పువల్లనైనా తన ఆరోగ్యం ఓ దారికి రావచ్చునన్న ఆశతో ఈమారు శాంత పుట్టింటికి వెళ్ళడానికి ఒప్పుకుంది.

# 3

శాంత నాన్నగారు రెండురోజులు విశ్రాంతి తీసుకున్నారు. సుశీలమ్మగారు శాంత చెల్లెళ్ళూ, తమ్ముళ్ళకోసం రకరకాల ఫలహారాలు చేసి పెట్టారు.

ఊరికి వెళ్ళేందుకు ముందురోజు సాయంకాలం; శాంత నాన్నగారు శేషగిరిరావుగారితో కలిసి బజారుకు వెళ్ళారు. శాంత తన బట్టలు సర్దుకుంటోంది.

రమేష్ ఇంటికిరాగానే కాళ్ళు కడుక్కొని వంటింట్లోకి వెళ్ళాడు. అక్కడ ఎవ్వరూ లేకపోవటంతో:

'వదినా' అని గట్టిగా కేకవేశాడు.

'ఏం కావాలి రమేష్' అని తన గదిలోనుండే అడిగింది.

'నాకు టిఫిన్ ఇద్దురుగాని రండి.'

'అలమరాలో మూత పెట్టాను తీసుకో.'

'సరే, అయితే నాకక్కరలేదు' అన్నాడు దురుసుగా.

'ఇలాచేస్తే ఎలా చెప్పు రమేష్! రేపటినుండి టిఫిన్ పెట్టటానికి నేనుండనుకదా. మరి అమ్మను కష్టపెట్టకు. వీలయినంతవరకూ నీ పనులు నువ్వే చేసుకోవాలి.'

'రేపు పుట్టింటికి వెడతాననగానే ఎంత గర్వం వచ్చేసిందో చూశారా? ఇక మేమంతా కనిపిస్తామా?'

శాంత జవాబు చెప్పకుండా అలమరానుండి టిఫిన్‌తీసి ప్లేటులో పెడ్తోంది. రమేష్ ఎందుకలా వున్నాడో శాంతకు తెలుసు.

తను పుట్టింటికి వెళ్ళినపుడల్లా రమేష్ ఇలాగే తన అసంతృప్తి

వ్యక్తపరచేవాడు. కాని, ఆ అసంతృప్తి తెరవెనుక వున్నది, నిర్మల స్నేహమన్న విషయం ఆమెకు తెలియనిదా.

శాంత టిఫిన్ ప్లేటు రమేష్ ముందుంచింది.

'నేనేం రాక్షసుడినికాను, ఇవన్నీ తినడానికి. తీసెయ్యండి.'

'ఎక్కువగా నెయ్యివేస్తాను; తిను రమేష్!'

'మీరువేసే నెయ్యికోసం మొహం వాచిలేను నేను. ముందు తీసెయ్యండి.'

శాంత సగంతీసి వేరే ప్లేటులో పెట్టింది. రమేష్ మౌనంగా తింటున్నాడు.

'పింగ్‌పాంగ్ లేదా ఈరోజు?'

'ఉంది.'

'రేపటినుండి త్వరగా లేవడానికి అలారంపెట్టుకో. ఆలస్యంగా లేస్తే కాలేజీకి టైమవుతుంది.'

'ఒక ముసలమ్మ వుండేదిట. ఆమె దగ్గర ఓ కోడి వుండేదిట. తన కోడి కూయకపోతే, తెల్లవారదనుకుందిట ఆ ముసల్ది' అని ఆగాడు రమేష్.

శాంత నవ్వి, 'తరువాత?'

'ఇహ ఇక్కడి విషయాలు మీకెందుకు? పుట్టింట్లో హాయిగా ఓ సంవత్సరంపాటు వుండిరండి. అత్తగారు, మామగారు, భర్త, మరిది వీళ్ళ గొడవలేం లేకుండా.'

'సంవత్సరం ఎందుకుంటానూ? తొందరగానే వచ్చేస్తాను.'

'ఏమక్కర్లేదు, మీరు లేకపోతే మాకు గడవదనుకున్నారా ఏం? మీరు లేరని మే మెవ్వరం చచ్చిపోం.'

'ఛ, అవేం మాటలు. రాక రాక నాన్నగారు వచ్చారు. వెళ్ళకపోతే బావుండదు.'

'మహారాజులా వెళ్ళండి. ఎవరొద్దన్నారు?'

'అయితే ఈ కోపం ఎందుకు మరి?'

'మీరిప్పుడు పుట్టింటి కెందుకు వెళ్ళాలసలు? ఆడపిల్లలు ఓ కారణానికి పుట్టింటికి వెడతారు. ఇపుడు మీకు అలాంటిదేమీలేదు. మీకెందుకు వెళ్ళాలి?'

'రేపు నీభార్య వస్తే ఇలాగే అడ్డుపడతావన్నమాట; పుట్టింటికి వెళ్ళొద్దని.'

'రేపటి సంగతి అలా వుంచండి. ఇప్పటిమాట చెప్పండి ముందు. నాకు పరీక్షలు దగ్గరకొచ్చాయికదా. మీరు వెళ్ళిపోతే ఎలా?' ఎంతో గొప్పకారణం ముందుంచాడు రమేష్.

శాంత నవ్వాపుకోలేకపోయింది.

'నేనేం చదువుకున్నానో తెలుసా రమేష్?'

'ఆఁ తెలుసు.'

'అయితే చెప్పు.'

'మెట్రిక్ ప్యాసయ్యారు.'

'ఇప్పుడు చెప్పు. మెట్రిక్ పాసయినవాళ్ళు ఫైనల్ ఎం. బి. స్టూడెంటుకి పాఠం చెప్పగలరా?'

దానికి జవాబు చెప్పలేక తికమకపడ్డాడు రమేష్. ఏమీ తోచక పోయేసరికి కోపంతో మండిపడుతూ:

'ఇలా మాట్లాడటం ఒకటి బాగావచ్చుమీకు. ఎక్కడన్నా ఏడవండి. నాకేం? పుట్టింట్లోనే వుండండి. ఇక్కడికి రానే రాకండి' అంటూ కాఫీ ఓ గుక్కలో తాగేసి చరచరా వెళ్ళిపోయాడు.

శాంత పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

శాంత మనస్సు కలుక్కుమంది. వెళ్ళేముందు మరిదితో దెబ్బలాడి వెళ్ళాల్సిరావటం చాలా కష్టమనిపించింది. ఏం? తనకు ఆ మాత్రం స్వాతంత్ర్యం లేదూ?

'హు. ఏమైనా అనుకోనీ నాకేం' అనుకుంది.

తన ప్రయాణాన్ని గురించి ఇంట్లో ఎవరూ ఏమీ అభ్యంతరం పెట్టనపుడు, మరిదిచేసే గొడవచూసి ఆమెకు నవ్వు వచ్చింది.

రాత్రి అందరి భోజనాలూ అయ్యాయి. తెల్లవారు ఝామునే ప్రయాణం గనుక మరిదితో అప్పుడే చెప్పివద్దామని అతడి గదిలోకి వెళ్ళింది శాంత.

'పాలు తీసుకో రమేష్!'

'అలా వుంచండి.'

'చల్లారిపోతుంది మరి.'

'అబ్బా, మీ గొడవొకటి– ఊఁ ఇలా తెండి' అంటూ గ్లాసు అందు కుని ఆముదం తాగేవాడిలా మొహంపెట్టి గడగడా త్రాగేశాడు.

'రేపు ఉదయం నువ్వు లేచి వుంటావో, లేదో' అంటూ తను చెప్ప బోయేదానికి నాందివేసింది శాంత.

'లేచివుండను' అన్నాడు రమేష్ చటుక్కున.

'లేవక్కర్లా. ఇపుడే చెపుదామని వచ్చాను. రేపు వెళ్ళొస్తాను.'

'మంచిది' అన్నాడు రమేష్ ముభావంగా.

'అమ్మను కష్టపెట్టకుండా చూడు. వీలయినంతవరకూ నీపనులు నువ్వే చేసుకో. కూర్చున్నచోటికే కాఫీ, టిఫిన్ తెచ్చివ్వాలని మొండిపట్టు పట్టకు. ఆమె కసలే ఏమీ చేతకాదు. వంటింట్లోకి వెళ్ళి, ఏంకావాలో అడిగి తీసుకో. పరీక్షకు బాగా చదువు.'

'నేనేం పసిపిల్లాడిననుకున్నారా ఏం? నాకూ ఇరవై మూడేళ్ళొ చ్చాయి. ఈ సంవత్సరం దాటితే డాక్టర్ రమేష్, ఎం. బి. బి. ఎస్. అని బోర్డు వేసుకొంటాను, గుర్తుంచుకోండి' అన్నాడు రమేష్.

'నువ్వు డాక్టరయితేమాత్రమేం? ఇంట్లో స్వభావం మారుతుందా?'

'మారకపోతే పోయింది. ఉదయం మీరు తొందరగా లేవాలనుకుం టాను. వెళ్ళిపడుకోండి' అన్నాడు రమేష్.

'సరే' అంది శాంత.

ఊరికి వెళ్ళేముందు మరిదితో కాస్సేపు కబుర్లు చెప్పాలనే వుందా మెకు. కాని, మరిది ముభావపు మాటలతో మెదలకుండా బయటికి వచ్చే సింది.

గదిలోకి వెళ్ళిన శాంత, మడతపెట్టిన చీరలను పెట్టెలో సర్దుకుం టోంది.

ఎవరో దబదబా తలుపు బాదడంతో:

'ఎవరో చూడండి' అంది భర్తతో.

'ఈ సమయంలో ఇలా తలుపుకొట్టేవారెవరు? మీ ముద్దుల మరిదే అయ్యుంటాడు' అంటూ లేచి తలుపు తీశాడు.

'కొంచెం పనుండి వచ్చాను' అంటూ లోపలికి అడుగుపెట్టాడు రమేష్.

'ఏమిటి సంగతి?' అంది శాంత.

'అనే మీరు ఊరినుండి ఎప్పుడొస్తారు?' అతి ముఖ్యమయిన ప్రశ్న వేశాడు రమేష్.

'పుట్టింట్లో కొన్నాళ్ళుఉండనీరా బాబూ, ఆ నాలుగు రోజులైనా హాయిగావుందాం' అన్నాడు కృష్ణమూర్తి.

'పదిహేను రోజులుంటాను' అంది శాంత.

'ఆర్నెల్లుండిరా శాంతా! ఇక్కడేం మునిగిపోతుంది' అంటూ రమేష్‌ని ఏడిపించాడు కృష్ణమూర్తి.

శాంత నవ్వుతున్నా, రమేష్‌కు కోపం వచ్చింది.

'మీకేం నవ్వులాటగా వుంది. వదిన అక్కడుంటే నా చదువు ఎలా సాగుతుంది? ఉదయం నన్ను లేపేవాళ్ళెవరూ?' అన్నాడు కోపంగా.

'అలారం గడియారం' అన్నాడు కృష్ణమూర్తి.

'అది చెడిపోతేనో? ఇక అమ్మకు కాలేజీకి భోజనం పంపటం తెలుస్తుందా? క్యారియర్ ఎలా సర్దాలోకూడా తెలీదాయె. ఇక నేను అన్నం లేక మాడాలి.'

'ఇంత ఖర్మే మొచ్చిందిరా తమ్ముడూ, ఎక్కడబడితే అక్కడ హోటళ్ళున్నాయి.'

'హోటల్ భోజనం ఏం బావుంటుంది? వంటికి మంచిదికాదు. మీరు చెప్పండి వదినా! నే హోటల్ భోజనం చెయ్యాలనేనా మీ కోరిక' అన్నాడు రమేష్ శాంతతో.

'అమ్మకు క్యారియర్ ఎలా సర్దాలో చెప్పి వెడతాను' అంది శాంత మృదువుగా.

'నన్ను చూస్తే మీ కందరికీ కచ్చ. అందుకనే మీరందరూ కలిసి నా మీద కుట్రపన్నుతున్నారు. కాని, ఇప్పుడే చెపుతున్నా. నేను ఈమారు పరీక్ష తప్పితే మాత్రం అది నా తప్పుకాదు.'

రమేష్ మాటలు విని, శాంతకు ప్రయాణం మానుకుందామనిపిం

చింది. కాని, అంతా నిర్ణయించుకొని, తండ్రికూడా వచ్చేశాక ఆఖరుక్షణాల్లో వెళ్ళనని చెప్పటం ఎలా?

'అయితే నన్ను వెళ్ళమంటావా, ఒద్దంటావా?' అంది చిన్నబుచ్చుకుంటూ.

'అంతా నిశ్చయమయిపోయాక నన్నడిగితే నేనేం చెప్పను? ఇదిగో ఈ మాత్రలు రోజుకు రెండు తీసుకోండి. ఇవి ఇద్దామనే వచ్చాను. తలనొప్పి మరీ ఎక్కువగావుంటే, ఈ మలాము రాసుకోండి' అంటూ మాత్రలూ, మలామూ శాంతకు అందిచ్చాడు.

'చాలా థ్యాంక్స్ రమేష్!'

'తలనొప్పి ఎక్కువయితే ఇక్కడికే వచ్చేయండి. ఎంతయినా అది చిన్న వూరు.'

'అలాగే! నీ ఈ సలహాకు ఫీజు ఎంత?' అని చిలిపిగా అడిగింది శాంత.

'పదిహేను రోజుల్లోగా మీరు ఇక్కడికి వచ్చేయాలి. అదే నా ఫీజు.

'రాకపోతే?'

'రాకపోతే, మీ జట్టు వదిలేస్తాను. రవ్వలడ్డులు, వెన్న, సినిమా ఏవీ నా కోపాన్ని పోగొట్టలేవు గుర్తుంచుకోండి'అన్నాడు హెచ్చరిస్తున్నట్టు.

'వెన్నెల కాంతివంటి దేహచ్ఛాయగల అమ్మాయి?'

రమేష్ తనను తానే మరచిపోయాడు.

'చాలదు! చంద్రబింబంలాంటి మొహం, పద్మాల్లాంటి కళ్ళు, సంపంగి పూవులాటి...'

'రమేష్! ఇహ నాకు నిద్దరొస్తోంది. తెల్లారగట్టే లేవాలిగాని, ఇక వెళ్ళు బాబూ' అంటూ అతడిని బయటకు పంపించి తలుపు వేసుకుంది.

రమేష్ తన కాబోయే భార్య వర్ణన సగంలోనే ఆగిపోయినందుకు బాధపడుతూ వెళ్ళిపోయాడు.

శాంత, 'చూశారా భార్య అంటే ఎలా ముకిసిపోతాడో' అంది భర్తతో.

'అంతేమరి; ఆ వయసులో నేనూ అలాగే వుండేవాడిని. ఎన్ని

కలలు కన్నానో. కాని, ఇప్పుడు అర్థమయింది పెళ్ళామంటే ఏమిటో' అన్నాడు కృష్ణమూర్తి.

'పెళ్ళామంటే ఏమిటి?' కుతూహలంతో అడిగింది శాంత.

'ఒక కవి చెప్పాడు. స్త్రీ పెళ్ళికిముందు పురుషుడికి ఓ రహస్యం; పెళ్ళయ్యాక ఓ సమస్య అని.'

'ఆ! అయితే మీ కిప్పుడు ఓ సమస్యగా తయారయ్యానా ఏమిటి?'

'కాదామరి? నీ తలనొప్పి నాకు నిజంగానే ఓ సమస్యగా పరిణమించింది.' కృష్ణమూర్తి నవ్వుతూ అన్నా, ఆమె ఆరోగ్యం గురించి అతడి మనసులోవున్న వ్యథ అతడి మొహంలోనే వ్యక్తమయింది.

'మరేం బెంగపడకండి. గాలి మార్పుతో నా తలనొప్పి చెప్పా చెయ్యకుండా పారిపోతుంది' అని ధైర్యం చెప్పింది శాంత.

మర్నాడు వుదయం రమేష్ నిద్ర లేచేసరికి శాంత తన తండ్రితో ఊరికి వెళ్ళిపోయింది. అలారం గడియారం సహాయంతో నిద్రలేచాడు. వదిన కబుర్లులేక అప్పుడే చికాకు పడటానికి మొదలెట్టాడు. కాస్త త్వరగానే కాలేజీకి బయల్దేరాడు.

వెళ్ళిన మర్నాడే వుత్తరం రాసింది శాంత. అమ్మా, నాన్న, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు అందర్నీ కలుసుకుని సంతోషంతో తలనొప్పిని కొద్దిగా మరిచిపోగలుగుతున్నానని రాసింది. అది విని అందరూ సంతోషించారు. కాని రమేష్ మాత్రం ఎప్పటిలాగానే వ్యాఖ్యానించాడు.

'వదిన తలనొప్పి మరిచిపోగలుగుతున్నాననే రాశారు కాని, తగ్గిందని కాదు. కాబట్టి అంత సంతోషించాల్సిన విషయమేం కాదు.'

సాయంకాలం ఇంటికి వచ్చిన కృష్ణమూర్తి : 'అమ్మా, ఈమారు దసరాకు శేషగిరి వస్తున్నాడమ్మా బొంబాయినుండి. భార్యా, కూతురు కూడా వస్తున్నారు. బహుశా ఎల్లుండి రావచ్చు' అని చెప్పాడు.

'శాంతకూడా లేదుకదా! బొంబాయిలో వుండే వాళ్ళాయె. వాళ్ళకు తగ్గట్టుగా అన్నీ నాజూగ్గా నేనేం చేయగలను? అంత నాగరికత నాకెక్కడిది చెప్పు? ఇప్పుడేం చేయను!' అని వాపోయారు సుశీలమ్మగారు.

'అయితే వెంటనే వదినను రమ్మని రాసేస్తాను. ఇక ఏ బాధా వుండదు' అంటూ అందుకున్నాడు రమేష్.

'ఒద్దు రమేష్! ఇంకా ఇప్పుడేగా వెళ్ళింది. అప్పుడే రాస్తే బావుం డదు' అని సుశీలమ్మగారు వారించినా, రమేష్ వినలేదు.

'వదినా! మీ ఇంటికి బొంబాయినుండి అతిథులు వచ్చారు. మీరు వచ్చి ఆదర సత్కారాల భారం వహించాలి. అమ్మకు ఏమీ చేతకాదు' అని ఓ పోస్టుకార్డు గీచి పడేశాడు.

శాంత రాలేదు. కాని, రమేష్‌కు ఓ చిన్న ఉత్తరం వచ్చింది.

'నేను రాలేను. వారి ఆదర సత్కారాల బాధ్యత నీకు చెందింది.'

చదివి, కోపంతో ఉత్తరాన్ని చింపి పారేశాడు.

శేషగిరి వస్తున్నాడని కృష్ణమూర్తికి చాలా సంతోషంగావుంది. వారిద్దరూ ఇంటర్ వరకూ కలిసే చదివారు. తరువాత వాళ్ళ వృత్తులు వేరుకావడంతోబాటు జీవితాలుకూడా వేరు మార్గాలలో సాగిపోయాయి. డాక్టర్ శేషగిరి బొంబాయివెళ్ళి, అక్కడే ప్రాక్టీసు చెయ్యసాగాడు. స్నేహితులు కలుసుకోవటం చాలా అరుదైనా, ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా పలకరించుకుంటూనే వున్నారు.

చాలా కాలానికి స్నేహితుడిని కలుసుకోబోతున్నందుకు సంతో షంగావున్నా, ఈ సమయంలో శాంత లేకపోవటం పెద్ద లోటనిపించింది కృష్ణమూర్తికి.

శేషగిరి దంపతులు వచ్చేందుకు ముందురోజు రాత్రికూడా తల్లీ కొడుకులు ఇదే విషయం మాట్లాడుకున్నారు.

'నేను పాతకాలందాన్ని. ఈ కాలపు నయం, నాజూకు నాకేం తెలు స్తాయి' అని చిన్నబుచ్చుకున్నారు సుశీలమ్మగారు.

'మనకు వచ్చినట్టే చేస్తే సరి' అన్నాడు రమేష్.

'ఆ బొంబాయిపిల్ల నా మొరటుతనానికి నవ్వుకుంటుందంతే.'

'నవ్వుకోనీ; మాకు చేతనయ్యేది ఇలాగే అంటే సరి' అన్నాడు రమేష్.

'నువ్వూరుకో, ఇక మాట్లాడకు' అని విసుక్కున్నారు సుశీలమ్మ గారు.

కృష్ణమూర్తి 'నువ్వేం బెంగపెట్టుకోకమ్మా! వాళ్ళేమీ అనుకోరు' అని ధైర్యం చెప్పాడు.

కృష్ణమూర్తి ఆఫీసుకు సెలవుపెట్టి స్నేహితుడికి స్వాగతమివ్వ టానికి స్టేషనుకు వెళ్ళాడు.

ఇంటిముందు టాక్సీ ఆగగానే సుశీలమ్మగారు, శేషగిరిరావుగారు బయటకువచ్చి నిలబడ్డారు. అందరూ టాక్సీనుండి దిగారు. కృష్ణమూర్తి తన స్నేహితుడిని, అతడి భార్యను తల్లిదండ్రులకు పరిచయం చేశాడు. నాలుగేళ్ళ ఆశ కుతూహలంతో కొత్త మొహాలను చూస్తోంది.

శేషగిరిచుట్టూ చూసి, 'మీ ఆవిడ కనుపించదేం?' అని అడిగాడు.

'ఊళ్ళోలేదు. పుట్టింటికి వెళ్ళింది.'

'ఓ, అయితే మా కందరికీ మిఠాయి పంచుతావన్నమాట.'

'అబ్బె, అదేంలేదు; పూరికే వెళ్ళింది' అన్నాడు కృష్ణమూర్తి.

శేషగిరి ప్రశ్న విని సుశీలమ్మగారి మనస్సు చిన్నబోయింది. కృష్ణమూర్తికి పెళ్ళయి పన్నెండేళ్ళకుపైగా అయినా, ఆ ఇంట్లో పసి పాపను చూసుకునే అదృష్టం నోచుకోలేదు. వృద్ధాప్యంలోకి అడుగు పెట్టిన ఆమెకు సహజంగానే మనవడిని ఎత్తుకోవాలని ఆశగా వుంది.

కాని, కోడలి ఎదుట ఎప్పుడూ ఆ విషయాలు గురించి ఎత్తేవారే గాదు. వృథాగా కోడలి మనస్సు నొప్పించటం ఆమెకు ఇష్టం వుండేది కాదు. వీటన్నిటివల్లా అవ్యక్తమైన విచారం ఆ కాపురంలో చోటు చేసుకొని వుంది.

సుశీలమ్మగారి మొహంలో క్షణకాలం కనిపించి మాయమయిన విషాద రేఖను సూక్ష్మమతియైన రత్న గమనించింది. ఎంతయినా తనూ ఓ ఆడదేకదా!

'ఇంట్లో మీరొక్కరు కదూ వుండటం. మేమంతా వచ్చి మీకు చాలా శ్రమను కల్పిస్తున్నాం' అంది రత్న మాట మారుస్తూ.

సుశీలమ్మగారు చిన్నగా నవ్వి:

'అలా అనకమ్మా, శ్రమేముంది. నీకోసం నేను ప్రత్యేకంగా ఏం చెయ్యాలిగనుక? మీరు రావటం నాకెంతో సంతోషంగా వుంది' అన్నారు.

రత్న కొంగుపట్టుకుని నిల్చున్న 'పాపను, నీ పేరేమిటమ్మా' అంటూ పలకరించారు.

పాప సిగ్గుతో జవాబు చెప్పలేదు.

'ఊఁ చెప్పుమరి. ఇల్లెగిరిపోయేట్లు కబుర్లు చెప్తావు. అవ్వ పేరడిగితే చెప్పలేవూ?' అన్నాడు శేషగిరి నవ్వుతూ.

'ఆశ' అంది పాప.

మగవాళ్ళు కబుర్లు చెప్పుకొంటూ కూర్చున్నారు. రత్న సుశీలమ్మగారివెంట వంటింట్లోకి వెళ్ళింది. అప్పటికే వంటంతా అయిపోయింది. ఇక అప్పడాలు వేయడమే తరువాయి

'నేనేం చెయ్యను? నాకూ ఏదైనా పని చెప్పండి' అంది రత్న.

'నువ్వేం చేయకమ్మా. అలా కూర్చో' అంటూ పీట వాల్చారు సుశీలమ్మగారు.

కూర్చున్న రత్నవైపు పరిశీలనగా చూశారు.

సాదా వాయిల్‌చీర కట్టుకుని, రెండు జడలువేసుకుంది రత్న. ఆమె మాటలు ఎంతో సరళంగా వున్నాయి. కాని, ఒకపిల్ల తల్లి అయ్యాక కూడా రెండు జడలు వేసుకోవడం సుశీలమ్మగారికి అంతగా నచ్చలా.

రత్న తనే ఆకులువేసి, నీళ్ళు చిలకరించింది. సూక్ష్మంగా ఏది ఎక్కడుంది అనే విషయాలు గమనించి ఉప్పు ఊరగాయ వడ్డించి, గ్లాసులలో నీళ్ళు పెట్టింది.

సుశీలమ్మగారి కాస్త బెంగకూడా తీరిపోయింది. అంత సరళంగా సహజంగా ప్రవర్తిస్తున్న ఆ పిల్లను తన ఇంటి పిల్లలాగే ఆదరించవచ్చుననుకున్నారు.

'నువ్వూ భోజనానికి కూర్చో' అని ఎంత చెప్పినా వినక రత్న 'నేనూ మీతోబాటే' అనేసింది.

మగవాళ్ళ భోజనాలయ్యాక సుశీలమ్మగారు రత్న భోజనానికి కూర్చున్నారు. రత్నతో కలిసి భోంచేస్తూంటే, సుశీలమ్మగారికి శాంతే గుర్తుకొచ్చింది. తన కోడల్ని గురించి చెప్పింది రత్నకు.

'ఆమెకూడా వుంటే ఎంతో బావుండేది' అంది రత్న.

భోజనాలయ్యాక 'కాసేపు పడుకుని విశ్రాంతి తీసుకోమ్మా' అన్నారామె.

'మేము బొంబాయినుండే నడిచిరాలేదుసుమండీ' అనేసింది రత్న.

సాయంకాలం రమేష్ ఇంటికిరాగానే, కొత్తవాళ్ళెవరో తల్లితో

మాట్లాడుతూ కూర్చుని ఉండటం చూశాడు. రత్న రెండుజడలు ముందు కనిపించాయి. వెనుతిరిగి వెళ్ళిపోబోతున్న రమేష్‌ని పిలిచి, రత్నకు పరిచయంచేశారు సుశీలమ్మగారు.

'వీడేనమ్మా, నా చిన్న కొడుకు. ఈ సంవత్సరంతో వీడి చదువు పూర్తయిపోతోంది. వీడికి పెళ్ళిచేస్తే మా బాధ్యత తీరిపోతుంది' అన్నారు.

రత్న రమేష్‌వంక చూసింది.

'నమస్తే' అన్నాడు రమేష్.

తరువాత తల్లివైపు తిరిగి, 'అమ్మా! నేను వెళ్ళాలి. టైమయి పోతోంది' అని తొందరచేశాడు.

సుశీలమ్మగారు కాఫీ టిఫిన్ అందించారు. మళ్ళీ పది నిమిషాలలో బయటకు వెళ్ళటానికి సిద్ధంగా నిల్చున్నాడు. అప్పుడే బయటినుండి వస్తున్న కృష్ణమూర్తి శేషగిరితో:

'ఇడుగోనోయ్, నా తమ్ముడు రమేష్. త్వరలోనే మీ ఫీల్డులోకే ప్రవేశించబోతున్నాడు. వీడికి వెన్నెలవంటి దేహచ్ఛాయగల అమ్మాయి కావాలిట. మరి కళ్ళేమో సంపంగి పువ్వులా వుండాలిట. కదుట్రా...' అంటూ తమ్ముడినిచూసి తృప్తిగా నవ్వాడు.

రమేష్ ఆడపిల్లలా సిగ్గుపడ్డాడు. అతడి మొహం ఎర్రబడింది.

'అన్నయ్య మాటలు నమ్మకండి...' అంటూ నసిగాడు.

'ఎక్కడికోయ్ వెడుతున్నావ్?' అని అడిగాడు కృష్ణమూర్తి.

'పింగ్‌పాంగ్ ఆడడానికి వెడుతున్నా నన్నయ్యా.'

'ఇవాల్టికి అలా షికారుకు వెళ్ళొద్దాం రావోయ్' అన్నాడు కృష్ణమూర్తి.

రమేష్‌కి వాళ్ళతో వెళ్ళటానికి ఇష్టంలేదు. కాని, ఎలా చెప్పటం?

'ఆటకు వెళ్ళాలనుంటే వెళ్ళనీ' అన్నాడు శేషగిరి.

'అదిరోజూ వుండేదేగా. ఈ రోజు మనతో వస్తాడులే' అన్నాడు కృష్ణమూర్తి.

ఇహ తప్పించుకోలేక పోయాడు రమేష్ విధిలేక బయల్దేరాడు.

రత్న ఆశకు వేరే గుడ్డలు తొడిగి, అలంకారం చేసింది. తనూ, చీర మార్చుకుని బయల్దేరింది.

కబుర్లలో రానురాను శేషగిరి గమనం కృష్ణమూర్తినుండి రమేష్ వైపుకు తిరిగింది. ఎంతయినా వృత్తి బాంధవ్యాలు. ఆ గొడవలే మాట్లాడు కోసాగారు. ఇహ కృష్ణమూర్తి విధిలేక ఆశను మాట్లాడించసాగాడు. చివ రికి ఆ గుంపులో రత్న ఒంటరిగానే మిగిలిపోయింది. శాంతయినా వుంటే బావుండేది అనుకుందేమో.

ఇంటికి వెళ్ళిపోతే బావుండుననిపించింది. కాని, ఎవరికీ ఆ ఆలోచన వున్నట్టులేదు. రత్న అర్థగర్భితంగా చూసినా, శేషగిరి గమనించే స్థితిలో లేడు.

బయలుదేరినప్పటినుండి నోరు మెదపకుండా నడుస్తున్న రత్నను చూసి, జాలేసింది రమేష్‌కి. ఆమెకు విసుగ్గా వుందేమో పలకరిద్దామను కున్నాడు. కాని, ఏమని పలకరించటం? తల్లిని మెప్పించగలగటం పిల్లల ద్వారానేకదా!

'ఆశను బళ్ళో వేశారా?'

'లేదు.'

ఆ సంభాషణ అక్కడికి ఆఖరయింది. ఆమెను మాటల్లోకి దింపటం చాలా కష్టమనిపించింది రమేష్‌కి. మితభాషిణి అనుకున్నాడు.

'వదిన వుంటే, మీకింత విసుగనిపించేదికాదు' అన్నాడు రమేష్.

'విసుగేమీలేదు...' అంది రత్న నవ్వటానికి ప్రయత్నిస్తూ.

'అలాకాదు. మా స్టెతస్కోపు. పళ్ళుల ప్రపంచం మీకేం నచ్చు తుంది?'

'స్టెతస్కోపుహారం వేసుకునేవాళ్ళకి హారం వేశాక, అన్నీ నచ్చా ల్సిందే' అంటూ నవ్వాడు కృష్ణమూర్తి.

రత్న మాట్లాడలేదు.

కాఫీహోటల్‌నుండి ఇంటికిపోదామనుకున్నపుడు రత్న హాయిగా నిట్టూర్చింది. ఇంటికిరాగానే పంజరంనుండి బయటపడ్డ పిట్టలా సుశీలమ్మ గారి వద్దకు వెళ్ళింది.

'ఎక్కడికి వెళ్ళివచ్చారమ్మాయ్' అని అడిగారు సుశీలమ్మగారు.

'ఇక్కడనుండి వెళ్ళి అక్కడ కాఫీ హోటల్‌లో కూర్చున్నాం' అంది రత్న.

'ఏమీ చూడడానికి వెళ్ళలేదేం.'

'కబుర్లతోనే సరిపోయింది.'

'రమేష్ స్వభావమే అంత. కబుర్లలో పడ్డాడంటే, మరింకేమీ అక్కర్లేదు వాడికి. వదిన పుట్టింటికి వెళ్ళిన దగ్గర్నుండి ఇంట్లో మాటలే తగ్గించేశాడు.'

'వాళ్ళ వదినదగ్గర చాలా చనువనుకుంటాను మీ చిన్నబ్బాయికి.'

'ఊఁ తనే అలా అలవాటు చేసింది. ఇక భోజనానికి వస్తారా?'

రత్న ఆవిడకు వడ్డించడంలో సాయపడింది.

రెండురోజులు మాత్రం వుండి శేషగిరి దంపతులు మూడవరోజున ప్రయాణమయ్యారు. స్నేహితుడిని మరో నాల్గురోజులు నిలుపుకోవాలని కృష్ణమూర్తి ఎంతో ప్రయత్నించాడు.

'వీల్లేదురా! సెలవులేదు. వెళ్ళితీరాల్సిందే' అన్నాడు శేషగిరి.

'ప్రైవేట్ ప్రాక్టీసుకదా నీది? నీకు సెలవేమిటి?'

'నా రోగుల గతో' అంటూ నవ్వాడు శేషగిరి.

రెండ్రోజులు కలకలలాడుతున్న ఇల్లు, శేషగిరి, రత్న, ఆశ వెళ్ళిపోగానే బావురుమంది.

'ఏమీ తోచటంలేదు. శాంతను పిలిస్తే బావుంటుంది' అంటూ గొణి గారు సుశీలమ్మగారు.

రమేష్ వెంటనే వదినెకు ఉత్తరం రాశాడు.

'అమ్మకు ఏమీ తోచడంలేదట. మీరు వెంటనే రావాలట.'

రమేష్ వుత్తరానికి శాంత నాన్నగారు జవాబు రాశారు; శాంత ఆరోగ్యం ఏమంత బాగుండటంలేదని.

కోడలి అనారోగ్యం విషయంవిని, మామగారు శాంత తండ్రికి వుత్తరం రాశారు. అది చూసుకొని ఆయన కూతుర్ని తీసుకొని వచ్చాడు.

శాంత నవ్వుతూ ఇంట్లోకి అడుగుపెట్టింది. నవ్వొక్కటే ఆమెలో వున్న వస్తువు అనిపించింది రమేష్‌కి. సామాన్యంగా దేన్నీ గమనించని కృష్ణమూర్తి కూడా భార్య ఇలా కృశించిపోవటంచూసి కంగారుపడ్డాడు.

ఎముకల గూడులావున్న కోడల్నిచూసి సుశీలమ్మగారి కళ్ళలో

నీళ్ళు నిండాయి. శాంత కళ్ళు మునుపటి కళ్ళ కాంతులను కోల్పోయి నిర్జీవంగా వున్నాయి.

# 4

'రమేష్! మీ వదినకు ఏదైనా మందు చూడరా' అంటూ వాపోయాడు కృష్ణమూర్తి.

'పుట్టింట్లో రాజోపచారం జరుగుతుందని వెళ్ళి నెలల తరబడి కూర్చుంటే మనమేం చెయ్యగలం' అన్నాడు రమేష్ మోటుగా.

'ఇంకా నెలకూడా పూర్తికాలేదు' అంటూ గొణిగింది శాంత.

'దగ్గర దగ్గర నెల కావస్తోంది. ఆరోగ్యం బాగా లేనప్పుడు వెంటనే బయల్దేరటానికేం' అంటూ వదినమీద విరుచుకుపడ్డాడు రమేష్.

'అయిందేదో అయింది. ఇప్పుడేం చేద్దామో చెప్పు' అన్నారు శేషగిరి రావుగారు.

'నాకేం తెలీదు. మీ ఇష్టం. ఏమైనా చేసుకోండి' అన్నాడు రమేష్.

'నీకివాల్సిన ఫీజు నీకు ముట్టచెబుతాం' అంది శాంత.

రమేష్ కోపంగా వదిన మొహంలోకి చూసి ఊరుకున్నాడు.

అతడికోపం తగ్గేసరికి పొద్దుగూకింది.

మర్నాడే శాంతను తీసుకుని హాస్పిటల్‌కు వెళ్లాడు రమేష్. డాక్టరు ఆమెను పరీక్షించి హాస్పిటల్‌లోనే వుండాలని చెప్పారు. శాంత అక్కడే వుండిపోవటానికి ఏమాత్రం ఇష్టపడలేదు.

కాంతిహీనమైన కళ్ళను పెద్దవిగాచేసి రమేష్‌వైపు చూస్తూ:

'ఉహుఁ' అంది.

రమేష్‌కూడా తన కళ్ళను అంతే పెద్దవిగాచేసి వదినను బెదరించాడు.

'ఇక్కడ వుండటం మంచిది. మేము పరీక్షచేసి చికిత్సచేయటానికి వీలుగా వుంటుంది. తరువాతవస్తే, మా బాధ్యతేమీ వుండదు' అన్నాడు డాక్టరుగారు.

'ఇక్కడే వుంటారు' అన్నాడు రమేష్ శాంతకు బదులుగా.

ఆ మాట విని శాంతకు ఏడుపువచ్చింది.

'ఇంట్లో ఎవర్నీ అడగక్కర్లేదా?'

'నేను చెప్తున్నాగా చాలదూ? ఎవర్నో ఎందుకు అడగటం? రేపు నేనేవచ్చి అడ్మిట్ చేస్తాను.'

రమేష్ నిర్ణయంచూసి శాంతకు దిక్కుతోచలేదు.

దారిపొడుగునా మరిదితో దెబ్బలాడుతూనే వచ్చింది.

'నీకు నేనంటే పడదు. అందుకే నన్ను ఆసుపత్రిలోపడేసి ఇంట్లో హాయిగా వుందామనుకుంటున్నావు. నేను అక్కడే చచ్చిపోవాలనే నీ కోరిక.'

రమేష్ అవేమీ పట్టించుకోకుండా:

'రోగులమాట పట్టించుకోరాదు' అన్నాడు.

శాంతను ఆస్పత్రిలో చేర్చటం నిశ్చయమైపోయింది. శాంత ప్రతి ఘటన లెక్కచెయ్యకుండా సుశీలమ్మగారు, రమేష్ బలవంతాన శాంతను హాస్పిటల్లో అడ్మిట్ చేశారు. తనమాట వినకుండా హాస్పిటల్లో పడేశారన్న కోపంతో శాంత ఆ రోజు అన్నంకూడా తినలా.

రమేష్ కాలేజీ హాస్టల్ ఎదురుగానే వుండటంవల్ల తనకు తీరికున్నప్పుడల్లా వదినదగ్గిరే కూర్చునేవాడు. ఆ వాతావరణం, హాస్పిటల్ జీవితం విసుగుపుట్టించకుండా వుండేందుకుగాను పత్రికలూ, పుస్తకాలు తెచ్చి యిచ్చేవాడు.

ఓ సాయంత్రం రమేష్ వచ్చేసరికి శాంత నిద్రపోతోంది. పత్రిక చూస్తూ కూర్చున్నాడు.

'రమేష్' అనే పిలుపువిని, వదినవైపు చూశాడు రమేష్.

'హాస్పిటల్‌లో వుండటంకూడా ఓ విధంగా చాలా బావుంది.'

'ఎందుకేమిటి?'

'మునపటికన్నా ఎక్కువసేపు నిన్ను చూడగలుగుతున్నాను. ఇంట్లో వున్నప్పుడు నువ్వు కనబడటమే గగనమయ్యేది.'

'మీరలా మాట్లాడితే ఏం చెప్పాలో తెలియటంలేదు.'

'అకస్మాత్‌గా నేను చనిపోతే ఎవ్వరూ బెంగ పెట్టుకోకండి.' అతి సహజంగా అంది శాంత.

'ఛా, అవేం మాటలొచ్చినా?'

'ఏమిటో అలా అనిపిస్తోంది. చెప్పాను.'

'మీకేమయిందనీ చావటానికి? ఇక్కడికొచ్చాక మూడు వంతులు నయమయింది.'

రమేష్ భరోసాచూసి చిరునవ్వు నవ్వింది శాంత.

'మృత్యు నిరీక్షణలో వున్నాను నేను' అంది మెల్లిగా.

'మీకు భ్రమ; అంతే.'

'లేదు రమేష్! నాకు దాని అడుగుల చప్పుడు వినిపిస్తోంది. రోజు రోజుకు క్రుంగిపోతున్నట్టు, మునిగిపోతున్నట్టు అనిపిస్తోంది. నేను చని పోతే మీ అన్నయ్యను మరో పెళ్ళిచేసుకోమను. నువ్వు...'

'నేను వెళ్ళిపోతున్నాను' అంటూ కుర్చీని వెనక్కుతోసేసి అగ్ని పర్వతంలా నిప్పులు కురిపిస్తూ, గాలిదుమారంలా బయటికి వెళ్ళిపోయాడు.

మర్నాడు రమేష్ హాస్పిటల్‌కు రానేలేదు. భర్త అత్తగారు వచ్చి నప్పుడు శాంత–

'రమేష్‌ని ఓ మారు పంపండి' అని చెప్పింది.

సుశీలమ్మగారు ఆశ్చర్యంతో

'ఈరోజు రానేలేదా' అన్నారు.

'లేదు.'

'మీరేమైనా దెబ్బలాడుకున్నారా?' కృష్ణమూర్తి అడిగాడు.

'దెబ్బలాటలేదు ఏమీలేదు.'

'వాడేమన్నా దురుసుగా మాట్లాడితే పట్టించుకోకు' అని కృష్ణమూర్తి భార్యను ఓదార్చాడు.

'రమేష్ రేపు రాకపోతే, నేను మందుతాగను. అలాగని అతనితో చెప్పండి' అని భర్తతో చెప్పింది శాంత.

'నేను చెప్తాననుకో. కాని, వాడు రాకపోతే మేము బలవంతంగా పంపటానికి వీలుపడుతుందా? మందు తాగనని మాత్రం పట్టుపట్టకేం' అన్నాడు కృష్ణమూర్తి.

'అతడు రాకపోయినపుడుకదా! మీరు నా మాట చెప్పండి. తప్పక వస్తాడు' అంది శాంత ఆత్మవిశ్వాసంతో.

ఆ మాటే నిజమయింది. మరునాడు రమేష్ ధుమధుమలాడుతూ వార్డులోకి అడుగు పెట్టాడు.

'నిన్న రాలేదేం?'

'ఇలా బెదిరించి నన్ను రప్పించుకోవటంవల్ల మీకు కలిగిన లాభం ఏమిటో అడగొచ్చా?'

శాంత నవ్వింది. 'లాభమా! నువ్వు ఇక్కడికి రావటమే నాకు పెద్ద లాభం.'

'మీరు పిచ్చి పిచ్చిగా వాగుతూండండి. నేనేమో వింటూ కూర్చుంటాను. నేనేం రాతి బొమ్మ ననుకున్నారా? మీ మాటలు ప్రవాహానికి రాతి బొమ్మకూడా కొట్టుకుని పోతుంది తెలుసా?'

'రమేష్! నా కేమనిపిస్తుందో చెప్పనా? ప్రతీ మనిషి ఓ రాతి బొమ్మే. రాతి బొమ్మలు వూపిరిపీల్చవు. మనం ఊపిరి పీలుస్తాం. అంతే తేడా వాటికి మనకు.'

రమేష్ రెచ్చిపోయి 'మనుష్యుల్ని రాతిబొమ్మలతో పోల్చటం చాలా అన్యాయం వదినా! మనకు హృదయముందన్న విషయం మరచిపోతున్నారు' అన్నాడు.

'హృదయమంటే ఏమిటో డాక్టరవబోతున్న నీకే నాకన్నా బాగా తెలిసివుండాలి.'

'మనకు అనుభవాలంటూ వుండవా? సంతోషమయితే సంతోషిస్తాం. దుఃఖంకలిగితే ఏడుస్తాం. మనం అన్నిటినీ అనుభవిస్తాం. అవునా కాదా? మనుషులను రాతితో పోల్చే మీ మాటలను వెనక్కు తీసుకోండి వదినా.'

రమేష్ వుద్రేకాన్ని చూసి శాంత నవ్వింది.

'మాటల ప్రవాహం అన్నావుగా. అదే తీసుకో. రాతిబొమ్మకూడా ప్రవాహంలో పడితే, తడిసి పోతుంది. గాలి, ఎండ తగిలి క్రమంగా ఆరిపోతుంది. అలాగే మానవుల మనస్సుకూడా అంటున్నా. సుఖదుఃఖాలు ఎంతసేపుంటాయి. కాల ప్రవాహంలో అన్ని గాయాలూ మానిపోతాయి.'

రమేష్ వ్యంగ్యంగా

'సరే! ఇంత వేదాంతం చెపుతున్నారే! ఈ మాటకు సరిగ్గా జవాబు

చెప్పండి చూద్దాం. నన్నెందుకింత పట్టించుకుంటున్నారు? చెప్పండి మరి' అన్నాడు. ఈ దెబ్బతో వదినను ఓడించాననుకున్నాడు రమేష్.

శాంత వాడిపోయిన మొహంలోకి చిరునవ్వు తొంగి చూసింది.

'దానికి కారణముంది. అందులోనూ స్వార్థమేవుంది.'

'స్వార్థమా?'

'అవును. నాకోబిడ్డ పుట్టివుంటే, నీవైపు కన్నెత్తికూడా చూసేదాన్ని కాదేమో. మనసులో మమత పేరుకున్నప్పుడు దానిని ప్రవహింప చెయ్యకపోతే భరించలేం. ఆ బరువు దింపుకోవటం స్వార్థంకాదా?'

శాంత నవ్వుతూ మాట్లాడినా, ఆమె కంఠం క్షీణంగా ధ్వనిస్తోంది.

'ఇహ మాట్లాడకండి వదినా! మీకు ఆయాసమవుతుంది.'

'కళ్ళున్నంతవరకూ చూపు; నాలికున్నంత వరకూ మాట.'

'మీరు ఇలా మాట్లాడితే నేనసలు రానేరాను. నేను రావాలనుకుంటే, మీరు ఇలా మాట్లాడడం మానెయ్యాలి.'

'లేదులే. ఇహ ఇలా మాట్లాడనులే' అని భరోసా యిచ్చింది శాంత.

ఏ దుర్ముహూర్తంతో 'కళ్ళున్నంతవరకూ చూపు, నాలికున్నంత వరకూ మాట' అని అన్నదోకాని, ఆ మాట నిజమయింది.

రాత్రి పదిగంటల ప్రాంతంలో డాక్టరు ఆఖరిరౌండుకు వచ్చినప్పుడు శాంతవైపు చూచి

'ఎలా వున్నారు?' అని అడిగారు.

శాంత మాట్లాడలేదు. ఊరికే కళ్ళప్పగించి డాక్టర్నే చూసింది. ఆమె కనురెప్పలు మూతపడగానే రెండు కన్నీటి బిందువులు ఆమె చెక్కిలిమీదుగా జారిపోయాయి. ఆమె పెదిమలు చలించాయి. కాని మాట బయటికి రాలేదు.

డాక్టరు దగ్గరగావచ్చి ఆమె దుర్బలహస్తాన్ని తన చేతిలోకి తీసుకుని 'ఎలా వున్నారు?' అన్నారు.

శాంత మాట్లాడలేదు. కన్నీళ్ళు ముత్యాలలా ఆమె చెక్కిళ్ళమీద ప్రవహించసాగాయి.

'మాట్లాడలేరా?'

శాంత తల అడ్డంగా తిప్పింది. డాక్టరు, నర్సువైపుకు తిరిగి 'ఎప్పటినుండి ఇలా అయింది' అని అడిగారు.

'సాయంకాలం బాగానే మాట్లాడారు. బహుశా ఎనిమిది గంటల తర్వాతనే ఇలా అయుండాలి' అంది నర్సు.

డాక్టరు మళ్ళీ శాంతను మాట్లాడించటానికి ప్రయత్నించారు. కళ్ళ నుండి ప్రవహించే కన్నీరే లేకపోయినట్టయితే ఆమెను చెక్కబొమ్మ అని తేలిగ్గా చెప్పవచ్చును. అఖరికి డాక్టరుగారు తమ ప్రయత్నంలో విఫలులై వెళ్ళిపోయారు.

మరునాడు పొదయం కాఫీ తెచ్చిన కృష్ణమూర్తికి ఈ వార్త పిడుగులా తగిలింది. కాఫీగ్లాసులోకిపోసి 'తాగు' అన్నాడు.

శాంత మాట్లాడలేదు.

'నేనే తాగిస్తాను' అంటూ కృష్ణమూర్తి కొద్దికొద్దిగా కాఫీ తాగించాడు.

'ఎలావుంది నీకు? ఊరికే ఏడవకు శాంతా! నీకు తొందర్లోనే నయమవుతుంది' అంటూ ఆ కన్నీళ్ళను తుడిచాడు కృష్ణమూర్తి.

శాంత పెదవులు చలించాయి. కన్నీటి ప్రవాహం కట్టలు తెంచుకుంది.

'ఆమె మాట్లాడలేకపోతున్నారు' అని చెప్పారు పక్క మంచం మీదున్నావిడ.

'ఆ!'

'నిన్నరాత్రినుండి ఇలాగే వుంది. అప్పటినుండి ఏడుస్తూనేఉన్నారు.'

'శాంతా! ఏమయిందో చెప్పవూ? గొంతునొప్పిగావుందా...' గబగబా మెడికల్ కాలేజీకి పరుగెత్తాడు కృష్ణమూర్తి.

కనిపించిన విద్యార్థిని అడిగాడు. 'ఫైనల్ ఇయర్‌లోని రమేష్ ఎక్కడుంటాడో తెలుసా?'

'తెలీదు.'

ఇంకా కొంతమందిని అడిగాకకాని, రమేష్ వుండేచోటు కనుక్కోలేకపోయాడు కృష్ణమూర్తి. ఆఖరికి రమేష్ కృష్ణరాజేంద్ర హాస్పిటల్‌కు వెళ్ళాడని తెలిసింది. కృష్ణమూర్తి తమ్ముడిని వెతుక్కుంటూ పరుగుతీశాడు.

జనరల్ వార్డులో రోగి జబ్బు గురించి చార్టుచూస్తూ నిల్చున్నాడు రమేష్. రోగితో పరిహాసంగా మాట్లాడుతూ వుండటంవల్ల అతడి మొహం మీద నవ్వు వెలుగుతోంది.

కృష్ణమూర్తి వార్డులోకి పరుగెత్తుకుంటూ వచ్చి 'రమేష్ తొందరగా రా' అన్నాడు.

అన్నయ్య మొహంచూచి రమేష్ కాళ్ళూ, చేతులూ ఆడలేదు.

'ఏమయిందన్నయ్యా?' అనే రమేష్ కంఠంలోని ఆర్ద్రతను గమనించి కృష్ణమూర్తి ధైర్యం తెచ్చుకున్నాడు.

'కంగారేంలేదుగాని, శాంతకు రాత్రినుండి మాట్లాడటానికి చేతకావటం లేదట. ఊరికే ఏడుస్తుంది. నువ్వోసారి వచ్చి పలకరించిచూడు' అన్నాడు కృష్ణమూర్తి.

రమేష్ వెంటనే అన్నయ్యతో కలిసి హాస్పిటల్‌కు వెళ్ళాడు.

అంతకుముందురోజు శాంత అనిన 'నాలికున్నంతవరకూ మాట' అనే వాక్యం అతడి చెవుల్లో గింగురుమంటుంది.

రమేష్‌ని చూడగానే శాంత దుఃఖం మరింత ఎక్కువయింది.

'వదినా! మీకు ఏమవుతుంది చెప్పండి. నాతోకూడా మాట్లాడరా మీరు? మామీద కోపం కాదుకదా?' అంటూ ఎన్నోవిధాలుగా పలకరించాడు రమేష్.

వాటి కన్నిటికీ ఒక్కటే జవాబు. కన్నీరు.

రమేష్, ఆస్పత్రి ప్రధాన వైద్యులను చూడటానికి వెళ్ళాడు. ఆమె లేబర్ వార్డులో వుందని తెలిసి, బయట బెంచి మీద కూర్చున్నాడు. తను లోపలికి వెళ్ళడానికి వీల్లేదు. బయటనే కూర్చుని నిమిషనిమిషానికి తలుపువైపుకే చూస్తూ, ముళ్ళమీద కూర్చున్నవాడిలా మహా ఆరాటపడుతున్నాడు.

ఆఖరికి బయటకు వచ్చిన నర్సును అడిగాడు.

'డాక్టరుగారు ఏంచేస్తున్నారు?'

'ఫోర్సెప్స్ కేసు అటెండ్ చేస్తున్నారు' అని చెప్పి చకచక వెళ్ళిపోయింది నర్సు.

లోపలనుండి వినబడుతున్న మూలుగు, ఏడుపు, అరుపులు వింటూ బయటకూర్చున్నాడు రమేష్.

ఈ విధంగా శాబర్ వార్డుముందు కాచుక్కూర్చునే రోజుకోసం ఎన్నేళ్ళు ఎదురుచూశాడు తను!

ఆఖరికి ఆ రోజు రానేలేదు.

ఒక్కసారి పెళ్ళయిన పదేళ్ళ తరువాత, శాంత తల్లి కాబోయే సూచనలు కనబడినప్పుడు ఇంట్లో అందరూ సంతోషంతో పొంగిపోయారు.

అంతవరకూ ఇంట్లో అందరికీ 'బిడ్డ' అయిన రమేష్‌కి అప్పటి నుండే తను పెద్దవాడన్న భావం కలుగసాగింది.

కాని, రెండు నెలలకే తాము కన్న కలలన్నీ కల్లలయినపుడు ఇంట్లోనివారికి కలిగిన నిరాశమాత్రం ఎంతటిది!

ఆ రోజు రమేష్ శాంతను చూడటానికి వెళ్ళినపుడు, ఆమెను అప్పుడే వార్డులోకి తెచ్చి పడుకోబెట్టారు.

తెల్లటి పక్కమీద అంతకన్నా తెల్లగా పాలిపోయిన శాంతను చూసినపుడు రమేష్ హృదయం దుఃఖంతోనూ, జాలితోనూ నిండిపోయింది. అసలే బాధ పడుతున్న ఆమెను మరింత బాధపెట్టడం ఇష్టంలేక నవ్వుతూనే పలకరించాడు.

'ఎలా వున్నారు వదినా?'

'కులాసాగానే వున్నాను.'

'ఇప్పటినుండి ఆరోగ్యం బాగాచూసుకోండి. ఇంకోమారు ఇలా కాకుండా...'

ఆ మాటవిని శాంత వెక్కి వెక్కి ఏడ్చింది.

రమేష్ కోపంగా, 'వదినా! మీకు చాలా దురాశ' అన్నాడు.

'ఏం?'

'నాకన్నా మంచికొడుకు కావాలనుకోవటం దురాశకాదా ఏం? నాలో మీకేం లోటు కనిపించింది చెప్పండి. చూడడానికి అందంగాలేనా? చదువు లేదా? మంచివాడినికాదా చెప్పండి. మీరిలా ఏడిస్తే నామీద ఒట్టే.'

ఆ మాటలువిని అంతఏడుపు మధ్యలోనూ చిరునవ్వు నవ్వింది.

'నువ్వొక బంగారుకొండవి' అంది.

'ఏడవనని మాటయివ్వండి మరి నాకు!'

'ఏడవనులేరా బాబూ.'

'ఏడవడానికి మీకేమయిందేమిటి? మీ ప్రేమను మాకంతా పంచి పెట్టండి. దానికి మీబిడ్డే కావాలని లేదు.'

రమేష్ మాటలతో తేరుకుంది శాంత.

కాని ఇప్పుడో?

మళ్ళీ తేరుకోగలదా? ఎందుకో రమేష్‌కి అనుమానం వేసింది.

లోపలనుండి పసిబిడ్డ ఏడుపువిని, తన ఆలోచనలనుండి బయటపడి తలుపువైపుకు చూశాడు.

డాక్టర్ బయటకు రాగానే, రమేష్:

'డాక్టర్! వదినకు మాట పడిపోయింది. మీరోమారు వచ్చిచూడండి' అన్నాడు.

డాక్టర్ శాంతను మళ్ళీ ఆమూలాగ్రంగా పరీక్షించారు. ఆమె బయటికి వెళ్ళగానే, తనూ ఆమెను అనుసరించి వెళ్ళాడు. ఆమె మొహంలో నిరాశ స్పష్టంగా కనిపిస్తోంది.

'ఆశలేదా డాక్టర్' అన్నాడు రమేష్ ఆదుర్దాతో.

'నాకూ కొంచెం అనుమానంగానే వుంది. ఇప్పుడే ఏమీ చెప్పలేను. వెన్నెముకలో నీరు చేరింది. దాన్ని తీసెయ్యాలి. ఆమె అదృష్టమే ఆమెను కాపాడాలి' అని నిట్టూర్చి, గబగబా అక్కడినుండి వెళ్ళిపోయారు.

తన కళ్ళముందు ప్రపంచమంతా గిర్రున తిరిగినట్లనిపించింది రమేష్‌కి.

అలాగే గోడకానుకుని నిల్చున్నాడు. ఒక్క నిముషం డాక్టరుగారు చెప్పిన విషయాన్ని అర్థంచేసుకుని జీర్ణించుకోవడానికి ప్రయత్నించాడు. తరువాత నెమ్మదిగా తేరుకుని, లేనినవ్వు మొహంమీదికి తెచ్చుకుని రంగస్థలంమీదకు వెళ్ళే నటునిలా శాంతదగ్గరకు వచ్చాడు.

శాంత మంచం ప్రక్కనున్న కుర్చీమీద కూర్చున్న కృష్ణమూర్తి మౌనంగా తమ్ముడివైపు చూశాడు. రమేష్ వదినక్కూడా వినిపించేలా

'బలహీనతవల్ల ఇలా అయిందట. కంగారు పడనక్కర్లేదు. నయమవుతుందన్నారు' అన్నాడు.

ఆ మాటలు విని, శాంత విషాదంగా నవ్వింది.

కృష్ణమూర్తి ఆఫీసుకు టైమయిపోతోందని లేచాడు.

'నేను వెళ్ళనా శాంతా?'

శాంత తలూపింది.

రమేష్ శాంతను పలకరించటానికి పలువిధాల ప్రయత్నించి విఫలుడయ్యాడు.

'ఆడవాళ్ళు ఎక్కువగా మాట్లాడటం మంచిదికా'దని ఏ విషగడియలో అన్నాడో తను?

ఒక్క నిమిషంకూడా మాట్లాడకుండా ఊరుకోలేని మాటకారి వదిన ఇప్పుడు మాట్లాడకుండా ఎలా వుందో? ఆమె హృదయంలో ఎంతటి కల్లోలం బయలుదేరిందో ఎవరికి తెలుసు? ఎవరితో మాట్లాడకపోయినా, తను మాట్లాడితే ఎలానయినా మాట్లాడగలుగుతుందని ఆశపెట్టుకున్నాడే తను! తనతో ఇహ వదిన మాట్లాడదా?

అతడి కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. గద్గదకంఠస్వరంతో 'వదినా! మాకింత కఠినశిక్ష విధించకండి. మేమెవ్వరం ఏ తప్పూ చేయలేదు' అంటూ అక్కడినుండి వెళ్ళిపోయాడు.

పదిహేనురోజులు తనలోని బాధను ఎవరితోనూ చెప్పుకోలేక మూగబాధ అనుభవించింది శాంత. తనను చూడటానికి వచ్చినవారిని కనురెప్ప వేయకుండా దీనంగా చూసేది. వాళ్ళ సాంత్వన వచనాలు వినగానే ఆమె కళ్ళనుండి అశ్రుప్రవాహం ప్రవహించేది. వాళ్ళు యిక వెళ్ళిపోవాలని బయలుదేరగానే, తన దుర్బలహస్తాన్ని చాచి, వాళ్ళచేతిని పట్టుకునేది.

కృష్ణమూర్తి, రమేష్‌లకు ఆమెచేతి పట్టునుండి విడిపించుకుని బయటపడటం అతి ప్రయాసగా వుండేది.

పదిహేనురోజుల తరువాత ఆమెదృష్టి శూన్యమయిపోయింది. ఇంతవరకూ బయట ప్రపంచం, మనుష్యులను గుర్తించేజ్ఞానం వుండేదామెకు.

కాని, ఇప్పుడామెదృష్టి దిగంతాని కావల దాక్కున్న కాలదూతకోసం చూస్తున్నట్లుండేది.

ఆమె ఒళ్ళో?

వట్టిగాజు; సూర్యరశ్మికూడా మెరవనిగాజు.

ఆమె ఇప్పుడు జీవచ్ఛవం. ఎవరైనా తనను చూడవస్తే సంతోషం లేదు. రాకపోతే దుఃఖమూలేదు. సుఖదుఃఖాలు, ఆకలిదప్పులు- వీటన్నిటి నుండి దూరమయిపోయింది.

చూడవచ్చినవాళ్ళు ఎన్నో విధాలుగా ఆమె గుణగణాలను పొగడుతూ, కళ్ళనీరు పెట్టుకునేవారు.

శిలాప్రతిమ ముందు తల పగలకొట్టుకున్నట్టే వాళ్ళ కన్నీరు, దుఃఖం శాంతను తాకేదికాదు.

కృశించిన ఆమె చేతివేళ్ళు మాత్రం అస్తమానం జడను విప్పుతూ, అల్లుతూ వుండేవి. తన నుదురు, తల వీటిని చేతితో నిమురుకుంటూ వుండేది. అప్పుడప్పుడు పక్కనేవున్న పేముకుర్చీమీద వేళ్ళతో కొట్టి శబ్దంచేసి, తనలో తానే నవ్వుకుంటూ వుండేది.

ఒకవిధమైన అపూర్వమైన ప్రశాంతి ఆమె మొహాన్ని ఆవరించింది.

కృష్ణమూర్తి రమేష్‌లకు పిచ్చిపట్టినట్లయింది.

ఆఖరికి డాక్టరుగారు శాంత జబ్బుకు 'మెలింజైటిస్' అని పేరు పెట్టారు.

'ఆశేమీలేదా డాక్టర్' అని రమేష్ అడిగినపుడు డాక్టర్ బదులేమీ చెప్పకుండా విషాదంగా నవ్వి, తల అడ్డంగా తిప్పి వెళ్ళిపోయారు.

శాంత మంచం ప్రక్కనే అటూ, ఇటూ కుర్చీలు వేసుకుని కూర్చునేవారు కృష్ణమూర్తి, రమేష్.

చేపట్టిన భర్తని, ఇన్నేళ్ళుగా తనను ప్రేమతో ఆదరించిన మరిదిని గుర్తించే శక్తిని కోల్పోయింది శాంత.

జీవితంమీదనున్న వ్యామోహమే ఆమె నింతవరకూ జీవించేట్లు చేసింది.

తనకు ఆకలిగా వుందన్న విషయంకూడా ఆమెకు తెలిసేదికాదు. సుశీలమ్మగారే టైంప్రకారం ఆహారం ఇచ్చేవారు.

ఆమెకు చావటం అంటే యిష్టంలేదేమో?

మృత్యువుతో పోరాడి పోరాడి అలసిపోయింది శాంత.

ఆ రోజు పున్నమి. ఆ రాత్రి డాక్టరుగారు శాంతను పరీక్షించి, 'ఈ రాత్రి గడవటం కష్టం. మీరిక్కడే వుండేటట్లయితే వుండవచ్చు' అని చెప్పారు.

కూతురి అంతిమయాత్ర చూడటానికి శాంత తల్లిదండ్రులుకూడా వచ్చారు.

స్పెషల్‌వార్డు కనుక శాంత బంధువర్గమంతా సంకోచంలేకుండా రోదించింది.

వైద్యుల చికిత్సలన్నీ విఫలమయ్యాయి.

ఆ రోజు పూర్ణిమ. కాని శాంత ఆత్మీయులకది అమావాస్య.

రాత్రి పదిగంటల ప్రాంతంలో శాంత తన ఆత్మీయుల నందరినీ దుఃఖసముద్రంలో ముంచి తెలియని లోకానికి పయనమైపోయింది.

అపుడపుడూ అవ్యక్త వేదనతో ముకుళించుకునిపోయే ఆమె మోహం ఇపుడు ప్రశాంతంగా వుంది.

ఆమె హృదయంలో ఎన్ని ఆశలు, ఆకాంక్షలు ఉండేవో అన్నీ అనంత వాయువులో లీనమైపోయాయి.

'పునిస్త్రీ చావు; పుణ్యం చేసుకుంది' అంది ఆ భాగ్యం లేని ఓ స్త్రీ.

'జీవితంలో ఏమీ అనుభవించకుండానే వెళ్ళిపోయే పునిస్త్రీ చావు ఎలాంటిది!'

కృష్ణమూర్తి హృదయం విదీర్ణమయింది.

సుమారు నెలరోజులుగా హాస్పిటల్‌కూ, ఇంటికీ ఆదుర్దాగా తిరుగుతున్న అందర్నీ ఒక్కసారిగా నిర్లిప్తత ఆవరించింది.

మరుగుతున్న నీళ్ళను దింపగానే చల్లారిపోయినట్టు, వాళ్ళ మనసుల్లో మరుగుతున్న ఆత్రుత, ఆవేదన కూడా ఒక్కసారిగా చప్పగా చల్లారిపోయాయి.

ఆ స్తమానం ఇంట్లో వాళ్ళందరికీ 'శాంత ఎలా వుందో' అనే బెంగే వుండేది.

కాలేజీలో పాఠం వింటూండగా రమేష్‌కి 'వదిన ఎలా వున్నారో' అనిపించగానే, ఏదో కారణం కల్పించుకుని బయటకు వెళ్ళేవాడు.

కాని, ఇపుడు అందరి హృదయాలనూ స్మశాన మౌనం ఆవరించింది.

# 5

శాంత లేని ఇంటికి తిరిగి వచ్చాడు కృష్ణమూర్తి.

ఆ రాత్రి అతడి శోకం వర్ణనాతీతం.

గదినిండా శాంత గుడ్డలు పడి వున్నాయి

ఆ పిచ్చిపిల్లకు చీరల మోజు ఎక్కువ. తన కంటికి నచ్చిన చీరలన్నీ కొని, పెట్టెలో భద్రపరచేది.

కాని, కట్టుకునేదికాదు. కొనటంతోనే తృప్తిపడేది.

శాంతకున్న ఇంకో విచిత్రమయిన కాంక్ష—బొమ్మలు అద్దాల బీరువాలో అందంగా అమర్చటం. బొమ్మలకొట్టు ముందునుండి వెళ్ళేటప్పుడల్లా-శాంత కనీసం ఒక బొమ్మైనా కొనకుండా వచ్చేది కాదు.

కోడలు అనవసరంగా బొమ్మలకోసం డబ్బు తగలెయ్యటం చూసి ఓ మారు సుశీలమ్మగారు:

'ఎందుకమ్మా శాంతా! ఇన్ని బొమ్మలు కొంటావు! దండగ' అన్నారు.

'పిల్లా పాపాలేని ఇంట్లో బొమ్మలెందుకు' అని కోడలి మనసు నొప్పించదలచుకోలేదామె.

తను అంతకు ముందు రోజే తెచ్చిన బొమ్మకు గుడ్డలు కుడుతూ శాంత:

'బొమ్మలు కావలసి వస్తాయ్' అంది.

'ఎందుకు?'

'మరి మీరు రమేష్‌కి పెళ్ళి చెయ్యరూ? అతడి పిల్లలకు ఆడుకోవటానికి బొమ్మలు అక్కర్లేదూ?'

'రమేష్ పెళ్ళయి, పిల్లలు పుట్టి...ఓ ఎప్పటిమాటో నువ్వు

చెప్పేది. అంతవరకూ మనం బ్రతికి ఉన్నప్పటి మాట!' నిరుత్సాహంగా అన్నారు సుశీలమ్మగారు.

'ఎందుకమ్మా అలా అంటారు? రమేష్ పెళ్ళి మనం చూడక పోవటమేమిటి? ఈ సంవత్సరం అయిపోగానే పెళ్ళి చేసెయ్యమూ!"

అతడి పెళ్ళి తను చూసి తీరుతానన్న ఆత్మవిశ్వాసముండేది శాంతకు.

'ఎంత బాగున్న పిల్లయినా నచ్చదుకదా నీ మరిదికి? కన్ను అలా ఉండాలి; ముక్కు ఇలా ఉండాలి అని నీ ముందు గంటలకొద్దీ వర్ణిస్తాడు. వాడు వర్ణించినలాంటి పిల్ల భూమ్మీద ఉందా అసలు?'

'అమ్మా! మొన్న మార్కెట్టుకు వెళ్ళినపుడు ఓ పిల్లను చూశాను. ఎంత బావుందంటారు. అందంగా ఉన్న అమ్మాయిలు కనబడినప్పుడల్లా రమేష్ గుర్తుకొస్తాడు నాకు. మీ పెద్ద కోడలు ఎలాగూ అందంగా లేదు; చిన్నకోడలయినా అందంగా ఉండాలి.'

'ఏం, నీకేమయిందేమిటి ఇప్పుడు?'

'చెప్పనా?'

'చెప్పు చూద్దాం.'

'నలుపు, పొట్టి, పెద్ద ముక్కు, చిన్నకళ్ళు...'

'చాల్చాలు; ఊరుకో. లేనిపోని మాటలు చెప్పి నాకు కోపం తెప్పించకు' అని అక్కడ నుండి వెళ్ళిపోయేవారు సుశీలమ్మగారు.

రమేష్ పెళ్ళి సుశీలమ్మగారు చూస్తారేమోగాని, శాంత ఏదిప్పుడు?

కృష్ణమూర్తి అద్దాల బీరువాముందు నిల్చుని ఒక్కొక్క బొమ్మ తీసుకుని చూడసాగాడు.

భార్య మరణానంతరం మొదటిసారిగా అతడి కళ్ళలో నీళ్ళు ప్రవహించసాగాయి.

రమేష్ నామమాత్రానికి చేతిలో పుస్తకం పట్టుకుని కూర్చున్నాడు. అతడి కళ్ళు మాటిమాటికి గడియారం వైపే చూస్తున్నాయి.

వదిన మాటా, పలుకూ, నవ్వూ, అతడి మనసును కెలికి, అల్ల కల్లోలం చేస్తున్నాయి.

ఆమె తన్ను పన్నెండేళ్ళుగా ఎరుగును. అయినా ఆమె తన

దుడుకు మాటలకు బాధపడుతూనే ఉండేది. అంత సున్నిత హృదయమామెది. వదినతో మాటల మల్లయుద్ధం చెయ్యాలంటే వెయ్యి ఏనుగుల బలం వచ్చేది తనకు. కాని ఆమె మౌన కలహం సాగించినపుడు మాత్రం ఓటమి తనదే!

తన చదువు గురించి, పెళ్ళి గురించి వదినకెంత ఆసక్తి! ఎవరితోను చెప్పుకోలేని ఎన్నో విషయాలను వదినతో చెప్పుకునేవాడు తను. తన కష్టసుఖాలను ఆమెతో చెప్పుకున్నప్పుడే రమేష్ హృదయం తేలికపడేది.

ఆమెతో ఆనందాన్ని పంచుకున్నప్పుడు అతడి హృదయం సంతోషంతో పొంగిపోయేది

రమేష్ లేచి నిల్చుని కిటికీనుండి బయటకు చూశాడు. ఆకాశంలో తెల్లటి మబ్బు తునకలు తేలిపోతున్నాయి. వెన్నెల నేలంతా పరచుకుంది.

ఒంటరిగా ఒక్క నక్షత్రమే నీలాకాశంలో వెలుగుతోంది.

రమేష్ హృదయంలో అగ్ని రగుల్కొంది.

ఏ తప్పూ చెయ్యని, ఏ పాపమూ ఎరుగని వదిన తమందరినీ వదిలి ఇంత త్వరగా వెళ్ళిపోయిందెందుకు?

దేవుడు తనకు ప్రియమైనవాళ్ళను తొందరగా తన దగ్గరకు రప్పించుకుంటాడట.

ఆ మాటల్లో ఎంత నిజం దాగి ఉందో!

దుఃఖావేగంతో హృదయం విదీర్ణమై కన్నీటి సముద్రం ఉడికిపోయి అక్కడే గడ్డకట్టిపోయింది.

రమేష్‌కి మంచంమీద పడుకుని వెక్కివెక్కి ఏడవాలనిపించింది. హృదయంలోని శోకాన్నంత బయటకు కక్కివేసి, హృదయాన్ని తేలికపర్చుకోవాలనిపించింది.

కాని, ఏడుపురాందే!

ఉహుఁ అతడి కళ్ళనుండి ఒక కన్నీటి చుక్కకూడా రాలలేదు. ఆఖరికి శాంత చితిలో కాలిపోతున్నపుడుకూడా అతడి కంట్లో నీరురాలేదు.

తన తల్లిదండ్రులు, శాంత తల్లిదండ్రులూ అందరూ శాంతను తల్చుకుని పెద్దగా శోకాలు పెడుతుంటే, రమేష్ మౌనంగా, బిక్క

మొహం వేసుకుని ఏడవలేక తల్లిని పోగొట్టుకున్న పసివాడిలా అందరి వైపు చూస్తూ నిల్చున్నాడు. ఆఖరికి ఏడుపురాక అవమానం పొందినట్టయి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

వదిన చనిపోతే ఒక్క బాష్పాంజలి కూడా అర్పించలేడా తను!

రమేష్ కళ్ళు అగ్నిగుండాల్లా ప్రజ్వలిస్తున్నాయి.

చల్లటి నీళ్ళతో మొహం కడుక్కుందామని బయటకు వచ్చాడు రమేష్.

వసారాలో కూర్చుని అందరూ కళ్ళు తుడుచుకుంటున్నారు.

అయితే వదినమీద తనకులేని ప్రేమ వీళ్ళకందరికీ ఉందా? తన కెందుకు ఏడుపు రావటంలేదు? సప్తసాగరాలు తన హృదయంలో దాక్కున్నాయి. వాటి కల్లోలాన్ని భరించలేకుండా ఉన్నాడు రమేష్.

ఇంతయినాకూడా అతనికి ఏడుపు రావటంలా.

ఏడుస్తున్న వాళ్ళందర్నీ చూసికూడా అతడికంట్లో నీరు రాలా. దానికి బదులు మహాక్రోధం ఉధృతంగా పొంగింది.

కాని, ఎవరిమీద?

అందర్నీ పట్టుకుని చితగ్గొట్టి, తనూ తలపగులగొట్టుకుని చావాలని పించింది రమేష్‌కి.

గోడనానుకుని రెండుచేతుల్లోనూ తల పెట్టుకుని కూర్చున్న శాంత తండ్రి మొహం రమేష్‌కంటబడింది.

గబగబా ఆయన ఎదుటకువెళ్ళి నిల్చుని గర్జించాడు:

'మీవల్లే అసలు వదిన చనిపోయింది. మీరెందుకు వదిన్ని ఆ పల్లెటూరుకు తీసుకొని వెళ్ళారు? అక్కడ ఓ మంచి డాక్టరుకూడా లేడే! అక్కడికి వెళ్ళినందువల్లే జబ్బు ముదిరిపోయింది. మీరే చంపారు వదిన్ని—'

మొదట అతడేమంటున్నాడో ఎవ్వరికీ అర్థంకాలేదు. అర్థంకాగానే అందరూ చకితులయ్యారు.

రమేష్‌కి పిచ్చెత్తలేదుకదా!

'రమేష్...' అంటూ గద్దించాడు తండ్రి.

రమేష్ వుద్రేకం చల్లారలేదు.

'మీరే చంపారు. ఇక్కడేవుంటే, వదిన్ని మేము చావనిచ్చేవాళ్ళం

కాదు. జబ్బుకొంచెం ఎక్కువయినప్పుడన్నా; ఇక్కడికి తీసుకుని రా
దెందుకు? నాకు తెలుసు. వదిన మమ్మల్ని చాలా ప్రేమించేది. మీరదిచూ
సహించలేకపోయారు. ఆ కడుపుమంటతోనే వదిన్ని చంపేశారు మీరు.

రమేష్ కంఠస్వరం తారస్థాయి నందుకుంది.

కృష్ణమూర్తి గది తలుపులు నెమ్మదిగా తెరుచుకున్నాయి. ఆ
శంలో రమేష్ అది గమనించలేదు. మిగినవాళ్ళు ఏం చేయటానికి తోచ
శిలాప్రతిమల్లా వుండిపోయారు.

'మీరే చంపింది– మీరే చంపింది' అని అరుస్తూనే వున్నాడు రమేష్

కృష్ణమూర్తి రమేష్ దగ్గరగావచ్చి, అతడి భుజాన్ని గట్టిగా పట్టు
కున్నాడు. అప్పుడే అన్నవైపుకు తిరిగిచూశాడు.

'వదులన్నయ్యా... ఇతడికి బాగా బుద్ధిచెప్తాను. వదులు...
అన్నాడు రమేష్.

కృష్ణమూర్తి జవాబు చెప్పకుండా తమ్ముడిని తన గదిలో
లాక్కునిపోయాడు.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోగానే శేషగిరిరావుగారు:

'శాంత వాడికి తల్లిలా వుండేది. ఆ దుఃఖంతో పిచ్చివాడం
పోయాడు వాడి మాటలు పట్టించుకోకండి' అని శాంత తండ్రిని వేడు
కున్నారు.

స్థాణువులా కూర్చున్న ఆయన కళ్ళనుండి జలజలా అశ్రుబిం
వులు రాలాయి.

అన్ని గాయాలకూ తిరుగులేని మందు కాలమే.

శాంత వెళ్ళిపోయింది. ఆమె వెనుకనే ఆమె జ్ఞాపకాలూ మసకబా
తున్నాయి. ఇప్పుడు క్షణక్షణానికి ఆమె జ్ఞాపకాలు ఇంట్లో వాళ్ళను బా
పెట్టినా, మునుపటిలా శాంత పేరెత్తగానే ఏడుపు రావటంలేదు.

శాంత ప్రతినిధిగా ఆమె ఫోటో ఒకటి గోడ నలంకరించిం
మల్లెపూలదండతో ఫోటో నలంకరించాడు కృష్ణమూర్తి.

సాయంకాలం రమేష్ ఇంటికి రాగానే, గాబరాగా అక్కడే నిల్చు
పోయాడు. గోడమీద ఫోటో అతని దృష్టిని ఆకర్షించింది. కృష్ణమూ
అప్పుడే ఫోటోకు దండవేసి క్రిందకు దిగుతున్నాడు.

రమేష్ ఒక నిముషం తదేకంగా ఫొటోవైపు చూశాడు. తరువాత తిన్నగా అన్నయ్య దగ్గరకొచ్చి నిల్చున్నాడు.

'టేబుల్ టెన్నిస్ అడ్డానికి వెళ్ళావా?' కృష్ణమూర్తి అడిగాడు.

'లేదు.'

'మరింకెక్కడికి వెళ్ళావు?'

'ఊరికే అలా షికారుకు వెళ్ళాను.'

కృష్ణమూర్తి ఆశ్చర్యపోయాడు. రమేష్ ఒక్క రోజూ ఆట మాత్రం తప్పించుకునేవాడు కాదు. పింగ్‌పాంగ్ నేర్చుకున్న కొత్తల్లో క్లాసులుకూడా ఎగొట్టి ఆడేవాడు. పింగ్‌పాంగ్ అంటే, నిద్రాహారాలుకూడా జ్ఞాపకం వుండేవికావు. అలాంటి రమేష్ ఆడటానికి వెళ్ళలేదంటే!

తమ్ముడు ఓ సమస్యగా కనిపించాడు కృష్ణమూర్తికి.

'రమేష్ ఫోటో బాగా వచ్చిందికదూ? శాంతే లేచి వస్తున్నట్టుందేమో అనేలా వుంది.'

రమేష్ మృదువుగా అన్నాడు: 'ఫొటో తీసెయ్, అన్నయ్యా.'

'ఏం. బాగాలేదా?'

'ఎంత బావుంటే మాత్రం, ఫొటో తగిలించినంతమాత్రాన వదిన తిరిగి రాదుకదా. తీసెయ్ అన్నయ్యా.'

'ఫరవాలేదు; ఉండనివ్వరా.'

'ఊహుఁ, నీకంతగా కావాలనుంటే, నీ గదిలో వేసుకో. ఇక్కడ మాత్రం వద్దు.'

కృష్ణమూర్తి ఆశ్చర్యంగా తమ్ముడివైపు చూశాడు.

రమేష్ మొహం గంభీరంగా వుంది.

వదినా, మరదుల మధ్యనున్న స్నేహ బాంధవ్యాల విషయం కృష్ణమూర్తికి తెలియనిదికాదు. అయితే ఈ విశ్వాసమంతా ఇంత తొందరగా మాసిపోయిందా? చనిపోయిన వాళ్ళను మరచిపోవటంకన్నా, మంచిపని వేరొకటిలేదు. కాని, ఇంత త్వరగా, అందులోనూ రమేష్ శాంతను మరచిపోయాడా? ఆమె ఫొటోను చూడటంకూడా అతడికి అసహనీయమైపోయిందా?

కృష్ణమూర్తి నెమ్మదిగా 'ఇక్కడుంటే నీకు కలిగే నష్టమేమిటి?' అన్నాడు.

'రోజూ ఆ ఫొటోను చూస్తుండాలి. ఆ బాధ నేను భరించ నన్నయ్యా. ఆ ఫొటో అక్కడినుండి తీసెయ్యి.'

'అవునులే; శాంత బ్రతికున్నప్పుడు, నీకు కబుర్లకూ, పనిచేసి పె టానికి కావలసివచ్చింది. ఆమె చనిపోగానే ఆమె జ్ఞాపకార్థం ఏదీ మిగ రాదంటున్నావు. తన ఫొటో వుంటేకూడా భరించలేవా? ఆమె బ్రతికినన్ని రోజులూ నువ్వు చూపిన స్నేహ విశ్వాసాలు కేవలం నటనే అన్నమాట...

కృష్ణమూర్తి మాట్లాడుతూ వుండగానే రమేష్ గబగబా తన గ లోకి వెళ్ళిపోయాడు. రమేష్ ఈ ప్రవర్తన కృష్ణమూర్తికి అర్థంకాలేదు

కడుపుకు అన్నం లేనివాళ్ళు కృశించిపోయినట్లు రమేష్ రో రోజుకూ చిక్కిపోతున్నాడు. భోజన పానాదుల్లోను, ఆటపాటల్లోను మున పటిలా ఆసక్తిలేదిపుడు. ఇదివరకు ఒక్కనిముషంకూడా ఇంట్లో కాల నిలిచేదికాదతనికి. ఎప్పుడూ తిరగటమే. ఎంతో ఉల్లాసంగా పక్షిలా విహ రించే రమేష్, రెక్కలు విరిగిన పక్షిలా అయిపోయాడు.

భోజనం, టిఫిన్ తినేటపుడుకూడా ఆత్రుతే. తొందరగా తినేసి పరుగెత్తేవాడు కాదు.

క్రాపు దువ్వుకోడానికి అరగంట పట్టేది. ఇహ సూటు, బూటు లై కుదరటం పెద్ద సమస్య అతడికి. ఎన్నోమార్లు ఆ సమస్యను శాంత పరిష్కరించేది. దుస్తుల సమస్య తీరాక, వదిన గదిలో ప్రవేశించి ఆవె వాడే పౌడరును శుభ్రంగా రాసుకునేవాడు. సెంటు తన రుమాలకు, దుస్తు లకు చల్లుకొని వదిన ముందు హాజరయ్యేవాడు.

'ఎలా వుంది వదినా?' అని అడిగేవాడు.

శాంత 'బాగున్నావు!' అని చెప్పేవరకూ వేధించేవాడామెని.

'నా పౌడరెందుకు ముట్టుకున్నావు' అని శాంత అడిగితే:

'నా చేతికి అందేలా పెట్టటం మీదే తప్పు' అని అతి సహజంగా తప్పంతా వదినమీదికే నెట్టేసి స్నేహితులను కలుసుకోవడానికి వెళ్ళిపోయే వాడు.

ఇప్పటి రమేష్‌లో చలనమే లేదు. రాతిలా జడుడయిపోయాడు. ఇల్లువదిలి కదలటమే లేదు. ఎపుడయినా వెళ్ళినా, స్నేహితుల కంట బడకుండా తప్పించుకుని వంటరిగా తిరుగుతూ ఉండిపోయి రాత్రి పది గంటలకు ఇల్లు చేరుకునేవాడు. మొదటి మారు అలా చేసినపుడు ఇంట్లో అందరూ గాబరాపడ్డారు.

సుశీలమ్మగారు కొడుకు ఏదయినా చెడు సావాసాల్లో పడ్డాడేమోనని అనుమానించారు.

ఓ రోజున రమేష్ సాయంకాలం నాలుగ్గంటలకు ఇల్లు వదలినవాడు రాత్రి ఎనిమిదిన్నరయినా ఇంటికి రాలేదు. వాడికోసం వచ్చిన స్నేహితులకు జవాబు చెప్పలేక విసుగుపుట్టింది సుశీలమ్మగారికి.

సుమారు ఎనిమిదిన్నర ప్రాంతాన కాంతరాజ్ స్నేహితుడిని వెతుక్కుంటూ నాలుగవమారు వచ్చాడు.

'రమేష్ ఇంకా రాలేదా?'

'లేదు.'

'ఎక్కడికెళ్ళాడో తెలుసా?'

'తెలీదు.'

'సరే, అయితే వాడొచ్చేదాకా కూర్చుంటాను' అంటూ లోపలికొచ్చి కూర్చున్నాడు.

కాంతరాజ్ రమేష్ ఆప్త మిత్రుడు. రమేష్‌కి అతని దగ్గరఉన్నంత చనువూ, స్నేహమూ, ఆత్మీయతా మరింకెవరిదగ్గరా లేవు.

చదువులో, ఆటపాటల్లో, సినిమా హాల్సులో ఎప్పుడూ ఇద్దరూ కలిసి మెలిసి తిరిగేవారు. ఒకరి నొకరు విడిచిపెట్టి ఉండేవారుకాదు

కాంతరాజ్ కుర్చీమీద కూర్చుని అడిగాడు.

'రమేష్ ఎక్కడికెళ్ళాడో మీతో చెప్పలేదా?'

'ఉహుఁ. మాతో అసలేమీ చెప్పనే చెప్పడు.'

'నేను కొన్ని విషయాలు చెప్తాను. మీరు గాబరాపడరాదు.'

ఏమి అశుభవార్త వినాల్సివస్తుందోనని సుశీలమ్మగారి గుండె దడదడా కొట్టుకుంటి.

కాంతరాజ్ కాస్సేపు మాట్లాడకుండా మౌనంగా కూర్చున్నాడు. ఉన్న విషయం చెపుదామా వద్దా అని ఆలోచిస్తున్నట్టుంది అతడి వైఖరి.

సుశీలమ్మగారు మనసులో ఆరాటాన్ని ఆపుకోలేక:

'ఏం చెప్పాలనుకుంటున్నావో చెప్పు బాబూ' అన్నారు.

'రమేష్‌కు ఇప్పుడు దేనిలోనూ ఆసక్తీ ఉత్సాహమూ లేదు.'

'దేనిలోనూ అంటే?'

'చదువూ, ఆటపాటలూ...జీవితంలోనే అతడికి మునుపటిలా ఆసక్తిలేదు. ఇప్పుడు అసలు మాతో కలసి తిరగటంలేదు. ఏదో పరధ్యానంగా ఉంటాడు.'

'అదేమో నిజమే. మేమూ చూస్తూనే ఉన్నాం. కాని, ఏం చెయ్యగలం? శాంత పోయినప్పటినుండి ఆ బెంగతోనే చిక్కి సగమయిపోయాడు.'

'అవును. నాకూ అలాగే అనిపిస్తోంది. ఏదో కొన్నిరోజులు అలా ఉంటాడు: సరిపోతుంది లెమ్మనుకున్నాను. కాని, పరీక్షలు దగ్గరకొస్తున్నా గాని, వాడిలో చలనమేలేదు. ఉదాసీనంగా ఉండిపోయాడు.'

'ఇలా అయితే వీడు నిజంగా పాసవుతాడా? శాంత పోయిన దుఃఖం కడుపులో పెట్టుకుని తిరుగుతున్నాం మేమంతా. ఇంత పట్టించుకుంటే, ఏం గతి నాయనా?'

'నేనూ అదే అడిగాను. ఇలా చదివితే నువ్వు ఎలా పాసవుతావని! ప్యాసు కాకపోతే పోయింది, డాక్టర్నయి ఎవరిని ఉద్ధరించాలి గనుక. నాకు ప్యాసూ, ఫెయిలూ రెండూ ఒకటే అనేశాడు. మా ప్రొఫెసర్ కూడా అడిగారు ఏమిటిలా ఉన్నావని!'

సుశీలమ్మగారి మొహంలో దుఃఖచ్ఛాయలు అలుముకుంటున్నాయి. కాసేపు మెదలకుండా ఉండి:

'మా దగ్గర అస్సలు నోరు విప్పడు రమేష్. నువ్వతడి స్నేహితుడివి. వాడి మనసులో ఏముందో కాస్త అడిగి తెలుసుకో బాబూ' అన్నారు విచారంగా.

'నేనేమో అడుగుతాననుకోండి. కాని ఇప్పుడతడు మునుపటిలా మనసు విప్పి మాట్లాడటంలేదు. చాలా మారిపోయాడు రమేష్.'

'అది నిజమే. క్రమంగా సరిపోతాడులే అనే ఆశతోనే, అనే నమ్మకంతోనే ఇలా ఉన్నాం.'

కాంతరాజ్ లేచి నిల్చుని:

'నేనిక వస్తానండి. నేను మీతో ఇలా మాట్లాడిన సంగతి అతడికి తెలియనివ్వకండి. నేనూ సమయంచూసి కదిలిస్తాను' అన్నాడు.

'అలాగే నాయినా; మీరే అతడిని మళ్ళీ మనుష్యుల్లో పడేయాలి.'

కాంతరాజ్ వెళ్ళిపోయాక కూడా సుశీలమ్మగారు అలాగే కూర్చుండిపోయారు.

ఇంటికి వచ్చిన కృష్ణమూర్తి చీకట్లో కూర్చున్న తల్లిని చూసి,

'చీకట్లో కూర్చున్నావేమిటమ్మా' అంటూ తనే లైటు వేశాడు.

రమేష్ ఇంటికి వచ్చేసరికి రాత్రి పది గంటలయింది. అంతవరకూ కృష్ణమూర్తి, సుశీలమ్మగారూ, శేషగిరిరావుగార్లు అతడి గురించే మాట్లాడుకుంటున్నారు.

సుశీలమ్మగారు రమేష్ రాగానే,

'కాళ్ళు కడుక్కోనిరా వడ్డిస్తున్నా' అన్నారు.

'నాకాకలిగా లేదమ్మా!'

'అలా అంటావేమిటి? మధ్యాహ్నం టిఫిన్‌కూడా తినలేదు. కాస్త ఎంగిలిపడుదువుగాని రా' అని బలవంతపెట్టారు.

వృధాగా వాదించడాని కిష్టంలేక వెళ్ళి కంచంముందు కూర్చున్నాడు రమేష్. అన్నం తింటున్న కొడుకువైపు చూశారు సుశీలమ్మగారు.

ఎలా ఉన్న కుర్రాడు ఎలా అయిపోయాడు! అతడి క్రాపు ఎప్పుడూ చెరిగేదికాదే. ఇస్త్రీ చెయ్యని షర్టు, పైజామాలు వేసుకునేవాడా?

కొంటెతనం తొంగిచూసే కళ్ళలో ఇప్పుడు గాంభీర్యం చోటు చేసుకుంది. నిండు బుగ్గలు లోతుకుపోయాయి.

చక్కగా ముస్తాబయ్యిగాని, గుమ్మం దాటని కొడుకు చెదిరినక్రాపు, మాసినగుడ్డలతో ఊరంతా తిరిగి వచ్చాడు.

ఏదో చెబుదామని నోటిదాకా వచ్చిన మాటలను అతికష్టంతో ఆపుకున్నారు సుశీలమ్మగారు.

కాంతరాజ్ స్నేహితుడి పరిస్థితికి కుమిలిపోతున్నాడు. కాని,

రమేష్ అతడితో మాట్లాడే అవకాశమే ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడు.

ఒకరోజు రమేష్ బయటికి వెళ్ళటాన్ని గమనించి, అతడి వెనకే బయల్దేరాడు కాంతరాజ్.

'ఎక్కడికి వెడుతున్నావ్?'

'అలా తిరిగి వద్దామని.'

'పద! నేనూ వస్తాను.'

'నువ్వెందుకూ? టేబుల్ టెన్నిస్‌కు వెళ్ళవా?'

'నువ్వు వస్తావా ఏం?'

'లేదు! నాకు ఆడాలనిలేదు! నువ్వు వెళ్ళేటట్టయితే వెళ్ళు.'

'నేనూ వెళ్ళ నీ రోజు. నీతోనే వస్తాను' అంటూ మొండికేశాడు. కాంతరాజ్.

రమేష్ ఇహ చేసేదేమీలేక అంగీకరించాడు.

ఇద్దరూ మౌనంగా చెరువు వైపుకు నడిచారు. చెరువు ఒడ్డున ఉన్న లతాకుంజపు నీడలో వున్న రాతి బెంచిమీద కూర్చున్నారిద్దరూ.

కాస్సేపు మౌనం రాజ్యం చేసింది.

ఆఖరికి కాంతరాజే మౌనాన్ని భగ్నంచేస్తూ;

'ఈ రోజు హాస్పిటల్‌కు రాలేదేం?' అని అడిగాడు.

'రావాలనిపించలా!' పరధ్యానంగా బదులు చెప్పాడు రమేష్.

'కులాసాగా ఉన్నావా?'

'నాకేం రాయిలా ఉన్నాను.'

కాంతరాజ్ ఓ నిమిషం మాట్లాడలా. రమేష్ చెరువులోని నీళ్ళ వైపే చూస్తున్నాడు.

నీలాకాశంలో ఒకదాని నొకటి తరుముకుపోతున్న తెల్లనిమబ్బులు, పొడుగ్గా ఎదిగిన సర్వీచెట్ల నీడలు చెరువు నీటిలో ప్రతిఫలిస్తున్నాయి. చల్లటి కొంగలు రెక్కల చప్పుడు చేసుకుంటూ పారిపోతున్నాయి. చల్లటి చిరుగాలికి లేచిన చిన్న చిన్న అలలచుట్టూ ప్రకృతికూడా స్తబ్దంగానే ఉండటం చూసి, మళ్ళీ లోపలకు వెళ్ళిపోతున్నాయి.

'రమేష్!'

'ఏం?' గడుసుగా ధ్వనించింది రమేష్ కంఠ స్వరం.

'ఇలా అయిపోయావేం నువ్వు?'

'ఏమయ్యానేం?'

'నీకే తెలియాలి! మునుపటిలా లేవు మరి.'

'నేను మామూలుగానే ఉన్నాను. నీ కళ్ళకే ఏమయినా జబ్బు వచ్చిందేమో!'

'కాదు. నువ్వింత ఉదాసీనంగా ఏనాడూ ప్రవర్తించి ఎరుగవు.'

'మనం ఆకాంక్షలను పెంచుకోరాదు. అన్నిటికన్నా ముఖ్యమైంది మమతను అసలే పెంచుకోరాదు రాజూ! ఉన్నచో, మళ్ళీ బాధ తప్పదన్న మాటే వ్యామోహముంది చూశావు! దీనంత చెడ్డది మరొకటిలేదు. అందుకే నేనికమీదట ఎవరితోనూ స్నేహ విశ్వాసాలను పెంచుకోరావని నిశ్చయించుకున్నాను.'

చివరిమాట పలికేటప్పుడు రమేష్ గొంతు జీరబోయింది.

'చూడు రమేష్! ఇలాంటి విరక్తి వేదాంతం మనలాంటి వాళ్ళకు తగదు. నలుగురితో, మాటామంతీ అంటూ ఉన్నాక సహజంగానే వ్యామోహం కలుగుతుంది. ఇలాంటి బంధం మహామహులకే తప్పలేదు? మనకు సాధ్యమా?'

'ప్రస్తుతానికి సాధ్యమనే అనుకుంటున్నామరి. జీవితాన్నుండి దూరంగా వుండాలనినిర్ణయించుకున్నాను.'

'అది పిరికిపంద లక్షణం.'

'కావచ్చు. కాని, నేను మాత్రం ఈ రకమయిన జీవితాన్నుండి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను.'

రమేష్ మాటలు విని, కాంతరాజ్ స్తబ్ధుడయిపోయాడు. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక కాస్సేపు మెదలకుండా ఉండిపోయాడు.

'కాని, రమేష్! నేనో మాట చెప్పనా? మనం ఇంకొకరికి ఉపకారం చెయ్యకపోయినా, బాధమాత్రం పెట్టరాదు. ఆ విషయమయినా ఒప్పుకుంటావా?'

'ఒప్పుకుంటాను.'

'ఇప్పుడు నీ పరిస్థితిచూసి మీ అమ్మ, నాన్న, అన్నయ్య ఎంత బాధపడుతున్నారో తెలుసా? వాళ్ళంతా నిన్ను ప్రేమిస్తున్నారన్న విషయం మరిచిపోకు. మీ అమ్మ నీమీద ఎన్ని ఆశలు పెట్టుకుందో తెలుసా?'

'తెలుసు.'

'కాని, యిప్పుడు నువ్వు నీ కర్తవ్యాన్ని మరిచిపోయి ఈ జీవితాన్నుండి పారిపోవాలని చూస్తున్నావ్. ఇది తప్పుకాదూ? నీ లక్ష్యం ఏమిటి? ఈ మారు పరీక్ష పాసయి రోగాలతో బాధపడుతున్న వేలాదిమందిని కాపాడాలనుకున్నావే! నువ్వు మా ముందు వర్ణించి చెప్పిన ఆ ఆదర్శ జీవితం ఎక్కడుంది రమేష్?'

రమేష్ వుదాసీనంగా అన్నాడు:

'నేను డాక్టరయి మాత్రం చేసేది ఏమిటిలేద్దూ! ఒక్క రమేష్ డాక్టరు కాకపోతేనేం? ఈ రోజుల్లో డాక్టర్లకేంలోటు? ఎక్కడ చూసినా మెడికల్ కాలేజీలూ, లెక్కలేనంతమంది డాక్టర్లూనూ! నేనొక్కడిని డాక్టర్ కాలేకపోతే, ప్రపంచం మునిగిపోదు లేవోయ్.'

'ఏం మాటలురా భాయి అవి! నీ నేర్పు, బుద్ధి అందరికీ ఉంటాయనుకున్నావా? నిన్ను మన ప్రొఫెసర్లు ఎంతగా మెచ్చుకునేవారో మరిచిపోయావా? ఈ వృత్తిలో నీకెంత ఉజ్వల భవిష్యత్తు వుందో నీకు తెలుసా? నువ్వు ఎంతమందిని కాపాడాలో ఎవరికి తెలుసు?'

రమేష్ వ్యంగ్యంగా అన్నాడు:

'హుఁ నేనూ... కాపాడటం! అదంతా వట్టి బూటకం కాంత్! మనం కేవలం మానవ మాత్రులం. బ్రహ్మ రాసిన దాన్ని తప్పించటానికి మన మెవరం? మనం విధి చేతిలోని కీలుబొమ్మ మాత్రమే. వైద్య వృత్తి వుంది చూశావు? అది వట్టి నటన. దాన్నుండి ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేదు. ఎవరి కర్మ వాళ్ళు అనుభవిస్తారంతే.'

రమేష్ మాటలకు కాంతరాజ్ తెల్లబోయాడు. కారణం: రమేష్ దేవుడు, విధి, కర్మలాంటి మాటలను నమ్మేవాడుకాదు. ఇది కాంతరాజ్‌కు బాగా తెలుసు.

'అయితే ఈమారు పాసవుతాననే నమ్మకం లేదా?'

'నేను పరీక్షకు వెళ్ళనే వెళ్ళను; ఇహ దాన్ని గురించి బెంగేమీ లేదు.'

కాంతరాజ్ ఈమారు నిజంగానే గాబరాపడ్డాడు. రమేష్ చేతిని తన చేతుల్లోకి తీసుకుని:

'రమేష్! నీ భవిష్యత్తు పాడు చేసుకోకు. నాకోసం, నీకోసం, మీ తల్లితండ్రులకోసం కాస్త ఆలోచించు' అన్నాడు. అతడి కంఠం రుద్ధమైంది. కళ్ళు చెమ్మగిల్లాయి.

రమేష్ జవాబు చెప్పలేదు. అతడి నిశ్చయానికి తిరుగులేదన్న సంగతి అతడి మొహమే చెప్తోంది. అది కాంతరాజ్ గ్రహించాడు.

'తొందరపడకు రమేష్!'

'నన్నిక విసిగించి బాధపెట్టకురా బ్రదర్! నాకేమీ అక్కర్లేదీ ప్రపంచంలో. ఎక్కడికయినా పారిపోవాలనిపిస్తుంది. ఇహ ఈ విషయం ఇక్కడికి వొదిలెయ్.'

'నీకు నిజంగా ఎక్కడికైనా వెళ్ళాలనుందా?'

'అవును.'

'పరీక్షలకు ఇంకో నెలరోజులు మాత్రమే వున్నాయ్.'

'అవును, నువు పరీక్షలు బాగా రాయి.'

'మరి నువ్వో?'

'నాకా బెంగేంలేదు, ఊరు వదలి ఎక్కడికైనా వెళ్ళిపోవాలని వుంది.'

కాంతరాజ్ ఇహ ఏమీ మాట్లాడలేకపోయాడు.

చీకటికాంత తన నాలుగు చెరుగుల్తో లోకాన్ని మెల్లి మెల్లిగా కప్పుకుంటోంది. సర్వీ చెట్ల సందులోనుండి సన్నగా ఈలలు వేస్తూ వస్తోంది గాలి. లతాకుంజం ప్రక్కనున్న దీపంనుండి కాంతి మందంగా ప్రసరిస్తోంది.

'ఇహ వెడదామా' అన్నాడు కాంతరాజ్.

'నువ్వు వెళ్ళు. నేనింకా కాస్సేపు వుండి వస్తాను.'

'నిన్నొక్కడినే వదిలి నేను వెళ్ళలేను. నా మాట విని, నాతో వచ్చేయ్.'

అతడి మాటల్లో ఉన్న ఆరాటాన్ని గమనించి రమేష్ నవ్వాడు.

'నేనెప్పటికీ ఆత్మహత్య చేసుకోను. నేను పిరికివాడనని అన్నావు. ఆ మాట నిజమే— ఒప్పుకుంటున్నా' అంటూ జేబులోనుండి సిగరెట్ తీసి వెలిగించాడు. కాంతరాజ్ విస్మయానికి అంతులేదు. అతడికి తెలిసినంతలో రమేష్‌కి సిగరెట్ అలవాటులేదు.

ఈ అలవాటు ఎప్పటినుండి?'

'ఏదో చికాగ్గా వున్నపుడు మాత్రమే'

'సరేగానీ, ఇహ లే వెడదాం' అంటూ బలవంతాన రమేష్‌ని బయలుదేర తీశాడు కాంతరాజ్.

# 6

పరీక్షలు ఇంకా పదిహేను రోజులున్నాయనగా రమేష్, తండ్రితో చెప్పాడు:

'ఈమారు నేను పరీక్షకు వెళ్ళదలచుకోలేదు నాన్నా.'

ఆ మాట విని శేషగిరిరావుగారు ఆశ్చర్యపడ్డారు.

'ఏం?'

'నేనింతవరకూ పుస్తకాలు తెరవనైనా తెరవలేదు. ఇప్పుడు పరీక్షకు చదివేంత ఏకాగ్రతకూడా నాకు లేదు. వెళ్ళినా నేను పాసవను.'

'సంవత్సరమంతా వృధాకదురా' అని ఇంకా ఆయనేమో చెప్పబోతుండగా కృష్ణమూర్తి కల్పించుకుని:

'అలాగేకానీ, వచ్చే సంవత్సరం వెడుదువుగానీ, ఒక్క సంవత్సరమేకదా. పోతేపోతుంది' అన్నాడు.

రమేష్ కృతజ్ఞతతో అన్నయ్యవైపు చూశాడు.

కాంతరాజ్ సుశీలమ్మగారికి ఇచ్చిన మాట ప్రకారం ఆమెకు ఉన్న సంగతంతా వివరించాడు:

'మీరు కొద్దిరోజులపాటైనా అతడిని ఎక్కడికైనా పంపడం మంచిది. ఈ వాతావరణంనుండి తప్పుకుంటేనైనా ఈ బాధను మరచి మనిషిగా కాగలడేమో!'

'ఎక్కడికి పంపుదామంటావ్?'

'ఎక్కడికైనాసరే. అలా తిరిగిరానివ్వండి. ఈ సంవత్సరం చదువు పాడయినా నష్టంలేదు. రమేష్ మామూలు మనిషి కావటమే ముఖ్యం.'

సుశీలమ్మగారికి ఆ మాట నిజమే ననిపించింది. భర్తతోనూ, కృష్ణమూర్తితోనూ చర్చించికూడా ఏ నిర్ణయానికి రాలేక వూరుకున్నారు.

శాంతపోయి మూడునెలలు కాకుండానే, కృష్ణమూర్తికి మళ్ళీ సంబంధాలు రాసాగాయి.

మొదటిసారి ఎవరో పిల్లనివ్వటానికి వచ్చినపుడు సుశీలమ్మగారు శాంతను తల్చుకుని వాళ్ళ ఎదుటనే కంటనీరు పెట్టుకున్నారు.

కాని, చనిపోయిన భార్యను తల్చుకుంటూ ఇంకా చిన్న వయసులో వున్న కృష్ణమూర్తి ఎన్నిరోజులు సన్యాసిలా వుండగలడు?

తన సంసారాన్ని కష్టంలేకుండా గడుపుకోగలిగిన సంపాదన వుంది. చిన్నవయస్సు. వచ్చేపిల్ల సవతితల్లి అవుతుందేమోనన్న భయమూ లేదు.

కృష్ణమూర్తి మళ్ళీ పెళ్ళిచేసుకోవటంలో తప్పేమిటి?

సుశీలమ్మగారు, రావుగారు ఆలోచించుకుని ఓ రోజు కృష్ణమూర్తి దగ్గర ఆ విషయాన్నెత్తారు.

'అబ్బాయ్! చిత్రదుర్గంనుండి ఎవరో వచ్చారు. వాళ్ళింట్లో పెళ్ళికెదిగిన పిల్ల వుందట. జాతకం అదీ సరిపోతే...'

కృష్ణమూర్తి అదిరిపడ్డాడు. ఇంత త్వరగా తన పెళ్ళి ప్రస్తావన వస్తుందని అనుకోలేదతడు. అలా అన్నంతమాత్రాన తన పెళ్ళిగురించి అతడు ఆలోచించనే లేదనికాదు. మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా జీవితాంతం వుండిపోలేడన్న సత్యం అతడికీ తెలుసు. కేవలం భావుకతకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే మనిషికాదు కృష్ణమూర్తి. మానవుడికి భావుకత అనేదే లేకపోతే జీవితం నరకం అనిపించేమాట నిజమే. కాని లౌకికానికన్నా భావుకతకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే వయస్సు దాటిపోయిందతడికి.

తండ్రిమాటకు కృష్ణమూర్తి జవాబు చెప్పలేదు. కొడుకు మౌనాన్ని చూసి తండ్రి తన మాటలవల్ల అతడికి బాధ కలిగిందని అర్థం చేసుకుని:

'ఎన్ని రోజులని ఇలా ఉండగలవు చెప్పు?' అన్నాడు.

'ఇంత త్వరగా నా పెళ్ళి విషయం ఎత్తకండి. నాకింకా కొంత కాలం అవకాశం కావాలి.'

'ఎప్పుడయినా పెళ్ళిచేసుకోవాల్సిందేగా. ఎప్పుడో కావలసింది ఇప్పుడే అయితేనేం?'

'నిజమే, పెళ్ళిచేసుకోనని నేనను. కాని ఇపుడే వద్దంటున్నానంతే.'

ఇంకా కొంచెం నొక్కిచెపితే ఒప్పుకుంటాడని తల్లిదండ్రులకు అనిపించింది. కాని, ఒక్కరోజే ఇంకా బలవంతం చేయటం మంచిదికాదని ఊరుకున్నారు.

కృష్ణమూర్తి అప్పటికి తన పెళ్ళి విషయం మరిచిపోయాడు.

ఇది జరిగిన వారంలో ఇంకెవరో ఆడపిల్ల తండ్రి వాళ్ళింటికి వచ్చాడు. కాఫీ, ఫలహారాలయ్యాక వచ్చినాయన శేషగిరిరావుతో:

'మా అమ్మాయికి ఇరవైనాలుగు ఏళ్ళునిండాయి. మీరు ఆలోచించుకుని, మీ పెద్దబ్బాయికి మా అమ్మాయిని తప్పక చేసుకోవాలి' అంటున్నారు.

'చూద్దాం! మా అబ్బాయేమో ఇప్పుడే వద్దంటున్నాడు.'

ఈ మాటలన్నీ గదిలో కూర్చున్న రమేష్ చెవిలో పడ్డాయి. అతడికి ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లనిపించింది.

అన్నయ్యకు ఇంకో పెళ్ళి! అంటే తనకు ఇంకో వదిన.

ఈ జన్మలో ఇది సాధ్యమా! ఇప్పుడేవద్దు అంటే కొన్ని రోజులు పోయాక చేసుకుంటాడనేగా!

అదెలా సంభవం? ఇంకో స్త్రీని తను వదినగా స్వీకరించటం సాధ్యమయ్యే విషయమేనా?

రమేష్ రక్తం పొంగింది. గబుక్కునలేచి బయటకు వచ్చి ఆయన ముందు నిల్చుని ఆవేశంగా:

'వదిన చావాలని ఎన్ని రోజులుగా కోరుకున్నారు మీరు? తను ఎప్పుడు చనిపోతుందాని కాచుక్కూర్చున్నారా? వదిన చనిపోవాలని దేవుడికి మొక్కుకున్నారా మీరు?'

తండ్రి కొడుకుని వారించడానికి ప్రయత్నించి విఫలులయ్యారు.

'వెళ్ళిపోండి, మళ్ళీ మా గడప తొక్కకండి. వదిన చనిపోయి మూడు నెలలు కాలా, అప్పుడే ఈ ఇంటిని పెళ్ళింటిగా చేద్దామని వచ్చారా మీరు? మీ అమ్మాయికి ఎక్కడా సంబంధం దొరక్కపోతే, నూతిలో పడమనండి. అంతేగాని...' అంటూ తండ్రివైపుకు తిరిగి:

'నాన్నా! ఇకమీదట ఇలాంటి వాళ్ళను ఇంట్లోకి అడుగు పెట్టనివ్వకండి. ఇలాంటివాళ్ళ ఉసురు తగిలే వదిన చనిపోయిందేమో!' అంటూనే గబగబా వెళ్ళిపోయాడు.

ఆ వచ్చినవారికి ఈ గడబిడంతా ఏమిటో అర్థం కాలేదు. కాని తమ రాక అతడికయిష్టమన్న విషయం మాత్రం అర్థమయింది. రావుగారు

'కొంచెం దుడుకు స్వభావం వాడిది. మీరేమీ అనుకోకండి' అన్నారు.

'ఆ అబ్బాయి యెవరు?'

'మా చిన్నబ్బాయే.'

'ఏమంటున్నారాయన?'

'ఏం లేదులెండి! అతడి స్వభావం కొంచెం విచిత్రం; అంతే. కృష్ణమూర్తికి ఇప్పుడిప్పుడే పెళ్ళి చేసుకునే అభిప్రాయం లేదు. మీ అడ్రసు ఇచ్చి వెళ్ళండి. చేసుకుంటానంటే మీకు కబురు చేస్తాను.'

'అలాగే' అని అడ్రసు ఇచ్చి వెళ్ళిపోయారాయన.

రాత్రి పెద్ద కొడుకుతో, జరిగిన విషయమంతా చెప్పారు రావుగారు.

'కృష్ణా! నీవు ఇలా మాట్లాడితే ఎలా? సంసారమన్నతర్వాత నలుగురూ వస్తారు, వెడతారు. నోటి కొచ్చినట్లు మాట్లాడితే బావుంటుందా? ఈ రోజు కాకపోతే రేపయినా నీ పెళ్ళి జరగాల్సిందేకదా?'

తండ్రి మాటల్లోని సత్యం అతడికి మాత్రం తెలియనిదా?

'పరీక్షక్కూడా వెళ్ళకుండా కూర్చున్నాడు. వాడికి మాత్రం ఏం తోస్తుంది చెప్పు. కాంతరాజ్ అన్నాడు 'కొద్ది రోజులు వేరే ఊరు వెళ్ళి వస్తే బావుంటుం'దని. నాకూ అదే మంచిదనిపిస్తోంది' అన్నారు సుశీలమ్మగారు.

'ఎక్కడికి పంపుదామంటావ్? ఎక్కడికి వెళ్ళినా, మళ్ళీ ఇక్కడికే కదా రావాలి?' అన్నారు శేషగిరిరావు.

'నిజమే కాని కొన్ని రోజులయినా మార్పు ఉంటే, తేరుకుంటాడేమో.'

అంతవరకు మౌనంగా కూర్చున్న కృష్ణమూర్తి,

'నిజమేనమ్మా. ఈ వాతావరణం నుండి కొంచెం దూరం పోతే నయినా, కాస మామూలు మనిషిగా కాగలడేమో! అన్నట్టు బొంబాయి వెడితే ఏం?' అన్నాడు.

'అక్కడెక్కడుంటాడు?'

'మన శేషగిరి ఉన్నాడుగా అమ్మా! రేపే వివరంగా ఉత్తరం రాస్తాను వాడికి. కొద్ది రోజులపాటయినా అలా వెళ్ళి రానీ. కొత్తచోటు, కొత్త మనుష్యుల మధ్య పాత దుఃఖాన్ని విస్మరించవచ్చు.'

'అలాగే కానీ: కాని, రమేష్‌వల్ల శేషగిరికేమయినా కష్టం కలిగేటట్టయితే మాత్రం వద్దు' అన్నారు శేషగిరిరావుగారు.

'కష్టమేమిటి? అలా అనుకునే స్వభావంకాదు వాడిది. రోజా తనతోబాటు 'క్లినిక్'కు తీసుకుని వెడితే, అదీ ఓ విధంగా మంచిదే అవుతుంది.'

ఆ రోజు రాత్రి పన్నెండు గంటలకు ఇంటికి వచ్చాడు రమేష్. ఇంట్లోని వారంతా ఆ వచ్చిన కొత్త మనిషితో కలిసి, తనమీద గూడుపుఠాణి జరుపుతున్న శత్రువులా అన్నట్టు అందరి వైపూ చురచురా చూసి తన గదిలోకి వెళ్ళి దఢేలున తలుపు వేసేసుకున్నాడు.

'భోజనానికి రారా' అన్నారు సుశీలమ్మగారు.

'ఆకలిలేదు.' తలుపు తెరవకుండానే సమాధానం వచ్చింది.

రమేష్‌ని ఎలాగయినా ఆ వాతావరణం నుండి తప్పించి వేరే చోటికి పంపాలని ఇంట్లో అందరూ నిశ్చయించారు. ఆ విషయం శేషగిరి నుండి జవాబు వచ్చాకనే చెప్పవచ్చునని ఊరుకున్నారు.

కృష్ణమూర్తి ఉత్తరం చూసుకుని శేషగిరి 'రమేష్‌ని తప్పకుండా పంపు. నువ్వేం బెంగ పెట్టుకోకు. ముందుగా ఏ ట్రైనులో వచ్చేది తెలిపితే స్టేషనుకు వస్తాము' అని రాశాడు.

కృష్ణమూర్తి తల్లిదండ్రులతో ఈ విషయం చెప్పాడు. సాయం కాలం తమ్ముడిని,

'రమేష్! నాలుగు రోజులపాటు ఎక్కడకయినా వెళ్ళి వస్తావుట్రా. నీకు ఇంట్లో ఏమీ తోచనట్లుంది' అని అడిగాడు.

'ఎక్కడికి వెళ్ళమంటావ్?...నేనెక్కడికీ వెళ్ళను. ఇక్కడే ఉంటాను.'

'అలా కాదు; నీ కిప్పుడు మార్పు కావాలి. మద్రాసు బొంబాయి ఎక్కడికయినాసరే; కొద్దిరోజులు వెళ్ళిరా! మనస్సు కాస్త కుదుటపడుతుంది. ఈమారు పరీక్ష పోయిందని బెంగెట్టుకోకు. వచ్చే సంవత్సరం చదువుదుగాని. నువ్వు సంతోషంగా వుండటమే మాకు కావలసిందీనూ.'

ఏం బదులు చెపుతాడా అని కృష్ణమూర్తి ఎదురు చూస్తున్నాడు. కాని, రమేష్ మాట్లాడకుండా అక్కడినుండి వెళ్ళిపోయాడు. రెండు రోజులు కృష్ణమూర్తి తమ్ముడిని కదిలించలేదు. మళ్ళీ మూడో రోజున.

'ఏమని నిశ్చయించుకున్నావ్?' అని అడిగాడు.

'నేనెక్కడికీ వెళ్ళను.' ముక్తసరిగా జవాబిచ్చాడు రమేష్.

'కొన్ని రోజులు ఎక్కడికయినా వెళ్ళివస్తే బావుంటుంది.'

'నేను మీకంతా భారంగా ఉన్నానా ఏం?'

తమ్ముడి మొరటు మాటలకు కృష్ణమూర్తి మనస్సు చివుక్కుమంది. అన్నయ్య మొహం నల్లబడటంచూసి, తను అంతమాట అనకుండా ఉండాల్సింది అనుకున్నాడు రమేష్.

'నువ్వు మాకు భారమని నేను చెప్పలేదురా తమ్ముడూ. నీకు మనస్సేమీ బాగాలేదు అందుకే జ్ఞాపకాలతో బాధపెట్టే ఈ యింటి వాతావరణాన్ని వదలిపెట్టి అలా వెళ్ళివస్తే మంచిదనిపించింది. చెప్పాను. అంతే! ఇష్టం లేకపోతే వద్దులే' అని కృష్ణమూర్తి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

రమేష్ రెండురోజులు ఆలోచించి ఆఖరికి:

'అన్నయ్యా! నువ్వు చెప్పిందే నిజం. నాలుగురోజులపాటు ఎటయినా తిరిగొస్తాను' అన్నాడు.

కృష్ణమూర్తి తమ్ముడిలోని మార్పుకు సంతోషించినా, దాన్ని పైకి కనపడనీయక

'అలాగే! ఎక్కడికి వెళ్ళాలనుకుంటున్నావ్?' అని అడిగాడు.

'నాకెక్కడికి వెళ్ళాలనే ఊహకూడా లేదు. నువ్వే చెప్పు.'

'నన్నడిగితే బొంబాయి వెళ్ళటం మంచిది. అక్కడ నా స్నేహితుడు శేషగిరి ఉన్నాడు. నీకూ తెలుసుగా. వాళ్ళింట్లో ఉండవచ్చు. అతనూ డాక్టరే కనుక నీకూ బాగా కాలక్షేపం అవుతుందని నా అభిప్రాయం. నువ్వే ఆలోచించుకో. నీకు యిష్టమైతేనే అక్కడికి వెళ్ళు' అని ముగించాడు కృష్ణమూర్తి.

రమేష్ బొంబాయి వెళ్ళటమే నిశ్చయమయింది. కాని అతను రైలు ఎక్కేవరకూ ఎవ్వరికీ నమ్మకంలేదు. క్షణక్షణానికి మనసు మారుతూ వుంటుంది. చివరి క్షణంలో 'నేను వెళ్ళను' అంటే కూడా ఆశ్చర్యపడక్కర్లేదు. అదే ఆరాటపడుతున్నారు అందరూ.

కృష్ణమూర్తి శేషగిరిరావుగారూ స్టేషనుకు వెళ్ళి రైలెక్కించారతనిని.

'డబ్బు కావాలంటే రాయి. సంకోచపడకు' అన్నాడు కృష్ణమూర్తి.

'రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్త. అక్కడ చాలా రద్దీగా ఉంటుందిట.'

రైలు వెళ్ళాక, 'ఇక తిరిగి వచ్చేటప్పటికి రమేష్ మామూలు మనిషి అయితే చాలు' అనుకుంటూ, ఇంటి మొహం పట్టారు తండ్రీ కొడుకులు.

రమేష్ ఇంత దూరపు ప్రయాణాన్ని చేయటం ఇదే మొదటిమారు. మెడికల్ కాలేజి చదువు ఇలాంటి ప్రయాణాలను చేసే అవకాశాన్ని ఇవ్వ లేదతడికి. దసరా, క్రిస్టమస్ శెలవుల్లో స్నేహితులతో కలసి జోగ్, శివసముద్రం ఇలాంటి ప్రదేశాలకు మాత్రమే వెళ్ళి వచ్చాడు.

నిరాశ, నిస్పృహలు మూర్తీభవించిన వాడిలా కనిపిస్తూ ఒంటరిగా, దిగులుగా ప్రయాణిస్తున్న రమేష్ రూపం తోటి ప్రయాణికుల్లోని ఓ వృద్ధుడిని ఆకర్షించింది.

ఆయన కాఫీ దొరికే ప్రతి స్టేషనులోనూ కాఫీ త్రాగి:

'మైసూరు కాఫీయే కాఫీ! బొంబాయి వెడితే ఇహ ఇంట్లోవాళ్ళు 'చా'యెగతి. కాని, చూశారూ! తెల్లవారి లేవగానే ఓ కప్పు మైసూరు కాఫీ

తాగందే ఉండలేను నేను. కాఫీకోసం సయాన్ నుండి దాదర్ వెళ్ళి ఉడుపి హోటల్లో కాఫీ త్రాగి వస్తాను. తరువాతనే నా బిజినెస్ ప్రారంభం...' అనేవారు.

'ఏం బిజినెస్సూ' అని రమేష్ అడగాలని ఆయన వాంఛ.

కాని, రమేష్ ఏమాత్రం కుతూహలం కనపర్చలేదు. ఇంకో ప్రయాణీకుడు అడిగాడు.

'ఏం బిజినెస్?'

'వజ్రాలు, రత్నాలు, వెండి, బంగారం ఊరి నుండి ఊరికి తీసుకుని వెళ్ళి అమ్ముతాను.'

ఆయన మాటలమీద అక్కడున్నవాళ్ళకెవ్వరికీ నమ్మకం కలుగ లేదు. అతడు వేసుకున్న గుడ్డలు ఇతడేం బంగారు వర్తకుడూ? అనిపించేలా ఉన్నాయి.

తోటి ప్రయాణీకుల మనసులోని సందేహం ఇట్టే కనిపెట్టేశాడు.

'నేను చెపుతున్నది నిజమేనండోయ్! బిజినెస్‌లో ఇలా తిరుగుతూనే ఉంటామూ. ఇప్పుడు నా ఒంటిమీద ఐదువేల రూపాయల బంగారానికి తక్కువ ఉండదు. చూపిస్తాను దండి' అంటూ, తన చొక్కా లోపలి జేబు కుట్టు విప్పసాగాడు.

'వద్దులెండి' అన్నారెవరో.

'మా అమ్మాయి నవరసులు ఇలా సంచిలో పెట్టి లోపలి జేబులో పెట్టి గట్టిగా కుట్టేస్తుంది. ఆ పిల్లే చిన్నమ్మాయి నాకు. ఆ ఒక్క పిల్లకు పెళ్ళి చేసేస్తే, నా బాధ్యత తీరిపోతుంది. నేనంటే ఎంతో ప్రేమ అమ్మాయికి. ఇహ మిగిలిన వాళ్ళంతా...ప్చ్...లాభంలేదు. ఈ ముసిలాడు ఎప్పుడు చస్తాడా? ఎప్పుడు ఆస్తి కాజేద్దామా అనే కాచుకూర్చున్నారు' మాట్లాడుతూనే కుట్లు విప్పి సంచిలోని నవరసులు దోసిట్లోకి పోసుకున్నారు.

క్రొత్త నవరసులు సూర్యుడి వెలుగులో తళతళా మెరిశాయి. వాటిని ఒక చేతిలో నుండి మరో చేతిలోకి పోసుకుంటో ఆనందించాడాయన.

'నేను తిరిగి వచ్చేదాకా క్షేమంగానే ఉన్నానన్న నమ్మకం ఎవరికీ

ఉండదు. బంగారం ఉందని తెలిసి ఎవరన్నా నన్ను ఖూనీచేసి బంగారం కాజేస్తారని వాళ్ళ భయం.'

'మీరు ఇలా అందరిలోనూ మీ దగ్గర బంగారం ఉందని చెప్పటం మంచిది కాదేమో!' ఎవరో అన్నారు.

'అందుకేగా, నేనెప్పుడూ ఫస్టు క్లాసులో ప్రయాణం చెయ్యను. ఎక్కువగా మనుష్యులున్న పెట్టెలోనే ఎక్కుతాను. అయినా మనలో ధర్మం, న్యాయం ఉన్నంతవరకూ ఏం భయం చెప్పండి.'

'మైసూరులో బంగారం బాగా అమ్ముడు పోయిందా?'

'ఫరవాలేదు-సుమారుగా ఖర్చయింది. మహారాష్ట్రంలో ముత్యాలు ఎక్కువగా అమ్ముడు పోతాయి. అక్కడ వజ్రాలను కన్నెత్తి కూడా చూడరు' అంటూ ఆయన మళ్ళీ నవరసులను సంచిలోపోసి, పెట్టెలోపెట్టి తాళం వేశాడు.

ధారవాడ దగ్గర పడుతూండటం గమనించి ఆయన నిరాశతో:

'ఇక కాఫీ దొరకదు' అన్నారు. అక్కడున్న ప్రయాణికులందరిలోనూ తన నవరసులను గురించి కొంచెంకూడా ఆసక్తి చూపని రమేష్‌ని చూసి,

'ఎక్కడిదాకా వెడుతున్నారు' అని అడిగాడు.

'బొంబాయి.'

'ఎవరింటికి వెడుతున్నారు? ఇల్లెక్కడ?'

ఆయనతో మాటలు కలపాలని ఆసక్తిలేని రమేష్:

'నాకు తెలియదు. వాళ్ళేవస్తారు స్టేషనుకు.'

'అలాగా! చదువుతున్నారా? ఉద్యోగమా?'

'చదువుతున్నాను.'

'ఏం చదువుతున్నారు.'

'ఎం.బి బి.యస్. ఫైనల్ ఇయర్.'

సరి! ఇక ఆయన తన 'డయాబిటీస్' జబ్బు గురించి వివరించటానికి మొదలు పెట్టాడు.

'నాకు తీపి అంటే ప్రాణం. జబ్బుకేమో తీపి అసలు పడదు. ఏం చెయ్యటమో చెప్పండి!'

ఆయనమాట ముగించటానికి ముందే రమేష్ అందుకున్నాడు.

'ప్రతీ స్టేషన్‌లోనూ పంచదారవేసిన కాఫీ తాగితే మరింకేముంది? తీపి వస్తువులు, పళ్ళు తినకండి. కొంచెం కూరగాయలు ఎక్కువగా వాడండి.'

'ఆ పాడు గోధుమ అన్నానికి ఏం కూరలు కలుపుకున్నా బావుండదు గడ్డిలా ఉంటుంది.'

'మీ కెన్నేళ్ళండి?'

'అరవై నాలుగు.'

'సామాన్యంగా నలభై ఏళ్ళు దాటాక ఈ జబ్బు వస్తుంది. మీరు ఆ తరువాత ఇరవై నాలుగేళ్ళు బాగానే ఉన్నారుకదా. ఆ మాత్రం చాలదూ? ఇన్నిరోజులు బాగా బ్రతికారుగాని, ఇహ చాల్లెండి.'

ఆయన మనస్ఫూర్తిగా నవ్వారు.

'నిజమే కాని, బ్రతికినంతకాలం తినాలిగామరి. జిహ్వాచాపల్యం అంత సుళువుగా పోతుందామరి?'

'బ్రతకటానికోసం తినండి గాని, తినడానికోసం బ్రతక్కండి.'

'మీరు చాలా రసవత్తరంగా మాట్లాడతారు! బొంబాయిలో మా ఇంటికి తప్పకుండా రండి' అని తన అడ్రసు కార్డు రమేష్‌కిచ్చాడు.

బొంబాయి చేరేవరకు ఆయన రమేష్‌ని వదల్లేదు. ఏకాంతాన్నే కోరుకుంటున్న రమేష్‌ని ఆయన మాటలు చాలా చికాకు పరచాయి. అతడి నుండి తప్పించుకుందామని రమేష్ ఎంత మోటుగా మాట్లాడినా:

'చాలా రసవత్తరంగా మాట్లాడుతారు మీరు' అనేవారాయన.

భోజనం, టిఫిన్ విషయంలో రమేష్ ఉదాసీన భావాన్ని గమనించి తనతో బాటే భోజనమూ అదీ తెప్పించేవారాయన.

'ఈ వయసులోనయినా బాగా తినాలండి. ఇప్పుడు నన్నే చూడండి! మీ ఈడులో దీనికి మూడింతలు తినేవాడిని. ఇప్పుడయినా నేను మీకంటే నయమే.'

రమేష్ ఆయన్నుండి తప్పించుకోలేకపోయాడు. మాటకారితనం, గొప్పలుగా చెప్పుకోడం ఎక్కువయినా, ఆయన మనసు మంచిదని గ్రహించాడు రమేష్.

దాదర్ స్టేషన్‌లోనే దిగవలసిందిగా రాశాడు శేషగిరి.

స్టేషన్ రాగానే, ఆ బంగారు వర్తకుడు రమేష్ కరస్పర్శచేసి,

'ఇక వస్తానండోయ్! మళ్ళీ మా ఇంటికి రావటం మరిచిపోయేరు' అన్నాడు.

రమేష్ కిటికీలో మొహంపెట్టి శేషగిరికోసం వెతికాడు. కాని, శేష గిరి మొహం ఎక్కడా కనుపించలేదు.

రైలు ఆగగానే, రమేష్ తన సూటుకేసు చేతిలో పట్టుకుని క్రిందకి దిగి చుట్టూ చూశాడు. శేషగిరి కనుపించలేదు. రమేష్ హృదయం బరువెక్కింది. బహుశా తన రాక వాళ్ళకిష్టంలేదేమోనన్న ఆలోచన అతడి మనస్సును కించబరచింది.

అన్నయ్యమాట విని, తను ఇలా రావటం పొరపాటేమో అనుకున్నాడతను. అయినా కళ్ళు చుట్టూ వెదుకుతూనే వున్నాయి. మరాఠీ, హిందీ, గుజరాతీ, తమిళ భాషలు కలగాపులగంగా వినిపిస్తున్నాయి. ఆ జన సాగరంలో ఎక్కడికి వెళ్ళాలో తోచలేదు రమేష్‌కి.

'నమస్కారం' అన్న మాతృభాషలో కంఠంవిని టక్కున వెనుదిరిగి చూశాడు రమేష్.

అపరిచితులతో నిండిన ఆ జనసమ్మర్దంలో పరిచయమున్న మనిషిని చూసి హాయిగా నిట్టూర్చాడు రమేష్.

'నమస్కారం!'

'ఆయన రావటానికి వీలుపడలేదు. ఫార్మసీకి వుదయమే వెళ్ళారు. నన్ను స్టేషన్‌కు వెళ్ళమని చెప్పారు. రండివెడదాం.'

రమేష్ పెట్టె, పరుపుకోసం దెబ్బలాడుకుంటున్న "హమాలీ"లతో మరాఠీలో మాట్లాడి, ఒకడిని సామాను తీసుకోనిచ్చి ముందుకు నడచింది రత్న.

రమేష్ ఆమె వెంటనే నడిచాడు.

ఆ గుంపులో చోటుచేసుకుంటూ రమేష్‌ని, ఇంట్లోనివారి క్షేమ సమాచారాలు అడుగుతూ నడుస్తోంది రత్న. రమేష్ ముక్తసరిగా జవాబు చెబుతున్నాడు. అతడి దృష్టి అంతా రత్నమీదనే వుంది. తను వెనకబడి రత్న కనిపించకపోతే, తను మళ్ళీ సమూహంలో ఒంటరి వాడి నయిపోతా

వన్న భయంతో ఆమెను అనుసరించాడు రమేష్. రమేష్ మైసూరులో దసరా వుత్సవాలప్పుడు మాత్రమే ఇంతటి జనసమూహాన్నిచూసి ఎరిగినవాడు. దసరాలో మేల్కొన్న మైసూరు మళ్ళీ దసరా వరకు ప్రశాంతంగా నిద్రపోయేది.

రత్న మెట్లుఎక్కి దిగింది. రమేష్ ఆమెను అనుసరించాడు. స్టేషన్ దాటి బయటకివచ్చి టాక్సీలో కూర్చున్నాక మొదటిమారు రమేష్ వైపుకు చూసింది రత్న.

'సయాన్ బస్‌స్టాప్' అని డ్రైవరుతో చెప్పి, మళ్ళీ రమేష్‌వైపు తిరిగింది.

వుల్లాసమే మూర్తీభవించినట్టుండే రమేష్ క్రుంగి కృశించిపోయాడు. నిండుగా వుండే బుగ్గలు వాడిన పువ్వులా అయిపోయాయి. కొంటెగా మెరిసే కళ్ళలో గాంభీర్యం చోటుచేసుకుంది.

తన దుస్తులు గురించికూడా అతడికి శ్రద్ధవున్నట్టు కనపడలేదు. తాము మైసూరు వెళ్ళినప్పుడు తనకేమీ తోచడంలేదేమోనని పలకరించిన రమేషేనా ఇతను అనుకుంది రత్న.

'కులాసాగా వున్నారా మీరు?'

కిటికీలోనుండి బయటకు చూస్తున్న రమేష్ ఇటు తిరగకుండానే సమాధానం చెప్పాడు.

'ఊఁ!'

'చిక్కిపోయినట్టున్నారు?'

'లేదు.'

అతడికి మాట్లాడటానికి ఇష్టంలేదని తెలుసుకున్న రత్న ఇహ అతడిని పలకరించే ప్రయత్నం మానుకుని వెనక్కు వాలింది.

సయాన్‌లోని ఓ మేడ రెండవ అంతస్థులోని ఓ ఫ్లాటులోనే వుంటున్నారు వారు. రత్న ముందుగా వెళ్ళి, తలుపులు బార్లా తెరచి;

'లోపలికి రండి' అంది.

రమేష్ తడబడుతూ లోపలికి అడుగుపెట్టాడు.

రత్న మందులూ, అవీ వుంచిన ఓ గదికి రమేష్‌ని తీసుకునివెళ్ళి;

'ప్రస్తుతానికి ఇదే మీ గది. ఇల్లు చాలాచిన్నది. మీరు దేనికీ

సంకోచపడకండి. నాకు వుపచారం చేయటంరాదు. ఇది మీ ఇల్లే అని అనుకోండి' అంది.

రమేష్ మాట్లాడలేదు.

'నీళ్ళు కాగాయి. స్నానం చేయవచ్చు' అంటూ రత్న ఇవతలికి వచ్చేసింది.

రమేష్ స్నానం చేశాడు.

'మీరు భోజనానికి లేవండి' అంది రత్న.

'శేషగిరిని కూడా రానివ్వండి.'

'ఆయనకోసం కాచుకుంటే లాభంలేదు. తీరిక చిక్కినపుడే వస్తారు. ఒక్కోరోజు రానే రా రసలు. మీరూ రాత్రి రైల్లో సరిగ్గా నిద్రపోయి వుండరు. భోంచేసి పడుకోండి.'

రమేష్‌కి ఏంచెప్పాలో తోచలేదు.

'మీరు భోంచేయకపోతే, నేను చెయ్యటానికి వీల్లేదు.'

రమేష్ ఇక మాట్లాడకుండా భోజనానికి కూర్చున్నాడు.

ఆమె అన్నిమాటలు మాట్లాడినా, తనేమీ మాట్లాడలేక పోతున్నందుకు బిడియపడ్డాడు రమేష్.

ఏమని పలకరించటం?

ఆమెకో కూతురుండాలి కదూ! కూతురో, కొడుకో?

అనుమానంతో చుట్టూ చూశాడు రమేష్. బట్టల స్టాండ్ మీద పువ్వుల ఫ్రాక్ కనిపించింది.

'మీ అమ్మాయేది?'

'బడికి వెళ్ళింది.'

అంతే! ఇహ ఏం మాట్లాడాలో అతనికి తోచలా. సంకోచంతో సరిగ్గా భోంచెయ్యలేకపోయాడు. ఆమె మాత్రం...

'నాకు సరిగ్గా మర్యాదలు చెయ్యటం రాదు' అంటూనే వడ్డించింది.

అతడు భోంచేస్తుండగానే హాల్లోని ఫోన్ మోగింది. రత్న వెళ్ళి రిసీవర్ తీసుకుంది. మాట్లాడివచ్చి;

'ఆయన ఫోన్ చేశారు. మిమ్మల్ని గురించే అడిగారు. ఇంకో అర గంటలో వస్తున్నారట' అంది

రమేష్ మాట్లాడలేదు. భోజనానికి ఇంకో అరగంట ఆగితే బావుండేది కదా అనిపించకపోలేదు. భోజనమయ్యాక తన గదిలోకి వెళ్ళాడు.

'ఈ గదినిండా మందుల వాసన బాగా నిండిపోయింది. మీరు కాబోయే డాక్టరేగా! ఏం ఫరవాలేదనుకుంటాను' అంటూ ప్రక్క సరిచేసి బైటికి వెళ్ళిపోయింది రత్న.

రమేష్ పక్కమీద పడుకుని అక్కడే పడివున్న మెడికల్ జర్నలొకటి చేతిలోకి తీసుకున్నాడు.

రత్న, రమేష్ క్షేమంగా వచ్చి చేరినట్టు సుశీలమ్మగారికి ఉత్తరం రాసి పని కుర్రాడి చేతికిచ్చి పోస్టు చేయించింది.

అరగంట భర్తకోసం కాచుక్కూర్చుంది. అతడు రాకపోయేసరికి తను భోజనం చేసేసి మళ్ళీ మధ్యాహ్నపు టిఫిన్ ప్రయత్నంలో వుండగా కారు హారన్ వినపడింది.

శేషగిరి లోపలికొచ్చాడు.

'రమేష్ ఏడి! భోంచేశాడా?'

'ఆఁ, మీరు కాళ్ళు కడుక్కోండి.'

'అతడిని పలుకరించి వస్తాను' అంటూ గది తలుపులు తెరిచాడు శేషగిరి.

రమేష్ నిద్రపోతున్నాడు.

'హల్లో!' అన్నాడు శేషగిరి.

'నిద్రపోతున్నారు. మీరు భోంచేద్దురుగాని రండి. అతడిని చూస్తే ఎన్నోరోజులుగా నిద్రే లేనట్టుగా వుంది' అంది రత్న.

శేషగిరి తలుపు ముందుకువేసి వచ్చేశాడు.

రమేష్ నిద్రలేచేసరికి సుమారు ఐదుగంటలయింది. అతడు పడుకొన్న గది వీధివైపు ఉండటంవల్ల కార్లూ, ట్రాములూ, బస్సుల సందడి విపరీతంగా వినిపిస్తోంది. శేషగిరి ఇల్లు మెయిన్‌రోడ్డులో వుండటంవల్ల బస్సులు ఆగటం, వెళ్ళటం అన్నీ తెలుస్తున్నాయి రమేష్‌కి.

వెంటనే మైసూరులోని తన గది గుర్తుకొచ్చిందతనికి. ఆ ప్రశాంత వాతావరణాన్ని తల్చుకుంటున్నాడు.

బాల్కనీలో యిద్దరు పిల్లలు మరాఠీలో మాట్లాడుతున్నారు. తన

కర్థంగాని భాషను వింటూ అలాగే పడుకున్నాడు రమేష్. క్రమంగా ఆ పిల్లల సంభాషణ తారస్థాయి నందుకుంది.

అంతలోగా లోపలనుండి మధురకంఠ మొకటి వినబడింది.

'ఆశా...'

'ఏమిటమ్మా?'

'గట్టిగా కేకలు పెట్టకు. మామయ్య పడుకున్నారు.'

'ఏ మామయ్య?'

'పడుకున్నారుగా, లేచాక చూద్దువుగానిలే.'

'ఉహూ! ఇపుడే చూడాలి.'

'వద్దమ్మా, అరవకుండా ఆడుకోండి.'

వాళ్ళమాటలు మళ్ళీ వినిపించలేదు. కాస్సేపు అలాగే పడుకుని తరువాత లేచి బయటికి వచ్చాడు రమేష్.

చాలాసేపు నిద్రపోయినందువల్ల అతడికళ్ళు ఎర్రగా బరువుగా ఉన్నాయి.

రత్న కూతురికి జడవేస్తూ, ఆ చిన్నపిల్లతో మరాఠీలో మాట్లాడుతోంది. రమేష్ బయటికి రావటంచూసి,

'నిద్ర పట్టిందా? ఇక్కడంతా ఒకటేగోల' అంది.

'బాగానే నిద్రపోయాను. డాక్టర్ వచ్చారా?'

'ఆఁ వచ్చారు. మళ్ళీ ఇపుడే పది నిముషాలవుతోంది, బయటకు వెళ్ళారు. మళ్ళీ ఏడుగంటలకు వస్తారట. రండి! మీరు టిఫిన్ తీసుకుందురు గాని.'

ఆశా కళ్ళు పెద్దవి చేసుకుని రమేష్ వైపే చూస్తోంది.

'అమ్మా! మామయ్యేనా?'

'అవునమ్మా.'

ఆశా మళ్ళీ కుతూహలంతో మామయ్య వైపు చూస్తోంది. రమేష్‌కి పాపతో ఏమయినా మాట్లాడాలనిపించింది. కాని చిన్నపిల్లలతో మాట్లాడే అలవాటే లేదతనికి. ఇంట్లో తనే చిన్నపిల్లాడు కనుక అందరూ తన్నే కుర్రవాడిని చేసి మాట్లాడించేవారు. ఆఖరికి ఎంతో ప్రయత్నంమీద,

'బడి వదిలిపెట్టారా?' అన్నాడు.

'ఓ!'

మళ్ళీ ఇంకేం మాట్లాడాలో తోచక రమేష్ ఊరుకున్నాడు.

రత్న టిఫిన్, టీ తెచ్చి రమేష్ ముందుంచింది.

'ఎందుకండి ఇవన్నీ?'

'అలా అనకండి. ముందు తీసుకోండి.'

రమేష్ టీ తాగి లేచేసరికి శేషగిరి వచ్చాడు. రాగానే కరస్పర్శ చేసి;

'కృష్ణ ఎలా ఉన్నాడు? నువ్వెందుకిలా చిక్కిపోయావ్? టిఫిన్ తీసుకున్నావా? బయటికెక్కడికయినా వెడదామా?' అంటూ, ప్రశ్నల వర్షాన్ని గుప్పించేశాడు రమేష్ మీదకు. కాని వాటికి జవాబులు ఆశించే స్వభావం కాదతనిది.

'వెడదాం. కాని, నా వల్ల మీ పనులకు ఆటంకం కలగకుండా వుండాలి!' రమేష్ సంకోచంతో అన్నాడు.

'నా పనికెప్పుడూ కష్టం కలిగించుకోను నేను. నా క్లినిక్కే పోదాం పద.'

'నాన్నా, నేనూ?' ఆశా రాగం తీసింది.

రమేష్, శేషగిరి, ఆశా ముగ్గురూ గిరిగాంన్‌లో వున్న శేషగిరి ఫార్మసీకి బయలుదేరారు.

రమేష్ కారులో కిటికీ దగ్గర కూర్చుని సంధ్యా వెలుగు ఆవరించిన బొంబాయి వీథులను చూస్తున్నాడు.

మూడు, నాలుగు అంతస్థులుగల ఇళ్ళు మొదట కనిపించాయి. ఒకే మూసలో పోసినట్టున్న ఆ భవనాలలో అందంకాని, వైవిధ్యంకాని, విస్పష్టతకాని కనిపించలేదు. చక్కటి నలుపునుండి తయారు చేసినట్టున్న పూరిపాకలు, వాళ్ళ వంటింట్లోని రేకు డబ్బాలు, జానెడు చోట్లో గాలి కోసం బాల్కనీలో కూర్చున్న ఆడవాళ్ళు, చెట్టు చేమ ఆఖరికి గడ్డికూడా మొలవని పార్కు అనిపించుకుంటున్న చోట్లలో ఆడుకుంటున్న పిల్లలు-అంతా చూశాడు రమేష్.

ఎన్నిభాషలు ఎన్ని వేషాలు? అక్కడ లేనిదేమిటి? ఓ చిన్న ప్రపంచాన్నే ఇముడ్చుకున్నట్టుంది బొంబాయి రమేష్ కళ్ళకు.

శేషగిరి ఫార్మసీ ముందు కారు ఆగినపుడు రమేష్ ఈ లోకంలోకి పడ్డాడు. డాక్టరు రాకకోసం ఎదురుచూస్తున్న రోగులు శేషగిరిని చూడగానే లేచి నమస్కారం చేశారు.

శేషగిరి రమేష్‌ని ఓ కుర్చీలో కూర్చోమని తనపనిలో పడ్డాడు. అన్నీ మరిచి తన్మయత్వంతో తనపని చూసుకుంటున్న శేషగిరిని చూసి రమేష్ అనుకున్నాడు, 'ఇతను మంచి డాక్టరు.'

శేషగిరికి రాని భాషలేదు. రోగులతో ఎవరి భాషలో వాళ్ళతో తడుముకోకుండా మాట్లాడేవాడు. అరగంట కాక మునుపే ఆశకు విసుగెత్తింది. తండ్రి దగ్గరకు వెళ్ళి,

'నాన్నా నేను ఇంటికి వెడతాను' అంది.

'ఎవరితో వెడతావ్?'

'మామయ్యతో.'

ఇంకా అపుడే బొంబాయిలోకి అడుగుపెట్టిన రమేష్‌తో ఆశను పంపేంత ధైర్యం కలగలేదు శేషగిరికి. అదీగాక, రమేష్ నిరాసక్తి, పరధ్యానాన్ని శేషగిరి కూడా గమనించాడు.

# 7

శేషగిరి కాంపౌండర్‌ని తోడిచ్చి వాళ్ళిద్దరినీ ఇంటికి పంపాడు. రమేష్, ఆశా ఇంత తొందరగా ఇంటికి వస్తారని రత్న అనుకోలేదు. రాత్రి వంట పూర్తిచేసుకుని రేడియో వింటూ కూర్చుంది.

'అమ్మా...'

ఆశ గొంతు విని, 'ఏమిటి ఇంత తొందరగా వచ్చేశారు?' అంది.

'ఆశకు అక్కడేమీ తోచలేదు. ఇంటికి వెళ్ళిపోదామంటే, వచ్చేశాం' అంటూ రమేష్ అక్కడే ఉన్న ఓ కుర్చీలో కూర్చున్నాడు. ఆశ తన మరాఠీ స్నేహితురాలికోసమని పరిగెత్తింది.

రమేష్ మౌనంగా కూర్చున్నాడు. ఆ నిశ్శబ్దతను భరించలేక రత్న,

'మీరు చాలా చిక్కిపోయారు' అంది.

'లేదు.'

'నేనామాత్రం తెలుసుకోలేనా ఏం? మీరు ఇక్కడి నుండి వెళ్ళే లోపల మామూలుగా కావాలి.'

'వీల్లేదు! అసంభవం...' రమేష్ గట్టిగా అరిచాడు.

రత్న చిరునవ్వు నవ్వింది.

'మనసుకు మించిందిలేదు. మనం అవుతుందనుకుంటే అవుతుంది; కాదనుకుంటే కాదు. అంతే.'

'నేను నమ్మను.'

'మీరు కాబోయే డాక్టర్. ఇలా అన్నిటికీ వీల్లేదు, అబద్ధం అంటే ఎలా? చనిపోతున్న రోగిలోకూడా ఆశాభావాన్ని రేకెత్తించడం మీ కర్తవ్యం. అలాంటప్పుడు మీ స్వవిషయంలోనే ఇలా నిరాశ చెందడం న్యాయం కాదు.'

'నేను డాక్టర్ని కాను.'

'నిజం? నేను మైసూరు వచ్చినప్పుడు మీరు ఫైనల్ ఇయర్, ఎం.బి.లో ఉన్నారని విన్నానే.'

'నిజమే కాని, నేను ఇపుడు చదవటంలా. చదువు పూర్తి చేస్తానన్న నమ్మకంకూడా లేదు.'

'ఏం?'

'ఈ డాక్టరీ కేవలం నటన. బ్రహ్మ మనకు ఇవ్వని ఆయుష్షు మాత్రం ఏ డాక్టరూ పోయలేడు. ఈ వృత్తి, మందులూ, సర్జరీ-అంతా వట్టిబూటకం.'

తన మాటలకు తనే ఆశ్చర్యపోయాడు రమేష్. తను ఇన్ని మాటలు మాట్లాడింది తన స్నేహితుల ముందుకాదు. ఇంచుమించు అపరిచితురాలయిన స్త్రీ ముందు. అతడికే ఆశ్చర్యం వేసింది. తనేనా ఇన్ని మాటలు మాట్లాడింది?

'నిజంగా?' అంటూ రత్న కళ్ళు పెద్దగా చేసుకుని నవ్వింది.

'నా మాటల్లో నమ్మకం లేదా మీకు? ఉన్నదున్నట్టే చెప్పాను.'

'నిజంగా? కాని, ఇంత తొందరగా ఏ నిర్ణయానికి రాకండి.'

'నే నలా తొందరపడి నిర్ణయానికి వచ్చే మనిషినికాను. ఇది స్వానుభవంతో చెపుతున్న విషయం.'

రత్న పరీక్షగా రమేష్ వైపుకు చూసింది.

పొడుగ్గా పెరిగాడు రమేష్. నిజమే, కాని మొహంలో మునుపటి అందమూ, ఠీవి లేవు. మునుపటిలా తన డ్రస్సు విషయంలో శ్రద్ధకూడా లేదు. సరిగ్గా దువ్వుకోని వుంగరాలజుట్టు నుదుటిమీదకు పడుతోంది. వయసుకు మించిన గాంభీర్యం అతడికి వింతకాంతి నిచ్చింది.

'అనుభవమా! ఇంత చిన్న వయస్సులో మీ కెలాంటి అనుభవం?'

'అనుభవానికి వయస్సే కావాలా?' రమేష్ ఎదురు ప్రశ్నవేశాడు.

'ఎలాంటి అనుభవం అన్నది వయస్సునుబట్టే వుంటుంది. ఇపుడు మీకు కాలేజీ అనుభవాలు తప్ప మరేమీ అయ్యే అవకాశంలేదు. కాని, మీ నాన్నగారికి విషాదకరమైన అనుభవాలు అయి వుండవచ్చు...'

'పొరపడుతున్నారు మీరు. చిన్న వయస్సయినంత మాత్రాన విషాదకరమైన అనుభవాలు అయి వుండరాదా? ఎందుక్కాకూడదు?' వుద్వేగంతో నోటమాట పెగల్లేదు రమేష్‌కి.

'కాని...'

'దయచేసి ఈ విషయం ఇహ మాట్లాడకండి. ప్లీజ్!' రమేష్ బతిమాలుకుంటున్నట్టు అన్నాడు.

రత్న మాట ఆపేసి అతని వంక చూసింది.

వుద్వేగంతో అతడి మొహం ఎర్రబడింది. పెదిమలు అదురుతున్నాయి. అతడు ఇంత వుద్వేగపడతాడని రత్న వూహించలేదు.

'మిమ్మల్ని నొప్పించానా? క్షమించండి' అంది రత్న పశ్చాత్తాపంతో.

'క్షమించాల్సినంత పెద్ద తప్పేమీ చెయ్యలేదు మీరు' అంటూనే రమేష్ లేచి నిల్చుని;

'అలా తిరిగివస్తాను' అంటూ బయటికి వెళ్ళిపోయాడు. రత్న అతని వెనుకనే గబగబా మెట్లుదిగి వచ్చి;

'మాట...' అంది.

చకచకా మెట్లు దిగుతున్న రమేష్ వెనుదిరిగి ఏమిటన్నట్టు చూశాడు.

'మీకు ఈ ఊరు ట్రాఫిక్‌తో పరిచయం లేదు. ఒక్కోసారి మేమే తికమకపడిపోతాం. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్త సుమండీ.'

రమేష్ మాట్లాడకుండా దిగి వెళ్ళిపోయాడు.

రత్న యోచనా క్రాంతురాలై ఇంట్లోకి వచ్చింది.

రమేష్ పరధ్యానాన్ని రత్న సూక్ష్మమైన కళ్ళు గమనించాయి. కనుకనే అతను వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా వుండమని హెచ్చరించటం మరచిపోలేదు.

అనవసరంగా అతడి మనసు నొప్పించానేమోనని బాధపడుతోంది రత్న మనసు. అలాగే కూర్చుండి పోయింది.

ఆశా ఇంటికి వచ్చి పలకరించినపుడే ఆమె ఈ ప్రపంచంలో పడింది. లేచి, ఆశకు అన్నంపెట్టి పడుకోబెట్టింది. తను పుస్తకం చేతికి తీసుకుని కూర్చుంది.

రాత్రి తొమ్మిదిన్నర దాటినా, రమేష్ రాకపోయేసరికి రత్న కంగారు పడింది.

తన మాటలతో అతడి మనస్సు అల్లకల్లోలమయి వుంటుంది ఇహ- ట్రాములు, బస్సులు తిరిగే ఆ మెయిన్‌రోడ్డు గుర్తుకొచ్చేసరికి భయంతో ఆమె హృదయం కంపించింది.

రమేష్ ఇంకా ఇంటికి రాకపోవటానికి కారణమేమిటి?

రత్న బాల్కనీలో నిల్చొని బయటకు చూసింది. రాత్రి తొమ్మిదిన్నర దాటినా, సందడి మాత్రం తగ్గలేదు.

ట్రాములూ, బస్సులు నిలకడలేకుండా తిరుగుతున్నాయనిపించింది. రత్నకు ఎదురుగా వున్న మద్రాసీ హోటలులోని మేనేజర్ "పాన్" వేసుకుంటూ కూర్చున్నాడు.

రత్న లోపలకు వచ్చింది. తను వచ్చిన అయిదు నిముషాల్లోనే రమేష్ కూడా వచ్చాడు.

'అబ్బ, వచ్చారా! మీరు ఎంతకీ రాకపోయేసరికి ఎంత కంగారు పడ్డానని...'

'కంగారెందుకు?'

'ఈ ట్రాఫిక్ సందడీ అదీ మీకంతగా అలవాటు లేదు.'

'అంత సుఖవుగా నేను చావనులెండి.'

మళ్ళీ మాటలు ఆ విషయంవైపుకే వెడుతున్నట్టు కనిపించింది రత్నకు. మాట మారుస్తూ:

'ఎందాకా వెళ్ళారు?' అంది.

'మాతుంగా మార్కెట్‌కు వెళ్ళి వచ్చాను' అంటూ జేబులోంచి బిస్కెట్ ప్యాకెట్ తీసి,

'ఆశా ఏదీ?' అన్నాడు.

'పడుకుంది.'

'తరువాత ఇదివ్వండి.'

రత్న ప్యాకెట్టు విప్పి రెండు బిస్కట్లు రమేష్‌కి ఇచ్చింది.

'ఆశకు బదులు ఇప్పుడు మీరు తినండి.'

వద్దనలేక పోయాడు రమేష్.

'భోంచేస్తారా?'

'డాక్టర్‌గారినికూడా రానివ్వండి' అన్నాడు రమేష్.

శేషగిరి రాగానే అందరి భోజనాలూ అయ్యాయి. శేషగిరి రమేష్‌తో కబుర్లకు దిగారు.

'ఏం చేస్తావయ్యా ఇకముందు? వచ్చే సంవత్సరం పరీక్షకు కడతావా?'

రమేష్‌కి ఏ విషయమైతే అక్కర్లేదో, అదే విషయం మాటల్లోకి వచ్చింది.

'చూడాలి. నేనింకా ఏదీ నిశ్చయించుకోలేదు.'

'వద్దులే. అదేం బెంగపెట్టుకోకు. కొన్నిరోజులు ఇక్కడ హాయిగా వుండు. నేనూ మీ అన్నయ్యే అనుకో. నా పనుల ఒత్తిడివల్ల నేను నీతో ఎక్కువసేపు గడపలేకపోవచ్చు. కాని, రత్న వుంటుంది. ఏ సంకోచమూ పెట్టుకోకు.'

రమేష్ ఏం చెప్పాలో తోచక వూరుకున్నాడు.

శేషగిరి ఇక పడుకుందా మనుకునేసరికి డోర్‌బెల్ మ్రోగింది. తనే వెళ్ళి తలుపు తీశాడు. వాళ్ళతో మాట్లాడి లోపలకువచ్చి:

'రత్నా! నేను డాంగే ఇంటికి వెళ్ళి వస్తాను. తలుపేసుకో' అని చెప్పి రమేష్‌తో;

'పడుకోవయ్యా; నాకోసం కాచుకూర్చోకు' అని చెప్పి, తన మందులపెట్టె తీసుకుని వెళ్ళిపోయాడు.

'నిద్ర వస్తోంటే పడుకోండి' అంది రత్న.

'మధ్యాహ్నం బాగా నిద్రపోయానేమో; ఇప్పుడు నిద్రరావటంలా. మీరు పడుకోండి. డాక్టర్ వస్తే నేను తలుపు తీస్తాను.'

రత్న వెళ్ళిపోయింది. రమేష్ లైటు ఆర్పేసి బాల్కనిలో నిల్చుని నక్షత్రాలు లెక్కపెట్టసాగాడు.

శేషగిరి వచ్చేవరకు అలాగే రాతిబొమ్మలా ఆకాశం వైపుకుచూస్తూ నిల్చున్నాడు రమేష్. శేషగిరి రాగానే తలుపు తీసి తన గదికి వెళ్ళి పడుకున్నాడు. అతడి మనసు ఆలోచనలతో వూగిపోతోంది.

నేను ఎందుకు వచ్చానిక్కడికి? ఊరు విడిచి పారిపోతే, మనసులో అగ్ని చల్లారుతుందా? ఎంత పొరపాటు - ఆలోచనలతోనే తెల్లవారింది.

ఉదయం కాఫీ తాగేటప్పుడు శేషగిరితో అన్నాడు.

'నేను ఈరోజు వెళ్ళిపోతాను.'

బ్రెడ్డు తింటున్న శేషగిరి ఆశ్చర్యంతో తలెత్తి చూసి 'ఏమిటీ?' అన్నాడు.

'నేను ఊరికి వెళ్ళిపోదామని...'

'నిన్ననే వచ్చావ్, ఈ రోజు వెళ్ళిపోతావా?'

'ఆ!'

'బొంబాయి చూడవా?'

'ఏముంటి చూడటానికి? ఒకటే సందడి.'

'నువ్వు ఇప్పుడప్పుడే వెళ్ళలేవు!' ఖచ్చితంగా చెప్పాడు శేషగిరి.

'ఏం?'

'మళ్ళీ నేను వెళ్ళమనేవరకూ ప్రయాణం మాట తలపెట్టకు' అంటూ వెళ్ళిపోయాడు శేషగిరి.

రమేష్ నిస్సహాయంగా రత్నవైపు తిరిగాడు. ఆమె ఏమీ మాట్లాడ లేదు.

'నేను వెడతాను.'

'ఇంత త్వరగానా? మీకిక్కడ కష్టంగా ఉందా?'

దీనికేమని జవాబు చెప్పాలో తోచలేదు రమేష్‌కి.

'కష్టమనికాదు; నేను మీకంతా 'న్యూసెన్సు'గా ఉన్నానని పిస్తోంది. ఊరికి వెళ్ళిపోదామని ఉంది. వెడతాను-అంతే.'

'మా కంపెనీ అంత తొందరగా విసుగనిపించిందా?'

'అలా కాదు-'

'ఇప్పుడు పంపలేం మిమ్మల్ని. సాయంత్రం సముద్రతీరానికి వెడ దాం. సముద్రం చూడాలని లేదూ?'

'దాన్నెందుకూ చూడటం?'

'చూసి తీరాల్సింది సముద్రం. ప్రయాణంమాటే తలపెట్టకండి.'

రమేష్‌కి కోపం, దుఃఖం పొంగివచ్చాయి. శేషగిరి ముందు మాట్లాడాలంటే, సంకోచం అడ్డువచ్చేది. ఎందుకోగాని, రత్నదగ్గర సంకో చం లేకుండా మనసువిప్పి మాట్లాడగలిగేవాడు.

'అయినా మధ్య మీదేమిటి బలవంతం నా ప్రయాణానికి?'

పనిచేసుకుంటున్న రత్న వెనుదిరిగి చూసి,

'ఎలా వెడతారో వెళ్ళండి చూద్దాం' అంది.

'అలాకాదు; నన్ను పంపేయండి.'

'పంపక మిమ్మల్ని ఇక్కడే అట్టేపెట్టుకుంటామనుకున్నారా? తప్పకుండా పంపుతాం. అన్నట్టు ఇక్కడి వంట నచ్చిందా మీకు?'

'ఏదో ఒకటి ఆకలవుతుంది కాబట్టి తినాలి, అంతే! నేను అలా తిరిగివస్తాను.'

'చాలా ఎండగా ఉంది. అనవసరంగా ఇప్పుడెందుకూ వెళ్ళటం? నిన్నటిలా నన్ను భయపెట్టకండి.'

'నిన్న మిమ్మల్ని భయపెట్టానా?'

'అవును. నేనన్న మాటలకు అసలే మీరు నొచ్చుకున్నారు.

అందుకే అంత భయపడ్డాను. ఇంకా స్నేహితులో మీరు రాకపోయినట్టయితే నేనే వెతుక్కుంటూ వచ్చేదాన్ని. ఈ రోజు మాత్రం ఇలా చేయకండేం.'

'లేదు' అన్నాడు రమేష్

తను పొద్దుకు సరిగ్గా ఇంటికి వస్తేనేం. రాకపోతేనేం? ఎందుకంత పట్టించుకోవాలి అనుకున్నాడు రమేష్.

సాయంత్రం దాదర్ బీచికి వెళ్ళటానికి సిద్ధమయింది రత్న. రాత్రి వంట తొందరగా పూర్తిచేసుకుని ఆశకు మంచి గుడ్డలు వేసి, తనూ చీర మార్చుకుని రమేష్ గదిలోకి వచ్చి,

'వెడదామా?'

'పదండి.' రమేష్ ఎలా ఉన్నాడో అలాగే బయల్దేరాడు.

'మీరింకా తయారవలేదు.'

'ఇలాగే వస్తాను.'

ఏమో చెప్పాలనుకున్న రత్న, ఆ ప్రయత్నం మానుకుని, తలుపుకి తాళంవేసింది. ముగ్గురూ బయల్దేరారు.

'బస్సులో వెడదామా? నడిచే వెడదామా?'

రమేష్ బదులు చెప్పకముందే ఆశా,

'బస్సులో వెడదామమ్మా' అంది.

వాళ్ళు బీచి చేరేసరికి సుమారు ఆరుగంటలయింది. మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే సముద్రపు గాలికోసం జనం గుంపులు గుంపులుగా వస్తున్నారు.

ఇసుకలోకి అడుగు పెట్టగానే, ఆశా ఆనందంతో గంతులేసింది. ఇసుకలో నుండి ఆల్చిప్పలు, శంఖాలు ఏరి, దాచమని తల్లి చేతికిచ్చింది.

రత్న ఇసుకమీద కూర్చుంటూ రమేష్‌తో,

'నేనిక్కడే కూర్చుంటాను. కావాలంటే మీరు అలా తిరిగి రండి' అంది.

'అక్కర్లేదు, నేనూ ఇక్కడే కూర్చుంటాను' అంటూ, తనూ కూర్చున్నాడు.

ఆశ గంతులేస్తూ నీళ్ళ దగ్గరకు వెడుతూంటే రత్న:

'నీళ్ళదగ్గరగా వెళ్ళకు' అని కేకవేసింది.

'అలలు చూస్తాను' అంది ఆశా.

'దూరం నుండే చూడు; దగ్గరగా వెళ్ళకు.'

రమేష్ చేతివేలితో ఇసుకమీద గీతలు గీస్తూ కూర్చున్నాడు.

సముద్రుడు ఆనందంతో ఉప్పొంగుతున్నట్టు అలలు ఎగిరెగిరి పడుతున్నాయి. నీలిరంగు అలలు ఒకదాని వెనకొకటి తరుముకొంటూ, ఒడ్డుని చేరక మునుపే నవ్వుల పువ్వుల్ని వెదజల్లినట్లు, నీటిని విరజిమ్మి అతి వేగంగా వెనక్కు వెళ్ళిపోతున్నాయి.

అస్తమిస్తున్న సూర్యుడి సంధ్యాకిరణ కాంతి పరిగెడుతున్న తెలి మబ్బులమీద ప్రతిఫలించి బంగారు తునకలను నీలాకాశంలోకి విసిరేసి నట్టు కనిపింప చేస్తున్నది.

ఉప్పునీళ్ళతో చేదుమాత్రను మింగినట్టు ఘోషపెడుతున్న అలలను జుగుప్సతో చూశాడు రమేష్. సముద్రంలో సౌందర్యం కాని, రమణీయత కాని కనిపించలేదతనికి.

'ఎలా ఉంది సముద్రం?' రత్న అడిగింది.

'నేను సముద్రాన్ని చూడటం ఇదే మొదటిమారు. కాని, నాకేమీ ఆశ్చర్యంగా లేదు. కొత్తగా అనిపించటమూలేదు.'

'మీరు ఎక్కువగా ఇంగ్లీష్ పిక్చర్స్ చూస్తారా?'

రత్న ప్రశ్నవిని తలెత్తి ఆమెవైపు చూశాడు రమేష్. చేతిలో చెయ్యివేసుకొని నడుస్తున్న జంటను తదేకంగా చూస్తోంది రత్న.

గతించిన మధుర స్వప్నాల తియ్యటి స్మృతి ఆమె కనురెప్పల వెనుక దాగివుంది.

'అవును. ఇంగ్లీషు సినిమాలు చూస్తాను. అలా అడుగుతున్నారేం?'

'సముద్రం మీకు క్రొత్తగా కనిపించటం లేదన్నారుగా. అందుకు చెబుతున్నా. వెన్నెల రాత్రిలో ఓసారి ఇక్కడికివచ్చి చూడండి. అప్పుడు మీకు సముద్రపు పరిపూర్ణ సౌందర్య దర్శనం కలుగుతుంది.'

'సౌందర్యానికి మీరంత ప్రాధాన్యత నిస్తారా?'

'ఎవరయినా అంతేకదా. సముద్రాన్ని చూడాలని ఎంతో మంది వస్తారు: కాని, బురదనీళ్ళను చూడాలని ఎవరయినా వెడతారా? పున్నమి వెన్నెలలో బాల్కనీలో గంటలకొద్దీ కూర్చుంటాం. అదే అమావాస్య చిమ్మ

చీకటిని చూడాలనీ ఎవరయినా ఉవ్విళ్ళూరుతారా?' అంది రత్న, దూరంగా వెడుతున్న దంపతులమీదనే దృష్టిని కేంద్రీకరించి.

'పూర్ణిమ ఇంకో ముఖమేకదా అమావాస్య?'

'నిజమే కాని, లోకులు వెతికేది ఒక్క ముఖంకోసం మాత్రమే.'

'నేను మీతో ఏకీభవించలేను. వికారమన్నది ఈ ప్రపంచంలో లేనేలేదు. సృష్టిలో ప్రతి వస్తువుకూ ప్రత్యేక సౌందర్యముంటుంది. అమావాస్యరాత్రి నలుపు పూర్ణిమ కెక్కడి నుండి వస్తుంది?'

రత్న పరధ్యానంగా 'అదీనిజమే' అంది.

రమేష్ వేళ్ళు ఇసుకలో గీతలు గీస్తున్నాయి. రత్న అటు వైపు చూసి,

'మీరు డాక్టరవరని అన్నారుకదూ?'

'అవును!'

'కాని మీరు తప్పకుండా డాక్టరవుతారు. కావాలంటే నేను రాసిస్తాను.'

'నేను చదువు పూర్తిచెయ్యకూడదనుకున్నాను కదా; డాక్టర్నెలా అవుతాను?'

'మీరు చదివి తీరుతారు.'

'ఎలా చెపుతున్నారు మీరు?'

రత్న ఇసుకలో రమేష్ గీసిన బొమ్మవైపు చూసింది. రమేష్ మాట్లాడుతూనే, ఇసుకమీద మనిషి అస్థిపంజరపు బొమ్మ గీశాడు.

'మీ మనసులో, రక్తపు ప్రతీకణంలోనూ డాక్టరు కావాలనే కాంక్ష నిండి ఉంది. తాత్కాలికంగా, ఆ కాంక్షమీద ఉదాసీనత తెరపడింది. అంతే.'

తప్పుచేస్తూ దొరికిపోయిన కుర్రాడిలా గబుక్కున బొమ్మ చెరిపేసి కొంచెం కోపంతో,

'నా ప్రతి కదలికనూ అంతగా గమనిస్తున్నారెందుకూ?' అన్నాడు.

'అది నా స్వభావం.'

పగలల్లా మబ్బులతో వసంతాలాడి అలసిపోయిన సూర్యుడు సముద్రంలోకి దుముకబోతున్నాడు.

జన సందడికూడా ఎక్కువగానే వుంది.

'ఆశా...ఆశా ఏది?'

రమేష్ చుట్టూ చూశాడు. కొంచెం దూరంలో కూర్చున్న గుజరాతి దంపతుల కుర్రాడొకడు జూలు కుక్కతో ఆడుకుంటున్నాడు. అతడు నీటిలోకి విసిరేసిన బంతిని కుక్క నోట్తో పట్టుకుని తెస్తోంది.

చీకటి వెలుగుస్థానాన్ని ఆక్రమించుకుంటోంది. తినుబండారాలు అమ్మేవాళ్ళ పెట్రోమాక్సు దీపాలుమట్టుకు అక్కడక్కడా వెలుగుతున్నాయి. చీకటి మందంగా అవుతున్నకొద్దీ సముద్రపు హోరు ఎక్కువ కాసాగింది.

రత్న తన చేతి వాచిని కళ్ళదగ్గరగా పెట్టుకునిచూసి:

'ఇక వెడదామా?' అంది.

'ఊఁ'

ఇద్దరూ లేచి, గుడ్డలకు అంటుకున్న ఇసుకను విదలించుకున్నారు.

'ఆశా, రామ్మా వెడదాం.'

ఆశ పరుగెత్తుకుంటూ వచ్చింది. ముగ్గురూ ఇంటికి బయల్దేరారు.

దోవలో బీచికి దగ్గరనే వున్న స్విమ్మింగ్ఫూల్ను చూపించింది రత్న రమేష్కి.

'నీకు ఈతవచ్చా మామయ్యా' అని అడిగింది ఆశా.

'ఊఁ. నేలమీదే ఈతకొడతాను' అన్నాడు రమేష్.

రమేష్తో తిరగటానికి శేషగిరికి తీరికుండేదికాదు. ఉదయంనుండి రాత్రివరకూ ఫార్మసీలోనే వుండవలసివచ్చేది. ఇంటికొచ్చిన తరువాత కూడా ఎవరయినా వెతుక్కుని వచ్చేవారు.

బొంబాయి చూడటానికి రమేష్కిగైడ్ అవసరమేమీలేదు. కావాలనుకున్న చోటికి వెళ్ళిరాగలడు. కాని, అతడి మనసులోని వ్యథ, పరధ్యానం, వుదాసీనతలను గమనించిన రత్నకు అతడిని ఒంటరిగా పంపాలంటే భయంగా వుండేది. ఉదయం వంటపనీ అవీ వుండేవి కనుక వెళ్ళలేకపోయేది. సాయంకాలాలు వెళ్ళటానికి వీలుగా వుండేది. మొదటి రెండు

రోజులు ఆశా వెళ్ళటానికి వుత్సాహం చూపించి. తరువాత విసుగనిపించింది. తన మరాఠీ స్నేహితురాలితో ఆడుకోవటానికే ఇష్టపడింది.

ఒక సాయంత్రం ఆశకు తల దువ్వి పువ్వులుపెడుతూ, 'ఆశా! చౌపతికి వెడదాం ఏం?' అంది ఆమె.

'నేను రానమ్మా; రజినీ, నేను ఇక్కడే ఆడుకుంటాం' అంది ఆశా.

రత్నకేమో కూతుర్ని తనతో తీసుకెళ్ళాలనే వుంది; కాని, ఆశా రానని మొండికేసింది. సరే; ఇంట్లోనే ఆడుకోమని చెప్పి బయల్దేరింది రత్న.

'మీరెందుకు శ్రమపడతారు? నేను వెళ్ళిరాగలను!'

'ఒద్దు; నేనూ వస్తున్నా; ఒక్కరే వెళ్ళకండి' అని తాళం వేసుకుని వచ్చింది రత్న.

బస్సులో రత్న రమేష్ ప్రక్కనే కూర్చుంది. ఈ పద్ధతి అలవాటు లేని రమేష్, రత్న అలా కూర్చోగానే, సిగ్గుతో కుంచించుకుపోయాడు. అతడి సంకోచ ప్రకృతిచూసి రత్న నవ్వింది.

ఇంకో స్టాపులో ఒకసీటు కాళీకాగానే రత్న రమేష్‌తో:

'కావాలంటే అక్కడికి వెళ్ళికూర్చోండి' అంది.

'ఏం, ఇక్కడే బావుంది.'

'ఆహా, సంకోచపడితేనూ' అంటూ నవ్వింది రత్న.

రమేష్ మొదట్లో సంకోచపడినమాట వాస్తవమే. కాని, రత్న పక్కనకూచోగానే అతడి మనసు, శాంతి సమాధానాలతో తేలిక పడినట్లయింది. అతడి గుండెలమీద వున్న అగోచరమైన బరువు తనంతట తానే దిగిపోయినట్లనిపించింది.

'లేదు...లేదు...' అన్నాడతను.

'కావాలంటే నేను వెళ్ళి అక్కడ కూర్చుంటాను.'

'వెళ్ళండి మీకంత కష్టంగావుంటే.'

రత్న ప్రక్కకు తిరిగి అతడి మొహంలోకి చూసింది.

అతడి క్రాపు ఎప్పటిలా చెదిరిపోలేదు. శుభ్రంగా దువ్వుకున్నాడు. దుస్తులూ అంత అన్యాయంగా లేవు. కళ్ళలోని గాంభీర్యం మాత్రం అలాగే వుంది.

రత్న మనసు కొంచెం తేలికపడింది.

'డాక్టరయ్యేవారు ఇలా కోపించుకోరాదు. మీరే కోపించుకుంటే రోగుల గతేమిటి?'

'నేను డాక్టర్ని కాను! మీరు రోగులూ కాదు.'

'ఎప్పటికయినా మీరు డాక్టరవుతారు.'

'లేదు, ఎప్పటికీ కాబోనుకూడా.'

'నేనేమో ఎప్పుడయినా ఒకప్పుడు జబ్బుపడవచ్చు. అప్పుడు మీదగ్గరతప్ప మరెవరిదగ్గరా మందు పుచ్చుకోనంటే అపుడేం చేస్తారు?'

'నేను మందివ్వను.'

'వేచిచూస్తాను.'

'అలాగే.'

తరువాత వాళ్ళేమీ మాట్లాడుకోలేదు. చౌపతిబీచిలో దాదర్ బీచిలో కన్నా ఎక్కువమంది జనం వున్నారు. అపుడే చీకటిపడుతోంది. బీచిలో కూచున్నవాళ్ళకు మలబార్ హిల్స్‌లోని ఇళ్ళ దీపాలు దూరనక్షత్రాల్లా, నల్లటి బ్యాక్ గ్రౌండ్‌లో రమణీయంగా కనిపిస్తున్నాయి. అపుడపుడు, ఆరుతూ వెలుగుతూ కనిపిస్తున్న మోటార్ అడ్వర్టయిజ్‌మెంటు ప్రజల్ని ఆకర్షిస్తోంది.

ఎంతసేపయినా రత్న మాట్లాడకపోయేసరికి రమేష్‌కి విసుగనిపించింది. ఆమె మాటా పలుకూ, గాజుల గలగలకు అలవాటుపడిన అతడి మనసు వాటి అభావంతో వ్యాకులగ్రస్తమయింది.

'మాట్లాడరేం?' అన్నాడు రమేష్.

'ఏం లేదు.'

'ఏమిటి కారణం? చెప్పండి.'

'కొంచెం తలనొప్పిగా వుంది.'

'సారిడాన్ వేసుకోండి. అదే తగ్గిపోతుంది.'

'మందూ మాకూ అంతా ఒట్టి బూటకం. నేను ఎంతసేపు తలనొప్పి అనుభవించాలని వుందో అంతసేపు అనుభవించాల్సిందే; తప్పదు.'

రమేష్ చటుక్కున రత్నవైపు చూశాడు. రత్న అతడినే సూటిగా చూస్తోంది ఆమె కళ్ళలోని ప్రశ్నకు బదులు చెప్పలేక అటుతిరిగాడు.

'మాట్లాడరేం?' రత్న మళ్ళీ కదిలించింది.

'నేను చెప్పినట్టు వినేటట్టయితేనే మాట్లాడతాను.'

'చెప్పండి.'

'సారిడాన్ తీసుకోండి.'

'తలనొప్పితో బాధపడేది నేనేగా; మీ కెందుకొచ్చిన ఆరాటం?'

'రేపు మీరు మంచానపడితే రుచిరుచిగా వండిపెట్టేవాళ్ళుండరనీ...'

'ఎదురుగానే వుంది మద్రాసీ హోటల్. అక్కడ భోజనం చాలా బాగుంటుంది.'

'కాని, మీచేతివంట- రుచి దానికెలా వస్తుంది?'

'నిజంగా! భోజనంకోసమేనా? ఇంకేమిలేదా?'

'లేదు.'

'నిజంగా?'

రమేష్ కాస్సేపు వూరుకుని మళ్ళీ అన్నాడు:

'మీరు బాధపడటం నేను చూడలేను.'

'అంటే, నేను బాధపడుతూ వుండటం మీ కిష్టంలేదన్నమాటేగా?'

'అవును.'

'అయితే మీరే సారిడాన్ తెచ్చిపెట్టండి.'

రమేష్ చిక్కుల్లోపడ్డాడు. రత్న ఇంత తొందరగా తనను మాటల్లో ఇరికిస్తుందని అనుకోలేదు రమేష్.

అతడి మనసు వూగిసలాడింది.

ఆమెకు తలనొప్పయితే తనకేం? అనుభవించనీ; తనే మాత్ర తెచ్చివ్వాలనే పట్టుదలేమిటి?

'మీరు తలనొప్పితోనే బాధపడండి నాకేం' అన్నాడు రమేష్ మొరటుగా.

'సంతోషంగా అనుభవించగలను. ఇహ నా తలనొప్పిమాట వదిలేయండి.'

'రత్నా! నన్ను బాధపెట్టడంవల్ల మీకేం లాభం?' రమేష్ వ్యాకులంతో అడిగాడు.

'డాక్టరవకూడదని ప్రతిజ్ఞ చేశారే మీరు? మీకేం లాభం? ఎవర్ని వుద్ధరిద్దామని ఈ ప్రతిజ్ఞ చేశారు?'

'నాకు వృత్తిలో నమ్మకం లేదు.'

'ఇన్నేళ్ళూ ఎలా చదివారు?'

'అపుడు నమ్మకం వుండేది. అదీకాక అపుడు...'

'అపుడు ఏమిటి?'

'అపుడు వదిన వుండేది. ఆమె ప్రోత్సాహమూ వుండేది. కాని, ఇపుడు...'

'ఇపుడు మీ అమ్మా, నాన్న, అన్నయ్యా, నేనూ, మీ మిత్రులూ ఇంతమంది ప్రోత్సాహాన్నివ్వగలం. ఏదో ఒక దౌర్బల్యానికి లోనయి జీవితాన్నే బలిచేయటం న్యాయం కాదు. ఇంకాముందు ముందు మీరు ఎంత గొప్పవారు అవాలనివుందో, ఎవరికి తెలుసు? మీబుద్ధి, మేధాశక్తి, జీవితం అంతా వ్యర్థం చేసుకుంటారా? మీ వదిన ఆత్మకైనా శాంతిని కలుగనీయరా? ఇలాంటి ఆత్మవంచనను నేను ఒప్పుకోను...'

అరచేతులతో కణతలను నొక్కిపట్టుకుంది రత్న.

'చాలా నొప్పిగా వుందా?'

'ఊఁ!'

రమేష్‌కి ఆమె తలను చేతుల్లోకి తీసుకుని కొట్టుకుంటున్న నరాలను మృదువుగా నిమురాలనిపించింది. సహృదయుడైన డాక్టరుకు సహజంగా కలిగే ప్రతిక్రియ అతని భావన.

'నేను రేపు ఊరికి వెడతాను.'

'మీరు ఊరికి వెళ్ళినంత మాత్రాన నా తలనొప్పి తగ్గిపోదు. అయినా మీరు ఎలా వెడతారో చూస్తాను. మిమ్మల్ని గదిలో పెట్టి తాళం వేసేస్తాను.'

'రండి, వెడదాం!' రమేష్ లేచి నిల్చున్నాడు.

'ఇంటికేనా?'

'ఊహు! ఇక్కడే సారిడాన్ దొరుకుతుందేమో చూస్తాను.'

'నేనిక్కడే వుంటాను. మీరు వెళ్ళి తీసుకురండి.'

రమేష్ రెండడుగులు వేసి, మళ్ళీ వెనక్కు వచ్చి 'చీకటిపడింది. ఒక్కరే వుంటారా? భయం వెయ్యదూ?' అన్నాడు.

'ఇంతమంది వుండగా భయమేమిటి?'

రమేష్ వెళ్ళిపోయాడు.

రత్న చీకటిలోనే కూర్చుని సముద్రాన్నే చూస్తోంది.

పసిపిల్లవాడి స్వభావంగల రమేష్ ఆమెను ఆకర్షించాడు. పరిచయమైన కొద్ది రోజుల్లోనే ఏర్పడిన ఈ ఆత్మీయత ఆమెను ఆకర్షించింది నిష్కపటమైన అతడి మొహంలో చోటుచేసుకున్న అసహాయతను చూసినపుడల్లా ఆమెకు అతడిని రక్షించాలి - దేనినుండి, ఎవరినుండి అనేమాటే లేక - అన్న మనోభావం పెరిగింది.

రత్నను ఆకర్షించింది అతనిలోని ముగ్ధత. కల్లాకపట మెరుగని, తనకు తోచిన దానిని సూటిగా అనే అతడి మనస్తత్వం ఆమెకు నచ్చింది. అతడి స్వభావ పరిచయం కాగానే, అతడికి అతని వదినతోవున్న బాంధవ్యపు తీరును ఆమె ఊహించుకోగలిగింది. కాని అతడి మనసును నొప్పించటం ఇష్టంలేక శాంత పేరుకూడా ఎత్తేది కాదామె.

భావుకత అంటే రత్నకు తిరస్కారం. కాని ఇపుడు అదే భావుకతకు చెందిన ఓ నిప్పురవ్వ తన హృదయంలో రగుల్కొంటున్నదని తెలిసి రత్న కంగారు పడింది.

చీకటిలో సముద్రం కలిసిపోయింది మృదువుగా శరీరానికి తగిలే గాలి, సముద్రుడి ఘోష తప్ప మరేమీ తెలియటం లేదు.

సముద్రం పైనుండి తేలివచ్చే చల్లటిగాలిలో సముద్రపు హోరును వింటూ స్వప్నలోకంలో తేలిపోయింది రత్న. ఆమె కపుడు వర్తమానం తప్ప భూత భవిష్యత్కాలాల జ్ఞాపకాలే లేవు

మళ్ళీ రమేష్ వచ్చి కూర్చున్నపుడే రత్న మేలుకుంది.

'మీరు కూర్చున్నచోటే మరచిపోయాను. ఒంటరిగా తెల్లచీరెలు కట్టుకుని కూర్చున్న ఆడపిల్లలందరి దగ్గరకూ వెళ్ళి చూశాను. వాళ్ళే మనుకున్నారో ఏమో!'

'ఇంత తొందరగా నేనున్నచోటు మర్చిపోయారా?'

'మాత్ర తెచ్చాను' అంటూ, రమేష్ సారిడాన్ రత్న చేతికిచ్చాడు.

'ఎలా తీసుకోను?'

'నోట్లో వేసుకుని మింగేయండి.'

'నీళ్ళో?'

'ఓహ్, మరచిపోయాను. రండి; ఇక్కడే ఏదైనా హోటలుకు వెళ్ళి కాఫీ తీసుకుందాం.'

రత్న లేచింది.

రమేష్ మొండిగా 'ఈ మాత్రతెచ్చానని నేను డాక్టరవబోను. మీరు అలా అనుకున్నారంటే పొరపాటే.'

చౌపతి ఇసుకలో నడిచి రోడ్డుపైకి వచ్చారు. అక్కడ నుండి నడిచి వెళ్ళి మెరిన్‌డ్రైవ్ దాటి హోటల్‌కి వెళ్ళారు.

హోటల్లో 'చా' కోసం కాచుకుని కూర్చున్నపుడు రత్న అడిగింది.

'మీకు నేనంటే ద్వేషమా?'

'ఛా! అలా అని ఎవరన్నారు? అలా ఎందుకనుకుంటున్నారు?'

'మరి నామీద కసితీర్చుకుంటున్నట్టు నేను డాక్టరవను అంటా రెందుకు? తన ముక్కు కోసుకుని అందరికి చూపే మూర్ఖుడిలా మాట్లాడు తున్నారు. మీరు డాక్టరు కాకపోతే, మిగతా వారికి నష్టమేమీలేదు. మీకే అపారనష్టం.'

'నా లాభనష్టాల విషయం నాకు చెందింది.'

'అలాగే అనుకోండి! డాక్టర్ కానక్కర్లా. మరేం చేస్తారు?'

'ఇలాగే వుంటాను.'

'అంటే మీ అన్నయ్యో తండ్రి పీళ్ళమీద ఆధారపడి జీవిస్తారన్న మాట.'

రమేష్ కాస్త ఆలోచించి చెప్పాడు. 'ఉహూ! ఏదైనా ఆశ్రమంలో చేరిపోతాను. సన్యాసిగా బ్రతుకుతాను.'

రత్న చిరునవ్వు నవ్వి, 'సన్యాసమా! అది మీలాంటి వారికి కాదు' అంది.

రమేష్ ఇక సహనాన్ని కోల్పోయాడు. గట్టిగా;

'ఏం ? నాకంత సంయమం లేదనుకున్నారా? నేను తల్చుకుంటే ఏదైనా చెయ్యగలను.'

'మీ ఆత్మవిశ్వాసాన్ని చూసి నాకు చాలా సంతోషంగా వుంది. అదే ఆత్మవిశ్వాసంతోనే చదువు పూర్తిచేయండి. మనిషికి వైరాగ్యమూ కావాలి. నిజమే! నేనూ ఒప్పుకుంటాను. కాని, మీ మనసు వైరాగ్యపు దారి తొక్కడానికి అనువైనదికాదు.'

రమేష్ టేబుల్‌మీదకు వంగి, రత్న కళ్ళలోకిచూస్తూ

'నా జీవితం విషయంలో తమరెందుకింత శ్రద్ధ తీసుకుంటున్నారో తెలుసుకోవచ్చా?' అన్నాడు.

రత్న కళ్ళు దించుకుంది. మెల్లిగా,

'అది నా స్వభావం' అంది.

'నే నొప్పుకోను. నా మొహంచూసి చెప్పండి. నా విషయంలో మీ కెందుకింత శ్రద్ధ?'

'నిజం చెప్పమన్నారా?'

'ఊఁ! చెప్పండి.'

'మీ రంటే నాకున్న ఆసక్తి వల్ల!'

'ఆసక్తి ఎందుకు?'

'మీరంటే నాకు అభిమానం వుంది. స్నేహమూవుంది.'

రమేష్ జీవితంలో ఎన్నడూ అనుభవించని అపూర్వమైన ఆనందాన్ని అనుభవించాడు. అతడి గుండె కొట్టుకోడం అతడికే వినిపించింది. నుదుటిమీద స్వేద బిందువులు నిలిచాయి.

'నా తలనొప్పికోసం మీరెందుకంత ఆరాట పడ్డారో చెప్పగలరా? మీ వేదాంతరీత్యా "ఆమె కర్మ ఆమె అనుభవిస్తుంది" అని ఊరుకోలేదేం?' రత్న ఎదురు ప్రశ్న వేసింది.

'మీరు బాధపడుతుంటే నేను చూడలేను.'

# 8

'మీ కర్మ సిద్ధాంతానికి మీరిచ్చే విలువ ఇంతేనన్నమాట.'

'మీ ఒక్కరికి మాత్రం ఆ సిద్ధాంతం అన్వయించదు.'

'ఏం?'

'మీ మీదున్న అభిమానమే దానికి కారణం.'

చేతిలో చేయి వేసుకుని లోపలకు వచ్చిన పార్సీ దంపతుల వైపు చూస్తూ రత్న 'వెడదాం' అంది.

రమేష్ యాంత్రికంగా బయలుదేరాడు.

ఈ విధమయిన నివేదనవల్ల తాత్కాలికంగా హృదయం తేలికపడి నట్టనిపించినా భవిష్యత్తులో ఎదుర్కోవలసిన మనోవిప్లవం రత్నను భయపెట్టింది.

రమేష్ ఎన్ని రోజులని తమ ఇంట్లో ఉండగలడు? ఈ రోజు కాక పోతే రేపు, ఎప్పుడో ఒకప్పుడు, అతడు వెళ్ళవలసిన వాడేకదా! ఎప్పటి విషయమో ఇప్పటినుండి ఆలోచించి మనస్సు పాడుచేసుకోవటం ఎందుకని రత్న అనుకున్నా, ఆ రోజు తెచ్చిపెట్టే వ్యథ భయంకర స్వరూపం దాల్చి ఆమెను బెదరించింది.

రమేష్ ఏం ఆలోచిస్తున్నాడోనని అతడి వైపు చూసింది.

రత్నలా రమేష్‌కి తన అంతరంగాన్ని ఎదురించవలసిన అవసరమే లేదు. అతని హృదయం బంధన రహితమైనది.

ఆ విధమైన సంఘర్షణ నుండి అతడయినా తప్పించుకున్నందుకు రత్న మనస్సు సమాధానపడింది.

అంతరాత్మతో యుద్ధంచేస్తూ పరధ్యానంగా నడుస్తున్న రత్నను రెండుమూడుసార్లు రమేష్ హెచ్చరించాడు. ఇంకోమారు పక్కనవస్తున్న కారును చూసుకోకుండా రోడ్డు దాటబోతున్న రత్న భుజం పట్టుకుని నిలిపి, మెల్లిగా గద్దించాడు.

'ఇది మైసూరు కాదు రత్నా, బొంబాయి.'

రత్న తేరుకుని 'ఏమిటి?', అంది.

'ఇన్ని రోజులూ మీరు నాకు ట్రాఫిక్ గురించి హెచ్చరిక చేసేవారే. ఈ రోజు నేను మిమ్మల్ని హెచ్చరించాల్సి వస్తోంది.'

'కారుకింద పడి చావాలని నా నొసట రాసి ఉంటే, ఎవరేం చెయ్యగలరు?'

తను అన్నమాటతోనే తన్ను మాటిమాటికి దెప్పుతున్న రత్నపైన రమేష్‌కి బాగా కోపంవచ్చింది. అప్పటిదాకా తన చేతిలో ఉన్న రత్న పట్టును మరింత బిగించాడు.

'ఇక జాగ్రత్తగా నడుస్తాను' అంటూ చెయ్యి విడిపించుకుంది రత్న.

దోవలో నడుస్తున్న ఓ చిన్నపిల్లను చూడగానే రత్నకు ఇంట్లో ఆశ గుర్తుకొచ్చింది. దాంతో అడుగులు కూడా వేగంగా పడసాగాయి.

రమేష్‌తో స్నేహమూ, ఆత్మీయతా బలపడినట్లు అనిపించగానే రత్న అతడినుండి దూరమవాలని ప్రయత్నించింది. అతడి స్నేహాన్ని ఆమె కోరుతున్నా కేవలం స్నేహంతోనే తృప్తి పొందక ఇంకా ఏదయినా కావాలని కోరుకునే మనస్సును మొదటి నుండి తన అధీనంలో ఉంచుకోవటమే ఇద్దరికీ మంచిదని ఆమెకు అనిపించింది.

జీవితంలో అంత ఎక్కువ పరిచయంలేని రమేష్, భవిష్యత్తుని గురించి అంతగా ఆలోచించేవాడేకాదు. రత్న స్నేహ సౌజన్యాలు తనకు దక్కాయి. అది అతని మనో మందిరపు మొదటిమెట్టు. అక్కడ అడుగు పెట్టిన అతడి కోర్కె ఆమె స్నేహ విశ్వాసాలను ఎప్పటికీ తనవిగా చేసుకోవాలనే వరకూ పోయింది.

రత్న స్నేహ విశ్వాసాలు ఇప్పటికేమో అతనివే కాని, అవి తనొక్కడివే కావాలనే ఆకాంక్ష అతడిలో చెలరేగింది. దానిని సాధించలేని తన జీవితమే వ్యర్థమనిపించిందతనికి.

పైకి ఎక్కిన కొలది అగాధంలోకి పడిపోతానన్న వూహే కలగ లేదతనికి.

శేషగిరి ఇంటిలో రెండు రోజులుండి వెళ్ళిపోవలసిన అతిథి తను. కాని, ఏ విషయాన్నీ ఆలోచించలేని అతడి ముగ్ధ మనసు, ఇంకొక మన సనే గాలంలో చిక్కుకున్నప్పుడు భవిష్యత్తును గురించి ఆలోచించాలన్న ప్రయత్నమే చేయలేదు.

కాని, పగలూ రాత్రి ఇదే ఆలోచనతో కొలిమిలోని ఇనుములా కాలిపోతోంది రత్న. తనకు భర్తనుండి ఏ విధమైన రక్షణ కాని, స్వాంత్వ నంకాని దొరకదని రత్నకు బాగా తెలుసు.

ఆమెకు ఆసరా ఆశ ఒక్కటే.

కాని, తన విషయాలకన్నా రమేష్ని గురించిన బెంగే ఎక్కువగా వుంది.

అతడు అసలే దెబ్బతిన్నవాడు. చిన్నప్పటినుండి ఎంతో గారా బంగా పెరిగిన అతడికి అనుకోకుండా తగిలిన వదిన చావు దెబ్బతో అంత వరకూ వున్న శాంతి సౌఖ్యాలను కోల్పోయి జీవితంలోనే ఏ ఆసక్తి లేకుండాపోయింది.

మునుపటిలా జీవితంలో ఆసక్తి కలిగించాలనే ఆశతోనే పెద్దవాళ్ళు అతడిని బొంబాయి పంపారు.

వారి ఆశలు ఫలించేటట్టే ఉన్నాయి.

రమేష్ ఇప్పుడిప్పుడే జీవితంలో ఆసక్తిని కనబరుస్తున్నాడు. కాని, ఈ ఆసక్తి పరిణామంవైపు అతడి దృష్టి పోనేలేదు.

తెల్లవారాక నయినా స్వప్నాన్నుండి మేల్కొనక తప్పదుకదా!

అలా అని రమేష్ విషయంలో వుదాసీనంగా వుండలేకపోయింది రత్న. దీనికి మారుగా అతడిమీది ప్రేమ, కరుణ, విశ్వాసాలు రెండింత లయ్యాయి.

ఒక శుక్రవారం రత్న:

'ఈరోజు మహాలక్ష్మి దేవాలయానికి వెడదాం' అంది.

'నాకు దేవుడంటే భక్తిలేదు.'

'దేవుడుకాదు దేవత' అంటూ సరిదిద్దింది రత్న.

దేవుడిమీద భక్తితో కాకపోయినా, రత్నతో వెళ్ళవచ్చునుకదా అని ఒప్పుకున్నాడు రమేశ్.

'ఆశా! గుడికి వెడదాంరా' అని పిల్చింది రత్న.

ఆటలో మునిగిపోయిన ఆశా రానంది.

ట్రాము, బస్సుల రద్దీనుండి దూరంగా వుంది దేవాలయం. దేవాలయ ప్రాకారం దగ్గరకు రాగానే అక్కడ పూలు, అగరుబత్తులు, కొబ్బరికాయలు అమ్ముతున్న పిల్లలు వీళ్ళను పిలువసాగారు.

రమేష్ ఒక పిల్లనుచూపి 'అక్కడ కొందాం' అన్నాడు.

రత్న పూజా సామగ్రి తీసుకొంది.

దేవాలయంలోకి వెళ్ళేముందు రత్న:

'మీరు ఆ అమ్మాయి దగ్గరే ఎందుకు కొనాలనుకున్నారో తెలుసా?'

'చెప్పండి.'

'ఆ అమ్మాయి మిగిలినవారికన్నా అందంగా వుంది. ఇప్పుడయినా ఒప్పుకుంటారా సౌందర్యం అందరినీ ఆకర్షిస్తుందని.'

దేవాలయంలో పూజ చేయించుకుని బయటకు వచ్చారిద్దరూ.

'దేవిని ఏం కోరుకున్నారు?' రమేష్ అడిగాడు

'సముద్రం దగ్గరకు వెడదాం. అక్కడ అంతా చెపుతాను' అంది రత్న.

దేవాలయం వెనుకభాగంలో రాళ్ళకు కొట్టుకుని హోరు పెడుతున్న సముద్రం దగ్గరకు వెళ్లారిద్దరూ.

ఎండిన ఆకుపచ్చ రంగుతో నున్న రాళ్ళమీద నడిచి కొంతదూరం వెళ్ళారు.

రత్న తొడుక్కున్న ఎత్తుమడమల జోళ్ళు పాచికట్టిన రాతిమీదికి అడుగుపెట్టగానే, జారి రత్న పడబోయింది. రమేష్ ఆమెను గట్టిగా పట్టుకున్నాడు.

'వదలండి; ఇక జాగ్రత్తగా వస్తాను!' రత్న విడిపించుకోబోయింది.

'మీరు పడి, కాళ్ళు విరక్కొట్టుకుంటే నాకేకదా చెడ్డ పేరు!' అన్నాడు రమేష్.

'మీకెందుకొస్తుంది చెడ్డపేరు?'

'మీరు నాకోసమే ఇలా వస్తున్నారు. నావల్ల మీకు కష్టం కలగ రాదు.'

రత్న ఒక్క నిముషం ఆగి,

'మనస్సు భగ్నమయ్యేటందుకన్నా కాళ్ళు విరగటమే మంచిది' అంది.

రమేష్ తన చేతిపట్టు వదల్లేదు. రత్న మాటలు తనకు వినిపించ నట్టే నటించాడు. ఇద్దరూ నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి నీళ్ళ మధ్యలో వున్న ఓ రాతిపైన కూర్చున్నారు. సముద్రపు నీరు రాతికి కొట్టుకొని మళ్ళీ తొందరగా వెనక్కు వెళ్ళిపోతోంది.

వాళ్ళలాగానే మరింకెంతోమంది అక్కడ రాళ్ళపైన కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్నారు.

వాతావరణం అకస్మాత్తుగా గంభీరంగా మారిపోయినట్టు అనిపించింది రమేష్‌కు.

'దేవిని ఏం కోరుకున్నారు?' అని అడిగాడు.

ఇసుకలో తలదూర్చి వాస్తవికత నుండి పారిపోవాలనుకొనే నిప్పుకోడి బుద్ధిలాంటిది రమేష్‌ది.

'అది నా రహస్యం; మీకెందుకూ?'

'నాకు చెప్పరానిదా?'

'అలాఅని కాదుగాని, మీరు అపార్థం చేసుకోరుకదా?'

'చేసుకోను; చెప్పండి.'

'రమేష్‌కి మంచిబుద్ధిని ప్రసాదించు తల్లీ! అని వేడుకున్నాను.'

రమేష్ కోపంతో అలిగి దూరంగా జరిగి కూర్చున్నాడు.

'నాలో అంత చెడ్డబుద్ధి మీకేం కనిపించింది?' రమేష్ అడిగాడు.

'ఈ సముద్రం ఎంత విశాలంగా వుందో, మీ చెడ్డ బుద్ధికూడా అంతే విశాలంగా వుంది.'

రమేష్, అస్తమిస్తున్న సూర్యుడివంక చూస్తూ:

'నాలో కొంచెంకూడా మంచిబుద్ధి లేదంటారా?' అని అడిగాడు.

'ఊహుఁ... లేదు.'

'పోనీ ఆ చెడ్డ బుద్ధు లేమిటో చెప్పండి. కనీసం సరిదిద్దుకోవటానికి ప్రయత్నిస్తాను.'

'చెప్పనా... మొదటిది—' అంటూ, రత్న వేళ్ళు మడిచి చెప్ప సాగింది.

'మీది అతి సున్నిత హృదయం. ఇంత మృదు హృదయమయితే జీవితంలో మనకు తగిలే దెబ్బలకు తట్టుకోలేం. మన మనసు— ఇదిగో ఈ రాయిలా వుండాలి. అలలు ఎంత జోరుగా కొట్టుకున్నా ఈ రాయి పగిలిపోదు.'

'సరే, రెండోది!' వుత్సాహంగా అడిగాడు రమేష్

'మీరు అందర్నీ చాలా తొందరగా నమ్మేస్తారు. కొంచెం మంచిగా మాట్లాడినంతమాత్రాన ఎవరినయినా మంచి వాళ్ళనుకోవడం పొరబాటు. కొననాలికనుండి వచ్చే పలుకులను హృదయాంతరాళంలోనుండి వచ్చాయని భావించటం మంచిదికాదు.'

'సరే. మూడవది?'

'మీరు చాలా సెంటిమెంటల్. మనిషికి భావుకత కావాలి. కాని, జీవితంలో అదే ప్రధాన పాత్ర వహించరాదు. ఆఖరిది. మీరు వదలి పెట్టా లనుకుంటున్న వైద్యవృత్తిని మళ్ళీ స్వీకరించాలని నా కోరిక. మొదటి మూడు లోపాలను క్షమించినా ఈ ఆఖరిదాన్ని మాత్రం మన్నించడానికి వీల్లేదు.'

రమేష్ బదులు పలకలేదు. అతడి మౌనంతో కలవరపడి, రత్న అతడి వైపుకు చూసింది. రమేష్ మొహం చిన్నబోయింది. గాలికి అతడి ముంగురులు ఎగిరి అతడి నుదుటి మీదికి పడుతున్నాయి.

వాత్సల్యంతో రత్న హృదయం పొంగి పొరలింది. అతడి, నుదుటి మీదకుపడ్డ జుట్టును వెనక్కు తోసి, అతడి చేతిని తనచేతిలోకి తీసుకోవా లనిపించింది.

కాని, ఎలాంటి సమయంలోనయినా తన మనస్సును తన అధీనంలో వుంచుకోగలశక్తి వుంది ఆమెకు.

'రమేష్!'

'ఏమిటి?'

'నేను చెప్పింది నిజంకాదా?'

'కొంచెం మాత్రమే నిజం. కానీ, అందరి విషయంలోనూ నేను ఇలాగే వుంటాననుకోకండి. మీ విషయంలో మాత్రం నాహృదయం దుర్బలంగా వుంది.'

'అది చాలా తప్పు.'

'ఎ దుకు?'

'ఎందుకో మీకు తెలియదా?... మీరనుకుంటున్నంత మంచిదాన్ని కాను నేను. నా ప్రవర్తనా, మాటా అంతా నటన!'

'రత్నా!'

రత్న మాట్లాడకుండా కూర్చుంది.

'నన్నెందుకిలా బాధపెడుతున్నారు? మీరు ఎలాంటి వారైనా సరే;

నామట్టుకు నాకు సరిగ్గానే వున్నారు. నాకింత బుద్ధి చెబుతున్నారే ...ఊ... ఏంలేదు లెండి.'

'ఏమిటో చెప్పండి.'

'మీకు తెలీదా? నేను చేసిన తప్పునే అది తప్పని మీరు అనుకుంటున్నట్టయితే మీరు చేయటం మంచిదే నంటారా?'

ఎదురు ప్రశ్న వేశాడు రమేష్

'నాదంతా ఒట్టి నటన అని చెప్పానుకదా! కాలేజీలో చదివేటప్పుడు 'మంచి నటి' అని నాకు పేరుండేది. ఒకవేళ నేను నటించడంలేదని మీరు అనుకున్నా, జీవితంలో నాకున్న అనుభవంలో నూరోవంతుకూడా మీకు లేదు. నేను జీవితం నుండి ఏమీ ఆశించను. ఎంతటి వ్యథ, నిరాశ ఎదురయినా, ఎదిరించగల ధైర్యం నాకుంది. ఆ దృష్టితో చూస్తే, మీరింకా ఓ పసిపాపాయి అనే చెప్పవచ్చును. ఒక చిన్న ఎదురుదెబ్బకూడా తట్టుకోలేరు. నా సంగతలా వుంచండి; మిమ్మల్ని గురించే నా బెంగంతాను.'

మాయానగరపు ముఖద్వారంలోవున్న మబ్బుల వెనుక సూర్యుడు అస్తమిస్తున్నాడు. సూర్యుని అరుణకాంతిని అప్పు తెచ్చుకుని, మబ్బులు బంగారు రంగును పులుముకున్నాయి. ఆకాశపుటంచులో సూర్యుడు శక్తిహీనుడిలా క్షణక్షణానికి క్రుంగిపోతున్నాడు. అతడి అస్తమయంతో, సూర్యుని మాయా దండంతో నిర్మించిన మాయానగరం క్షణమాత్రంలో నల్లరంగు పూసుకుని శత్రువులు లూటీచేసి వెళ్ళిపోయిన రాజధానిలా కళాహీనమయింది.

రమేష్ హృదయం వ్యథతో బరువెక్కింది. రత్నవైపు చూశాడు. చీకటిలో ఆమె మొహం కనిపించటంలేదు. ఆమె చెవులకున్న దుద్దులు మాత్రం మెరుస్తున్నాయ్.

'జీవితాన్ని అనుసరించి నేను వెళ్ళగలను. ఎలాంటి విషమ పరిస్థితిలోనైనా చిరునవ్వు నవ్వగలను. కాని మిమ్మల్ని గురించిన బెంగ నన్ను వేధిస్తోంది.'

రమేష్ దారితప్పిన పసివాడిలా 'అయితే నన్నేం చెయ్యమంటారు చెప్పండి. మీరు చెప్పినట్టు నేను వింటాను' అన్నాడు.

'నిజంగానా?'

'ఊఁ!'

'అయితే ఆలోచించి చెపుతాను. ఇంటికి వెడదాం పదండి.'

రమేష్ లేచాడు. లేచి నించున్న రత్న కాళ్ళు ఎగుడు దిగుడుగా వున్న రాతిమీద నడవటానికి మొండికేస్తున్నాయి.

'నేను పట్టుకోనా?'

'వద్దు.'

'పడితే మరీ కష్టం. ఈ విషయంలో మీ మాటను అతిక్రమిస్తున్నాను' అంటూ ఆమె చేతిని పట్టుకున్నాడు రమేష్.

'వద్దు, వద్దు, వదిలెయ్యండి.'

'నేను అస్పృశ్యుడినా? నేను పట్టుకుంటే మీరు అపవిత్రులవుతారా?'

'ఛ! ఏమిటా మాటలు ? మీచెయ్యి మురి కవుతుందేమోనని...'

'అయితే మీరింకేం బాధపడకండి' అన్నాడు రమేష్.

ఒకటి రెండు రాళ్ళనుదాటాక, రమేష్ ఆమెకు దగ్గరగా జరిగి రత్నను తనకు మరింత దగ్గరగా లాక్కున్నాడు. నడుస్తున్న రత్న చటుక్కున ఆగిపోయింది.

'రమేష్! నన్ను పరీక్షించకండి. క్షణక్షణానికి నన్ను ఆశ పెట్టకండి. నేను మానవ మాత్రురాలిని; దుర్బలురాలిని.'

మునిగిపోతున్నవారి ఆర్తనాదంలా వుంది రత్న కంఠస్వరం.

'లేదు రత్నా! నేను మిమ్మల్ని పరీక్షించటంలేదు. ఎలాంటి అగ్ని పరీక్షలోనైనా గెలుపుమీదే! కాని నా కొక మధుర స్మృతి కావాలి.'

'మధుర స్మృతా! నా స్నేహమే మీ కో పీడకలగా వున్నప్పుడు మధురస్మృతి ఎక్కడిది రమేష్!'

'మన భావనలోనే వుంది అంతా.'

సముద్రతీరం నిర్జనమైన మరుభూమిలావుంది. చీకటి పడటంవల్ల చాలామంది సముద్రతీరాన్నుండి వెలుగువైపుకు వెళ్ళిపోయారు.

రమేష్, రత్న మొహాన్ని తన రెండు చేతులతోనూ పైకెత్తి పట్టుకుని మండుతున్న తన పెదవులతో, ఆమె చల్లటి పెదవులను చుంబించాడు.

అతడి ప్రేమ ముద్రకు ఆకాశంలోని అసంఖ్యాక తారలు, అగాధమైన జలరాశి సాక్షిభూతాలుగా నిలిచాయి.

రత్న ప్రతిమలా అతడి చేతులలో వుండిపోయింది. ఎన్నో రోజులుగా నీళ్ళులేక, దప్పిగొన్న ఎడారి ప్రయాణికుడు నీళ్ళను చూడగానే తనివితీరా జలపానం చేసినట్టు రమేష్, రత్న ప్రేమామృతాన్ని పానం చేశాడు.

అల్లరిచేస్తున్న పిల్లాడిని సముదాయించినట్టుగా అతడి తల నిమిరింది రత్న.

'రత్నా!'

'ఏమిటి?'

'నా మీద కోపమా?'

'లేదు!'

'అయితే మాట్లాడరేం?'

'మీ రెక్కడ అవకాశమిచ్చారు నాకు?'

'మీకు కోపం వచ్చింది. కావాలంటే ఫెడీల్మని కొట్టండి. మీ రేం శిక్ష విధించినా అనుభవిస్తాను. కాని, నామీద కోపగించుకోకండి' అంటూ రమేష్, ఆమె చేతిని తన చెంపలమీదుంచుకొన్నాడు.

రత్న అతడి చెంపలను మృదువుగా నిమిరి తన చేతి రుమాలతో అతడి పెదవులను తుడిచింది.

'నా పెదవు లెందుకు తుడిచారు?'

రత్న బదులు పలకలేదు. అదే రుమాలుని తన నోటికి అడ్డు పెట్టుకుని పొంగివస్తున్న ఏడుపు నాపుకుంది.

వెలుగులోకి రాగానే, రత్న బుగ్గలమీద ప్రవహిస్తున్న కన్నీటి ధారలను చూసి చకితుడయ్యాడు రమేష్.

'రత్నా!'

'ఏమిటి?' రత్న ధ్వని మాత్రం శాంతంగా వుంది.

'మీరు నా తల పగులగొట్టినా సరే, కాని ఏడిస్తే మాత్రం నేను సహించలేను. నా ప్రవర్తనతో మిమ్మల్ని నొప్పించి వుంటే చెప్పండి. రేపే వూరికి వెళ్ళిపోతాను.'

'అలాగే, కాని మీరు పెదవులపై ముద్రించిన ఈ అమూల్యమయిన ముద్రను ఏం చేయను?'

'నాకే తిరిగి ఇచ్చివేయండి.'

'ఉహుఁ. మీకివ్వను'.

'అయితే ఏం చేస్తారు?'

'నాలోనే దాచుకుంటాను. ఒక్కొక్కప్పుడు, జీవితం శూన్యంగా అనిపించినపుడు అద్దంముందు నిల్చుని మీ ముఖం చూసుకుని జీవితంలో వుత్సాహం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తాను.'

రమేష్ మౌనంగా తన చేతిలోని ఆమె చేతిని నొక్కాడు.

వాళ్ళు ఇల్లు చేరేసరికి ఎప్పటికన్నా కాస్త పొద్దుపోయింది. అంత రద్దీగా వున్న బొంబాయిలోకూడా తనదే అయిన ఒక ప్రత్యేకమయిన లోకాన్ని నిర్మించుకుని విహరించి వచ్చారు వాళ్ళిద్దరూ.

ఇంటికి రాగానే, తన మరాఠీ స్నేహితురాలింట్లో కూర్చున్న ఆశను తీసుకొచ్చింది రత్న.

రమేష్ వచ్చినప్పటినుండి రత్న సహవాసమే అపురూపమయింది ఆశకు. శేషగిరి ప్రొద్దుటే వెళ్ళిపోతే, మధ్యాహ్నం భోజనానికి వస్తే వచ్చే

వాడు లేకపోతేలేదు. మళ్ళీ రాత్రి పది గంటల తర్వాతేగాని, వచ్చేవాడు కాదు.

దీనితో ఆశకు తండ్రితో ఎక్కువ స్నేహమే లేకపోయింది. తల్లి వడిలోనే పెరిగిన ఆశకు రమేష్ రాకతో అదీ దుర్లభమయింది.

తల్లిని తననుండి దూరం చేస్తున్న మామయ్యంటే ఆశకు కోపంగా వుంది.

'ఎక్కడికెళ్ళావమ్మా?' ఆశ అడిగింది.

'దేవాలయానికి.'

'ఇంత సేపయిందేం?'

'బస్సు దొరకలేదమ్మా.'

తన ప్రతిస్పర్ధిని చూసినట్టుగా రమేష్‌వైపు చూసింది ఆశ. 'నువ్వింత ఆలస్యంచేస్తే నాకు విసుగ్గా వుంటుందమ్మా' అంది ఆశ.

'ఇకమీదట త్వరగా వస్తాను' అని రత్న భరోసా ఇచ్చింది కూతురికి.

ఆశ కళ్ళల్లోని ఆక్షేపణను ఎదిరించలేక అటుతిరిగాడు రమేష్.

నిజమే! ఇంతకూ తనెవరు? వాళ్ళింట్లో కొద్దిరోజులపాటు వుండి పాత గాయాలు మరచిపోవటానికి వచ్చినవాడు తను. రత్న మధుర స్నేహంలో తన పాతగాయాన్ని మరిచిపోయినా పోవచ్చు కాని, దాని స్థానంలో కొత్తగాయం కాకుండా మానదు.

భవిష్యత్తులోకి చాలా దూరం తొంగిచూసే ధైర్యం కలగలేదు రమేష్‌కి.

కళ్ళుమూసుకుని కుర్చీలో వెనక్కి వరిగాడు.

రాత్రి శేషగిరి వచ్చేసరికి పదిగంటలయింది. అతడు రాగానే, అందరి భోజనాలు అయ్యాయి.

రమేష్ అయిదు నిమిషాలు శేషగిరితో మాట్లాడి, తరువాత:

'నాకో నిద్రమాత్ర ఇవ్వండి డాక్టర్' అన్నాడు.

'నిద్రపోవడానికి మాత్ర వేసుకోవలసిన వయస్సటయ్యా నీది' అంటూ నవ్వాడు శేషగిరి.

'దయచేసి ఇవ్వండి.'

శేషగిరి ఇచ్చిన మాత్ర మింగి నీళ్ళు తాగి పక్కమీద పడుకున్నాడు రమేష్.

అతడి కణతలు పగిలిపోతున్నాయి. తన గదికి కొంచెం దూరంలో వెడుతున్న ట్రామ్‌కిందపడి ప్రాణం వదిలేయాలన్న తీవ్రమయిన కోర్కె కలిగిం దతనికి.

నిప్పులోపడ్డ పురుగులా పడకమీదపడి దొర్లాడు.

'నిద్రయినా వస్తే!'

భవిష్యత్తు శూన్యంగా కనిపించిం దతనికి.

ఎన్నోరకాల ఆలోచనలు సూదుల్లా గ్రుచ్చుకుని బాధ పెడుతున్నాయి.

బాధ, మంటలతో మూగబాధ అనుభవిస్తూ నిద్రపోయాడు.

'రత్నా' అని కలవరిస్తూ పక్కకు పొర్లాడు.

# 9

ఉదయం రమేష్ లేచేసరికి ఎనిమిది దాటింది.

అతడు గదిలోనుండి బయటకు వచ్చేసరికి రత్న ఫోనులో ఎవరితోనో మాట్లాడుతోంది.

ఆమె మొహం చూడగానే గతరాత్రి తాను అనుభవించిన బాధంతా మరిచిపోయి నవ్వాడు రమేష్.

'ఉదయం లేవగానే ఎవరితో మాట్లాడుతున్నారు? అంత పుణ్యం చేసుకున్నవారెవరు?' అని అడిగాడు రమేష్.

'నా కజిన్ దాదర్‌లో వుంది. సాయంకాలం నాలుగింటికి ఇక్కడికి రమ్మని ఫోన్ చేశాను.'

'ఓ'

'సాయంకాలం అందరం కలిసి మలబార్‌హిల్స్‌లోని కమలా నెహ్రూ పార్కుకు వెడదాం.'

నవ్వుతో వెలుగుతున్న రమేష్ మొహాన్ని క్షణమాత్రంలో నల్లటి మబ్బులు క్రమ్ముకున్నాయి.

'నా నుండి రక్షించుకుందామని ఆవిడను పిలిచారా?'

అతడి కంఠంలో ధ్వనించిన వ్యథను గమనించి వెంటనే రత్న:

'అలా అనుకోకండి. మిమ్మల్ని ఆమెకు పరిచయం చేద్దామనిపించి పిలిచాను. తను బి. ఏ. పాసయింది. బాగా పాడుతుంది—'

'ఇవేం పెళ్ళిచూపులు కావుకదా?'

రత్న అటుతిరిగి ఏదో వెతుకుతున్నట్టు నటిస్తూ 'కాదు' అంది.

రత్న కాఫీ తీసుకుని వచ్చేసరికి రమేష్ కుర్చీలో మెదలకుండా కూర్చుని వున్నాడు.

రత్న కాఫీగ్లాసు అతడి ముందుంచి:

'తాగండి' అంది.

'అక్కర్లేదు.'

'మంచికుర్రాళ్ళు ఇలా మొండికెయ్యరు; నాకోసం తాగండి.'

'నాకోసం మీరామెను పిలవకండి.'

'నళినికి అంతా చెప్పి సాయంత్రం నాలుగింటికి రమ్మన్నాను. ఇప్పుడు ప్రోగ్రాం కాన్సిల్ చేయటానికి వీల్లేదు.'

'అయితే ఈ రోజు నేనెక్కడికీ రాను.'

'రమేష్! మిమ్మల్నేం చేయాలో తెలుసా?'

'చెప్పండి.'

'**Spanking** అంటారు విన్నారా?'

'మీరు మాటల్లోనే **Spank** చేస్తున్నారు.'

'మిమ్మల్ని పట్టుకుని బాగా తన్నాలనిపిస్తుంది. కాని చేతులురావు.'

'కొట్టడానికి బదులు తిడుతున్నారు. అంతేగా?'

రత్న కాఫీగ్లాసు పట్టుకుని అతడి ముందు:

'తీసుకోండి' అంది.

'ఊహుఁ.'

'మీరు తాగకపోతే నేనే తాగించాల్సి వుంటుంది.'

రమేష్ రత్న కళ్ళల్లోచూస్తూ 'రత్నా! నేను అడిగింది తెచ్చి తాగిస్తారా?' అని అడిగాడు.

'ఓ, ఏంకావాలి? కాఫీ, టీ?'

'విషం ఇవ్వండి. సంతోషంగా తాగుతాను.'

స్విచ్ ఆఫ్‌చేయగా ఆరిపోయే దీపంలా రత్న మొహంలోని వెలుగు ఆరిపోయింది. దెబ్బతిన్న పక్షిలా అక్కడినుండి వెళ్ళిపోయింది రత్న.

రమేష్‌కి తానన్న మాటలోని తీవ్రత అర్థమయింది. కాని, అతడికి ఆ క్షణంలో నిజంగానే ఆమె చేతినుండి విషం తీసుకుని తాగాలనిపించింది.

బ్రతకటానికి భయపడి మృత్యువును ఆహ్వానించటం!

ఎంత పిరికితనం!

కళావిహీనమయిన రత్న మొహం అతడిని అక్కడ నిలవనీయలేదు. కాఫీగ్లాసు తీసుకొని వంటగదిలోకి వెళ్ళి, ఆమె ముందే కూర్చుని కాఫీ తాగాడు.

రత్న మాట్లాడకుండా కూర్చుని కూర తరుగుతోంది.

'రత్నా! నామీద కోపమా?'

'లేదు. మీ ఇష్టమొచ్చినట్టు మాట్లాడే స్వాతంత్ర్యం మీకుంది.'

'విషం తాగినా, నేను చావను రత్నా.'

రత్న తలెత్తి అతడివైపు చూసింది. ఆమె కళ్ళనిండా నీరు నిలిచింది.

'నిన్నరాత్రి నేను మహాలక్ష్మి దేవస్థానం వెనుక సముద్ర తీరంలో అమృతపానం చేశాను. అమృతం తాగాక, విషం తాగినా చావను.'

రత్న తలవంచుకుని నెమ్మదిగా అంది, 'రమేష్! నేను చాలా సామాన్యురాలిని. నాకు అంత వెలకట్టకండి. మీ రత్న అతి సామాన్యురాలు.'

'ఎప్పటికీ కాదు! రత్న రత్నమే!'

'కాదు. పేరు మాత్రమే రత్న. నేను వట్టి గాజుముక్కను.'

'రత్నమో, గాజో దానివెల, అదే నిర్ణయించదు. దాని వెలకట్టే వారు వేరే ఉంటారు.'

'కావచ్చు. ఎవరయితే ఆ విషయాలలో ఎక్కువ అనుభవం కలిగి ఉంటారో, వాళ్ళే వెలకట్టగలరు. మీలాంటివారికి రత్నానికి, గాజుకూ తేడా ఏం తెలుస్తుంది?'

'నాకు తెలుసు. నేను చెప్పగలను.'

రత్న చిరునవ్వునవ్వి 'పులుసులో ఉప్పెక్కువో, కారం ఎక్కువో చెప్పలేని మీరు, గాజు, వజ్రాల సంగతెందుకు మాట్లాడుతారు?' అంది.

'రత్నా నేను మీరనుకున్నంత మూర్ఖుడిని కాను.'

'సరే అలాగే అనుకుందాం. ఇప్పుడు చెప్పండి మీకెంతమంది స్త్రీలతో పరిచయం ఉంది? నాతో ఉన్నటువంటి స్నేహమే ఇంకెవరితో ఉందో చెప్పండి.'

ఆమె మాటల్లో ఇమిడివున్న అర్థాన్ని తెలుసుకోకుండానే రమేష్ 'మీరు...అమ్మ...వదిన' అన్నాడు.

'అంతేనా?'

'అవును! నా క్లాసులో కొంతమందితో పరిచయం ఉందిగాని, అది స్నేహమనిపించుకోదు.'

'అమ్మ, వదినలమాట అటుంచండి. వాళ్ళిద్దర్నీ జాబితాలో నుండి తీసేస్తే మిగిలేది నేనొక్కదాన్నే. నాలాంటి వాళ్ళు పదిమందితో పరిచయం చేసుకుని, చనువుగా తిరగండి. అపుడు మీరు రత్నకు ఎన్నో స్థానమిస్తారు?'

'ప్రథమ స్థానం.'

'నిజంగానే?'

'అవును.'

'దీన్నే మొండితనం అంటారు. సరేగాని, సాయంత్రంమటుకు నా

మాట తీసెయ్యకండి' అంటూ ప్రతిమాలుకుంది రత్న.

సాయంకాలం నాలుగింటికి సరిగ్గా నళిని 'రత్నా' అని పిలుస్తూ లోపలికి అడుగు పెట్టింది.

'ష్...' అని నోటిమీద వేలుంచుకుని అరవవద్దని హెచ్చరించి వంటగదిలోనికి తీసుకొని వెళ్ళింది.

'ఏమిటీ అంత అర్జంట్‌గా రమ్మన్నావ్?'

'మా ఇంటికి రమేష్ అని ఒకరు వచ్చారు. ఎం.బి.బి.యస్ ఆఖరి సంవత్సరం చదువుతున్నారు. ఇంకా పెళ్ళి కాలేదు. అందగాడు.' మాట నిలిపి నళినివైపు అర్థగర్భితంగా చూసింది రత్న.

నళినికి రత్న చెప్పబోతున్నదేమిటో తెలిసినా, తెలియనట్టుగానే, 'దానికి నన్నేం చేయమంటావ్?' అంది.

'దేవుడు నీకు అందం, తెలివి, యౌవనం విద్య అన్నీ ఇచ్చాడు. జీవితంలో అంతగా ఆసక్తిలేని ఈ అబ్బాయిని వీలయితే వలపించుకో. ఈ పరీక్షలో నువ్వు గెలిస్తే రమేష్‌నే బహుమతిగా పొందుదువుగాని.'

చెంచాతో గ్లాసును మోగిస్తూ రత్న మాటలు వింటోంది నళిని.

'ఏమంటావు?' రత్న అడిగింది.

'ముందు అతడిని చూడాలి నేను తరువాత చెప్తాను. జీవితంలో అతడికి కలిగిన నిరాసక్తి ఎందుకో తెలుసా?'

'ఆప్తులొకరి మరణంతో జీవితంమీద విరక్తి కలిగింది.'

'ఆప్తులంటే?' నళిని కంఠంలో ఆరాటం వ్యక్తమయింది.

'వారి వదిన.'

'అంతేకదా!' తేలికగా నిట్టూర్చింది నళిని.

'రమేష్ బంగారంలాంటి అబ్బాయి. నువ్వు రెండు రోజులు అతడితో కలిసి తిరిగి, వీలయితే నీ వాడిగా చేసుకో.'

'నా కెరియర్ (Career) గతేంకాను?'

'నీ కెరియర్ పాడుగాను. ఆడదానికి కెరియర్ ఏమిటి? భర్తతో కాపురం చేయటమే నీ కెరియర్.'

'ఈరోజు ఎటువైపు వెడదామంటావ్?'

'కమల నెహ్రూ పార్కుకు వెడదామని చెప్పాను. కాని, నాలుగుంపావుకు కుముదని రమ్మని కబురుచేశాను. తను రావటంతో, నేను రాను. మీరిద్దరూ వెడతారు. రేపటి ప్రోగ్రాం నువ్వే అతడితో చెప్పు.'

'అతడిని చూశాక ఏ సంగతీ చెపుతాను' అంది నళిని.

రత్న నళినికి కాస్త దూరంగా జరిగి నిల్చుని పరీక్షగా చూసింది.

నళిని పదిమందిలో ఉన్నా, ప్రత్యేకంగా కనిపించే అందగత్తె. రత్నకు పినతండ్రి కూతురు. ఆ సంవత్సరమే బి.ఏ. పాసయింది. ఒక స్కూలులో టీచరుగా పని చేస్తోంది. నళిని తల్లిదండ్రులు ఆమెకు పెళ్ళి చెయ్యాలని ఆత్రుతపడుతున్నారుగాని, మంచి సంబంధం దొరక్క ఊరుకున్నారు.

నళిని కళ్ళల్లో ఆనందం లాస్యం చేస్తోంది. అందమైన పెదవుల మీద మందహాసం వెలుగుతోంది. చంచలతతో ఆమె కళ్ళు మిలమిలా మెరిసిపోతున్నాయి. పసిపాపలకుండే నిర్మలమైన దేహకాంతి ఆమె నడచిన పరిసరాలకంతా వెలుగును విరజిమ్ముతోంది.

తన అందాన్ని కనిపించేలా అలంకరించుకునే నేర్పు ఉందామెకు.

రత్న ఆమెవైపు చూసి తృప్తిగా నిట్టూర్చింది.

నళిని టీ తాగి లేచేటంతలో, రమేష్ లేచి వచ్చాడు.

రత్న ఇద్దర్నీ ఒకరినొకరికి పరిచయం చేసింది.

'నమస్తే' అంది నళిని చేతులు జోడిస్తూ.

అప్పుడే నిద్రనుండి లేచి వచ్చిన రమేష్ కళ్ళు ఎర్రగా ఉన్నాయి. నిద్రమత్తు వదలని మొహం పసిపిల్లాడి మొహంలా ఉంది. చెదిరిన ఉంగరాల జుట్టు నుదురునంతా కప్పేసింది.

'అందగాడు' అని మనసులోనే అనుకుంది నళిని.

పనిహేను నిమిషాల్లో బయటికి వెళ్ళటానికి సిద్ధమై నిల్చున్నాడు రమేష్. రత్న కూడా వెళ్ళే సన్నాహంలోనే ఉంది కాని, ఆమె కళ్ళంతా వీధి తలుపువై పే ఉన్నాయి.

'కుముద ఇంకా రాలేదేం చెప్మా' అని మాటిమాటికీ ఆ తలుపువైపు చూస్తోంది రత్న. లేని పనిని వెతుక్కుంటూ కాలయాపన చెయ్యసాగింది. ఆఖరికి కుముద కనిపించేసరికి దేవుడి దర్శనమంత సంతోషమయింది రత్నకు. కుముదను పలకరించి కూర్చోబెట్టి, రమేష్‌తో:

'మీరు వెళ్ళిరండి. రాకరాక కుముద వచ్చింది రేపు కావాలంటే అందరం వెడదాం' అంది.

రమేష్‌కి ఏం చెయ్యాలో తోచలేదు. నళిని మౌనంగా రమేష్‌వైపొక సారి, రత్నవైపొకసారి చూసింది. ఆఖరికి:

'పోనీ, అందరం కలిసి వెడదాం' అంది.

రత్న ఒప్పుకోలేదు. 'నా వల్ల మీరు ఆగిపోవటం ఎందుకూ? మీరు వెళ్ళిరండి' అంది.

రమేష్ ఏమనటానికి వీల్లేకపోయింది. మెడబట్టి గెంటించుకున్న వాడిలా నళినీతో బయల్దేరాడు.

అంతవరకూ కుముద మాట్లాడకుండా కూర్చున్నది రత్న అదృష్టమే అనాలి. వాళ్ళు వెళ్ళిపోగానే, రత్న వీపుమీద చిన్నగాకొట్టి, 'ఏమిటే గొడవ' అంది.

'ఏం లేదే. నిన్ను చూద్దామనిపించింది. రమ్మన్నాను' అంది రత్న.

కాని, తరువాత కబుర్లలో ఆసక్తిలేక రత్న పరధ్యానంగా ఉండటం కుముద గమనించింది.

# 10

నిజంగా తనను చూడాలని ఆత్రంతో పిలిపించిన రత్నేనా తను?

ఇప్పటికి వాళ్ళు మలబార్ హిల్స్ ఎక్కుతుంటారు. నళిని ఏం మాట్లాడుతోందో? ఏమైనా మాట్లాడనీ. రమేష్ మనస్సును నొప్పించకుండా ఉంటే చాలు...

'ఏయ్ రత్నా! కలగంటున్నావా?' అని రెండు మూడుమార్లు హెచ్చరించింది కుముద.

రానురాను కుముద వెళ్ళిపోతే చాలు అనిపించింది రత్నకు. ఆమె మనస్సు అక్కడలేని రమేష్ వెంట తిరుగుతోంది.

కుముద ఇంటికి వెడతానని లేచినపుడు రత్నకు హాయనిపించింది. కుముద వెళ్ళిపోతే తను నిరాటంకంగా రమేష్ గురించి ఆలోచించవచ్చు గదా!

కుముద వెళ్ళిపోయింది. ఏడింటికి వచ్చిన ఆశా, తల్లి ఇంట్లో ఉండటం చూసి ఆశ్చర్యంతో కళ్ళు పెద్దగా చేసుకుని:

'అమ్మా! ఇంట్లోనే ఉన్నావేం? మామయ్యతో వెళ్ళలేదూ?' అంది.

'లేదమ్మా, నళిని వెళ్ళింది.'

ఆశా తల్లిని వాటేసుకుని:

'ఇకమీదట నళిననే పంపమ్మా మామయ్యతో! నువ్వు వెళ్ళిపోతే నాకేం తోచదు' అంది.

కూతురుమాట రత్న హృదయాన్ని తాకి గాయపరిచింది.

సుమారు ఎనిమిది ఆ ప్రాంతాలలో నళిని, రమేష్ ఇంటికివచ్చారు. అంత తొందరగా వారు వచ్చేసినందుకు రత్న ఆశ్చర్యపడినా, రమేష్ని చూడగానే ఆమెకు శాంతి లభించింది.

'ఏం ఇంత తొందరగా వచ్చేశారు?'

'పార్కు చూశాం. వచ్చేశాం' అంది నళిని ముక్తసరిగా.

'ఎలా ఉంది మా రోరి పార్కు?' రమేష్‌ని అడిగింది రత్న.

'ఉద్యానవనాల సీమనుండి వచ్చినవారు ఆయన. మన ఊరి పార్కు అంతగా నచ్చినట్టు కనిపించలా' అంది నళిని.

తన గదిలోకి వెళ్ళిపోబోతున్న రమేష్‌ని రత్న ఆపి 'రేపు ఎక్కడికి వెడదాం?' అని అడిగింది.

'అక్వేరియానికి వెడదామని చెప్పాను నేను. లేదా విహార్ లేక్‌కు వెళ్ళినా వెళ్ళొచ్చు. రేపు ఆదివారం ఎలానూ డాక్టర్‌కు తీరికేకదా. అందరం వెడదాం రత్నా!' అంది నళిని.

'అవునమ్మా. అందరం వెడదాం' అంది ఆశా.

'డాక్టర్ నడిగి రాత్రికి ఏ విషయమూ ఫోన్‌చేసి చెపుతాను' అంది రత్న.

ఇద్దరిమధ్యా మూగవాడిలా నిల్చున్న రమేష్,

'నేనలా తిరిగి వస్తాను.'

'నేనూ వస్తాను మామయ్యా' అంటూ ఆశకూడా బయల్దేరింది.

ఇద్దరూ కిందికి దిగి వెళ్ళగానే, రత్న కలవరంతో నళిని వైపు తిరిగి,

'ఏమయింది నళినీ? పాసా? ఫేలా?' అంది.

'ఇంత తొందరగా ఎలా చెప్పను? ఇపుడే ఏమీ చెప్పలేను. చాలా మంచివారిలా కనుపిస్తున్నారు.'

నళిని రమేష్‌ని మెచ్చుకోవటం రత్నకు ఎంతో ఆనందాన్నిచ్చింది.

'ఎక్కువ మాట్లాడేవారిలా కనిపించలేదు. ఎంతసేపూ నేను మాట్లాడించాలేకాని, అతనయి అతనే నన్ను పలకరించలా. మొత్తం మీద కుతూహలం, ఆసక్తి కలిగించే వ్యక్తిత్వం అతడిది.'

'అయితే అతడిని వలపించుకోవటానికి ప్రయత్నిస్తావా?' రత్న ఆతృతతో అడిగింది.

'ఇపుడే ఏమీ చెప్పలేను. నా ప్రయత్నం అంత త్వరగా మానుకోలేనంత అందగాడతను.'

'ఆయనతో ఏం మాట్లాడావ్ ?'

'నా కాలేజి సంగతులూ, ఇపుడు నేను టీచర్‌గా పనిచేస్తున్న స్కూలు విషయాలూ, బొంబాయి జీవితం... ఇవే, కాని మా సంభాషణలో ఎక్కువ పాత్ర నాదే!'

రత్న మెల్లిగా 'రమేష్ ఒక్కసారైనా నీ వైపు మెచ్చుకుంటున్నట్టు చూశాడా?' అని అడిగింది.

ఈ విషయంలో మటుకు నళినికి అసంతృప్తిగా వుంది.

బొంబాయి నాగరిక వాతావరణంలో పెరిగిన గడుసుపిల్ల నళిని. ఎంతమందిలోవున్నా కనుపించే లావణ్యవతి.

రమేష్ ఔదాసీన్యం ఆమె సౌందర్యాన్నే అవమానపరిచినట్టు నళిని భావించింది కాని, ఆ ఉదాసీనతే అతడిని మెచ్చుకొనేలా చేసింది.

తన సౌందర్యానికి మరులుకాని అతడిని ఎలాగైనా తనవాడిగా చేసుకోవాలన్న పట్టుదల కలిగింది నళినికి.

నళిని లేచి నిల్చుని 'ఇక వస్తాను రత్నా. డాక్టరు వచ్చాక ఫోన్ చెయ్యి' అంది.

రమేష్, ఆశా లోపలికి అడుగు పెట్టారు.

నళిని చిరునవ్వునవ్వి, చేతులుజోడించి 'వస్తాను' అంది.

రమేష్ కూడా చేతులు జోడించాడు యాంత్రికంగా.

నళిని వెళ్ళిపోగానే రత్న అడిగింది. 'పార్కు ఎలావుంది?'

'ఓ మోస్తరుగా వుంది.'

'మా బొంబాయికి చెందిన వాటిని మీరు మెచ్చుకున్నట్టు కనిపించదు. అవునా?'

'కాదు. మీరు పొరపడుతున్నారు. బొంబాయికి చెందిన రెండు వస్తువులు నాకు చాలా నచ్చాయి.'

'ఏమేమిటో?' కుతూహలంతో అడిగింది రత్న.

'ఒకటి సముద్రం, ఇంకొకటి సముద్రంలో దొరికే వస్తువు.'

'అంతే?... ఓ.. ' రత్న మొహం క్షణమాత్రంలో కెంపుల రాశిలా ఎర్రబడిపోయింది.

'నిజం చెప్పండి రత్నా! ఈ రోజు నాతో రాకుండా ఎందుకు తప్పించుకున్నారు? నన్ను చూస్తే మీకు భయమా! మీ అనుమతి లేకుండా ఇహ ఎప్పటికీ నిన్నటి తొందరపడను. నా తొందరపాటుకు మీరేం శిక్ష విధించినా అనుభవిస్తాను.'

'నిజంగా?'

రత్న కుడి కనుబొమను పైకెత్తి 'నిజంగా?' అన్నప్పుడు రమేష్ కంటికి అతి మనోహరంగా కనిపించింది.

'ఊఁ!'

రత్న చుట్టూచూసింది. ఆశ కనిపించలేదు. వేగంగా రమేష్‌కు దగ్గరగా వచ్చి తనకన్నా ఎత్తుగావున్న అతడి తలను రెండు చేతులతోనూ పట్టుకుని వంచి నుదుటిమీది జుట్టు వెనక్కు తోసి నుదుటిమీద మృదువుగా ముద్దు పెట్టుకుని వెనక్కు జరిగి;

'ఇదే నేను మీకు విధించే శిక్ష' అంది.

'రత్నా...!'

'ఉహుఁ! ఇక మనం "సెంటిమెంటల్‌గా" వుండటం మానేద్దాం.'

'రత్నా...!'

'రమేష్! వద్దు. మీకు పుణ్యముంటుంది.'

'రత్నా...!'

'మీరు చుట్టి చుట్టి మళ్ళీ అదే విషయానికి వచ్చారంటే, నాకు పిచ్చెత్తుతుంది. దయచేసి ఇంకేమైనా మాట్లాడుకుందాం.'

ఆమె గాంభీర్యంచూసి రమేష్ మెదలకుండా వూరుకున్నాడు.

'నళిని ఎలాంటి పిల్ల?' రత్న అడిగింది.

'మంచి అమ్మాయే! కొంచెం మాట లెక్కువ.'

'చూడటానికి ఎలా వుంది?'

'బాగుంది.'

'అంతేనా?'

'కాక, నళినిని నాతో షికారుకు పంపటంలో మీ వుద్దేశ్యం?'

'దానిలో పెద్ద వుద్దేశ్యమేముంది? మీకు మా వాళ్ళను పరిచయం చేద్దామనిపించింది. నళినికి కబురంపాను అంతే!'

'నమ్మమంటారా?'

'నమ్మండి.'

శేషగిరి వచ్చాక, రత్న విహార్ లేక్‌కు వెళ్ళే విషయం కదిపింది. కాని, అతడికి ఇలాంటి విషయాల్లో అంత ఆసక్తి వుండదు.

అతను ఆయాసంతో కళ్ళు మూసుకుని 'చూద్దాం' అన్నాడు.

'నళినికి ఏమని చెప్పను?'

'వెళ్ళేటట్టయితే వుదయం ఎనిమిదింటికి వాళ్ళింటికి వస్తామని చెప్పు.'

బాల్కనీలో నిల్చుని వీథివైపు చూస్తున్న రమేష్ ఎందుకో వెనక్కు తిరిగిచూశాడు.

శేషగిరి రత్న మాట్లాడుకుంటున్నారు. రత్న మొహం మీద మంద హాసం వెలుగుతోంది.

పనిచేసి అలసివచ్చిన శేషగిరి అలసటతో కళ్ళు మూసుకుని వున్నాడు.

అతడికి రత్న మాటలవైపు దృష్టి వున్నట్టేలేదు.

కాని, నిరంతరం వెలిగేదీపం రత్న మందహాసం.

ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అనే భేదం లేకుండా ఎల్లవేళలా ప్రశాంతంగా వెలిగే నందా దీపం ఆమె నవ్వు.

ఆశ నేలమీదకూర్చుని ఏదో బొమ్మల పుస్తకం చూసుకుంటోంది.

రమేష్ కళ్ళకు ఓ సుందరమైన చిన్నారి సంసార చిత్రం కని పించింది.

అతను ఆ సంసారంలోనివాడు కాడు. తనకూ ఆ సంసారానికి ఏ విధమైన బంధుత్వమూ లేదు.

తను అక్కడెందుకుండాలి?

రమేష్‌కి వెంటనే తన వస్తువులు సర్దుకుని చప్పుడు కాకుండా వెళ్ళి పోవాలనిపించింది. అతడు రెండు చేతులతోనూ కణతలను అదిమి పట్టు కున్నాడు.

రెండు నిమిషాలు ఆగి, మళ్ళీ అటువైపే చూశాడు రమేష్.

ఈసారి అతడి కళ్ళు రత్నమీదే నిలిచాయి.

రత్న, శేషగిరి దగ్గర వున్నప్పుడు తనకు పరాయిదానిగా అనిపించేది.

తన దగ్గర వున్నప్పుడు జన్మ జన్మాంతరాల బాంధవి అన్నట్టు స్నేహంగా, ఆత్మీయతతో మెలిగేది.

అది నటనా లేక నిజమయినదా?

శేషగిరి కళ్ళు తెరచి రత్నతో ఏమో చెప్పాడు.

రత్న నవ్వుతూ బదులు చెప్పినప్పుడు– రమేష్ హృదయం అసూయతో వుడికిపోయింది.

తనలో అసూయాగ్ని కణాన్ని రగుల్కొల్పిన రత్నను రమేష్ ఆ నిమిషంలో బద్ధ శత్రువులా ద్వేషించాడు. అతడు చూస్తూండగానే రత్న వంటింట్లోకి వెళ్ళిపోయింది.

'ఆశా! అందర్నీ భోజనానికి రమ్మను!' వంటింట్లోనుండి పిలుపు వచ్చింది.

వాళ్ళతో కలిసే అధికారం తనకు లేదనిపించి రమేష్ చీకట్లోనే నిల్చుండిపోయాడు.

శేషగిరి, ఆశా భోజనానికి వంటగదిలోకి వెళ్ళారు. కాస్సేపటిలో రమేష్‌ని వెతుక్కుంటూ వచ్చింది రత్న.

రమేష్ చీకట్లో నిల్చోవటం చూసి, బాల్కనీలైటు స్విచ్ వేయటానికి చెయ్యి చాచింది.

ఆ చేతిని తన చేతితో అందుకుని రమేష్:

'రత్నా—' అన్నాడు.

'ఏమిటి?'

'మీరు నన్ను ప్రేమిస్తున్నారా?'

'ఇదేం ప్రశ్న? వాళ్ళిద్దరూ అన్నం తింటున్నారు. మీరూ రండి.'

'నేను అడిగినదానికి బదులు చెపితేగాని రాను.'

రత్న కొంటెగా 'ప్రేమించటంలేదని చెపితేనో?' అంది.

'ఈ బాల్కనీనుండి కిందకి దూకేస్తాను.'

రత్న మౌనంగా అతని చేతిని నొక్కి, లోపలకు వెళ్ళింది. రమేష్ సంతృప్తి చెందాడు.

మర్నాడు వుదయం తను విహార్ లేక్ కి రాలేనని చెప్పేశాడు శేషగిరి.

'మీరు వెళ్ళిరండి. నేను ఇంట్లోనే వుంటాను' అని ఖచ్చితంగా చెప్పేశాడతడు.

ఆఖరికి రమేష్, రత్నా, ఆశా ఇంటినుండి బయల్దేరి నళిని యింటికి వెళ్ళారు. రమేష్ని నళిని తల్లిదండ్రులకు పరిచయంచేసింది రత్న.

నళిని చూపరులకు ముద్దుగొలిపేలా అలంకరించుకొంది.

జరీ పువ్వుల తెల్ల సిల్కుచీరలోనున్న నళినిపైనుండి తన చూపును మరల్చుకోలేకపోయింది రత్న.

ఆశా, నళిని కాళ్ళకు పెనవేసుకుని 'అక్కయ్యా— నువ్వెంత బాగున్నావ్! నీ జడ ఎంత పొడుగో, నాకు జడేలేదు! అమ్మా! అక్కయ్యెంత బావుందో చూడు- నేను అంత బాగాలేనుకదూ-' అంది.

'అవునమ్మా, నువ్వు నాలాగున్నావు' అంది రత్న.

రమేష్ నళినీలను తన మనస్సులో పక్క పక్కగా నిలబెట్టి చూసి రత్న :

'ఎంత అందమైన జంట' అనుకుంది.

నళిని యింటినుండి బయల్దేరేసరికి తొమ్మిదిగంట లయింది.

ఆ రోజు ఆదివారం కావటంవల్ల విహార్ లేక్ అంతా జనసమ్మర్దంతో నిండిపోయింది.

ఆ సందడినీ, అందమైన తోటను చూడగానే, ఎగిరి గంతులు వేసింది ఆశా.

అందర్నీ వదలి వుత్సాహంతో పరుగులు తీస్తున్న కూతుర్ని వెంబడించే సాకుతో రమేష్ నళినీలను వదలి ముందుకు వెళ్ళింది రత్న.

కాని, ఆశా తల్లి చేతికి దొరికితేనా?

ఆశా భూతాకారపు బొమ్మల నోటిలో ప్రవేశించి ఆటలాడింది. తల్లి చేతికి అందకుండా ఏడిపించింది.

రమేష్ నళినితో కలిసివస్తున్నా, అతడి కళ్ళు కూతురితో ఆడుకుంటున్న రత్నమీదనే వున్నాయి.

నళిని మాటలమీద దృష్టే లేదతనికి.

రత్న ఎక్కడైనా మనుష్యుల గుంపులో కనుమరుగయినపుడు అతడి కళ్ళు ఆ సమీపంలోనే రత్నకోసం వెతుకుతున్నాయి.

కూతురి ఆట పాటల్లో మైమరచిన రత్ననుచూచి అసూయ కలిగించింది రమేష్‌కి.

రత్న ఎంతమందిని ప్రేమించగలదు?

తన కూతుర్ని అంతగా ప్రేమించే రత్నకు తనమీదకూడా ప్రేమ వుండటం సాధ్యమా?

'ఏమయినాసరే, ఈరోజు ఈ సంగతి తప్పకుండా తేల్చేయాలి' అనుకున్నాడు రమేష్.

'రమేష్! అటు చూడండి. నీళ్ళలో చెట్టు, మబ్బుల ప్రతి బింబం ఎంత బావుందో–'

సరిగ్గా వినిపించుకోని రమేష్ 'ఏమిటి? ఎక్కడా?' అని కంగారు పడ్డాడు.

ఇహ రమేష్‌ని మాట్లాడించాలనే ఆశ వదులుకుంది నళిని. తనూ రమేష్‌తోబాటు రత్న, ఆశలను వెతకసాగింది.

చెట్టునీడలో గడ్డిమీద కూర్చున్న రత్నను చూడగానే 'ఎక్కడికి వెళ్ళారు మీరు? వెతకలేక చచ్చాం' అంది.

'నిజంగా?'

'ఊం. కావాలంటే వీరిని అడుగు' అంటూ రమేష్‌వైపు చూసింది నళిని.

రమేష్ 'నిజంగా?' అంటున్న రత్న మోహక భంగిమను చూస్తూ నిల్చున్నాడు.

నళిని మొహం తెల్లగా పాలిపోయింది.

ఆమె మొహంలోని వెలుగు, నూనె అయిపోగానే ఆరిపోయే దీపంలా, ఆరిపోయింది.

మరుక్షణంలోనే తేరుకుంది నళిని.

మామూలుగానే నవ్వుతూ వెళ్ళి, రత్న పక్కన కూర్చుంది. పొద్దెక్కుతున్న కొద్దీ వేడి ఎక్కువకాసాగింది. సోడా అమ్మేవాళ్ళ వ్యాపారం బాగా సాగుతోంది.

'అమ్మా! నాకు ఐస్‌క్రీమ్.'

'రా; ఐస్‌క్రీమ్ ఇప్పిస్తాను' అంటూ లేచింది రత్న.

నళిని 'నువ్వుండు రత్నా! నేను ఇప్పిస్తాను' అని ఆశ చెయ్యి పట్టుకుని బయల్దేరింది.

రమేష్ రత్న ఇద్దరే మిగిలారు.

రత్నే మాటలు ప్రారంభించింది:

'నళిని చాలా మంచిపిల్లకదూ?'

'అవును.'

'రూపం, విద్య, బుద్ధి అన్నీవున్నా, గర్వంలేదు.'

'నిజం.'

'ఆమెను చేపట్టే వరుడు అదృష్టవంతుడు.'

'అవును.'

రత్న అర్థగర్భితంగా రమేష్‌వైపు చూసింది రమేష్ ఏమీ తెలీనట్టే నటించాడు.

'రత్నా! మీకు ఆశంటే చాలా ప్రేమకదూ?'

రత్న ఆశ్చర్యంతో తలెత్తి 'అదేం ప్రశ్న!' అంది.

'చెప్పండి.'

'ఏ తల్లికుండదు తన పిల్లమీద ప్రేమ? దీనిలో అడగటానికేముంది?'

'కాని, మనిషి హృదయం ఎంతో చిన్నది. ఒకేసారి ఎంతమందిని ప్రేమించగలదు?'

'హృదయపు ఆకారం చిన్నది, కాని అందులోని భావనలు విశ్వాన్నంతా ఆవరించగలవు. ప్రేమకు మరో పేరే దేవుడు అనటం అబద్ధం కాదు. దేవుడు సర్వశక్తి సంపన్నుడు, సర్వాంతర్యామి, సర్వవ్యాపి అని వినే వున్నారుగా.'

'రత్నా! మీరు ఆశను ఎంతగా ప్రేమిస్తున్నారు?'

'ఒక తల్లి తన పిల్లను ఎంతగా ప్రేమించగలదో అంతగానూ ప్రేమిస్తున్నాను.'

'రేపు మీకు నలుగురు పిల్లలు పుట్టినా, ఆశను ప్రేమించినట్టే వాళ్ళనూ ప్రేమించగలరా?'

'ఏం ప్రశ్న లడుగుతున్నారు మీరు! నలుగురు పిల్లల తండ్రయ్యాక మిమ్మల్ని ఇదే ప్రశ్న అడుగుతాను. మీ రప్పుడేం జవాబు ఇస్తారో, నేనూ అదే ఇప్పుడు ఇవ్వగలిగేది.'

రమేష్ గడ్డికొసను పంటితో కొరుకుతూ:

'నేను తండ్రిని కాబోను' అన్నాడు.

'అంటే?'

'నేను పెళ్ళిచేసుకోను.'

రత్న నవ్వి 'పెళ్ళికాకముందు యువతీ యువకులందరూ ఇదే మాట అంటారు' అంది.

'ఖచ్చితంగా చెపుతున్నాను నేను.'

'కారణం తెలుసుకోవచ్చా?'

'ఆఁ. నిరాశే కారణం.'

'ఎలాంటి నిరాశ?'

'నేను అపురూపమైన రూపవతిని పెళ్ళాడాలని కోరుకునేవాడిని. రూపంకోసం అన్వేషిస్తున్న నా మనసు కెవరూ నచ్చలా...'

రత్న మధ్యలో అందుకుని 'మీకు నచ్చే రూపసిని నేను తేగలను' అంది.

'కావచ్చు కాని, ఇపుడు రూపసిని మెచ్చుకునే మనఃస్థితిలో లేను నేను.'

కారణం అడిగే ధైర్యం రాలేదు రత్నకు. అతడి దృష్టిని ఎదిరించ లేక తలవంచుకుని కూర్చున్నది.

'నాకు నచ్చిన యువతికి... పెళ్ళయిపోయింది.' మెల్లిగా అన్నాడు రమేష్.

ఆమె ఎవరని అడగటానికి ప్రయత్నించి, చివరికి మౌనమే మంచి దనుకుంది రత్న.

'రత్నా! ఇపుడు నేనేం చెయ్యాలో చెప్పండి!' రమేష్ ఆమెనే అడిగాడు.

'ప్రేమ గుడ్డిది. నిజం; కాని, ప్రేమకుకూడా కొంచెం విచక్షణా జ్ఞానం వుండాలి.'

'ఇపుడేం చేయను?'

'ఏమీ చేయకండి. ఆమెను మరిచిపోయి ఇంకో అందగత్తెను పెళ్లాడి సుఖంగా వుండండి.'

'రత్నా! మీరు మనఃపూర్వకంగా ఈ సలహా ఇస్తున్నారా?'

రత్న తలెత్తి అతడివైపు చూసింది.

ఆమె కళ్ళలో బాధ స్పష్టంగా కనిపిస్తోంది. అతడిమీద అభిమానం, వ్యథా ఆమె మొహంలో గూడుకట్టుకున్నాయి.

'నా ఆత్మను హింసించకండి రమేష్! నాకు అంత శక్తిలేదు.'

'మనఃపూర్వకంగానే ఇస్తున్నారా ఈ సలహా?'

'అవును, పెళ్ళి ఒకటే మీరు పాతదాన్నంతా మరిచి జీవించటానికి సాయపడుతుంది. మీ సంసారమూ, వృత్తి వీటి సహాయంతో అన్నీ మరచి పోగలరు.'

'నాకు మీ మాటమీద నమ్మకం కలగటంలేదు.'

'నామాట నమ్మండి. మొదట కొన్ని రోజులు పాతవాటిని మరిచి పోలేక పోవచ్చు. కాని, క్రమేణా అన్నీ సరిపోతాయి. ఒక స్త్రీ కాని, పురుషుడుకాని ఒకర్నొకరు పోగొట్టుకుని జీవితమంతా ఏడవవలసింది ఏమీ లేదు. ఎవరికీ అంతటి విలువనివ్వరాదు.'

'నోటితో చెప్పటం సులువే. ఆచరణలో పెట్టటమే కష్టం.'

'కష్టమంతగా ఏం వుండదు. పోను పోను అన్నీ మీకే తెలుస్తాయి.'

రమేష్‌కి దూరంలో నళిని, ఆశా రావటం కనిపించింది. వెంటనే తను అడగాలనుకున్న ప్రశ్న గుర్తుకు వచ్చింది.

'రత్నా! నేనొకటి అడుగుతాను, చెప్పాలి' అన్నాడు.

'ఏమిటది?'

'మీరు నన్ను ప్రేమిస్తున్నారా?'

రత్న చిన్నగా నవ్వి 'కొన్ని ప్రశ్నలు అడగరాదు. వాటికి జవాబు దొరకదు' అంది.

'కాదు చెప్పండి.'

'మీకేమనిపిస్తోంది?'

'మనమిద్దరమే వున్నప్పుడు మీరు నన్ను ప్రేమిస్తున్నారనే అనిపిస్తుంది. కాని, మీరు ఆశతో కలిసి ఆనందంగా ఆడుకుంటున్నప్పుడు ఆశను ప్రేమించినంతగా నన్ను ప్రేమించటం లేదనిపిస్తుంది. మీరు నిజం చెప్పండి.'

'నిజం తెలుసుకుని ఏం చేద్దామని?' కొంటెగా అడిగింది రత్న.

'నన్ను బాధపెట్టక చెబుదురూ' అన్నాడు రమేష్.

రత్న చుట్టూచూసి మెల్లిగా 'వీలయితే మిమ్మల్ని నా కంఠహారంగా మార్చి మెళ్ళో వేసుకునేదాన్ని' అంది.

'కంఠహారంగానా? ఎందుకూ?'

'హృదయానికి దగ్గరగా వుంటుందని.'

రమేష్ ఆనందానికి అంతులేదు.

నళిని, ఆశా దగ్గరగా లేకపోతే తన సంతోషాన్ని ఏ విధంగా చూపేవాడో?

మోకాలిమీద తల ఆన్చి పచ్చగడ్డిమీద కూర్చుంది రత్న.

పెద్ద ముడిమీద మల్లెపూల దండ అమర్చుకుంది. ముడి మధ్య కెంపుల బిళ్ళ మెరుస్తోంది.

వెనుకనుండి చెక్కిన ప్రతిమలా వున్న రత్ననుచూస్తూ, నళిని నిదానంగా నడిచి వచ్చింది.

ఆశా పరుగెట్టుకుంటూ వచ్చి తల్లి ఒళ్ళోపడి:

'అమ్మా! ఐస్‌క్రీమ్ ఎంత బావుందో' అంది.

'ఇంతసేపయిందేం?' నళినివైపు తిరిగి అడిగింది రత్న.

'నళిని అక్కయ్య నన్ను నీళ్ళ దగ్గరకు తీసికెళ్ళింది. అమ్మ దగ్గరకు వెడదాం అంటూంటే వినకుండా ఎక్కడికో తీసికెళ్ళింది–'

రత్న గుండె దడదడలాడింది.

గబుక్కున నళిని మొహం చూడాలనిపించింది. కాని, తలెత్తిచూసే ధైర్యంరాలేదు. కాసేపయ్యాక ఏదో మాట్లాడుతూ నళినివైపు చూసింది.

అందమైన ఆ మొహంమీద రాసిన కథ స్పష్టంగా కనిపించింది రత్నకు.

నల్లటి వుంగరాలజుత్తు ఆవరించి వున్న ఆ ముద్దు మొహంలో నిరాశ చోటు చేసుకుంది.

ఇలాంటి పిల్లవైపు తలెత్తి చూడలేని రమేష్ ఎంతటి మూర్ఖుడు!

రమేష్‌కి బాగా బుద్ధిచెప్పాలి అనుకుంది రత్న.

ఒకవిధమైన నిరాశ, అసంతృప్తి, వ్యథలతోనే ముగ్గురూ ఇంటిదారి పట్టారు. ఐస్ క్యాండీ తింటున్న ఆశా మాత్రం ఆనందంగానే వుంది.

దోవలో ఎవరూ ఎక్కువగా మాట్లాడలేదు.

రమేష్‌వైపు ఆకర్షించబడిన నళినికి అతడి దృష్టి వేరే చోట్లో వుందని తెలిసినపుడు, తన అందం, చాతుర్యం అంతా వ్యర్థమనిపించి నిరాశచెందింది.

నళిని మౌన కారణం గ్రహించి రత్న నొచ్చుకుంది. నళిని తన ఇంటివైపు తిరిగినపుడు;

'సాయంత్రం మెట్రో వెడదాం రా, మంచి పిక్చరే వచ్చింది.'

'లేదు రత్నా! నేను రాలేను. నా స్నేహితురాలింటికి వస్తానని మాటిచ్చాను. క్షమించు' అని రమేష్‌వైపు తిరిగి 'వస్తాను' అని చేతులు జోడించింది.

నళిని వెళ్ళిపోగానే రత్న రమేష్‌వైపు తిరిగి:

'నళిని అదోమాదిరిగా వుంది' అంది.

'అలాగా, నేను గమనించలేదు.'

'మీరు ఆమె నేమీ నొప్పించలేదు కదూ?'

'ఛా. నే నామెతో మాట్లాడితేకదా' అని తనను తాను సమర్థించు కున్నాడు రమేష్.

నళినికి అంతకన్నా మరో అవమానం ఏముంది?

'మీరెందుకు మాట్లాడలేదు? మాట్లాడితే ముత్యాలు రాలుతాయనా? మీరు మాట్లాడించలేదనే ఆ అమ్మాయి చిన్నబుచ్చుకుంది. పాపం! ఎందుకలా చేశారు మీరు?'

రమేష్ అపరాధిలా తల వంచుకుని;

'ఏమని మాట్లాడించాలో నాకు తెలియలేదు' అన్నాడు.

'నా దగ్గర గంటలకొద్దీ మాట్లాడతారు కదా. నళినితో మాట్లాడటానికేమీ తోచలేదూ?'

'మీరు నళిని కాదు. రత్న.'

'ఎవరైతేనేం? మీ రామెను మాట్లాడించకుండా తప్పు పనిచేశారు.'

'ఏమని మాట్లాడించాలి?'

'నువ్వు చాలా అందంగా వున్నావు అని చెప్పాల్సింది.'

'ఇది మరీ బావుంది. అందంగా వున్నవాళ్ళను అందంగా వున్నావనటంలో విశేషం ఏముంది? అన్నంతిని, కంచం కడుగుతున్నవారిని "భోంచేశారా" అని అడిగినట్టు వుంటుంది.'

'పొండి! నేను మీతో మాట్లాడను' అంది రత్న కోపంగా.

తమిద్దరి మధ్యా ఆశ వుండకపోయినట్టయితే అనుకున్నాడు రమేష్.

తలుపుకు వేసిన తాళాన్ని చూసి రత్న కనుబొమలు ముడిపడ్డాయి.

'ఆశా! దేశాయిగారింటికి వెళ్ళి తాళంచెవి తీసుకురా' అంది రత్న. ఆశ వెళ్ళగానే రమేష్:

'కోపం చేసుకోకండి. నళినిని ఏమని పలకరించాలో నాకు తెలియలేదు. ఈసారికి క్షమించండి' అన్నాడు.

పశ్చాత్తాపంతో నిండిన అతని మొహాన్ని చూసి రత్న కోపమంతా కరిగిపోయింది. కాని, దాన్ని కనబడనీయకుండా మౌనంగానే నిల్చుంది.

'సాయంతం మెట్రో వెళదామా?'

'ఊహు! నేను రాను.'

'నేనింకా ఆ థియేటర్ చూడలేదు.'

'వెళ్ళి చూసిరండి.'

'ఒక్కడినే వెళ్ళటాని కిష్టం లేదు.'

'అయితే నళినిని పిలవండి.'

రమేష్ వుత్సాహంతో 'అలాగే. దారిలో నళినిని కూడా తీసుకునే వెడదాం' అన్నాడు.

ఆశ తాళంచెవి తీసుకుని వచ్చింది. రత్న తాళం తీసి ఇంట్లోకి అడుగు పెట్టింది.

శేషగిరి చిన్న చీటీ రాసిపెట్టాడు టేబుల్ మీద.

'నా కోసం భోజనానికి కాచుకోకండి.'

రత్న మొహం వాడిపోయింది.

'ఏం జరిగింది?' అన్నాడు రమేష్.

'ఏమీలేదు. ముందు మీరు కాళ్ళు కడుక్కోండి.'

'డాక్టర్ని రానివ్వండి.'

'కాచుకోవద్దని రాశారు.'

భోజనా లయ్యేసరికి రత్న మనస్సు కాస్త కుదుటబడింది. రత్న ప్రసన్నంగా వుండటం చూసి రమేష్:

'సాయంత్రం మెట్రో వెడదాం' అన్నాడు.

'మీరే నళినితో చెప్పండి' అని రిసీవర్ రమేష్ చేతికిచ్చింది. ఇష్టం లేకపోయినా ఫోన్ చేశాడు రమేష్

'సాయంత్రం నాలుగింటికి వస్తాం. మెట్రోకి వెడదాం.'

ఒక క్షణం వూరుకుని 'క్షమించండి. నేను రాలేను' అని ఫోన్ పెట్టేసింది నళిని.

రమేష్ రెండుమార్లు హలో అని జవాబు రాకపోయేసరికి వూరుకున్నాడు.

'ఏమంది?' కుతూహలంగా అడిగింది రత్న.

'రాదట.'

'అయితే నేనూ రాను.'

'నాకు మెట్రో చూపించరా?'

'మీకు నేను చూపించటమేమిటి? మీరే వెళ్ళి చూసిరండి.'

రమేష్‌కి ఆమెతో దెబ్బలాడాలనిపించింది. కాని, ఆశ దగ్గరలోనే వుండటంతో వూరుకోవాల్సి వచ్చింది.

నాలుగ్గంటలవుతూంటే, రమేష్ నిలవలేకపోయాడు.

ఆఖరికి స్థిరంగా, మౌనంగా కూర్చున్న రత్న దగ్గరకు వెళ్ళి;

'వెడదామా?' అన్నాడు.

'ఎక్కడికి?'

'మెట్రో!'

'క్షమించండి. నేను రాలేను.'

'రత్నా! ఎందుకు నన్నిలా ఏడిపిస్తున్నారు?'

'ఈ రోజు నేను రాలేను...' అంటూండగానే ఫోన్ మ్రోగింది. శేషగిరి ఫోన్ చేశాడు.

'స్నేహితులతో సినిమాకు వెడుతున్నాను. రాత్రి రావటం ఆలస్య మవుతుంది. నా కోసం కాచుక్కూర్చోకండి.'

రత్న రిసీవర్ క్రిందపెట్టి రమేష్ వైపు తిరిగి,

'వస్తాను' అంది.

ఆనందంతో రమేష్ మొఖం వికసించింది.

రత్న ఆశకు గుడ్డలు మార్చి తనూ అలంకారం చేసుకుంది. ఇంటికి తాళంవేసి తాళం చెవి ఆశ చేతికిచ్చి;

'మంజు తల్లికి యిచ్చేసిరా' అంది.

'ఉన్నట్టుండి మనస్సు మార్చుకున్నారేం?' అని,

'నళినిని వాళ్ళింటికి వెళ్ళి పిలుద్దామా?'

'వద్దు' అంది రత్న ముక్తసరిగా.

మెట్రోలాంటి దివ్యమైన థియేటర్‌ను అంతవరకూ చూసి ఎరుగడు రమేష్.

అలాంటి థియేటరులో కూర్చుని ఎంత చెత్త పిక్చరయినా చూడ వచ్చు అనిపించింది రమేష్‌కి.

క్రిందపరచిన రత్నకంబళి, కుషన్ కుర్చీలు, అద్దాలు, హితమైన వాతావరణం, అతడిని వేరే లోకంలోకి తీసుకువెళ్ళాయి.

కుర్చీలో కూర్చుని రమేష్ రత్నతో,

'బొంబాయిలో చూడదగినవి మూడున్నాయి' అన్నాడు.

'ఏవేవి ?'

'సముద్రం, మెట్రో, మీరు.'

రత్న కళ్ళు చెమర్చాయి. రుద్ధ కంఠంతో,

'రమేష్! నేను మామూలు స్త్రీని. నన్నెందుకింత వున్నత స్థాయిలో కూర్చోబెడతారు ? మీరిలా మాట్లాడితే నాకు బాధకలుగుతుంది' అంది.

రమేష్ కాస్సేపు వూరుకొని,

'రత్నా ! నన్నెప్పుడు వూరికి పంపిస్తారు?' అన్నాడు.

రత్న అదరిపడింది. రమేష్ తమ యింటికి అతిథిగా వచ్చిన వాడు. కొద్దిరోజులుండి వెళ్ళిపోతాడు అనే విషయం అపుడే గుర్తుకొచ్చిందామెకు.

తరువాత ... తరువాత ... తను ... ఎలా?

'ఊరికి వెళ్ళే మాటలతో నన్ను భయపెట్టకండి రమేష్!'

'అయితే ఇక్కడే వుండిపొమ్మన్నారా?'

'ఊ! మీరు వెళ్ళిపోతే నాకేం తోచదు.'

'ఏం?'

'మీరు వెళ్ళిపోతే తరువాత ఇంత ప్రేమగా, స్నేహంగా నన్నెవరు చూస్తారు?'

రమేష్ చీకట్లో చటుక్కున ఆమె చేతిని పట్టుకుని;

'రత్నా! ఇపుడు నన్నేం చెయ్యమంటారో చెప్పండి' అన్నాడు. అలా అంటున్నట్టుగానే అతడి ధ్వని భారమైంది. వుద్వేగంతో వేగంగా వూపిరి వదులుతున్నాడు.

'అంటే?'

'నాకు ఏం చెయ్యటానికి తోచలేదు. మీరు ఎలా చెపితే అలా చేస్తాను. నేనిక్కడికి వచ్చిన వుద్దేశమే వేరు. దుఃఖపు వలనుండి తప్పించుకుందామని ఇక్కడికి పారిపోయి వచ్చాను. కాని ఇక్కడ ఇంకో వలలో చిక్కుకున్నాను. రత్నా! నేనేం చేయను?'

దారి తప్పిన పిల్లాడిలా, అసహాయుడై 'ఏం చేయను?' అని తన్నడుగుతున్న రమేష్‌ని తన హృదయానికి హత్తుకోవాలనిపించింది రత్నకు.

థియేటరులో వున్నది మసకవెల్తురే అయినా, చుట్టూవున్న మనుష్యులను చూసి తన కోర్కెను లోలోపలే అణుచుకుంది రత్న.

'ఏం చేయను రత్నా?'

'నేనూ మీలాగే అసహాయురాలిని రమేష్. మీరీ వూరికి అసలెందుకొచ్చారు? మీరు రాక మునుపు నేను నిశ్చింతగా వుండేదాన్ని.'

'కాని, సంతోషంగా వుండేవారా?'

'అవన్నీ అడగరాని ప్రశ్నలు. మీ రెందుకొచ్చారు?'

'తరువాత చెపుతాను నే నెందుకొచ్చానో...'

ఇద్దరూ సినిమా చూడటంలో మునిగిపోయారు.

# 11

ఇంటికివచ్చి భోజనాలవటమే ఆలస్యం, రత్న అడిగింది.

'బొంబాయికి ఎందుకొచ్చారు?'

ఆశా: 'అమ్మా! పక్కవేయమ్మా!' అంది. రత్న పక్కవేసి ఆశను నిద్రపుచ్చింది.

రమేష్ అన్నాడు.

'ఇపుడు అనిపిస్తోంది. నేనిక్కడికి రాకుండా వుండాల్సిందని. అక్కడే వుంటే బాగుండిపోయేది. ఇక్కడికి రావటమే మొదటి తప్పు. మీతో ఆత్మీయత పెంచుకోవటం రెండవతప్పు. రత్నా! నేను వెళ్ళిపోతాను. నన్ను పంపించేయండి, ఇహ ఇక్కడుంటే నాకు పిచ్చిపట్టక మానదు.'

'పిచ్చా?'

'ఊఁ! రత్నపిచ్చి. నా మనసు నా ఆధీనంలో వుండటం లేదు. నే నిక్కడే వుంటే, ఏం జరుగుతుందో నేను చెప్పలేను. రత్నా! నన్ను పంపించేయండి.'

'ఎలా పంపను?'

'మెడపట్టి గెంటేయండి.'

'అది నా చేతకాని పని.'

'చేతనయ్యేలా ప్రయత్నించండి. రత్నా! నేనో ప్రశ్న అడుగు తాను దాచుకోకుండా జవాబు చెపుతారా ?'

'అడగండి.'

'నన్ను మీరెందు కింతగా పట్టించుకున్నారు?'

'ఇంతగా అంటే ?'

'చాలా!'

'కొన్ని విషయాలను వివరించి చెప్పటం కష్టం. మొదట్లో మిమ్మల్ని చూసినపుడు కుతూహలం కలిగింది. క్రమేణా కుతూహలం జాలిగా మారింది. జాలినుండి స్నేహం, ఆత్మీయత, ఇలాగే ... కాని, రమేష్! మీరు నా గురించి అదేపనిగా ఆలోచించకండి. నాకు భయమేస్తుంది.'

'ఎందుకూ?'

'మీరు సుఖంగా వుండాలంటే, నన్ను మరచిపోవాలి. కాలమే అన్నిటినీ మరిపించగలదు.'

'అయితే నన్ను పంపించేయండి.'

'కాని ఎలా పంపను? మిమ్మల్ని పంపించటానికే నాకు మనసు రావటంలేదు. అలా అని మిమ్మల్ని ఇక్కడే కట్టివేసుకోలేను. మీ స్నేహం నాకు కావాలి. కాని, దానినుండి మీకే హాని కలుగరాదు.'

'మరి మీకో?'

'నా విషయం వదిలేయండి. ఎలాంటి పరిస్థితినైనా నేను నవ్వుతో ఎదిరించగలను. నాకు మిమ్మల్ని గురించే బెంగ.'

'ప్రేమ గుడ్డిది.'

'కాని, ప్రేమకు విచక్షణా జ్ఞానం వుండాలి. నేను పగిలిన అద్దాన్ని. అందులో మొహం చూసుకోవాలని, దాన్ని అతికించాలనే సాహసం మీది. ఇదేం లాభంలేదు రమేష్! ఈ విధమైన ఆత్మవంచనవల్ల ఇద్దరికీ సుఖం లేదు.'

రమేష్, ఆమె మాటలు వింటూ కూర్చున్నాడు. వాళ్ళిద్దరి మాటలకూ మూగసాక్షిగా గడియారం టిక్కు టిక్కు మంటోంది.

రమేష్ దిక్కుతోచక 'అయితే ఇపుడేం చేద్దాం ?' అన్నాడు.

'అన్నీ మరిచిపోయి, కొత్త జీవితం ప్రారంభించండి.'

రమేష్ ఏమో చెపుదామని నోరు తెరిచాడు. కాని, రత్న అతడిని మాట్లాడనీయక:

'మీరన్నీ మరచిపోగలరు. అదేమంత అసాధ్యమైన పని కాదు. ఏళ్ళు గడిచినకొద్దీ ఈ పాత ప్రకరణాలన్నీ అర్థంలేనివిగా అనిపించవచ్చు. గడిచిపోయినదాన్ని తల్చుకుంటూ, భవిష్యత్తులేదని భావించేటంత ముసలి వాళ్ళు కాదు మీరు. మీ జీవితమంతా ఇకముందే వుంది. ప్రయత్నిస్తే దీన్ని ఓ పీడకలగా భావించి మరచిపోవచ్చు.'

'పాతదాన్ని మరచిపోవాలంటే, కొత్తదేదైనా కావాలి కదా ? మీ కైతే ఆశా వుంది... కాని నాకు?'

'మీ చదువు, వృత్తి, స సారం వీటికన్నా ఏం కావాలి మీకు ?'

'కాని అందులో నేను మనఃపూర్వకంగా కోరుకునేది ఒక్కటీలేదు.'

కోపంతో రత్న మొహం కందగడ్డయింది. కనుబొమలు ముడివేసి గుప్పిలి బిగించి;

'నా చేత బాగా దెబ్బలు తినాలని ఆశగావుంటే అలా మాట్లాడండి. ఒక్కోసారి మీరు మరీ మూర్ఖంగా మాట్లాడుతారు. మిమ్మల్నేం చెయ్యాలో తోచటంలేదు' అంది.

అలా అంటూనే గడియారంవైపుచూసి 'పదకొండున్నరయింది. ఇక పడుకోండి' అంటూ లేచింది.

'ఇంకా డాక్టర్ రాలేదే!'

'ఆయన ఎప్పుడొస్తారో ఏమో? మీరు పడుకోండి' అంటూ అతడి గదిలోకి వెళ్ళి పక్క సరిజేసి బయటకు వచ్చింది.

రమేష్ పసిపిల్లాడికిమల్లే లేచి వెళ్ళి పడుకున్నాడు.

రత్న చేతిలో ఓ పుస్తకం పట్టుకుని పడుకుంది. ఆమె కళ్ళవెంట అశ్రువులు ప్రవహిస్తున్నాయి.

రమేష్ బొంబాయివచ్చి ఒక నెలకుపైగా అయింది. రత్న స్నేహాదరాలతో అతడికి రోజులు గడిచిపోతున్న విషయమే తెలియడం లేదు.

కాని కొద్దిరోజులు వుండి వెళ్ళటానికి వచ్చిన రమేష్ ఎన్నిరోజులని ఉండగలడు?

రత్న యిల్లు పరాయి ఇల్లని అతడికి ఏనాడూ అనిపించలేదు. కాని, తన్ను రోజురోజుకూ బలంగా బంధిస్తున్న వలను కత్తిరించి, వీలయినంత తొందరగా అక్కడనుండి వెళ్ళిపోవాలని అతడు నిశ్చయించుకున్నాడు.

ఒక సాయంత్రం రత్న, రమేష్ని బాంద్రాబీచికి తీసుకుని వెళ్ళింది. ఆకు పచ్చరంగుతో ఎండి నిల్చిన కొన్ని రాళ్ళను దాటి, విశాలంగావున్న ఓ రాతిమీద కూర్చున్నారిద్దరూ.

నిర్జనంగా వున్న ఆ ప్రదేశాన్ని చూసి, తాము వున్నది బొంబాయి అనే విషయమే మరిచిపోయాడు రమేష్.

అ స్తమిస్తున్న సూర్యుడు బంగారపు పళ్ళెంలా కనిపిస్తున్నాడు.

'నీ శక్తెంతో చూపు' అన్నట్టుగా ఎగసిపడుతున్న అలలను అందుకోవాలని సూర్యుడు ప్రయత్నిస్తున్నట్టుగా వుంది ఆ దృశ్యం.

సూర్యుడు గిరగిరా తిరుగుతూ, అలలతో ఆడుకుంటున్నాడు.

రమేష్ అన్నాడు:

'రత్నా, నాకు వూరికి వెళ్ళటానికి అనుమతివ్వండి.'

రమేష్‌వైపు చూడకుండానే, అ స్తమిస్తున్న సూర్యుడివైపే తదేకంగా చూస్తూ రత్న అంది:

'ఒక షరతుమీద మాత్రమే పంపగలను.'

'ఏమిటది?'

'మీరు చదువు పూర్తిచేసి, డాక్టరయి, పెళ్ళి చేసుకోవాలి. ఇలా మాటిస్తే, రేపే వెళ్ళటానికి ఒప్పుకుంటాను.'

రమేష్ కొంచెం వుద్రేకంతో 'మీరు ఎంతో సుళువుగా ఆ మాట చెప్పేస్తున్నారు. కాని నా కదంత సుళువుగా అనిపించటంలేదు. నన్ను మీరు అంత త్వరగా మరిచిపోగలరా?' అన్నాడు.

రత్న మనసు ఒక్క క్షణం తటపటాయించింది,

ఏం చెప్పను? ఏం చెప్పను? అని.

ఆఖరికి ఆమె మనసు ఒక నిశ్చయానికి వచ్చింది. నెమ్మదిగా:

'ఆఁ మీరు వెళ్ళిన మర్నాడే నేను మిమ్మల్ని మరిచిపోగలను.'

'అదెలా సాధ్యం?'

'ఎందుక్కాదు? మిమ్మల్ని గుర్తుంచుకుని మాత్రం ప్రయోజనమేముంది? ఈ జబ్బుకు మరుపుకన్నా దివ్యౌషధం వేరేలేదు. నేను ఎప్పుడూ మిమ్మల్ని ఎక్కువగా పట్టించుకోలేదు. రేపు మీరు వెళ్ళిపోయినా, మళ్ళీ ఒక్క క్షణంకూడా మిమ్మల్ని తల్చుకుని బాధపడను...'

రమేష్ కోపంతో 'నాటకం చాలు రత్నా' అన్నాడు.

'నాటకమా!'

'అవును— ఇన్ని రోజులూ నాతో మీరు నాటకమాడారు. నేను మీకంత చులకనై పోయానా?'

'నాదంతా నాటకం, అభినయం అని ఒప్పుకుంటే, మీరు నన్ను సులభంగా మరిచిపోగలరా?'

రమేష్ కోపోద్రేకంతో 'ఇహ చాలు, మీ నిజరూపం ఈ రోజు బయటపడింది' అన్నాడు.

రత్న మొహం వివర్ణమైంది. కాని, మృదువుగా:

'రమేష్!' అంది.

కోపగించిన బిడ్డలా ఆమెవైపు వీపు తిప్పి కూర్చున్నాడు.

'మిమ్మల్ని నొప్పించానా రమేష్?'

రమేష్ పలుకలేదు.

రత్న మెల్లిగా అతడి భుజంమీద చెయ్యివేసి:

'ఇటు చూడండి రమేష్! నన్ను మరవటం మీ కెంత కష్టమో, మిమ్మల్ని మరిచిపోవటం నాకూ అంత కష్టంగానే వుంది. కాని, జీవితంలో మళ్ళీ మనం కలుసుకోమేమో! మన జీవితాలు వేర్వేరు దిక్కుల్లో ప్రవహిస్తున్నాయి. అందుకే ఈ పిచ్చి వద్దంటున్నా. నిప్పులో చెయ్యిపెట్టి కాల్చుకోవటం మూర్ఖత్వం రమేష్! కనుకనే ఇద్దరం ఒకర్నొకరు మరిచిపోవటానికి ప్రయత్నిద్దాం' అంది.

'ఎలా రత్నా! ఎలా?' రమేష్ కంఠంలో ఆవేదన పొంగి పొరలింది.

'నాకు ఆశా వుంది. మీకు—'

'నాకేముంది?'

'మీకు అన్నీ వున్నాయి-'

'కాని, నాకు రత్న కావాలి' అంటూ, రత్న చేతిని తన చేతిలోకి తీసుకొని ఆమను తన దగ్గరగా లాక్కున్నాడు రమేష్. రత్న కాదన లేదు. కాని శాంతంగా:

'అగ్నిలో ఆజ్యంపోస్తే మంట ఎక్కువ అవుతుంది. మనిద్దరి మధ్యా లేచిన ఈ మంటను మనం నీళ్ళుపోసి ఆర్పడానికి ప్రయత్నిద్దాం' అంది.

రమేష్ చటుక్కున ఆమె చెయ్యి వదిలేసి లేచి నిల్చున్నాడు.

'పదండి ఇక్కడినుండి వెళ్ళిపోదాం' అంటూ ఆమెకన్నా ముందుగానే బయల్దేరాడు.

'ఏం' అంటూ లేచింది రత్న.

'చీకటి పడింది, నిర్జన ప్రదేశం. దొంగ లెవరైనా వస్తే-' అంటూ వేగంగా అడుగులు వేయసాగాడు రమేష్. రత్న అతడిని అనుసరించింది. బస్‌స్టాప్ దగ్గరకు వచ్చాక రత్న అడిగింది:

'ఎందుకలా పారిపోయి వచ్చారు?'

'దొంగల భయం నాకు. నాకన్నా వేరే దొంగలు అక్కడ లేరనుకోండి. నామీద నాకా క్షణంలో నమ్మకం లేకపోయింది. ఇంకో క్షణం మనం అక్కడే వుంటే, మిమ్మల్ని ఏం చేసేవాడినో చెప్పలేను. అందుకే అలా పరుగెత్తుకుని వచ్చేశాను-'

రమేష్ నిష్కపటంగా వివరించాడు.

కల్లాకపట మెరుగని అతడి మొహాన్ని చూసి వాత్సల్యంతో అతడి చేయందుకుని మృదువుగా నొక్కి:

'నిజంగా మీదెంత సహృదయం!' అంది.

'ఎందుకలా అంటారు?'

'మీరు వూరికివెళ్ళి చదువు పూర్తిచేసి పెళ్ళిచేసుకోండి. అందాకా నాకు శాంతిలేదు. మీ జీవితం నావల్ల నాశనం కాకూడదు రమేష్! నేను మీ దగ్గరకి రాకుండా వుండాల్సింది. చాలా దూరంగా వుండిపోవాల్సింది.'

రమేష్ కొంటెగా 'మీరు నా దగ్గర కెప్పుడొచ్చారు? ఇప్పుడు నానుండి ఓ అడుగు దూరంలోనే వున్నారు' అన్నాడు.

రత్న తన పక్కగా నడుస్తున్న రమేష్‌వైపు చూసింది. ఒక అడుగు దూరంలో నడుస్తున్నాడు.

అతడి కళ్ళు మెరుస్తున్నాయి. ఉంగరాలజుత్తు రేగి నుదుటిమీదకు పడుతోంది.

రత్నకు అతడినుండి ఒక్క అడుగుకూడా దూరంగా వుండలేనని పించింది.

వెంటనే అతడి దగ్గరగా వచ్చి:

'లేదు! మీకు చాలా దగ్గరగా వున్నాను' అంది.

రమేష్ ఆమెవైపు తిరిగి చూడకుండానే, కుడిచేతితో ఆమెను తన దగ్గరికి లాక్కుని, సర్వదా ఆమెను రక్షించేవాడిలా ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిచాడు.

అతడేమీ మాట్లాడకపోవటంచూసి రత్న:

'ఏమీ మాట్లాడరేం?' అంది.

'మాటల ఆవశ్యకత వుందంటారా?'

'ఊం( మన మాటల శబ్దమైనా మనల్ని హెచ్చరించనివ్వండి. నాకు వాగ్దానం చేస్తారా?'

'ఇప్పటికి నన్ను క్షమించండి. మీరు నా దగ్గరగా వున్నారు. ఇది కలో, వాస్తవమో నాకు తెలియదు. కలే అయితే దీన్నే ఆఖరిదాకా వుండి పోనివ్వండి.'

రత్నకు మళ్ళీ అతడిని పలకరించే సాహసం కలగలేదు.

ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచివున్నాయి. నళిని రేడియో సిలోన్ వింటూ కూర్చుంది.

నళినిని చూడగానే రత్నకు తాను అపరాధిననిపించింది.

'ఎప్పుడొచ్చావ్ నళినీ?' అంది ఆమెవైపు చూడకుండానే.

'అరగంటవుతోంది. దేశాయిగారింట్లో ఆళ వుంటే, తాళం చెవి తెచ్చి, రేడియో పాటలు వింటూ కూర్చున్నా. ఓ- నమస్తే!' అంది నళిని అప్పుడే రమేష్‌ని చూసినట్టు.

'డాక్టర్ రాలేదా?' నళిని అడిగింది.

'లేదు.'

'ఎన్నింటికొస్తారు?'

'పది గంటలకు ముందురారు.'

'నాన్నగారికి ఒంట్లో బాగాలేదు. డాక్టర్ని పిలవమన్నారు. క్లినిక్‌కు ఫోన్ చేశాను. అక్కడా లేరు. రేపు ఉదయం క్లినిక్‌కు వెళ్ళేముందు అక్కడికి వచ్చి వెళ్ళమను.'

చేతిలోని గాజులను తిప్పుతూ అంది నళిని. అందంగా, చక్రాకారంలో, అజంతా మాదిరిలో వేసుకున్న ఆమె ముడి ఆమె తెల్లటి మెడను మరింత బాగా కనిపింపచేస్తోంది. ముత్యాలను గుచ్చిన నల్లటి పట్టుదారపు కుచ్చులు వీపుమీద పడి ఉన్నాయి.

ఎంతటి అందగత్తె నళిని!

కాని, ఏం లాభం? ఒక యువకుడిని ఆకర్షించలేని ఆమె అందం ఎందుకూ?

రత్న ముగ్ధురాలై నళిని సౌందర్యాన్ని చూస్తోంది.

తనదీ తప్పే! రమేష్‌ని తమ ఇంట్లోకన్నా, నళిని ఇంట్లో అతిథిగా ఉంచి ఉంటే బాగుండేది.

రత్న రమేష్‌వైపు చూసింది.

అతడు సంకోచంతో ఏమీ మాట్లాడటానికి తోచక అలాగే నిల్చున్నాడు. తనతో అంతగా మాట్లాడే రమేష్, ఇంకెవరయినా వస్తే మూగనోము పట్టేవాడు.

అంతలో ఆశా తుఫానులా పరుగెత్తుకుని వచ్చి నళిని కాళ్ళను పెనవేసుకుంది.

'అమ్మా! నళినక్కయ్య ఎంత బావుందో?'

నళిని పక్కన ఉన్న కుర్చీమీదకెక్కి, ఆమె బుగ్గలు, కంఠం అన్నీ చేత్తోతాకి:

'అమ్మా! అక్కయ్య ఎంత బావుందో' అంది ఆశా.

కూతురి సంబరం, ఆనందం చూసి రత్న నవ్వుతూ,

'అంత అందంగా ఉన్నవాళ్ళను అంతగా తాకరాదు, మాసిపోతారు వాళ్ళు' అంది.

'అవునా అక్కయ్యా?'

'లేదు ఆశా! ఏమీకాదు.'

వారి మధ్యలో ఏం మాట్లాడాలో తెలియక వంటరిగా నిలబడిపోయిన రమేష్, వాళ్ళంతా మాటల్లో పడటం గమనించి చప్పుడు చేయకుండా అక్కడనుండి జారుకున్నాడు.

రమేష్ వెళ్ళిపోవడాన్ని గమనించి రత్న,

'ఆశా! నీ స్నేహితురాలు పిలుస్తున్నట్లుంది చూడు' అంటూ ఆశను బయటికి పంపింది.

రత్న, నళిని దగ్గరగా జరిగి నెమ్మదిగా,

'నళినీ! నీకెందుకింత పట్టుదల?' అంది.

'అంటే?'

'అదే, రమేష్‌తో కాస్త కలిసి మెలిసి తిరిగి...'

రత్న మాట పూర్తిచేయక మునుపే నళిని బద్ధకంగా వళ్ళువిరిచి 'నాకేమంత ఆసక్తిలేదులే ఆ విషయంలో-'

'ఏం?'

'నిజం చెప్పనా?' నళిని సూటిగా చూస్తూ అడిగింది.

రత్న గుండె గబగబా కొట్టుకుంది. తను 'ఊఁ' అంటే నళిని ఏం చెపుతుందో?

తలవంచుకుంది రత్న.

'నాకాబోయే భర్త నన్నే మనస్ఫూర్తిగా ప్రేమించాలని కోరుకోవటంలో తప్పులేదనుకుంటాను. నా భర్త ప్రేమను ఇంకో స్త్రీతో పంచుకోవటానికి నేను సిద్ధంగా లేను.'

'నువ్వు పొరబడుతున్నావు నళినీ—'

'ఇహ ఆ సంగతి వదిలేయి రత్నా. రేపు డాక్టర్ని మా ఇంటికి మరవకుండా పంపాలి. అన్నట్టు ఆశా ఏదీ?' అని మాట మార్చింది నళిని.

తరువాత తొమ్మిదింటిదాకా ఏవో కబుర్లు చెపుతూ కూర్చున్నా

రిద్దరూ. పొద్దుపోయినట్టే తెలియలేదిద్దరికి. తొమ్మిది గంటలకు నళిని తన వాచి చూసుకుని,

'ఇక వస్తాను' అంది.

'ఒక్కదానివే వెడతావా? రమేష్‌ను రానీ, తోడు వస్తారు.'

నళిని నవ్వింది. ఆమె అందమయిన పలువరస ఎర్రటి పెదవుల వెనక తళుక్కుమంది.

నళిని మాట్లాడకుండా తన వ్యానిటీ బ్యాగ్ తిప్పుకుంటూ వెళ్ళిపోయింది.

రత్న చాలా సేపటివరకూ కూర్చున్న చోటినుండి కదలలేకపోయింది. సుడిగాలిలో చిక్కిన ఎండుటాకులా ఆమె హృదయం అల్లల్లాడిపోయింది.

రెండు విభిన్న భావోద్వేగాల తాకిడికి తట్టుకోలేకపోతోంది రత్న.

రమేష్ ప్రేమ, స్నేహ ప్రవాహంలో రత్న అసహాయురాలై ఏదో అవ్యక్త శక్తిచేత నెట్టబడుతున్నట్టుగా తేలిపోతోంది.

అటువంటి నిర్మలమయిన ప్రేమను చవిచూసి ఎరుగదామె. భర్త ప్రేమ ఆమెకెన్నడూ లభించలేదు. శేషగిరి నూరు నయాపైసల డాక్టరు. అతడి దగ్గర ఏ విధమైన భావుకతకు కాని, స్నేహ, ప్రేమలకు కాని స్థానంలేదు. అతడి దృష్టిలో హృదయమంటే దేహానికి రక్తాన్ని సరఫరా చేసే అవయవం మాత్రమే. ఎవరయినా హృదయం గురించి మాట్లాడితే స్టెతస్కోపు చేతిలోకి తీసుకోవటమే తెలుసు నతనికి.

భావుకత హృదయ దౌర్బల్యానికి చిహ్నం. అదో రకమయిన జబ్బు. ఆ జబ్బును ఏ విటమిన్‌తో కూడా నయం చేయలేం. ఒక్కసారి అది మానవుడిమీద దాడిచేస్తే, ఇక అతడు ఎప్పటికీ దాని ఆక్రమణ నుండి, దానివల్ల కలిగే అశక్తత, పరధ్యానం, నిరుత్సాహం-వీటి నుండి తప్పించుకోలేడు. కనుకనే, ప్రతీమనిషి ఆ జబ్బు తగలకుండా జాగ్రత్త పడాలి అనే సిద్ధాంతం అతడిది.

భావుకత ఓ అంటురోగం అయినట్టు, అది తన దగ్గరకు రాకుండ జాగ్రత్త వహించాడతడు.

కాని, అతడు కఠిన హృదయుడు కాడు. రత్న భర్తగా, ఆశ తండ్రిగా, రోగుల వైద్యుడుగా తన కర్తవ్యాన్ని సవ్యంగానే నిర్వహించే వాడు.

తినటానికి తిండి, కట్టుకోవటానికి గుడ్డ అన్నివిధాల స్వాతంత్ర్యమూ రత్నకుంది. సంపాదనలో సగం తన దగ్గరుంచుకుని మిగతాది రత్న చేతికిచ్చేవాడు. ఇంట్లో తనో అతిథిలాగానే మెలిగేవాడు.

భార్యను ఏ విషయాన్ని గురించీ ప్రశ్నించేవాడేకాదు.

ఆశకు తండ్రిగా, తన కూతురి యోగక్షేమాలను చూసుకునేవాడు. ఒక తండ్రి నుండి, ఓ కూతురు ఎన్ని సౌకర్యాలను పొందగలదో, అన్ని సౌకర్యాలను పొందేది ఆశ, ఒక్క ప్రేమనుతప్ప. తండ్రిగా అతడు కూతురికి తెచ్చివ్వని వస్తువులేదు. కాని ఎపుడూ కూతుర్ని దగ్గరకు తీసుకుని లాలించేవాడు కాదు. ఆప్యాయంగా కబుర్లు చెప్పే అలవాటే లేదతనికి!

కాని తన రోగులు, తన వృత్తి అంటే మిగతా ప్రపంచాన్నే మరిచి పోయేవాడు. శేషగిరి ఆప్యాయతను పొందాలంటే అతడి దగ్గరకు రోగిగానే వెళ్ళాలి. అతడి సాంత్వన వచనాలు, భరోసా, వీటన్నిటివల్లనే అతడి రోగుల జబ్బు సగం నయమయిపోయేది.

దానికితోడు అతడి పెదవులపై సదా వెలిగే మాయని చిరునవ్వు రోగుల నిర్జీవమైన మొహాల్లోకూడా ఆశను రేకెత్తించేది.

రత్న తల్లి కాబోతున్నప్పుడు, శేషగిరి ఆమె విషయంలో తీసుకున్న శ్రద్ధ ఆసక్తి ఇంకెవరూ తీసుకోలేరు. ఒక్క నిమిషం కూడా ఆమెను వదలి ఉండటానికి ఇష్టపడేవాడుకాదు.

భార్య ఆహారాల విహారాల నన్నిటినీ వైద్యుడి దృష్టితోనే గమనించేవాడు.

ఆశ పుట్టేముందు ప్రసవవేదనతో బాధపడుతున్న రత్నను వదలి వెళ్ళలేదు శేషగిరి. దగ్గరే కూర్చుని కర్చీఫ్‌తో తన నుదుటిమీది చెమటను తుడుస్తూ, చేతిని నిమురుతూ కూర్చున్న భర్తను రత్న ఎప్పటికీ మరిచిపోలేకపోయింది.

అకస్మాత్తుగా తనమీద భర్త చూపిస్తున్న అగాధమైన ప్రేమనూ, ఆసక్తినీ చూసి చకితురాలయింది రత్న. భర్త ఇదే విధంగా తన్ను ప్రేమించేటట్టయితే ఇంకా కొద్దికాలం ప్రసవ వేదనను అనుభవించగలను అనుకుంది రత్న.

ఆశ పుట్టగానే, శేషగిరి మామూలుగా అందరికిలాగే, ఆమెకూ డాక్టర్‌గా మిగిలాడు.

బయటనుండి వచ్చేటప్పుడు నిశ్శబ్దంగా నడిచివచ్చి ఆమె చేతిని తీసుకుని నాడిచూసి, నుదుటిమీద చెయ్యివేసి పరీక్షించేవాడు.

'ఓ, ఆ చెయ్యి అలాగే నుదుటిమీదనుండి తల వెంట్రుకలమీదికి వెడితే!' అని ఆశించేది రత్న మనసు.

భార్యను పరీక్షించాక, కూతురివైపు మళ్ళేదతని దృష్టి.

ఉయ్యాలలో పడుకున్న కూతుర్ని అపుడపుడూ ఎత్తుకునేవాడు, బరువు చూడటానికి.

మూడు నెలల ఆశా, మూడు నెలల బిడ్డ వుండాల్సినంత బరువు లేకపోతే, ఆలోచనతో నుదురు చిట్లించేవాడు.

బిడ్డ పోషణలో ఏవిధమైన లోపమూ లేనపుడు, బరువు తక్కువగా వుండటానికి కారణమేమిటి?

ఆ సమయంలో తండ్రిగా బిడ్డను చూసేవాడు కాడతను.

డాక్టర్ శేషగిరి తక్కువ బరువున్న బిడ్డనుచూసి ఆలోచించేవాడు.

ఇహ అప్పటినుండి కొత్త మందుల ప్రయోగం ప్రారంభమయేది.

పురుడు పోసుకుని మూడు నెలలు పూర్తికాగానే, శేషగిరి మళ్ళీ ఇంట్లో మామూలు మనిషయ్యాడు.

అతడు బుద్ధిజీవి అయితే, రత్న భావజీవి.

భర్త బుద్ధికుశలత, అతడి వృత్తిపైన అతడికున్న అభిమానం, వీటిని రత్న ఎంతో గౌరవించేది. కాని ఇంట్లో వున్నప్పుడైనా, తను డాక్టరన్న మాట మరిచిపోయి భర్తగా మెలిగితే ఎంత బావుంటుంది అని మథనపడేది రత్న హృదయం.

కాని శేషగిరి తనవాళ్ళకూ, బయటి వాళ్ళకూ కూడా డాక్టరుగానే మిగిలిపోయాడు.

తన భార్యను చుట్టుదోవలో ఆమె స్నేహితురాలి ఇంట్లో దిగపెట్ట డానికి వెనుదీసే శేషగిరి, పది పదిహేను మైళ్ళ దూరంలోవున్న హాస్పి టలుకు తన కారులోనే తీసుకుని వెళ్ళేవాడు రోగిని.

రత్న పెళ్ళయిన కొత్తలో—.

'నాకన్నా మీకు ఆ రోగే ఎక్కువ!' అని విసుక్కుంటే,

'నువ్వు మీ స్నేహితురాలింటికి బస్సు, ట్రాము, ట్రైను, టాక్సీ ఎందులోనైనా వెళ్ళగలవు' అని జవాబు చెప్పేవాడు.

'మీ రోగి వెళ్ళలేడనా?'

'అలాకాదు. ఇప్పటి అతడి పరిస్థితిలో డాక్టర్ అతడి దగ్గర వుండటం అవసరం. బస్సుకోసం కాచుక్కూర్చోవటం మంచిదికాదు.'

రత్న మళ్ళీ మాట్లాడకుండా వూరుకునేది. భర్తను అనుసరించి జీవించటానికే అలవాటు పడింది.

కాని, ఒక్కొక్కప్పుడు 'ఇంట్లోనైనా డాక్టర్‌గాకాక, భర్త సాహ చర్యం కావా' లని తీవ్రంగా కాంక్షించే దామె హృదయం.

కాని, అది ఆమెకు తీరని కోరికగానే మిగిలిపోయింది.

డాక్టర్ భార్యగానే జీవితం సాగిపోతోంది.

ఈ విధమైన వాతావరణానికి అనుగుణంగా జీవితాన్ని దిద్దుకుని సాగిపోతున్న రత్న, అకస్మాత్తుగా లభించిన రమేష్ స్నేహంతో అవ్యక్త మైన ఆనందాన్ని అనుభవించింది.

కాని, క్రమేణా రమేష్ ప్రేమవిశ్వాసాలు పెరిగినట్లల్లా గాబరా పడసాగింది.

తనను దేవలోకంనుండి దిగివచ్చిన దేవతలా రమేష్ ఆరాధించటం గమనించి, రత్న మొదట పువ్వులా వికసించింది.

ఆ ఆరాధన ఎలాంటిది ?

కేవలం గుడ్డి ఆరాధన !

చుట్టూవున్న ప్రపంచాన్ని, సౌందర్యాన్ని విస్మరించి, కేవలం తనొక్కతెనే సజీవ మూర్తిగా భావించి రమేష్ ఆరాధించటంచూచి, రత్న పులకితురాలయింది.

ఈ నూతనమైన అనుభవం ఆమె యౌవన సౌందర్యాలను ద్విగుణీకరించి, వింత శోభ నిచ్చింది.

కాని, ఈ రకమైన ఆరాధనవల్ల ఆరాధకునికి మంచి కలుగకపోగా, చెడు కలుగుతుందన్న భావన జాగృతమవటంతోనే, రత్న అతడినుండి దూరంగా పారిపోవటానికి ప్రయత్నించింది.

రమేష్‌మీద ఆమెకు అంతులేని ప్రీతి విశ్వాసాలున్నమాట వాస్తవమే!

జీవితంలో దెబ్బతగిలి దుఃఖిస్తున్న వ్యక్తి అని, స్త్రీ సహజమైన అనుకంపం కలిగింది ఆమెకు.

కాని, తన అనుకంపానికి బదులుగా అతడినుండి అపారమైన ప్రేమను నిరీక్షించలేదామె.

అతడి ప్రేమతో ఆమె సుఖి; దుఃఖి!

ఇంతటి ప్రేమను దూరం చేసుకోవడమా!

ఆమెలోని స్వార్థం, తనను ప్రాణంకన్నా మిన్నగా భావించి, ప్రేమించే రమేష్ ప్రేమను స్వీకరించి అతడిని తనవాడిగా చేసుకోమని ప్రేరేపించేది.

కాని, ఆమె హృదయం ?

అతడి సుఖదుఃఖాలను గురించి ఆలోచించేది. తనను ప్రేమించటం వల్ల జీవితం అతడికి ఏమాత్రం సుఖంలేదని తెలుసుకుని క్రుంగిపోయింది రత్న.

రమేష్ దృష్టిని అందాలరాశి నళినివైపు తిప్పటానికి ప్రయత్నించి విఫలురాలయింది.

తన ప్రేమ పథంలో వెనుదిరిగి రాలేనంతదూరం సాగిపోయాడు

రమేష్. ఇక 'ముందేమిటి'అనే విషయం అతడికి అగమ్యగోచరంగానే వుండిపోయింది.

ఈ మనోవిప్లవంలో రత్న హృదయం సతమతమయి కొట్టుకు పోతోంది.

పరధ్యానంగానే ఆశను అన్నం తినిపించి పడుకోబెట్టింది. చేతిలో ఓ పుస్తకం పట్టుకొని కూర్చుంది.

కాని ఆమెదృష్టి పుస్తకంమీద లేదు. ఇపుడు తనేంచెయ్యాలో అని ఆలోచిస్తూ కూర్చుంది.

రమేష్‌ని తననుండి దూరంగా పంపేయాలి.

క్రమంగా అతడు తన్ను మరిచిపోగలడు. ఈ విరహాన్ని భరించటం తనకు చాలా బాధను కలిగిస్తుంది. నిజం. కాని, మందు చేదుగావుంటే మాత్రమేం, రోగికి నయం కావటమే ముఖ్యం.

రమేష్‌ని పంపించేముందు కొన్ని విషయాలలో అతడి దగ్గర మాట తీసుకోవాలి.

వీలయినంత త్వరలోనే ఆ మాట తీసుకోవాలి!

రమేష్ తలుపు తోసుకుని లోపలికి వచ్చాడు.

రత్న చేతిలోని పుస్తకం పట్టుకొని కలగంటోంది. రమేష్ చనువుతో ఆమె దగ్గరకువచ్చి చేతిలోని పుస్తకం లాక్కొని;

'మీ ఆలోచనలకు ఒక్క అణా ఇస్తాను' అన్నాడు.

రత్న చటుక్కున వెనక్కి జరిగి, నవ్వుతున్న అతడి కళ్ళను చూస్తూ,

'అణా! చాలా తక్కువ' అంది.

'అయితే... అయితే...' రమేష్ సందేహించాడు చెప్పటానికి.

'ఏమిటో చెప్పండి!' ప్రోత్సహించింది రత్న.

'ఒక తియ్యటి ముద్దు' అన్నాడు ఇంగ్లీషులో.

రత్న ఎడమ కనుబొమ కొంచెం పైకెత్తి 'ఉహుఁ' అంది.

'ఖరీదెక్కువైంది కావాలి మీకు?'

'నేను చెప్పినట్టు చెస్తానని మాటివ్వండి.'

'వీల్లేదు.'

'దయచేసి...'

'క్షమించండి.'

'అయితే సరే. నన్ను మాట్లాడించకండి. పుస్తకం ఇలా తెండి నేను చదువుకోవాలి.'

రమేష్ ఇచ్చిన పుస్తకం తీసుకుని చదువుతూ కూర్చుంది రత్న రమేష్, రత్న మొహంచూస్తూ కూర్చున్నాడు. రమేష్ తనవైపే తదేకంగా చూడటం గమనించి అధీరురాలయింది.

'అలా చూడకండి రమేష్!'

'ఏం ?'

'నేను భరించలేను.'

'రత్నా!'— అన్నాడు రమేష్ బ్రతిమాలుకుంటున్నట్టు.

'ఏమిటి?'

'నాకు మీరు కావాలి.'

అతడి మాట ఎంతో సరళంగావుంది. అతడి ధ్వని ఎంతో మధురంగా ఉంది.

బడినుండి ఆకలితో ఇంటికి వచ్చిన ఆశా, 'అమ్మా! ఆకలేస్తుంది. అన్నం పెట్టమ్మా' అన్నంత సరళంగానే వుందతని కోర్కె.

రత్న తలెత్తి అతడివైపు చూసింది. మెరుస్తున్న అతడి కళ్ళలో పిపాస ప్రజ్వలించటం లేదు. దానికి మారుగా అతడి కళ్ళు ప్రేమార్ద్రితతో మెరుస్తూ ఆశతో రత్నవైపు చూస్తున్నాయి.

ఆమె సోఫాలో కూర్చున్నట్టుగానే ముందుకు వంగి, అతడి బుగ్గలను చేత్తో మృదువుగా నిమిరి, నుదుటిమీద పడ్డ జుట్టుని వెనక్కి తోసింది మాట్లాడకుండా.

రమేష్ మళ్ళీ అన్నాడు. 'నాకు మీరు కావాలంటే కావాలి.'

రత్న తల అడ్డంగా తిప్పింది.

'నేనంటే ప్రేమలేదా మీకు?'

'ప్రేమ ఉందంటే, దాన్ని వ్యక్తపరచటానికి అదొక్కటే మార్గమా రమేష్? మన ప్రేమ అంత హీనస్థితికి దిగజారక తప్పదా? మీ మీద నాకెంత ప్రేమ వుందంటే మిమ్మల్ని ఆ త్రోవలో నడిపించటానికి నాకే మాత్రం ఇష్టంలేదు. నేను తల్చుకున్నట్టయితే ఎప్పుడో మిమ్మల్ని పాడు చేసేదాన్ని. కాని, మీరు జీవితంలో సుఖంగా వుండాలన్న కోరికుంది నాకు. అటు త్రోవలేకుండా మూసివేయలేను. రమేష్! నన్ను లోబరచకండి ప్లీజ్!'

'కాని, నాకు మీరు కావాలి రత్నా! మీరు లేని జీవితం అపూర్ణం.'

'ఇప్పుడలా అనిపించినా, ముమ్ముందు అన్నీ సరిపోతాయి. మీ జీవితాన్ని పంచుకునే భాగ్యశాలిని ఓ రోజున వస్తుంది. నేను సతీధర్మానికి కాని, పవిత్రత గురించికాని, సంఘానికి భయపడి కాని మిమ్మల్ని నిరాకరించటం లేదు. నా దృష్టిలో వాటికి విలువే లేదు.'

'అయితే...' అన్నారు రమేష్.

'కాని, అంతరంగానికే నేను భయపడుతున్నాను. నేను జీవించి నంతకాలం నా అంతరాత్మ నన్ను వేలుపెట్టి చూపిస్తూవుంటే, నేను భరించలేను. మీ పవిత్రమైన జీవితాన్ని మలిన పరచలేను.'

రమేష్ మాట్లాడలేదు. మెదలకుండా కూర్చున్నాడు. ఆఖరికి రత్నే పలకరించింది.

'నా మాటలతో విసుగు పుట్టిందా?'

'లేదు. మీ మనోదార్ఢ్యాన్ని, చిత్తస్థైర్యాన్ని, మెచ్చుకుంటున్నాను. మెప్పుతోనే మీ వైపుకు ఆకర్షింపబడుతున్నాను.'

'అలా మాట్లాడకండి రమేష్!'

'ఏం?'

'మీ మాటలు వినాలనే ఆశతోనే నేను మీతో వచ్చేయగలను.'

రమేష్ వుత్సాహంతో 'వచ్చేయండి. వెళ్ళిపోదాం' అన్నాడు.

'ఎక్కడికి?'

'ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోదాం.'

రత్న నవ్వుతూ అతడి గడ్డాన్ని పుణికి;

'పదండి. భోజనానికి' అంది.

'డాక్టర్ని రానివ్వండి.'

'డాక్టరుకోసం వేచివుండి లాభంలేదని తెలియలేదూ ఇన్నిరోజులైనా?'

'ఫరవాలేదు. నాకింకా ఆకలిగాలేదు' అంటూ టేబుల్‌మీది మెడికల్ జర్నల్ చేతికితీసుకుని చదవసాగాడు. డయాబిటీస్ గురించి వ్రాసిన క్రొత్త ప్రయోగాన్ని గురించి వ్రాసిన వ్యాసాన్ని చదువుతూ అందులో లీనమైపోయాడు రమేష్

అదిచూసి రత్న మనసులో ఆశ చిగురించింది.

శేషగిరి ఇంటికి వచ్చేసరికి పదకొండు దాటింది. మెడికల్ జర్నల్‌లో మునిగిన రమేష్‌కి గాని, నవలలో లీనమైపోయిన రత్నకుగాని పొద్దు పోయిందే తెలియలేదు.

రమేష్, రత్న ఇద్దరూ ఒక్కోమూలలో పుస్తకాలు పట్టుకుని కూర్చుని వుండటంచూసి, నవ్వువచ్చింది శేషగిరికి.

'భోంచేశావా?' రమేష్ వైపు చూసి అడిగాడు.

'లేదు' అంది రత్న.

భోజనాలపుడు శేషగిరి చెప్పిన విషయం రత్న నిరీక్షించనిది.

'ఎల్లుండి బరోడా వెళుతున్నాను.'

'ఎందుకూ?'

'అక్కడ వైద్యుల సమ్మేళనం జరుగుతుంది. నా స్నేహితులంతా వెళుతున్నారు. నన్నూ రమ్మని బలవంతం చేశారు. నేను వెళ్ళిరావటానికి నాలుగయిదు రోజులు పట్టవచ్చు' అంటూ రమేష్ వైపు తిరిగి;

'నువ్వూ రావయ్యా, వెళ్ళొద్దాం' అన్నాడు శేషగిరి.

'నేను వైద్యుడిని కాను.'

'ఇపుడు కాకపోతే ఏం? ఎపుడయినా డాక్టరయ్యే వాడివేగా? చాలా చోట్లనుండి డాక్టర్లు వస్తారు. ఆలోచించి చూడు.'

'లేదు; నేను రాలేను మీరు వెళ్ళిరండి. నేను మా వూరికి వెళతాను' అన్నాడు రమేష్.

రత్న తలెత్తి రమేష్‌వైపు చూసింది.

'అపుడేనా?' అన్నాడు శేషగిరి.

'నేను యిక్కడకువచ్చి తక్కువ రోజు లయిందా ఏం? రెండున్నర నెలలు కావస్తోంది. మీరు అన్నం పెడుతున్నారు. నాన్న డబ్బుపంపిస్తున్నారని ఎన్నిరోజులు వుండి పొమ్మంటారు?'

'అయితే నాదో సలహా. నేను బరోడానుండి రాగానే నువ్వు వెళ్ళి పోదువుగాని, ఏమంటావ్?'

రమేష్ భయమూ అదే- శేషగిరి లేనపుడు తనేమైనా అనుచితమైన పని చేస్తే? ఆ భయంతోనే తన ప్రయాణం సంగతి ముందుగానే చెప్పాడు.

కాని, ఇపుడు శేషగిరి మాటలకు ఏం చెప్పాలో తెలియలేదతనికి. అతడింకా ఆలోచిస్తూండగానే రత్న శాంతమైన ధ్వనితో,

'అలాగేలెండి. మీ రొచ్చాకనే రమేష్ వెడతారు' అంది.

రమేష్ ప్రశ్నార్థకంగా రత్నవైపు చూశాడు. కాని, రత్న మొహం అటువైపు వుంది.

మర్నాడంతా శేషగిరి ప్రయాణపు హడావిడి. ప్రతి పనిలోనూ క్రమం తప్పరాదు.

అంతా నీటుగా వుండాలనే మన స్తత్వం అతడిది. బరోడాలో వుండేది నాలుగు రోజులే అయినా, బట్టలు మాత్రం కొంచెం ఎక్కువగానే సర్దుకున్నాడు.

శేషగిరి స్నేహితులతో కలిసి రాత్రి రైలులో ప్రయాణంచేశాడు. వెళ్ళేముందు ఆశ తండ్రి దగ్గరకొచ్చి;

'నాన్నా గొంతులో నొప్పిగావుంది' అంది.

శేషగిరి వెంటనే చేతిలోని సంచి కిందపెట్టి టార్చ్‌తెచ్చి పరీక్షించి టచ్ చేశాడు.

'ఆశకు గొంతు నొప్పిగా ఉందట' అంటూ రత్నవైపు ఆరాటంతో చూశాడు.

'ఫరవాలేదు, తనకు అప్పుడప్పుడూ అలాగే అవుతూంటుంది. మీరెందుకు కంగారు పడతారు? నేనున్నాను, రమేష్ ఉన్నారు. చూసుకుంటాం' అని ధైర్యం చెప్పింది.

రమేష్, శేషగిరితో వి.టి.కి వెళ్ళి వీడ్కోలిచ్చి వచ్చాడు.

డాక్టర్ శేషగిరి ట్రైను కదిలేముందు,

'ఆశకు పెరుగు వెయ్యవద్దని రత్నతో చెప్పు.'

రమేష్ ఇంటికి వచ్చేసరికి రత్న ఆశను పడుకోబెడుతోంది. ఆశ గొంతు నొప్పిగా ఉందని మూలుగుతూ ఉంది.

రమేష్‌కి కొంచెం కంగారుగానే ఉంది.

తను ఆఖరి సంవత్సరం చదువుతున్న మెడికల్ విద్యార్థి అని శేషగిరికి, రత్నకు తనంటే నమ్మకం.

కాని, రమేష్‌కి తనపై తనకే నమ్మకంలేదు.

'శేషగిరి వెళ్ళకుండా ఉంటేనే బావుండేది' అన్నాడు. అతడి కంఠంలోని ఆరాటాన్ని గుర్తించి రత్న,

'మీరెందుకలా భయపడతారు? డాక్టరయ్యే మీరే అలా భయపడితే, రోగుల గతేం కావాలి? ఆశకు అప్పుడప్పుడు ఇలాగే అవుతూంటుంది. ఫరవాలేదు' అంది శాంతంగా.

రత్న శాంతస్వరం రమేష్ కలవరాన్ని కొంచెం తగ్గించింది.

రమేష్ తన గదిలోకివెళ్ళి పడుకున్నాడు. కాని, ఆశను గురించిన ఆలోచనతో అతడికి నిద్రపట్టలా. తల్లితోబాటు కూతుర్ని కూడా తనెంతగా ప్రేమిస్తున్నాడో ఇపుడే తెలిసి వచ్చిందతనికి. రత్నకు చెందిన ప్రతీ వస్తువుపైనా ప్రీతి విశ్వాసాలు పెంచుకున్నాడు తను. రత్న తన కూతుర్ని ఎంతగానో ప్రేమిస్తుందని తెలుసునతడికి. అపుడంతా ఆశ తన ప్రతిస్పర్థి అని అసూయపడ్డాడు. కాని రత్న కూతుర్ని తను ఎంతగా ప్రేమిస్తున్నాడో ఇపుడే తెలుసుకుంటున్నాడు.

ఈ ఆలోచనలతో అతడికి రాత్రంతా సరిగా నిద్రపట్టలేదు.

ఆశకు ఎలా ఉందోనని రెండుమూడుసార్లు లేచివచ్చి చూసి వెళ్ళాడు మళ్ళీ.

తల్లీ కూతుళ్ళిద్దరూ హాయిగా నిద్రపోతూండటం గమనించి తను హాయిగా నిద్రపోయాడు.

# 12

ఉదయం రమేష్ లేచేసరికే, రత్న లేచి ఇంటిపనులు చేసుకుంటోంది. రమేష్ లేవగానే ఆశ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు. ఆశ కళ్ళు మూసుకుని పడుకుంది. రమేష్ చెయ్యి సహజంగానే నుదుటిమీదకు వెళ్ళింది. వెంటనే గాబరాగా రత్న దగ్గరకు వెళ్ళి,

'ఆశకు జ్వరం వచ్చింది' అన్నాడు.

'అలాగా?'

'ఊఁ! ఎవర్నయినా డాక్టర్ని తీసుకొస్తాను.'

రత్న కొంచెం నవ్వి, హేళనగా,

'డాక్టరా? ఎందుకు? ఈ మాత్రం గొంతునొప్పి, జ్వరాలకు మీరు మందివ్వలేరా?' అంది.

'వద్దు రత్నా! నన్ను పరీక్షించకండి. నేనో పనికిమాలినవాడిని.'

రత్న అలక్ష్యంతో అటు తిరిగి 'సరే! అయితే ఆశకు ఇంకో డాక్టర్ అవసరమూలేదు' అంది.

'రత్నా...ప్లీజ్...'

'మీరు చికిత్స చేసేటట్టయితే చెయ్యండి. లేదంటే దాని కర్మ ఎలా ఉంటే అలా అవుతుంది.'

'నేను వెళ్ళి డాక్టర్ని తీసుకొస్తాను' అన్నాడు రమేష్ మొండిగా.

'మీకంత ధైర్యం ఉంటే తీసుకురండి చూద్దాం' అంది రత్న ఇంకా మొండిగా.

'రత్నా! నన్ను ధర్మసంకటంలో పడేయకండి!' రమేష్ ప్రతిమాలుకున్నాడు.

'ఇపుడు ధర్మసంకటంలో పడింది మీరుకాదు. నేను. నా ఆశకు మీరే చికిత్స చెయ్యాలని నా కోరిక. మీమీద నాకున్నంత నమ్మకం, ఇంకే డాక్టర్ మీదా లేదు.'

'రత్నా...' అంటూ ఆమె భుజాన్ని పట్టుకున్నాడు రమేష్.

'అమ్మా...' అంటూ కళ్ళు తెరిచింది ఆశా. నేరం చేసినవాడిలా దూరంగా జరిగాడు రమేష్.

రత్న రమేష్‌ని మందుల బీరువాముందు నిలబెట్టి ప్రశ్నార్థకంగా అతడివైపు చూసింది.

రమేష్ దీనంగా ఆమెవైపు చూస్తూ,

'నన్నిలా బంధించకండి' అన్నాడు.

రత్న బదులు చెప్పలేదు.

రమేష్ కళ్ళు యాంత్రికంగా బాటిల్స్‌మీది పేర్లు చదవసాగాయి. అతడి చేతులు కొయ్యచేతుల్లా, నిర్జీవంగా అయి, ఏదో అదృశ్యశక్తి ప్రేరేపణతో ముందుకు వెళ్ళి ఓ మందుసీసా అందుకుని ఇంకో మందున్న దానితో కలిసాయి.

రెండు మందులూ బాగా కలిపి ఔన్సు గ్లాసులో పోసుకుని ఆశ దగ్గరకొచ్చాడు రమేష్.

'నోరు తెరు ఆశా! మందు తాగుదువుగాని' అన్నాడు.

జ్వర తీవ్రతతో కళ్ళు మూసుకున్న ఆశా కళ్ళు తెరిచింది.

ఆశ కళ్ళలో ఆశ్చర్యం కనిపిస్తోంది.

'మామయ్యా! నువ్వా డాక్టరేనా?'

ఏం బదులు చెప్పాలో తెలియలేదు రమేష్‌కి. అతడి అవస్థ గమనించి రత్న,

'అవునమ్మా. డాక్టరవుతారు' అంది.

'అయితే మామయ్యా! తొందరగా ఓ ఇంజక్షన్ ఇచ్చి గొంతు నొప్పి నయం చేసేయ్! రేపే నేను బడికి వెళ్ళొచ్చు.'

ఆశ మాటంతో రమేష్ హృదయం కెలికినట్టయింది. ఆతడు రత్న వైపు తిరిగాడు. తృప్తి, సంతోష విజయాలతో ఆమె మొహం వెలిగి పోతోంది.

ఓటమితో రమేష్ కళ్ళు చెమర్చాయి. అక్కడ కూర్చోలేక లేచి వెళ్ళిపోయాడు.

రత్న ఆశకు మందు తాగించి పడుకోబెట్టి రమేష్ దగ్గరకొచ్చింది.

రమేష్ తలవంచుకుని కూర్చున్నాడు. రత్న అతనిదగ్గర నిల్చుని ఆప్యాయతతో అతడివైపు చూసింది. ఆమె మృదువయిన చేతివేళ్ళు అతడి ఉంగరాల జుట్టుల్లో ఆడుకున్నాయి.

'రమేష్...'

'ఏమిటి?'

'నావైపు చూసి చెప్పండి మీకెందుకింత వ్యథ?'

'ఈ జన్మలో ఇహ ఎవ్వరికీ మందివ్వకూడదనుకున్నాను. ఎపుడయితే వదినను బ్రతికించుకోలేకపోయానో, అపుడే డాక్టర్ వృత్తికి నీళ్ళు వదులుకున్నాను. కాని, ఈ రోజు మీ తల్లి కూతుళ్ళు కలిసి నా నిశ్చయాన్ని సడలింప జేశారు. నా జీవితంలో ఇదొక ఓటమి.'

'ఓటమి! తప్పుగా తెలుసుకున్నారు మీరు. ఇదే మీ గెలుపు రమేష్! ఏదో గుడ్డినమ్మకంతో మీ జీవితాన్నే పాడుచేసుకుంటున్నారు. జలుబు చేసిందని ముక్కు తెగ్గోటుకున్నట్టుంది మీ స్థితి. చావు బ్రతుకులు ఎవరి అధీనం? పుట్టిన వాళ్ళంతా ఎపుడో ఒకరోజు చావాల్సిందేగదా?'

'కాని వదిన ఎంత చిన్నవయసులో చనిపోయింది? ఆమె జబ్బుకు ఎన్నిరకాల చికిత్సలు చేశాం. ఏదీ నయం చెయ్యలేకపోయింది. మరి ఈ చికిత్స అంతా ఎందుకు? నేను నయం చేస్తాను, నేను బ్రతికిస్తాను అనే మాట అబద్ధం. అందుకే నాలో నమ్మకం లేదు.'

'మానవ శక్తిని మించింది మరొకటుంది. దాన్నే 'దేవుడు, శక్తి, విధి' అని ఏ పేరుతోనయినా పిలువవచ్చు. మన ప్రయత్నం మనం చేస్తే ఆత్మతృప్తి కలుగుతుంది. ముఖ్యంగా ఆయుస్సుతీరి, శాంత చని

పోయింది. ముళ్ళు గుచ్చుకుంటాయని గులాబి చెట్టునుండి దూరంగా వెళి పోతారా ఎవరైనా?'

'నేను వెళ్ళిపోతాను. జీవితం నుండే దూరంగా వెళ్ళిపోతాను.'

'దీన్నే పిరికితనం అంటారు. రమేష్! మీరీరోజు నుండి కొత్త జీ తం ప్రారంభించాలి. మీ ఊరికి వెళ్ళి చదువు పూర్తిచేసి డాక్టరుగా స్థి పడండి. మనిషిగా జీవితాన్ని ఎదిరించండి. పిరికిపందలా పారిపోకండి.

రమేష్ బదులు చెప్పకుండా జోలపాట వింటున్న పసిపాపల కూర్చున్నాడు.

'ఆశ తండ్రి వచ్చేదాకా ఆశను చూసుకునే బాధ్యత మీది' అంటు తనమాట ముగించింది రత్న.

రమేష్ ఆ పూటల్లా ఆశ దగ్గర్నుండి కదలలేదు. ప్రక్కమీద పడుకుని బాధపడుతున్న ఆ పిల్లకు ఎన్నోరకాల కథలను చెప్పి నవ్విం చాడు. ఒక్క నిమిషంకూడా విసుగు చెందకుండా కూర్చున్నాడు. కాని, అతడి కళ్ళు ఎక్కువగా మాట్లాడకుండా తన పనులు చేసుకుంటున్న రత్నను వెంటాడుతున్నాయి.

రత్న తన పనులన్నీ ముగించుకుని వచ్చి,

'నేను ఆశదగ్గరుంటాను. మీరు అలా తిరిగిరండి' అంది.

'ఊహుం. నేనెక్కడికీ వెళ్ళను' అన్నాడు రమేష్. ఆశ అది విని 'అమ్మా! మామయ్య చాలా మంచివారమ్మా' అంది.

ఇంతలో ఆస్పత్రిలో రత్న స్నేహితురాళ్ళ గుంపొకటి లోపలకి ప్రవే శించటంతో, రమేష్ అక్కడనుంచి లేచి బయటకు వెళ్ళాడు.

మాతుంగా మార్కెట్, గాంధీమార్కెట్టు చుట్టుకుని రమేష్ వచ్చే సరికి రత్న స్నేహితురాళ్ళెవ్వరూ లేరు.

రమేష్ ఆశ దగ్గర కూర్చుని 'ఎలా ఉందమ్మా' అనడిగాడు.

'నొప్పి ఎక్కువగా ఉంది మామయ్యా. నీరు మింగటానిక్కూడా వీలు కావటంలేదు.'

'తెల్లవారే సరికి అన్నీ సరిపోతాయ్' అంటూ ధైర్యం చెప్పాడు రమేష్.

కూతురికి గ్లాసులో పాలు తెచ్చిన రత్న, 'రేపు నా స్నేహితురాలి చెల్లెలి పెళ్ళి. నన్ను తప్పకుండా రమ్మంది' అంది.

'ఇంట్లో అమ్మాయికి వంట్లో బాగాలేనపుడు మీరెలా వెడతారు?' అన్నాడు రమేష్.

'మీరుండగా నాకేం భయం? ఆశను మీకు అప్పజెప్పి నేను నిశ్చింతగా వెళ్ళగలను' అంది రత్న చిలిపిగా.

'వద్దు రత్నా! నేను అయోగ్యుడిని. నాకప్పజెప్పకండి.'

రత్న చిరునవ్వునవ్వి అతడిమాట అనునయంగా తిరస్కరించింది.

మరుసటిరోజు ఎనిమిది గంటలకల్లా పెళ్ళికి వెళ్ళటానికి సిద్ధమైంది రత్న. ఆమె వెళ్ళకుండా ఆపలేకపోయాడు రమేష్. నిస్సహాయుడై కూర్చుండిపోయాడు.

రత్న పట్టుచీర కట్టుకుని కూతురి దగ్గరకొచ్చి,

'వెళ్ళిరానా ఆశా!' అంది.

'వెళ్ళమ్మా, మామయ్య ఉంటారుగా' అంది ఆశా.

రత్న రమేష్‌తో,

'వెడుతున్నాను. ఫ్లాస్కులో వేడిపాలున్నాయి. ఆశకు కావాలంటే ఇవ్వండి. సాయంత్రం నాలుగింటికి వచ్చేస్తాను' అంది.

రమేష్ భయపడుతూ ఆమె చెయ్యి పట్టుకుని,

'నాకు భయమేస్తోంది.'

'మీకు ధైర్యం కలగాలనే నేను వెడుతున్నాను. త్వరగానే వచ్చేస్తాను. వెళ్ళనా?'

రత్న అతడి చేతిలోని తన చేతిని నెమ్మదిగా విడిపించుకుంది.

పెళ్ళిభోజనం అదీ ముగించుకుని రత్న వచ్చేసరికి సాయంత్రం ఐదయింది. సంతోష సమారంభంలో పాల్గొని వచ్చినందువల్ల గాబోలు రత్న మొహంలో ఆనందచ్ఛాయలు వెల్లివిరుస్తున్నాయి. ఏదో పాటను మెల్లిగా గొణుక్కుంటూ మెట్లెక్కింది.

తలుపు దగ్గర నళిని ముళ్ళమీదున్నట్టు నిలబడి వుంది.

రత్నను చూడగానే తలుపుకు తాళంవేసి, రత్న చెయ్యి పట్టుకుని కిందకు దిగుతూ,

'రత్నా! ముందు పద. దోవలో అంతా చెపుతాను, కంగారుపడ అంది.

రత్న కళ్ళు పెద్దవయ్యాయి.

'ఏం జరిగింది?'

'ఆశకు "డిఫ్తీరియా" అయిందట. ఉదయం నువ్వు పెళ్ళికి వె గానే, ఆశా చాలా బాధ పడిందట!'

ఆత్రంగా వింటోంది రత్న.

'ఏయ్ టాక్సీ!' అని టాక్సీని పిలిచింది నళిని. టాక్సీరాగా రత్నను లోపలికి తోసి, తనూ కూర్చుని,

'జె. జె. హాస్పిటల్' అంది.

రత్న మాట్లాడే శక్తి కోల్పోయి స్తబ్దంగా కూర్చుండి పోయిది.

'రమేష్‌కు అనుమానం వచ్చి ఆశను పరీక్షించి డిఫ్తీరియా అ నిర్ధారించి ఒక ఇంజక్షన్ ఇచ్చి హాస్పిటల్‌కు తీసుకుని వెళ్ళి అడ్మిట్ చేశారట. హాస్పిటల్‌నుండే నాకు ఫోన్ చేశారు, రత్న పెళ్ళి నుం రాగానే అక్కడికి తీసుకుని రమ్మని. అప్పటినుండి ఇక్కడ నిలబ నీ కోసం చూస్తున్నాను. నువ్వెక్కడికి వెళ్ళావోకూడా నాకు తెలీదాయె. తెలుసుంటే అక్కడికైనా వచ్చేదాన్ని.'

'ఆశ కెలావుందట?' రత్న అడిగింది.

'ఇపుడే అయిదు నిముషాలక్రితం ఫోన్‌చేసి కనుక్కున్నాను. వెంటనే ఆపరేషను చేశారట. ఇంకా తెలివి రాలేదు కాని, మామూలుగానే వూపిరి పీలుస్తోందని చెప్పారు రమేష్. ఏం కంగారు పడకు.'

టాక్సీ హాస్పిటల్ ముందు ఆగింది. రత్న నళినిని అనుసరించింది. నర్సుల నడిగి ఆశా వున్న వార్డును కనుక్కున్నారు.

నళిని రత్న చప్పుడు చేయకుండా మెల్లిగా నడిచి వెళ్ళారు లోపలికి.

ఆశ మంచం దగ్గర తలవంచుకుని కూర్చున్నాడు రమేష్. అడుగుల చప్పుడు విని లేచి రత్న దగ్గరకువచ్చి మృదువుగా,

'మీ ఆశను మీకు అప్పచెబుతున్నాను' అనేసి అవతలకు వెళ్ళి పోయాడు.

రత్న కుర్చీమీద కూర్చుని ఆశ చిన్నచేతిని తనచేతిలోకి తీసుకుంది. నళిని రత్న వెనుక నిలబడింది.

సాయంత్రం రౌండుకువచ్చిన డాక్టర్ని నళిని;

'ఏం భయం లేదా డాక్టర్!' అని అడిగింది.

'లేదు. ఈ అమ్మాయిని తెచ్చి అడ్మిట్ చేసిన అబ్బాయి చాలా బుద్ధిమంతుడు. ఇంట్లో చేయాల్సిన చికిత్స తనేచేసి తీసుకొచ్చాడు గనుకనే బ్రతికింది పాప. తగిన సమయంలో చికిత్స దొరకటం మీ అదృష్టం.'

'అయితే ఇంకేం భయం లేదన్నమాట' అంది నళిని మళ్ళీ.

'భయమేమీలేదు. తప్పకుండా నయమవుతుంది. కాని, ఇంకా నాలుగు రోజులు ఇక్కడే వుండాలి' అని చెప్పి వెళ్ళిపోయాడు డాక్టర్.

రత్న లేచి నిల్చుని 'నళినీ! నువ్విక్కడే వుండు. నేను రమేష్ ఇక్కడే ఎక్కడైనా వున్నారేమో చూసి వస్తాను' అంది.

నళిని మంచం దగ్గర కూర్చుంది.

కాస్సేపట్లో రత్న వెనక్కి వచ్చింది.

'ఎక్కడా కనిపించలేదు. ఉదయం ఫోంచేశారో లేదో కూడా తెలీదు.'

నళిని మాట్లాడలేదు.

కాస్సేపు పూరుకుని నళిని 'నేనిక వెడతాను. రాత్రికి నువ్విక్కడే వుంటావా?' అని అడిగింది.

'ఊఁ!'

'అయితే నీకు పక్క అదీ తెచ్చిస్తాను. ఇహ వెళ్ళనా' అని రత్నతో చెప్పి వెళ్ళిపోయింది నళిని.

మృత్యు కుహరంలోనుండి బయటపడిన ఆశా కళావిహీనమయిన మొహాన్ని చూస్తూ రమేష్ని గురించి ఆలోచిస్తూ కూర్చుంది రత్న.

రాత్రి తొమ్మిదింటికి నళిని దుప్పటి అదీ తీసుకుని మళ్ళీ వచ్చింది.

'రమేష్ ఇంట్లో వున్నారా?' ఆత్రుతతో అడిగింది రత్న.

'లేరు. ఇక్కడికి రాలేదా?'

'లేదు.'

'ఇపుడొస్తారేమో. నీకు అన్నం తెచ్చాను. భోంచేద్దువుగాని లే.
'వద్దు నళినీ. పెళ్ళిభోజనం ఇంకా అరగనే లేదు నాకు.'
'కొంచెం తిను.' నళిని బలవంతం చేసింది.
'వద్దు. క్యారియర్ ఇక్కడే వుండనీ; కావాలంటే తింటాను.'
నళిని క్యారియర్ బల్లమీదపెట్టి ఉదయం వస్తానని చెప్పి వె పోయింది.

రాత్రి పది దాటాక వార్డులోకి అడుగుపెట్టాడు రమేష్. రత తదేకంగా ఆశనేచూస్తూ కూర్చుంది.

రమేష్ మాట్లాడకుండా వెళ్ళి ఆశ చెయ్యిపట్టుకుని నాడి చూశాడ ఆశ మెల్లిగా, హాయిగా ఊపిరిపీలుస్తూ వుండటాన్ని గమనించి అత హృదయం తేలిక పడింది.

రత్న అతడినే పరీక్షగా చూస్తూవుంది.
'రమేష్ !'
'ఏమిటి ?'
'ఆశకు తప్పకుండా నయమవుతుందని చెప్పారు డాక్టర్.'
రమేష్ మాట్లాడలేదు.
'ఇకనైనా భోంచెయ్యండి.'
'నేను భోంచెయ్యలేదని మీ కెవరు చెప్పారు?'
'మీ మొహమే చెపుతోంది.'
'నాకు ఆకలిగాలేదు.'
'ఉదయంనుండి కాఫీ, టిఫిన్, భోజనం ఏమీ తీసుకోలేదు; అయినా ఆకలిగా లేదా?'
'లేదు.'
'నా కోసం కొంచెం తినండి '
'వద్దు.'
'నేనే తినిపిస్తాను' అంటూ నళిని తెచ్చిన క్యారియర్ మూతతీసి కలిపిన అన్నాన్ని స్పూనుతో అతడిచేత తినిపించ సాగింది
రమేష్ తృప్తిగా తిన్నాడు. అతడి భోజనం అయ్యాక రత్న :
'మీరు ఇంటికి వెళ్ళి పడుకోండి. నేను ఇక్కడేవుంటాను' అంది.

'ఉహుఁ నేనూ ఇక్కడే వుంటాను.'

'పక్క అదీ ఏదీలేదు. మీరెలా పడుకుంటారు?'

'మీరేం చేస్తారు ?'

'నళిని నాకు దుప్పటి తెచ్చింది.'

'సరే. మీరు పడుకోండి.'

'మరి మీరో?'

'నేను కుర్చీమీద కూర్చుని, మిమ్మల్నీ, మీ కూతుర్నీ చూస్తూ రాత్రి గడిపేస్తాను.'

'ఉదయంనుండి తిరిగి, అలసిపోయారు. ఇపుడైనా కాస్త విశ్రాంతి తీసుకొండి.'

'మిమ్మల్నిచూస్తూ కూర్చోవటంకన్నా నాకు వేరే విశ్రాంతి అక్కర్లేదు.'

'అలా చూడదగినంత అందగత్తెను కాను నేను.'

'ఫరవాలేదు. ఈ రోజు నన్ను బలవంతపెట్టకండి' అన్నాడు రమేష్.

రత్న పడుకుంది. రమేష్ ఆ తల్లీ కూతుళ్ళను చూస్తూ ఆ రాత్రంతా గడిపాడు.

ఏ జన్మజన్మాల అనుబంధమో ఇది ! తను ఎన్నడూ చూసి ఎరుగని స్త్రీ రత్న! ఏదో కారణంవల్ల తను కొన్ని రోజులు వాళ్ళింట్లో వుండాల్సివచ్చింది. కాని, అంతలోనే స్నేహపు వేరు తన హృదయంలోకి అంత లోతుగా దిగిపోగలదని ఎన్నడూ వూహించనైనా వూహించలేదు.

అంతా తెలిసికూడా రత్న స్నేహబంధాన్నుండి తప్పించుకోలేక పోయాడు రమేష్. తమ స్నేహంవల్ల ఏ విధమైన ఉపయోగమూ లేదని ఇరువురికీ తెలుసు. ఆ స్నేహాన్ని పెంచుకోవటంవల్ల ఇద్దరికీ సుఖంలేదన్న విషయం తెలిసి కూడా ఆ అనుబంధాన్ని తెంచుకోలేక పోయారు.

రత్న నుండి దూరంగా వెళ్ళాలన్న ఆలోచనే రమేష్ హృదయాన్ని భయక్రాంతం చేస్తోంది. ఆ విరహం భరించరానిదిగా అనిపించిందతనికి.

ఆ ఆలోచనరాగానే బెదరిపోయేవాడు రమేష్. రత్నను చూడకుండా, ఆమెతో మాట్లాడకుండా తను వుండగలడా ?

ప్రేమ తామర పుష్పపు వేరులా బలమైనది. ఆ వేళ్ళ సమూహా చేతికి చిక్కిన మనిషి, ఆవలనుండి తప్పించుకు పోదామని ప్రయత్నించి కొలదీ, ఆ వేరు అతడిని బంధించి బురదలోకి లాగేసినట్టు, రమేష్ అ రాగపు స్వచ్ఛమైన సరోవరంలోకి అడుగుపెట్టి, దాని రుద్రాలింగనాని లోనై వివశుడై పోయాడు

మర్నాడు నళిని వచ్చేసరికి రమేష్ కుర్చీలోనే నిద్రిస్తున్నాడు రత్న నిద్రలేచి ఆశదగ్గర కూర్చుని వుంది. ఆశ కళ్ళు తెరచి నళినివైపు చూసింది. నళిని అందం, అలంకారంచూసి ఆశ కళ్ళు పెద్దవయ్యాయి మాట్లాడకుండా నళినివైపుచూసి నవ్వింది.

రెండు రోజుల తరువాత బరోడానుండి తిరిగివచ్చిన శేషగి కూతురి అనారోగ్యం సంగతి తెలిసి గాబరాగా హాస్పిటల్‌కు పరుగెత్తు కొచ్చాడు.

ఆశకు జబ్బు నయమవుతుండటంచూసి అతడి మనసు తేలిక పడింది. ఆశను ఇంటికి తీసుకుని వెళ్ళేదాకా ఆశ పక్కనుండి కదల్లేద శేషగిరి.

వారంరోజుల తర్వాత ఆశ ఇంటికి వచ్చింది. రత్న కూతుర్ని మళ్ళీ పొందినట్టుగా సంబరపడింది. ఆ సంబరంలోని సంతోషాన్ని మనః పూర్వకంగా అనుభవించాడు రమేష్.

ఆశ యింటికి వచ్చిన మర్నాడు రమేష్ మళ్ళీ తన ప్రయాణ విషయం ఎత్తాడు.

'ఇహనైనా వూరికి వెళ్ళటానికి అనుమతినివ్వండి' అన్నాడు ఆ దంపతుల మొహం చూసి.

రత్న శేషగిరినే మాట్లాడనిచ్చి తాను తప్పుకుంది.

'అలాగే. ఇంకో సంవత్సరం చదువు పూర్తిచేసేయ్. తరువాత ఇక్కడికే వచ్చేద్దువుగాని. ఇద్దరం కలిసి ప్రాక్టీసుచేద్దాం. నేనూ కృష్ణ మూర్తికి ఉత్తరం రాస్తాను. అయినా ముందు నీ చదువు పూర్తికానీ, ఇప్పటినుండి ఆ విషయ మెందుకులే' అన్నాడు శేషగిరి.

'చదువు పూర్తి చేస్తాను. అదిమట్టుకు నిర్ణయించుకున్నాను' అంటూ రత్నవైపు చూశాడు రమేష్.

ఆమె తలెత్తి రమేష్‌వైపు చూసింది. శేషగిరి అక్కడ లేకపోతే, ఆ మాట అన్నందుకు ఏం బహుమతి ఇచ్చేదో రత్నకు మాత్రమేతెలుసు.

ఒక్కక్షణం ఆమె కళ్ళలో మెరుపు మెరిసింది. హృదయంలోని సంతోషమంతా ఆమె మొహంలోనే ప్రతిబింబించింది.

ఆమెకు తను ఆ మాట అని ఎంత ఆనందాన్ని కలుగచేశాడో రమేష్ కొలవలేక పోయాడు.

'కాని, ఇక్కడ ప్రాక్టీసు చేయను' రమేష్ అన్నాడు.

రత్న మౌనంగా నిట్టూర్చింది.

'ఎందుకయ్యా! బొంబాయంటే అప్పుడే విసుగు పుట్టిందా?'

'అలా కాదు. నేను ప్రైవేటు ప్రాక్టీసు పెడితే దగ్గు, జ్వరం ఇలాంటి జబ్బులకే మందివ్వగలను. సర్జన్ కావాలని నాకు చాలారోజులుగా ఓ కోర్కె వుంది. సర్జన్ అయి, కొత్త ప్రయోగాలుచేసి, కొత్త మందులను కనిపెట్టాలని వుంది.'

శేషగిరి సంతోషంతో పొంగిపోయాడు. గర్వంతో రత్నవైపు తిరిగి;

'చూశావా, రత్నా! మా కృష్ణమూర్తి తమ్ముడు ఎలా తయారవుతున్నాడో?' అన్నాడు.

మాటలకు అందని సంతోషాన్ని హృదయంలో నింపుకున్న రత్న మౌనం దాల్చింది.

మర్నాడు రాత్రే రమేష్ ప్రయాణం నిశ్చయమయింది. ముందే టికెట్ రిజర్వు చేయించుకున్నాడు.

తల్లి సమయాన్నంతా తననుండి లాక్కున్న రమేష్ మీద మొదట్లో ఆశకు స్నేహభావం కలుగలేదు. కాని క్రమేణా పరిచయమూ, స్నేహమూ పెంపొందాయి వారిద్దరి మధ్యా.

ఆఖరి సాయంత్రం రత్నతో కలిసి జుహూబీచ్‌కి వెళ్ళాలని కోరుకున్నాడు రమేష్.

సంధ్యా స్వర్ణకాంతి కిరణాలు నీల సముద్రపు కెరటాలమీద ఆడుకుంటున్నాయి. ఆ కిరణాల ఆటలను చూసి సముద్రుడు నవ్వుతున్నాడేమో

అన్నట్టు, కెరటాలు తెల్లటి నురుగును నింపుకుని నవ్వుల్ని పువ్వుల్ని విరజిమ్మి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతున్నాయి.

'రత్నా! మీతో గడిపే ఆఖరి సాయంత్రం ఇది' అన్నాడు రమేష్.

'మీరిలా మాట్లాడకండి రమేష్! నాకు ఏడుపు వస్తోంది.'

'మీ మనసు చాలా గట్టిదనుకున్నాను. ఆఖరిరోజున ఇలా బెంబేలు పడిపోతారేం?'

రత్న నిస్సహాయంగా;

'మనం ఎవరితోనూ స్నేహ బాంధవ్యాలు పెంచుకోరాదు రమేష్! మీనుండి దూరంగా ఉండాలని ఎంతో ప్రయత్నించాను. వీలుపడలేదు. ఈ స్నేహమూవద్దూ, ఈ విరహమూవద్దు. ఏదీ లేకుండా ఉంటేనే మనసుకు హాయిగా ఉంటుందేమో అనిపిస్తోంది' అంది.

'మీరు ఏమేమో మాట్లాడకండి. తరువాత నేను బొంబాయి వదలి వెళ్ళనే వెళ్ళను. డాక్టర్ నన్ను ఇక్కడకే రమ్మని ఆహ్వానించినపుడు వచ్చేద్దామా అనుకున్నాను. కాని, మనిద్దరం ఒకచోట ఉండటం ఇద్దరి శ్రేయస్సు దృష్ట్యా మంచిది కాదని నిర్ధారించాను.'

'అదే మంచిది. మీరు చదువు పూర్తిచేసి డాక్టరవాలని నిశ్చయించు కున్నారని తెలిసి నేనెంత సంతోషపడ్డానో తెలుసా?'

'ఎంత?'

'ఇక్కడకాదు. ఇంట్లో చూపుతాను...' అంటూ చుట్టూ చూసింది రత్న.

'తరువాత మాట తప్పకూడదు!'

'లేదు; అకస్మాత్తుగా మీరలా అనగానే నాకెంత ఆశ్చర్యం, సంతోషం కలిగిందనీ!'

'ఆశకు సీరియస్‌గా ఉన్నపుడు నా కనిపించింది-నేను చదువు పూర్తి చేయకపోవటం శుద్ధ తప్పు అని. తన జబ్బేమిటి అని ముందుగానే నేను "డయాగ్నస్" చెయ్యగలిగాను. దానితో నామీద నాకు నమ్మకం కలిగింది.'

'ఆశ రెండు రోజులు జబ్బుపడినా బాధలేదు. కాని ఆ కారణంగా మీ నిశ్చయాన్ని మీరు మార్చుకున్నారు రమేష్! నాకు వాగ్దానం చేస్తారా?'

'ఏమని?'

'డాక్టరై ప్రజాసేవ చేస్తానని, మరి...'

'ఊఁ చెప్పండి.'

'మీరు డాక్టరయ్యాక తప్పకుండా పెళ్ళి చేసుకోవాలి. దయచేసి నా కోర్కెను మన్నించండి. ఈ రెండు విషయాలకు మీరు వాగ్దానం చేస్తే నేను నిశ్చింతగా ఉండగలుగుతాను.'

'మొదటిదానికి వాగ్దానం చెయ్యగలను; రెండవదాని విషయమే కాస్త ఆలోచించాలి.'

'ఇందులో ఆలోచించడానికేముంది? ఆలోచించాల్సినంత గహనమైన విషయం కాదే! పెళ్ళికి ముందు ప్రతి అబ్బాయి, అమ్మాయి కాబోయే సహచరుల గురించి ఎన్నో కలలు కంటారు. మనసు చంచలంగా, నిలకడ లేకుండా ఎగిరే సీతాకోక చిలుకలా ఉంటుందపుడు. పెళ్ళయ్యాక మనసు ఒక స్థిమితాన్ని పొందుతుంది. వెనుకటి సంగతులన్నీ కుర్ర చేష్టలుగా అనిపిస్తాయి...'

రమేష్ మధ్యలోనే ఆపి,

'నేను దేనికయితే చాలా ప్రాధాన్యతనిస్తానో, దాన్నే అంత తేలిగ్గా తీసిపారేస్తారేం? ఆఖరి రోజు—దయచేసి నా మనసు నొప్పించకండి.'

'మీ మనస్సును నొప్పించాలని నేనీ మాటలనడంలేదు రమేష్! అనురాగానికి మీరిచ్చే విలువను సహించలేకుండా ఉన్నాను నేను. మట్టికి బంగారానికిచ్చినంత విలువ ఇస్తున్నారా? నిజం చెప్పాలంటే ప్రేమలో నమ్మకంలేదు నాకు.'

'రత్నా ఏమంటున్నారు మీరు?'

'ఉన్నమాటే అంటున్నాను. ప్రేమకు నిలకడలేదు. చిరకాలం నిలిచేది కాదు. పువ్వునుండి పువ్వుకు ఎగిరే భ్రమరానికి, ప్రేమకూ పెద్ద తేడా ఏమీలేదు. క్షణికంగా మనసుకు భ్రాంతిగొలిపే హృదయ దౌర్బల్యాన్నే ప్రేమ అంటారు. అంతే!'

'మీరు ఇదే విధంగా మాట్లాడుతూ ఉంటే నేను వెళ్ళిపోతాను' అంటూ లేచి నిల్చున్నాడు రమేష్.

రత్న అతడిని ఆపి,

'ఇహ అలా మాట్లాడనులెండి. కాని, నాకు మాటివ్వండి–పెళి చేసుకుంటానని' అంటూ చెయ్యి చాపింది.

రమేష్ మళ్ళీ ఇసుకలో కూర్చున్నాడు.

'ఎందుకు నన్నిలా బాధిస్తారు?'

'నేను మాత్రం తక్కువ బాధ పడుతున్నానా? నా మనసుకు కా ‌ శాంతినివ్వలేరా?'

'సరే! అలాగే చేసుకుంటాను. కాని, ఎపుడో చెప్పలేను. నామనస్సు కుదుటపడ్డాక చేసుకుంటాను సరేనా? మీకు శాంతి కలిగిందా?'

అపారమైన తృప్తితో రత్న 'ఊఁ' అంది.

ఒకదాన్ని ఒకటి తరుముకుంటూ వస్తున్న అలలవైపు చూస్తూ రమేష్,

'మీ అడ్రస్ చెపుతారా?' అన్నాడు.

రత్న అదిరిపడి 'ఎందుకూ?' అంది.

'మీకు ఊరికి వెళ్ళాక ఓ ఉత్తరం రాస్తాను.'

రత్న జోరుగా తల అడ్డం తిప్పుతూ 'వీల్లేదు రమేష్! మీరు ఉత్త రాలేమీ రాయకండి. మనం పత్ర వ్యవహారం పెట్టుకుంటే ఇక్కడితో తెంచుకుందామనుకుంటున్న బంధం మళ్ళీ పెరగటానికి అవకాశమివ్వటమే అవుతుంది.'

'లేదు. అలా పెరగటానికి అవకాశమివ్వను. ఇక్కడ నుండి వెళ్ళాక ఒక్క ఉత్తరం మటుకు వ్రాయటానికి అనుమతివ్వండి' అంటూ బ్రతిమాలుకున్నాడు రమేష్.

రత్న ఖచ్చితంగా 'వీల్లేదు. మీరొక ఉత్తరం రాస్తే మర్యాద కయినా నేను జవాబు రాయాల్సి వస్తుంది. అందుకే మిమ్మల్ని రాయ వద్దంటున్నా' అంది.

'ఇన్ని రోజులు మీ ఆతిథ్యాన్ని పొంది కృతజ్ఞతతో మీకో ఉత్త రం రాసే అవకాశం కూడా నాకుండనక్కర్లేదంటారా?'

రత్న నవ్వుతూ అతడివైపు చూసి 'మీరు చెప్పాల్సిన థ్యాంక్సంతా ఇప్పుడే చెప్పేయండి' అంది.

'ఉహూ, నేను ఉత్తరమే రాస్తాను.'

'అయితే ఓ పని చెయ్యండి. మీకంతగా రాయాలనే ఉంటేడాక్టర్‌కు రాయండి. నా అభ్యంతరం ఏమీలేదు.'

రమేష్ కోపంతో అన్నాడు 'మిమ్మల్ని బాగా కొట్టాలనిపిస్తోంది నాకు. నేను అనుకున్నంత మంచివారు కాదు మీరు.'

'అలాగే అనుకోండి. మరీ సంతోషం. నేను మంచిదాన్నని ఏనాడూ చెప్పుకోలేదే.'

'రత్నా!'

'అలా పిలువకండి. నా మనసు బలహీనమై మీరడిగిన దానికంతా ఒప్పేసుకుంటున్నాను. మీ మంచికోసమే నేనింత క్రూరంగా వర్తిస్తున్నాను.'

ఇహ ఆమెను బలవంతపెట్టి లాభం లేదని ఊరుకున్నాడు రమేష్.

చీకటి పడుతూండగా ఇద్దరూ ఇంటికి బయులుదేరారు. ఇంటికి రాగానే రమేష్ తన వస్తువులు సర్దుకోసాగాడు. రత్న అక్కడే ఓ కుర్చీలో కూర్చుని, గడ్డానికి చెయ్యి ఆన్చి అతడినే చూస్తూ కూర్చుంది.

రమేష్ గుడ్డలు పెట్టెలో సర్దుతూ రెండుమూడుసార్లు రత్నవైపు చూశాడు. కాని, ఆమె అతడి చూపును గమనించలేదు. చాలా పరధ్యానంగా కూర్చుంది రత్న.

రమేష్ గుడ్డలు సర్దటం మానేసి రత్నవైపు సూటిగా చూశాడు. కాని, రత్న గమనించలేదు.

రమేష్ తన పని మానేసి రత్న దగ్గరగా వచ్చి నిల్చున్నాడు.

రత్న తన ఆలోచనల్లోపడి, అతడు తన దగ్గరకు రావటాన్ని కూడా గమనించలేదు. రమేష్ తన రెండు చేతులతోనూ ఆమె మొహాన్ని తన వైపుకు తిప్పుకుని-

'మీ ఆలోచనలలో నాకూ సగం వాటా ఉంది' అన్నాడు.

రత్న మౌనంగా అతడివైపు చూసింది. ఆమె కళ్ళలో నిండిన నీరు బుగ్గలమీదుగా జారిపోయింది. రమేష్ వ్యాకులంతో-

'ఛ! ఏడుస్తున్నారా? తప్పుకదూ. ఇంతవరకూ నాకు ధైర్యం

చెప్పి ఇపుడు మీరే కన్నీరు కారుస్తున్నారా? అదీ నాలాంటి దొంగకోసం!' అన్నాడు.

'దొంగా! మీరేం దొంగతనం చేశారు?'

'ఈ ఇంట్లోనుండి రెండు అమూల్యమయిన వస్తువులను ఇంటి యజమాని అనుమతిలేకుండా తీసుకుపోతున్నాను. అవేమిటో తెలుసా?'

రత్న తల అడ్డంగా ఊపింది.

'మొదటిది మీ హృదయం. రెండవది, ఆఖరుదీ ఇది....' అంటూ వంగి, రత్న బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాడు. రత్న అతడి నుదురు,కళ్ళు, తల, నోరు అన్నీ మృదువుగా చేత్తో తడిమి చూసింది.

'గుడ్డివాళ్ళ చేత్తో మొహాన్ని తడిమి చూసినట్టు చూస్తున్నారేం రత్నా?'

'మీ మొహాన్నెక్కడ మరచిపోతానో అని భయం నాకు. అందుకే సరిగ్గా చూసి గుర్తు పెట్టుకుంటున్నాను. రమేష్–'

'ఏమిటి?'

'మీరు బొంబాయికి ఎందుకొచ్చారు?'

'నేనూ అదే ఆలోచిస్తున్నాను. నేను రాకపోతేనే, మీరు హాయిగా ఉండేవారు.'

'రేపటి నుండి మీరుండరు. ఇల్లంతా శూన్యంగా ఉంటుంది.'

'మీరు ఎంతో ధైర్యం కలవారు అనుకున్నా; మీ ధైర్యమంతా మాటల్లోనే.'

రత్న మాట్లాడకుండా లేచి నిల్చుంది.

'భోంచేద్దురుగాని రండి. రాత్రి రైల్లో నిద్రసెడకండి. పడుకుని నిద్రపోవటానికి ప్రయత్నించండి. క్షేమంగా ఊరు చేరినందుకు డాక్టర్‌కి ఉత్తరం రాయండి.'

'మీరు మళ్ళీ ఎప్పుడొస్తారో అటువైపుకు?'

'మీ పెళ్ళికి లేదా మీ కూతురి పెళ్ళికి తప్పకుండా వస్తాను' అం రత్న.

రమేష్‌కి వీడ్కోలివ్వటానికి అందరూ కార్లో స్టేషనుకు వెళ్ళారు మామయ్య వెళ్ళిపోతున్నాడంటే ఆశకూడా బెంగగానే ఉంది

శేషగిరి కృష్ణమూర్తికి చెప్పమని ఏమేమో చెపుతున్నాడు. రత్న మాత్రం మౌనంగా కూర్చుంది.

రైలు కదిలింది. రమేష్ రత్నవైపు చూశాడు. ఆ కళ్ళలో రత్న కేం కనిపించిందో? వెంటనే తనను లోపలికి లాక్కుంటాడేమోననిపించి రెండడుగులు వెనక్కి వేసింది.

రత్న తన కర్చీఫ్ ఊపింది. రమేష్ ప్రతిమలా నిల్చున్నాడు.

రైలు కనుమరుగవగానే అందరూ వెళ్ళి కార్లో కూర్చున్నారు. శేషగిరి రమేష్‌ని ఒకటే పొగుడుతున్నాడు...

'చాలా మంచి కుర్రాడు. మనతో బాగా కలసిపోయాడు. కృష్ణమూర్తికి తగిన తమ్ముడు. అతడు ఇక్కడే ప్రాక్టీస్ చెయ్యాలని నాకెంతో ఆశగా ఉంది. కాని ఎందుకో అతడికి నచ్చలా మరి—' అంటూ రత్న వైపు చూశాడు శేషగిరి.

రత్న కిటికీలోనుండి బయటకు చూస్తోంది.

ఆశ కారులోనే నిద్రపోయింది. శేషగిరి కూతుర్ని ఎత్తుకుని పక్కమీద పడుకోబెట్టాడు. కూతురికి దుప్పటి కప్పి రత్నవైపు చూశాడు.

రత్న పరధ్యానంగా గుడ్డలు మార్చుకుంది. శేషగిరి మంచంమీద కూర్చుని భార్యకోసం నిరీక్షిస్తున్నాడు. రత్న మెల్లిగా మందుల బీరువా దగ్గరకు వెళ్ళి తనకు కావలసిన మందుకోసం వెదకసాగింది.

'పడుకోవా రత్నా?'

శేషగిరి మౌనాన్ని భంగపరిచి అడిగాడు.

'మీరు పడుకోండి.'

'నువ్వో?'

'నాకు చాలా తలనొప్పిగా ఉంది. నిద్ర మాత్ర తీసుకొని పడుకుంటాను.'

'తలనొప్పికి తలనొప్పి మాత్ర తీసుకోవాలిగాని, నిద్రమాత్రెందుకూ?'

'లేకపోతే నిద్రరాదు నాకు. దయచేసి మాత్ర ఇవ్వండి.'

రత్న పరిహాసం చేస్తోందనుకుని శేషగిరి వెనుకనుండి వచ్చి ఆమె భుజాన్ని పట్టుకున్నాడు.

'వదలండి. ఈ రోజు నన్ను వదిలేయండి. ఈ ఒక్క రోజు. ఇంత వరకూ ఏనాడూ మీ మాటకు అడ్డుచెప్పి ఎరుగను. ఈ రోజు నామాట కాదనకండి.'

హిమ సదృశమయిన రత్న పలుకులు విని తెల్లబోయి వెనక్కి తగ్గాడు శేషగిరి.

పెళ్ళయిన రోజునుండి, ఇంతవరకూ ఏనాడూ రత్న, భర్త అభీష్టాన్ని వ్యతిరేకించి ఎరుగదు.

ఈ రోజు ఎందుకిలా ప్రవర్తిస్తోందో శేషగిరికి అర్థంకాలేదు.

రత్న నెమ్మదిగా మాత్రమింగి, నీళ్ళు తాగింది.

ఆ క్షణంలో శేషగిరికి రత్న పరిష్కరించలేని సమస్యగా కనిపించింది.

-:సమాప్తం:-

# అంకితం

అడగగానే అనువదించటానికి
అనుమతినిచ్చి, సహకరించి
29-7-'68 న పరమపదించిన త్రివేణికి

కన్నీటితో
శర్వాణి

# తామర కొలను

కన్నడ మూలం : త్రివేణి

తెలుగు సేత : శర్వాణి

ఏ జన్మజన్మాల అనుబంధమో ఇది ! తను ఎన్నడూ చూసి ఎరుగని స్త్రీ రత్న! ఏదో కారణంవల్ల తను కొన్ని రోజులు వాళ్ళింట్లో వుండాల్సివచ్చింది. కాని, అంతలోనే స్నేహపు వేరు తన హృదయంలోకి అంత లోతుగా దిగిపోగలదని ఎన్నడూ వూహించనైనా వూహించలేదు.

అంతా తెలిసికూడా రత్న స్నేహబంధాన్నుండి తప్పించుకోలేక పోయాడు రమేష్ తమ స్నేహంవల్ల ఏ విధమైన ఉపయోగమూ లేదని ఇరువురికీ తెలుసు. ఆ స్నేహాన్ని పెంచుకోవటంవల్ల ఇద్దరికీ సుఖంలేదన్న విషయం తెలిసి కూడా ఆ అనుబంధాన్ని తెంచుకోలేక పోయారు.

రత్న నుండి దూరంగా వెళ్ళాలన్న ఆలోచనే రమేష్ హృదయాన్ని భయ్రాకాంతం చేస్తోంది. ఆ విరహం భరించరానిదిగా అనిపించిందతనికి.

ఆ ఆలోచనరాగానే బెదరిపోయేవాడు రమేష్. రత్నను చూడకుండా, ఆమెతో మాట్లాడకుండా తను వుండగలడా ?

ప్రేమ తామర పుష్పపు వేరులా బలమైనది. ఆ వేళ్ళ సమూహపు చేతికి చిక్కిన మనిషి, ఆ వలనుండి తప్పించుకు పోదామని ప్రయత్నించిన కొలదీ, ఆ వేరు అతడిని బంధించి బురదలోకి లాగేసినట్టు, రమేష్ అనురాగపు స్వచ్ఛమైన సరోవరంలోకి అడుగుపెట్టి, దాని రుద్రాలింగనానికి లోనై వివశుడై పోయాడు

ఆద్యంతం ఉత్కంఠతతో చదివించే నవల!

తప్పక చదవండి !


యం. శేషాచలం అండ్ కంపెనీ

మచిలీపట్నం-సికింద్రాబాద్

Cover Printed at Nandini Art Printers, Hyd - 29.